
ఆదివారం 1-12-2024


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 250

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సమంగా ముగిసిన ఐదో గేమ్

భారత ఆటగాడు దొమ్మరాజు గుకేశ్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్ మధ్య జరుగుతున్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ సమరంలో మరో పోరు సమంగా ముగిసింది. సింగపూర్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్ ఐదో గేమ్ 40 ఎత్తుల తర్వాత 'డ్రా' అయింది. ఈ ఫలితం అనంతరం గుకేశ్, డిఫెండింగ్ చాంపియన్ లిరెన్ చెరో 2.5 పాయింట్లతో సమంగా కొనసాగుతున్నారు. విజేతగా నిలవాలంటే మిగిలిన 9 గేమ్‌లలో మరో 5 పాయింట్లు సాధించాల్సి ఉంటుంది. నల్ల పావులతో ఆడిన లిరెన్ తొలి గేమ్ తరహాలోనే ఫ్రెంచ్ డిఫెన్స్‌తో మొదలు పెట్టాడు. ఆ గేమ్‌లో ఓటమిపాలైన గుకేశ్ ఈ సారి జాగ్రత్త పడ్డాడు. అయితే 23వ ఎత్తు వద్ద గుకేశ్ తప్పుడు ఎత్తు వేసి ఓటమికి ఆస్కారం కల్పించగా...లిరెన్ దానిని గుర్తించలేకపోయాడు. దాంతో గుకేశ్ డ్రాతో గట్టెక్కాడు. 'నేను చాలా పెద్ద తప్పు చేశానని తర్వాత అర్థమైంది. కానీ అదృష్టవశాత్తూ తప్పించుకున్నాను. ఇంకా ఈ సమరం సగం కూడా కాలేదు. కాబట్టి నాకూ మంచి అవకాశాలున్నాయని నమ్ముతున్నా' అని గుకేశ్ వ్యాఖ్యానించాడు. ఇద్దరి మధ్య ఆరో గేమ్ నేడు జరుగుతుంది.

తొలి రోజు వర్షార్పణం



- భారత్‌కు దక్కని 'పింక్' ప్రాక్టీస్
- నేడు వన్డేలా ఆడే అవకాశం

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో 'పింక్ టెస్టు'కు ముందు ప్రాక్టీస్ మ్యాచ్ ద్వారా సాధనకు సిద్ధమైన భారత జట్టుకు వాతావరణం అనుకూలించలేదు. భారత్, ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్ మధ్య శని, ఆదివారాల్లో జరగాల్సిన రెండు రోజుల డే అండ్ నైట్ మ్యాచ్‌ను వర్షం వెంటాడింది. వాన కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే మొదటి రోజు ఆట పూర్తిగా రద్దయింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిరంతరాయంగా వాన కురవడంతో రోజంతా మైదానాన్ని కవర్లతోనే కప్పి ఉంచారు. ఆ తర్వాత గంటకు పైగా తెరిపినిచ్చినా మళ్లీ భారీ వర్షం మొదలైంది. బరిలోకి దిగే పరిస్థితి లేకపోవడంతో తొలి రోజు ఆటను అంపైర్లు రద్దు చేశారు. అయితే ఈ మ్యాచ్‌ను ఆదివారం వన్డే తరహాలో నిర్వహించే అవకాశం ఉంది. గులాబీ బంతితో మ్యాచ్ ప్రాక్టీస్ కోరుకుంటున్న టీమిండియా... వాతావరణం అనుకూలిస్తే 50 ఓవర్ల ఆటలోనే సాధనకు సిద్ధమైంది. అంతకు ముందు ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ స్టేడియాన్ని సందర్శించి ఇరు జట్ల ఆటగాళ్లతో ముచ్చటించారు. ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్ టీమ్ సభ్యులకు ఆయన క్యాప్‌లు అందించారు.



రెండో టెస్టుకు హాజల్‌వుడ్ దూరం

తొలి టెస్టులో ఓడి ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న ఆస్ట్రేలియాకు పెద్ద దెబ్బ తగిలింది. గత మ్యాచ్‌లో చక్కటి బౌలింగ్ ప్రదర్శించిన సీనియర్ పేసర్ జోష్ హాజల్‌వుడ్ గాయం కారణంగా అడిలైడ్‌లో శుక్రవారం నుంచి జరిగే రెండో టెస్టునుంచి తప్పుకున్నాడు. అతను పక్కెటిముల నొప్పితో బాధపడుతున్నాడు. పెర్త్ టెస్టులో ఆసీస్ ఆటగాళ్లంతా విఫలం కాగా... హాజల్‌వుడ్ ఒక్కడే మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. 34 ఓవర్లలో 57 పరుగులే ఇచ్చి అతను 5 వికెట్లు తీశాడు. భారత్ ఏకంగా 487 పరుగులు బాదిన రెండో ఇన్నింగ్స్‌లో హాజల్‌వుడ్ 21 ఓవర్లలో 28 పరుగులే ఇవ్వడం విశేషం. 2020 సిరీస్‌లో భారత జట్టు అడిలైడ్‌లో 36కు ఆలౌట్ అయిన 'పింక్ బాల్' టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హాజల్‌వుడ్ 8 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి భారత్ పతనాన్ని శాసించాడు. అతడు టీమ్‌లో లేకపోవడంతో ఆసీస్ బౌలింగ్ బలహీనపడినట్లే.

తాజా పరిణామం అనంతరం ఆస్ట్రేలియా సెలక్టర్లు పేసర్లు సీన్ అబాట్, బ్రెండన్ డగెట్‌లను జట్టుతో చేర్చారు. వీరిద్దరిని టీమ్‌లోకి ఎంపిక చేసినా...ఇప్పటికే సభ్యుడిగా ఉన్న పేసర్ స్కాట్ బోలండ్‌కే తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆస్ట్రేలియా తరఫున 10 టెస్టులు ఆడిన బోలండ్ 35 వికెట్లు పడగొట్టాడు.

పాకిస్తాన్ తలవంచినట్లే!

'హైబ్రిడ్' మోడల్‌కు దాదాపు అంగీకారం

- త్వరలో ఐసీసీ అధికారిక ప్రకటన

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ-2025 నిర్వహణకు సంబంధించి ఇప్పటి వరకు గట్టిగా పట్టుదల కనబర్చిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తప్పనిసరి పరిస్థితుల్లో మెత్తపడింది. 'హైబ్రిడ్' మోడల్‌కు అంగీకరించేది లేదని, మ్యాచ్‌లన్నీ పాకిస్తాన్‌లోనే నిర్వహిస్తామని చెబుతూ వచ్చిన పీసీబీ అధ్యక్షుడు మొహసిన్ నఖ్వీ ఆ ఆశలు వదిలేసుకున్నారు. శనివారం ఐసీసీ సమావేశం ముగిసిన తర్వాత ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 'మేం ఏం చేసినా క్రికెట్ మేలు కోసమే' అంటూ ఐసీసీ షరతులకు తలవంచారు. ఐసీసీ నుంచి దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాకపోయినా... నఖ్వీ మాటలను బట్టి చేస్తూ 'హైబ్రిడ్' మోడల్ ఖాయమైనట్లు కనిపిస్తోంది. ఐసీసీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి ఇరు దేశాల ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి. కాబట్టి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ ఐసీసీ త్వరలోనే సమగ్ర ప్రకటన జారీ చేసే అవకాశం ఉంది. భారత్, పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా సమస్యల కారణంగా పాకిస్తాన్‌కు తాము వెళ్లమని బీసీసీఐ గతంలోనే ప్రకటించింది. దాంతో ఐసీసీ ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చింది. 'హైబ్రిడ్' మోడల్ ప్రకారం భారత్ ఆడే మ్యాచ్‌లు మినహా ఇతర మ్యాచ్‌లన్నీ పాకిస్తాన్‌లోనే జరుగుతాయి. భారత్ మాత్రం మరో వేదికలో ఆడుతుంది. ప్రస్తుతానికి అది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అయ్యే అవకాశం ఉంది. అయితే చివరి ప్రయత్నంగా పీసీబీ కొన్ని డిమాండ్లు చేసినట్లు సమాచారం. ఐసీసీ టోర్నీల విషయంలో తాము 'సమానత్వం' కోరుకుంటున్నట్లు నఖ్వీ వెల్లడించారు. దీని ప్రకారం మున్ముందు భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీలకు కూడా 'హైబ్రిడ్' మోడల్ అమలు చేయాలని పీసీబీ కోరింది. అంటే తాము కూడా ఇకపై భారత్‌కు వెళ్లి మ్యాచ్‌లు ఆడమని... తమ కోసం ప్రత్యామ్నాయ వేదికను చూడాలని పీసీబీ డిమాండ్ చేసింది. 2026లో టి20 వరల్డ్ కప్, 2029లో చాంపియన్స్ ట్రోఫీ, 2031లో వన్డే వరల్డ్ కప్‌లతో పాటు ఆసియా కప్‌కు కూడా భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. మరో వైపు ఐసీసీ నుంచే తమకు లభించే ఆదాయాన్ని కూడా కొంత శాతం పెంచాలని, 'హైబ్రిడ్'కు అంగీకరించినందుకు కొంత అదనపు మొత్తాన్ని ఇవ్వాలని కూడా పీసీబీ కోరినట్లు సమాచారం. చాంపియన్స్ ట్రోఫీ వచ్చే ఏడాది ఫిబ్రవరి - మార్చిలో జరగనుంది. పాక్‌లో వేదికలుగా లాహోర్, కరాచీ, రావల్పిండిలను నిర్ణయించారు.





షహ్‌జైబ్

యువ భారత్ పరాజయం

- 43 పరుగుల తేడాతో పాకిస్తాన్ గెలుపు
- అండర్-19 ఆసియాకప్

దుబాయ్: అండర్-19 ఆసియాకప్‌ను యువ భారత జట్టు ఓటమితో ప్రారంభించింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 43 పరుగుల తేడాతో పాకిస్తాన్ చేతిలో ఓటమి పాలైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ అండర్-19 జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షహ్‌జైబ్ ఖాన్ (147 బంతుల్లో 159; 5 ఫోర్లు, 10 సిక్స్‌లు) భారీ శతకంతో చెలరేగగా... మరో ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ (60; 6 ఫోర్లు) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. యువ భారత బౌలర్లలో సమర్థ్ నాగరాజ్ 3, ఆయుష్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 47.1 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. నిఖిల్ కుమార్ (77 బంతుల్లో; 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో రాణించినా... తక్కిన వాళ్లు విఫలమవడంతో ఇండియాకు పరాజయం తప్పలేదు. ఇటీవల ఐపీఎల్ వేలంలో రూ.1.10 కోట్లకు అమ్ముడైన 13 ఏళ్ల బీహార్ కుర్రాడు వైభవ్ సూర్యవంశీ (1) విఫలమయ్యాడు. ఆయుష్ మాత్రే (20), సిద్దార్థ్ (15), కెప్టెన్ మొహమ్మద్ అమాన్ (16), కిరణ్ చోర్మాలే (20), హర్వన్ష్ పంగలియా (26), హార్దిక్ రాజ్ (10) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. చివర్లో మొహమ్మద్ ఇనాన్ (30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడి ఓటమి అంతరాన్ని తగ్గించాడు. పాకిస్తాన్ బౌలర్లలో అలీ రజా 3... అబ్దుల్ సమద్, ఫహమ్ ఉల్ హక్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో ఆతిథ్య యూఏఈ 273 పరుగుల తేడాతో జపాన్‌పై గెలుపొందింది. తదుపరి మ్యాచ్‌లో సోమవారం జపాన్ అండర్-19 జట్టుతో యువ భారత్ తలపడనుంది.


నిఖిల్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఫైనల్లో సింధు

- గాయత్రి-ట్రెసా జోడీ కూడా
- సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్ టోర్నీ

లక్నో: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆడిన టోర్నీల్లో చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించని సింధు ఈ టోర్నీలో నిలకడైన ప్రదర్శనతో తుది పోరుకు అర్హత సాధించింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో శనివారం సింధు 21-12, 21-9తో భారత్‌కే చెందిన 17 ఏళ్ల ఉన్నతి హుడాపై విజయం సాధించింది. 36 నిమిషాల్లో ముగిసిన పోరులో సింధు పూర్తి ఆధిపత్యం కనబరుస్తూ ప్రత్యర్థిని వరుస గేమ్‌ల్లో చిత్తు చేసింది. సింధు పవర్ ముందు నిలవలేకపోయిన ఉన్నతి పదే పదే తప్పులు చేస్తూ మ్యాచ్‌ను కోల్పోయింది. 'ఈ ప్రదర్శనతో ఆనందంగా ఉన్నా. మ్యాచ్ ఆరంభం నుంచే ఆధిక్యం కనబర్చా. పూర్తి ఆత్మవిశ్వాసంతో షాట్లు ఆడా. దానికి ఫలితం దక్కింది. ఉన్నతి శాయశక్తులా ప్రయత్నించింది. కానీ నేను ఆమెకు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. తను వర్ధమాన షట్లర్. భవిష్యత్తులో మంచి విజయాలు సాధించాలని ఆశిస్తున్నా' అని సింధు పేర్కొంది. ఆదివారం జరగనున్న మహిళల సింగిల్స్ ఫైనల్లో చైనా షట్లర్ వు లువో యుతో సింధు తలపడనుంది.

లక్ష్యసేన్ ముందంజ..

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్యసేన్ ఫైనల్లో అడుగుపెట్టాడు. సెమీఫైనల్లో లక్ష్యసేన్ 21-8, 21-14తో షోగో ఒగావా (జపాన్)పై వరుస గేమ్‌ల్లో విజయం సాధించాడు. ఆరంభం నుంచే సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన లక్ష్యసేన్ సులువుగా మ్యాచ్‌ను ముగించాడు. మరో సెమీఫైనల్లో ప్రియాన్షు రజావత్ 13-21, 19-21తో జియా హెంగ్ జాసో (ఇండోనేషియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆదివారం పురుషుల సింగిల్స్ తుది పోరులో జియా హెంగ్‌తో లక్ష్యసేన్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జంట ఫైనల్‌కు చేరగా... అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ సెమీస్‌లో ఓడింది. గాయత్రి-ట్రెసా 18-21, 21-18, 21-10తో బెనీపా - నున్తకర్న్ (థాయిలాండ్)పై గెలుపొందగా...టాప్ సీడ్ అశ్విని - తనీషా 21-14, 16-21, 13-21 తేడాతో లి జింగ్ - లి ఖియాన్ చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల (భారత్) జోడీ కూడా ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీస్‌లో ఐదో సీడ్ తనీషా-ధ్రువ్ జంట 21-16, 21-15తో జీ హాంగ్ జూ-జియా యీ యాంగ్ (చైనా) ద్వయంపై గెలిచింది.



సినిమా


తమన్నా

దొంగగా కనిపించడం ఆనందం

''నా పదిహేనేళ్ల వయసులోనే నటిగా నా కెరీర్ మొదలైంది. ప్రేక్షకులకు వీలైనంత చేరువ కావాలని కథల ఎంపికలో ఎప్పటికప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటుంటాను. ఇప్పటివరకు ఎన్నో భిన్నమైన పాత్రలు చేశాను. కానీ ఇప్పటివరకూ దొంగ పాత్రలో మాత్రం నటించలేదు. ఈ పాత్ర చేయాలనే నా ఆకాంక్ష 'సికందర్ కా ముఖద్దర్' చిత్రంతో నెరవేరినందుకు హ్యాపీగా ఉంది. నా కెరీర్‌లో ఈ పాత్ర నాకెంతో స్పెషల్'' అని తమన్నా అన్నారు. జిమ్మీ షెర్గిల్, అవినాష్ తివారి, తమన్నా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'సికందర్ కా ముఖద్దర్'. నీరజ్ పాండే దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా నవంబరు 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తమన్నా మాట్లాడుతూ– ''నేను చేసే పాత్ర చిన్నదా? పెద్దదా అనేది నాకు ముఖ్యం కాదు. ఆ కథను ఎంత ప్రభావితం చేస్తుందన్నది ముఖ్యం. పెద్దా చిన్నా తేడాల్లేకుండా వచ్చిన అవకాశాలతో ప్రేక్షకులను మెప్పించడమే నా లక్ష్యం. అలాగే ఒకే రకంగా ఉండే స్ట్రాంగ్ ఉమన్ రోల్స్ కాకుండా... కొత్త తరహా ఉమన్ రోల్స్ చేయా లని ఉంది'' అని పేర్కొన్నారు.


హృతిక్ రోషన్
ఎన్టీఆర్

ఢీ అంటే ఢీ

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా నటిస్తున్న తాజా చిత్రం 'వార్ 2'. ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం హృతిక్ రోషన్-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఓ మాసీ సాంగ్‌ను ముంబైలో వేసిన ఓ సెట్‌లో చిత్రీకరించారని బాలీవుడ్‌లో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా హృతిక్, ఎన్టీఆర్ కాంబోలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు రెడీ అవుతున్నారట దర్శకుడు అయాన్ ముఖర్జీ. డిసెంబరు రెండో వారంలో చిత్రీకరించే ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో హృతిక్, ఎన్టీఆర్ ఢీ అంటే ఢీ అన్నట్లు ఫైట్ చేస్తారట. ఇది క్లైమాక్స్ ఫైట్ అని, దాదాపు పదిహేను రోజుల పాటు చిత్రీకరించడానికి ప్లాన్ చేశారని, ఈ ఫైట్ కోసం ముంబైలోని ఓ ప్రముఖ స్టూడియోలో భారీ సెట్ రూపొందించారని టాక్. ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న 'వార్ 2' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకూ కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయని తెలిసింది. వచ్చే ఏడాది ఆగస్టు 14న ఈ చిత్రం విడుదల కానుంది.

ఆ ధైర్యాన్ని క ఇచ్చింది

- కిరణ్ అబ్బవరం


వంశీ నందిపాటి, సందీప్, కిరణ్ అబ్బవరం, సాయికృష్ణ, సుజీత్

''క' సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మంచి సినిమా చేస్తే ప్రేక్షకుల ప్రేమను గెల్చుకోవచ్చు అనే ధైర్యాన్ని, నమ్మకాన్ని 'క' ఇచ్చింది. మా మూవీ సక్సెస్‌కు కారణమైన డైరెక్టర్స్ సందీప్, సుజీత్, నిర్మాత గోపీ, డిస్ట్రిబ్యూటర్ వంశీగార్లకు కృతజ్ఞతలు'' అని హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. సుజీత్, సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'క'. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమాని తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి అక్టోబరు 31న విడుదల చేశారు. శనివారం నిర్వహించిన 'క' బ్లాక్ బస్టర్ ధమాకా ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీ నుంచి ఓటీటీలోకి వచ్చిన ఫస్ట్ తెలుగు సినిమా 'క' కావడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''క' సినిమాకు థియేటర్స్‌లో అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు ఓటీటీలోనూ అదే స్పందన రావడం హ్యాపీగా ఉంది'' అని సుజీత్ తెలిపారు. ''మా టీమ్‌లోని ప్రతి ఒక్కరూ 'క' సినిమా సక్సెస్‌కు కారణం'' అన్నారు సందీప్.


సూర్య వంటిపల్లి, సీతక్క, శశి వంటిపల్లి

నారి హిట్ అవ్వాలి

- సీతక్క

''మహిళలు ఎన్నో రంగాల్లో ఎదుగుతున్నారు. అయినా వారి పట్ల వివక్ష, చిన్న చూపు తగ్గడం లేదు. సమాజ నిర్మాతలు మహిళలనే నిజాన్ని మనమంతా గుర్తుపెట్టుకోవాలి. ఆడపిల్లలు ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలి. మహిళల్ని గౌరవించాలి. ఇలాంటి గొప్ప కథాంశంతో 'నారి' సినిమా చేసిన సూర్యకి అభినందనలు. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అని తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆకాంక్షించారు. ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనికా రెడ్డి, ప్రగతి తదితరులు నటించిన చిత్రం 'నారి'. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో శశి వంటిపల్లి నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న రిలీజ్ కానుంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌ని సీతక్క రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సూర్య వంటిపల్లి మాట్లాడుతూ – ''మహిళల పట్ల మనం ఎలా వ్యవహరించాలి? వారికి ఎలా సపోర్ట్ చేయాలనే కాన్సెప్ట్‌తో 'నారి' చిత్రం తీశాను. ప్రతి మహిళ తమ ఇంట్లోని పురుషుడిని వెంట తీసుకెళ్లి ఈ సినిమాను చూపించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

Gold Memories

మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాపకాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే 'సాక్షి యూట్యూబ్' ఇక ప్రతి వారం ఓ సినిమాతో మీ మనస్సును తట్టే ప్రయత్నం చేస్తుంది 'గోల్డెన్ మెమొరీస్' రూపంలో. ఈ వారం 'గోల్డెన్ మెమొరీస్'లో ఓ ఆణిముత్యం అయిన 'గుండమ్మ కథ' గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

వీణా రావుకి ఈ అవకాశం రావడం అదృష్టం

- నిర్మాత సుప్రియ


గీత, స్వప్నా దత్, సుప్రియ, వైవీఎస్ చౌదరి


''నా తొలి సినిమాని అశ్వినీదత్‌గారి బేనర్‌లోనే చేయాలి. కానీ అన్నపూర్ణ స్టూడియోస్‌లో నాగార్జునగారు డైరెక్టర్‌గా తొలి అవకాశం ఇచ్చారు. ఈ ఇద్దరూ నాకు చిరస్మరణీయులు. వారి కుటుంబం నుంచి వచ్చి, మహిళా శక్తులుగా ఎదిగారు సుప్రియ, స్వప్నా దత్. నేను కథానాయికగా పరిచయం చేస్తున్న తెలుగు అమ్మాయి వీణా రావు ఫస్ట్ లుక్ దర్శన్‌ని సుప్రియ, స్వప్న విడుదల చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను వీణా రావు మంచి కూచిపూడి డ్యాన్సర్. తనకి ఇండస్ట్రీలో మంచి భవిష్యత్తు ఉండాలి'' అని డైరెక్టర్ వైవీఎస్ చౌదరి అన్నారు. తారక రామారావు హీరోగా, తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ వైవీఎస్ చౌదరి ఓ సినిమాని ప్రకటించిన సంగతి తెలిసిందే. న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత ఈ చిత్రం నిర్మిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో వీణా రావు ఫస్ట్ దర్శన్‌ని నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, స్వప్నా దత్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా స్వప్నా దత్ మాట్లాడుతూ– ''వీణారావు చాలా అందంగా ఉంది. తెలుగు అమ్మాయిలు హీరోయిన్లుగా రావాల్సిన సమయం ఇది. చౌదరి అన్న ఈ విషయంలో ఓ అడుగు ముందుకేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ– ''వైవీఎస్ చౌదరిగారు డైరెక్టర్‌గా తీసిన తొలి చిత్రం 'సీతారాముల కళ్యాణం చూతము రారండి' చూసిన తర్వాత తాతగారు (అక్కినేని నాగేశ్వరరావు) చాలా సంతోషపడ్డారు. కొత్త వారిని పరిచయం చేయడంలో ఆయనెప్పుడూ ముందుంటారు. వీణా రావుకి ఈ అవకాశం రావడం అదృష్టం'' అని చెప్పారు. ''వీణా రావు ఫస్ట్ దర్శన్‌ని లాంచ్ చేసిన సుప్రియ, స్వప్నగార్లకు థ్యాంక్స్'' అన్నారు యలమంచిలి గీత. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి.

ఓటీటీ ఇది చూడొచ్చు

నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉంటుందో తెలుసా?


ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ఎ క్వైట్ ప్లేస్ డే వన్' ఒకటి. ఈ చిత్రం గురించి...

ప్రతి మనిషికీ ఆలోచనలుంటాయి. కానీ కొంతమందికి ప్రత్యేక ఆలోచనలొస్తాయి. మరీ ముఖ్యంగా హాలీవుడ్ దర్శకులకు విపరీత ధోరణితో ఆలోచనలొస్తాయి. అవి వాళ్ల సినిమాల రూపంలో ప్రేక్షకుల ముందుంచుతారు. ఆ నేపథ్యంలో వచ్చిన సినిమానే 'ఎ క్వైట్ ప్లేస్ డే వన్'. ఈ సినిమా సిరీస్‌లో మూడవది. ఈ సిరీస్‌లో వచ్చిన మూడు సినిమాలూ సూపర్ డూపర్ హిట్. ఇప్పుడు వచ్చిన 'ఎ క్వైట్ ప్లేస్ డే వన్' నెల రోజుల క్రితమే ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా పెయిడ్ ఫార్మెట్‌లో విడుదలవగా... ఈ వారమది అందరికీ అందుబాటులోకి వచ్చింది. దాదాపు ముప్పైఏడేళ్ల క్రితం ప్రముఖ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు 'పుష్పక విమానం' అనే ప్రత్యేకమైన సినిమా తీశారు. ఒక్క డైలాగ్ లేకుండా చక్కటి కామెడీతో చూడముచ్చటగా ఉంటుందా చిత్రం. దాదాపు అలాంటి కోవకే చెందిన ఇంగ్లిష్ చిత్రం 'ఎ క్వైట్ ప్లేస్ డే వన్' చూసేవాళ్లకు చెమటలు పట్టించడం ఖాయం. మాటలు తక్కువున్నా ప్రేక్షకులకు దడ పుట్టిస్తుంది. జాన్ క్రసిన్స్కీ ఈ సిరీస్‌లో వచ్చిన చిత్రాలన్నిటికీ రచయిత. మొదటి రెండు చిత్రాలకు తాను దర్శకత్వం వహించగా తాజా చిత్రానికి మైఖేల్ సర్నోస్కీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ ప్రకారం... న్యూయార్క్‌లో హాస్ స్పైస్ అనే ఫెసిలిటీలో క్యాన్సర్ పేషంట్‌గా ఉన్న సామ్ తన కుక్క పిల్లతో వాలంటీర్ రూబెన్‌తో కలిసి ఓ ప్లే చూడడానికి సిటీలోకి వెళ్తుంది. సామ్‌కి సంగీతం అంటే ఇష్టం. ఎప్పుడూ ఏదో ఒకటి వింటుంటుంది. అప్పుడే మాన్‌హట్టన్ నగరంపై ఏలియన్స్ దాడి జరుగుతుంది. ఈ ఏలియన్స్ ఎక్కడైనా శబ్దం వస్తే చాలు కనిపించిన మనుషులపై దాడి చేస్తూ ఉంటాయి. నగరమంతా వాటి దాడి వల్ల క్షణాల్లో నిర్మానుష్యమైపోతుంది. అక్కడక్కడా శబ్దం చేయకుండా బ్రతికున్నవాళ్లు ఏలియన్స్ నుండి తప్పించుకుంటూ ఉంటారు. అసలే క్యాన్సర్ బారిన పడిన సామ్ ఈ ఏలియన్స్ దాడిని ఎలా ఎదుర్కొందనేది మిగతా కథ. పైన చెప్పుకున్నట్టు ఈ నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉంటుందో ఈ సినిమా చూశాక తెలుస్తుంది. ఇంకెందుకు ఆలస్యం... ఈ వీకెండ్ చూసెయ్యండి.



– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 17 సంచిక: 250

SUNDAY Special ఆదివారం 1-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నిశ్శబ్దాన్ని ఛేదించారు!

వారు నిత్యం దేహంలోని శత్రువుతో పాటు సమాజంతోనూ పోరాడుతున్న ధీరులు. ధైర్యంగా తలెత్తుకొని నిలబడే యత్నం చేస్తూ ఇప్పుడిప్పుడే నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్నారు. ఒక్కొక్కరుగా సంఘటితమవుతున్నారు. - 16లో



ఇథనాల్‌పై గెలుపులో అంతా ఆమే!

దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. ఇది ఉద్యమ విజయం. ఈ ఉద్యమ ప్రత్యేకత... మహిళా శక్తి. - 14లో



సీఎం పదవి బీజేపీకే..

మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమిలో సీఎం పదవిపై పీటముడి క్రమంగా వీడుతోంది. సీఎం పదవి బీజేపీదేనని తేల్చేశారు.

- వివరాలు 6లో▶



ప్రతీ దాడి బలోపేతం చేస్తుంది

చట్టాలు, నిబంధనల అమలుకు తమ గ్రూప్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని అదానీ గ్రూప్ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీ చెప్పారు.

- వివరాలు 6లో▶



బంగ్లాలో పూజారుల అరెస్ట్

బంగ్లాదేశ్‌లో హిందువులపై అఘాయిత్యాలు కొనసాగుతున్నాయి. హిందూ మత పెద్ద చిన్మయ్ శిష్యులిద్దరిని అరెస్ట్ చేశారు.

- వివరాలు 6లో▶



తీరం దాటిన ఫెంగల్

తుఫాన్ ప్రభావంతో తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద నీరు చేరడంతో చెన్నై ఎయిర్‌పోర్టును మూసివేశారు.

- వివరాలు 6లో▶



రైతు సంక్షేమం కాంగ్రెస్ పేటెంట్

మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో సభకు హాజరైన ప్రజలు

నాడు ఉచిత విద్యుత్ నుంచి నేటి బోనస్ దాకా తెచ్చింది మేమే

చర్చిద్దాం.. మోదీ వస్తారా? కేసీఆర్ వస్తారా?: రేవంత్ సవాల్

- లగచర్లలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చిచ్చుపెట్టారు
- వారి మాటలు నమ్మి అమాయక లంబాడాలు జైలుకు వెళ్లారు
- మీ కుట్రలు, కుతంత్రాలకు నేను బెదిరేవాడిని కాదు..
- తోడేళ్లు, పులులు ఎన్నో చూశా.. మానవ మృగాలు మీరెంత?
- కేసీఆర్ చేసిన రుణమాఫీ మిత్తీలకే పోయింది
- మేం తొలి ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం
- పాలమూరు జిల్లా కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడి
- రైతు పండుగ ముగింపు సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

2లో

"నా ప్రాంత అభివృద్ధి, 25 వేల మంది యువతకు ఉపాధి కోసం కొడంగల్‌లో పారిశ్రామిక వాడ నిర్మించాలనుకున్నా. కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లగచర్లలో చిచ్చుపెట్టి అధికారులపై దాడులు చేయించారు. వాళ్ల మాయమాటలు నమ్మి అమాయక లంబాడాలు జైలుకు వెళ్లారు. మీ కుట్రలు, కుతంత్రాలకు నేను బెదిరేవాడిని కాదు. తోడేళ్లు, పులులు ఎన్నో చూశా.. మానవ మృగాలు మీరెంత? నేను ఆనాడే చెప్పాను వాళ్లని నమ్మొద్దని. లగచర్లలో కేసులు ఎదుర్కొంటున్న వారు నా దగ్గరకు వస్తున్నారు. ఒక్క కేసీఆర్‌కే గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉంది. మా పారిశ్రామిక వాడ కోసం 1,300 ఎకరాలు ఉండొద్దా? నాడు అధికారులపై దాడులు చేసి ఉంటే సాగర్ వంటి ప్రాజెక్టులు పూర్తయ్యేవా? అభివృద్ధి కోసం కొందరు నష్టపోక తప్పదు." - సీఎం రేవంత్‌రెడ్డి

నాలుగో విడత రుణమాఫీకి మరో రూ. 2,747.67 కోట్లు 2లో


అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి



టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు గవర్నర్ ఆమోదం
- ఒకటి రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం
- ఈ నెల 3న ముగియనున్న ప్రస్తుత ఛైర్మన్ మహేందర్‌రెడ్డి పదవీకాలం
- ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించనున్న బుర్రా వెంకటేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నూతన ఛైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులు కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా నియామక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్న ఎం.మహేందర్‌రెడ్డి పదవీకాలం ఈ నెల 3వ తేదీతో ముగుస్తోంది. ఆ తర్వాత బుర్రా వెంకటేశం బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణ రాష్ట్రం

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఉద్యోగుల జోలికొస్తే ఖబడ్దార్



ప్రభుత్వ ఉద్యోగులను దూషించడం, దాడులు చేయటం, బెదిరించటం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉద్యోగులను ఎవరైనా లక్ష్యంగా చేసుకుంటే.. తాము కూడా వారిని టార్గెట్ చేస్తామన్నారు.

- వివరాలు 3లో▶

జీవో '317' బదిలీలకు పచ్చజెండా



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. స్థానికతపై రాష్ట్రపతి ఉత్తర్వులు–2018 అమలులో భాగంగా జీవో 317 కింద గతంలో కొత్త లోకల్ కేడర్లకు కేటాయించిన ఉద్యోగులను స్పౌజ్ కేటగిరీ, పరస్పర బదిలీలు, ఆరోగ్య కారణాల కింద వేరే లోకల్ కేడర్లకు మళ్లీ బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది.

- వివరాలు 3లో▶

అమెరికాలో కాల్పులు.. ఖమ్మం యువకుడి మృతి



ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఖమ్మం జిల్లాకు చెందిన యువకుడు అక్కడ దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు. సాయితేజ ఎంబీఏ చదువుతూనే అక్కడ ఓ స్టోర్‌లో పార్ట్‌టైం ఉద్యోగం కూడా చేస్తున్నాడు.

- వివరాలు 5లో▶


మరో రైతుపై పులి దాడి

ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లో ఘటన

5లో


గాయపడిన రైతు సురేశ్

ఇదండీ సంగతి



ఈనాడు, ఆంధ్రజ్యోతిలకు

వైఎస్ జగన్ లీగల్ నోటీసులు

ఆ పత్రికల పబ్లిషర్లు, ఎడిటర్లకు జగన్ తరఫున నోటీసులు ఇచ్చిన న్యాయవాదులు



- రాష్ట్ర చరిత్రలోనే అత్యంత చౌక ధరకు 'సెకీ' విద్యుత్
- యూనిట్ రూ.2.49 చొప్పున కేంద్రంతో రాష్ట్రం విద్యుత్ కొనుగోలు ఒప్పందం
- ఇందులో మూడో పార్టీకి ఎలాంటి పాత్ర లేదు
- అంతర్రాష్ట్ర సరఫరా చార్జీలు ఉండవని స్పష్టంగా చెప్పిన సెకీ.. అయినా ఉద్దేశపూర్వకంగా ఆ పత్రికలు తప్పుడు కథనాలు
- దీనిపై బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- దానిని మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49 చొప్పున కేంద్రంతో విద్యుత్ కొనుగోలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంపై నిరాధార ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తూ కథనాలు ప్రచురించిన ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫు న్యాయవాదులు శనివారం లీగల్ నోటీసులు జారీ చేశారు. ఇది కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందం అని, థర్డ్ పార్టీకి ఎలాంటి పాత్ర లేదని ఆది నుంచీ తమ క్లయింట్ స్పష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. సెకీ ఐఎస్‌టీఎస్ (అంతర్రాష్ట్ర సరఫరా) చార్జీలు మినహాయింపు ఇచ్చిందని.. ఆ మేరకు ఒప్పంద పత్రాలు, సెకీ రాసిన లేఖ ప్రతులను చూపిస్తున్నా సరే ఆ పత్రికలు పట్టించుకోకుండా నిరాధారంగా తమ క్లయింట్ గౌరవ ప్రతిష్ఠలను దెబ్బ తీస్తూ, ఉద్దేశ పూర్వకంగా తప్పుడు కథనాలు ప్రచురించాయని

మిగతా 3వ పేజీలో ▶

కృష్ణాలో తెలంగాణకు 70% వాటా దక్కాలి

- నీటి పారుదల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- 70% కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉంది.. ఏపీలో 30 శాతమే ఉంది



- దీని ప్రకారమే జలాల్లో తెలంగాణకు వాటా రావాలి
- ఆ దిశగా కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట వాదనలు వినిపించాలని అధికారులకు సూచన

- వివరాలు 5లో

మళ్లీ గ్రామ రెవెన్యూ అధికారులు!

- విద్యార్హతల ఆధారంగా నియమించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- గతంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్‌ఏలు మళ్లీ రెవెన్యూ శాఖలోకి...
- అందులో సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన వారు నేరుగా విధుల్లోకి
- మిగతా సుమారు 8 వేల పోస్టులకు రాతపరీక్ష ద్వారా నియామకాలు చేపట్టే యోచన

3లో

నేడు ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్లు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- ప్రధాని నరేంద్ర మోదీ మాటల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు
- త్వరలో జరిగే 'స్థానిక' ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలి

2లో

ఏఈఈ అక్రమాస్తులు రూ. 200 కోట్లపైనే..!


నిఖేశ్‌కుమార్

- రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ అధికారి నిఖేశ్‌కుమార్ అవినీతి బట్టబయలు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ చేసిన ఏసీబీ
- బఫర్ జోన్లలో అనుమతులు.. అందుకు ప్రతిగా లంచాలుగా ఆస్తులు
- 19 ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన తనిఖీలు.. రూ. 17.73 కోట్ల ఆస్తుల గుర్తింపు.. బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ రూ. 200 కోట్లపైనే

సాక్షి, హైదరాబాద్/బండ్లగూడ: బఫర్ జోన్లలో నిర్మాణాలకు అక్రమంగా అనుమతులిచ్చి అందుకు ప్రతిగా లంచాలుగా ఆస్తులు పొందడంతోపాటు ఇటీవల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కి సస్పెండైన ఓ అవినీతి అధికారి బాగోతం బట్టబయలైంది. ఆదాయానికి మించి రూ. వందల కోట్ల ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై నమోదైన కేసులో రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హెరూర్ నిఖేశ్ కుమార్‌ను ఏసీబీ శనివారం రాత్రి అరెస్ట్ చేసింది. అంతకుముందు శనివారం ఉదయం నుంచి రాత్రి దాకా ఆయన ఇల్లు, బంధువులు, స్నేహితుల ఇళ్లపై ఏసీబీ మెరుపుదాడులు చేసింది. హైదరాబాద్ బండ్లగూడ జాగీర్‌లోని పెబెల్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలోని ఆయన ఇంటితోపాటు 19 ప్రాంతాల్లో సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో కొల్లూరులో 15 ఎకరాల వ్యవసాయ భూమి, మొయినాబాద్‌లో 3 ఫాంహౌస్‌లు, విలాసవంతమైన 3 విల్లాలు, 5 నివాస స్థలాలు, 6.5 ఎకరాల వ్యవసాయ భూమి, ఆరు ప్లాట్లు, రెండు కమర్షియల్ స్థలాలకు సంబంధించిన పత్రాలను ఏసీబీ గుర్తించింది. వాటి

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

గురుకులాలపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుట్ర

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: పేద విద్యార్థులు చదువుకునే గురుకులాలపై మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఠా కుట్రలకు పాల్పడుతోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్‌ల ఆదేశాల మేరకు ప్రవీణ్‌కుమార్ తన మనుషులతో ఈ కుట్రను అమలు చేస్తున్నారని తెలిపారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డైట్ చార్జీలు గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా పెంచకపోయినా ప్రవీణ్‌కుమార్ నోరు మెదపలేదని, ఇప్పుడు డైట్ చార్జీలు పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్న ప్రజా ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తన ప్రైవేటు సైన్యాన్ని ఉపయోగించి ఇలాంటి కుట్రలను అమలు చేయడం ద్వారా ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని సత్యం విమర్శించారు. బీఆర్ఎస్ తీరు సరిగా లేకనే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటికి పంపించారని, పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలిపించకుండా మెడలు పట్టి గెంటేశారని సత్యం గుర్తుచేశారు. ఇదే రీతిలో వెళ్తే స్థానిక ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థి లోకానికి ఇప్పటికైనా ప్రవీణ్‌కుమార్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఓర్వలేకే ఫుడ్ పాయిజన్ కుట్రలు

ప్రభుత్వ విప్ అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకులాల డైట్ చార్జీలను 40 శాతం పెంచి పేద విద్యార్థులకు మంచి భోజనం అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఓర్వలేక.. ఫుడ్ పాయిజన్ కుట్రలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆరోపించారు. గురుకులాలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పెద్ద కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్.. తన హయాంలో నియమించుకున్న మనుషులతో ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని చెప్పారు. పదేళ్ల పాటు గురుకుల విద్యార్థులకు కనీసం డైట్ చార్జీలు పెంచని బీఆర్ఎస్‌కు.. తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతలు మారడం లేదని అయిలయ్య ఎద్దేవా చేశారు.

తప్పు చేస్తే జైలైనా.. ఉరికైనా సిద్ధం

బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్




సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్లు గురుకులాల కార్యదర్శిగా ఉన్నానని, తన రికార్డులు సంక్షేమ భవన్‌లో భద్రంగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. తప్పు చేశానని విచారణలో తేలితే జైలుకైనా.. ఉరికంభం ఎక్కడానికైనా సిద్ధమని సవాల్ చేశారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో గురుకుల బాట కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గురుకుల బాట కార్యక్రమానికి కేటీఆర్ పిలుపునిచ్చారని, గురుకులాల్లోని సమస్యలపై అధ్యయనం చేసి నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. ఏడాదిగా తెలంగాణలో విద్య, సాంఘిక సంక్షేమ శాఖకు మంత్రి లేరని ధ్వజమెత్తారు. గురుకులాల్లో సరైన వసతుల్లేవని విద్యార్థులు రోడ్డెక్కుతున్నారని చెప్పారు. ఒకే జిల్లాలో మూడు సార్లు గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని, 28మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి విద్యాశాఖపై అవగాహన లేదని, మతి స్థిమితంలేని మంత్రులతో తనపై మాట్లాడిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆకునూరి మురళి విద్యా కమిషన్ చైర్మన్ కాకముందు ఒకలా.. ఇప్పుడు మరోలా మాట్లాడుతున్నారన్నారు. బాల్క సుమన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాల వ్యవస్థను నీరుగారుస్తున్నారన్నారు. గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై కోపాన్ని గురుకుల విద్యార్థులపై చూపిస్తున్నారని విమర్శించారు.

ఆత్మస్తుతి.. పరనిందలా రేవంత్ ప్రసంగం

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పాలమూరు సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందలా సాగిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌లో భూములు ఇవ్వకుండా గిరిజన రైతులు ఎదురు తిరిగినందుకు.. రాష్ట్రంలోని రైతులను బెదిరించేందుకు ఈ సభ ఏర్పాటు చేసినట్లుందని శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రైతులు భూములు ఇవ్వకున్నా గుంజుకోవడం ఖాయమని రేవంత్ బహిరంగంగా బెదిరించినట్లుందని పేర్కొన్నారు. పాలమూరు మీద ప్రేమ ఉంటే.. ఏడాది కాలాన్ని ఎందుకు హారతి కర్పూరంలా కరిగించారో సీఎం చెప్పాలని కోరారు.





రైతు కుటుంబాలకు రుణమాఫీ చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, తదితరులు. స్టాల్‌లో ప్రదర్శనకు ఉంచిన మినీ ట్రాక్టర్‌ను నడుపుతున్న రేవంత్. పక్కన జూపల్లి, తుమ్మల తదితరులు

రైతు సంక్షేమం.. కాంగ్రెస్ పేటెంట్

నాడు ఉచిత విద్యుత్ నుంచి నేటి బోనస్ దాకా తెచ్చింది మేమే

చర్చిద్దాం.. మోదీ వస్తారా? కేసీఆర్ వస్తారా?: సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రైతు సంక్షేమం అంటేనే కాంగ్రెస్ పార్టీకి పేటెంట్ అని...వైఎస్సార్ హయాంలో ఉచిత విద్యుత్ నుంచి ఇప్పుడు వరి ధాన్యానికి రూ.500 బోనస్ దాకా ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ''ప్రధాని మోదీ వస్తారో.. మాజీ సీఎం కేసీఆర్ వస్తారో.. ఒక్కొక్కరుగా వస్తారో, అందరూ కలసి వస్తారో... రండి... చర్చిద్దాం..'' అని సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు 'లగచర్ల'లో చిచ్చుపెట్టి అధికారులు, కలెక్టర్‌పై దాడులు చేయించారని... వాళ్ల మాయమాటలు నమ్మి అమాయక లంబాడాలు జైలుకు పోయారని పేర్కొన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో రైతు పండుగ అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు, స్టాళ్లను తిలకించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ప్రసంగించారు. సీఎం రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎలాంటి విమర్శలు చేస్తున్నారో ప్రజలు గమనించాలి. గత పదేళ్లలో కేసీఆర్ కేవలం సాగునీటి ప్రాజెక్టులు, కాంట్రాక్టర్ల కోసం రూ.1.83 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. అందులో కాళేశ్వరానికే రూ.1.02 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. కాళేశ్వరం నీళ్లతో రైతుల కాళ్లు కడుగుతానని చెప్పారు. కానీ సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ కుప్పకూలిపోయాయి. అదే కాంగ్రెస్ హయాంలో ఎప్పుడో కట్టిన జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, నెట్టెంపాడు, మంజీరా, ఎల్లంపల్లి భద్రంగా ఉన్నాయి. కాళేశ్వరం నుంచి చుక్క నీళ్లు రాకున్నా... వరుణుడి దయవల్ల 75 ఏళ్ల ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఉత్పత్తి చేయనంతగా 66 లక్షల ఎకరాల్లో 1.53 లక్షల కోట్ల టన్నుల వడ్లు తెలంగాణలో పండాయి. వరి వేస్తే ఉరేనని నాడు కేసీఆర్ అన్నారు. ఈ రోజు వరి ధాన్యానికి బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. దానితో బీఆర్ఎస్ నేతల గుండెల్లో పిడుగులు పడుతున్నాయి.

కేసీఆర్ రుణమాఫీ మిత్తీలకే పోయింది..

కేసీఆర్ మొదట ఐదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ అన్నారు. నాలుగు విడతలు అన్నారు, మిత్తి తాను కడతానన్నారు. మళ్లీ 2018–23 వరకు లక్షన్నర రుణమాఫీ చేస్తానన్నారు. మొదటి నాలుగేళ్ల పైసా ఇవ్వలేదు. ఆఖరి ఏడాదిలో ఔటర్ రింగ్ రోడ్డును రూ.7,500 కోట్లకు తెగనమ్మి మాఫీ డబ్బులు వేశారు. ఐదేళ్లలో వాళ్లు రుణమాఫీకి ఖర్చు చేసింది రూ.11 వేల కోట్లే. అందులో రూ.8,596 కోట్లు మిత్తిలకే పోయాయి. రైతులకు చెల్లించింది రూ.2,500 కోట్లే. హరీశ్‌రావు ఇది విను.. లెక్కలు కావాలంటే మళ్లీ చెబుతాం.

సవాల్ చేస్తున్నా... ఎవరు వస్తారో రండి..

కేసీఆర్‌కు ఈ వేదికగా సవాల్ విసురుతున్నా. 25 రోజుల్లో రూ.17,869 కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర దేశంలో ఎక్కడైనా ఉందా నిరూపించండి. మొదటి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు మొత్తం రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. మోదీ వస్తారో.. కేసీఆర్ వస్తారో రండి. ఒక్కొక్కరుగా వస్తారో, అందరూ కలిసి వస్తారో రండి.. అసెంబ్లీలో చర్చిద్దాం. రైతు రుణమాఫీ చేసిన చరిత్ర మాది.. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన చరిత్ర మాది.. రైతు బీమా తెచ్చింది కాంగ్రెస్.. వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చింది కాంగ్రెస్. అసలు రైతు సంక్షేమమే కాంగ్రెస్ పేటెంట్. పని చేయడమే మాకు తెలుసు.. పనిలోపడి చేసింది చెప్పుకోలేకపోతున్నాం.

నాకీ పదవి ఆషామాషీగా రాలేదు..

కేసీఆర్.. పాలమూరు బిడ్డలు నిన్ను పల్లకీలో మోసి ఎంపీని చేశారు. పాలమూరు ప్రజలు ఆదరిస్తే సీఎం అయ్యానని చెప్పి పదేళ్లు మోసం చేశావు. నాడు పాలమూరును దత్తత తీసుకుంటా అన్నారు. కానీ పదేళ్ల పాలనలో ఈ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. ఇవాళ మేం నారాయణపేట–మక్తల్–కొడంగల్ ప్రాజెక్టు చేపడితే వద్దంటున్నావ్. కాళ్లలో కట్టెలు పెడుతున్నావ్. ఎందుకీ ద్వేషం. నేను రైతు బిడ్డగా కొండారెడ్డిపల్లి నుంచి బయలుదేరి రాష్ట్రానికి సీఎంగా ఇక్కడికి వచ్చా. నాకీ పదవి ఆషామాషీగా వచ్చింది కాదు. ఒక బాధ్యత. పాలమూరును దత్తత తీసుకున్న చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, కేసీఆర్ చేసిందేమీ లేదు. మేం అభివృద్ధి చేసుకోలేమా? నేను ఇక్కడే పుట్టినోడిని, ఇక్కడి మట్టిలో కలిసే వాడిని.. సీఎంగా ఉండి నా జిల్లాకు ఏమీ చేయకపోతే చరిత్ర క్షమిస్తుందా? ఎవరు అడ్డం వచ్చినా తొక్కుకుంటూ జిల్లాకు నిధులు తెస్తా. పాలమూరులో 20 లక్షల ఎకరాలకు నీళ్లు పారించేవరకు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తాం..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

మార్పు కోసం వేసిన ఓటు అభయహస్తమైంది


రైతన్న చరిత్రను తిరగరాసిందంటూ 'ఎక్స్'లో సీఎం పోస్టు

సాక్షి, హైదరాబాద్: ఏడాది క్రితం సరిగ్గా ఇదే రోజు (నవంబర్ 30) పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు పోలింగ్ బూత్‌కెళ్లి మార్పు కోసం ఓటేశాడని, ఆ ఓటు అభయహస్తమై రైతన్న చరిత్రను తిరగరాసిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ.. రూ.7,625 కోట్ల రైతు భరోసా.. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్... రూ.10,444 కోట్ల ఉచిత విద్యుత్.. రూ.1,433 కోట్ల రైతుబీమా.. రూ.95 కోట్ల పంట నష్ట పరిహారం.. రూ.10,547 కోట్ల ధాన్యం కొనుగోళ్లు.. ఇలా ఒక్క ఏడాదిలో రూ.54 వేల కోట్లతో రైతుల జీవితాల్లో పండుగ తెచ్చాం. ఇది నంబర్ కాదు.. రైతులు మాపై పెట్టుకున్న నమ్మకం..'' అని రేవంత్ పేర్కొన్నారు.

పాలమూరుకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు తెచ్చుకుందాం

పాలమూరుకు నీళ్లు తెస్తామంటే కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు అడ్డుపడుతున్నారు. ఎవరో వచ్చి పాలమూరును దత్తత తీసుకోవడం కాదు. మీ పాలమూరు బిడ్డనే ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఎవరి దయాదాక్షిణ్యాలు మాకు అవసరం లేదు. వచ్చిన అవకాశాన్ని జార విడుచుకుందామా? పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసుకోవద్దా? ఒకే సంతకంతో మన జిల్లాకు కావాల్సిన అన్నీ తెచ్చుకుందాం. ఏడాదికి రూ.20 వేల కోట్లు మా జిల్లాకు ఇవ్వాలని మీ తరఫున మంత్రివర్గాన్ని అడుగుతా. ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఈ జిల్లాకు తెచ్చుకుంటే బంజరు భూములు బంగారు భూములుగా మారవా? కేసీఆర్ కమీషన్ల కక్కుర్తి కోసం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు తీసుకెళ్లారు. అలాంటిది మన గడ్డ అభివృద్ధికి లక్ష కోట్లు తెచ్చుకోలేమా? కచ్చితంగా తెచ్చుకుందాం. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20లక్షల ఎకరాల్లో నీరు పారించి సస్యశ్యామలం చేస్తాం.

ఎన్ని కష్టాలు వచ్చినా హామీలు నెరవేర్చి తీరుతాం: భట్టి



సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పాలమూరు జిల్లాలో పారుతున్న కృష్ణానదిని పట్టించుకోలేదని.. గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రాష్ట్రాన్ని కుదువపెట్టారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. రైతు పండుగ సభలో ఆయన మాట్లాడారు. కృష్ణా నీళ్లను పాల మూరుతో పాటు పక్కనున్న రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు ఇవ్వాలని ఆలోచన చేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కాలేదు. అప్పుడే బీఆర్ఎస్ నాయకులు ప్రజల వద్దకు వెళ్తాం. ఉద్యమాలు చేస్తాం, నిలదీస్తామని చెప్పడం చూస్తే నవ్వు వస్తోంది. పకడ్బందీగా ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టి వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తుంటే.. ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఒకాయన అంటాడు. ఇంకో ఆయన వచ్చి ఉద్యమం చేస్తానని చెప్తాడు. ఇది సిగ్గు చేటు. ఇది దొరల ప్రభుత్వం కాదు. ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వం. ఇచ్చిన హామీ మేరకు ఎన్ని కష్టాలు వచ్చినా పథకాలు అమలు చేసి తీరుతాం'' అని భట్టి పేర్కొన్నారు. తాము రుణమాఫీ చేయడం మాత్రమే కాకుండా... పంట నష్టపోయిన రైతులకు పరిహారం కింద రూ. 100 కోట్లు విడుదల చేశామని తెలిపారు. పంటల బీమా కింద ప్రభుత్వమే రాష్ట్రంలోని 50 లక్షల మంది రైతులకు సంబంధించి రూ. 1,433 కోట్ల ప్రీమియం చెల్లించిందని భట్టి తెలిపారు. బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లు కేటాయించి వ్యవసాయాన్ని పండుగలా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

రూ.2,747 కోట్లు రుణమాఫీ సొమ్ము విడుదల

రైతు పండుగ ముగింపు సందర్భంగా నాలుగో విడత రుణమాఫీ కింద రూ.2,747 కోట్లు విడుదల చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. అదేవిధంగా 255 స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు. సమావేశంలో మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం మొదలైంది వైఎస్సార్ హయాం నుంచే..

రైతు పండుగ సభలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రైతులకోసం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలను గుర్తు చేసుకున్నారు. మొదట రైతులకు రుణమాఫీ చేసినది, ఉచిత కరెంట్ ఇచ్చినది వైఎస్సార్ హయాంలోనేనని మంత్రి సీతక్క పేర్కొన్నారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడే ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలకు నీరందించేలా ప్రాజెక్టులు రూపొందించారని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మొదటిసారిగా రైతు రుణమాఫీ చేసినది వైఎస్ అని మంత్రి దామోదర రాజనర్సింహ గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ రైతుల ప్రభుత్వమని, వైఎస్సార్ హయాం నుంచీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు.

రైతు పండుగ పేరిట మోసగిస్తున్నారు

రైతుబంధును బంద్ చేసే కుట్ర

- ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపాటు



సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్‌లో రేవంత్ ప్రభుత్వం ఆడంబరంగా నిర్వహించిన రైతు పండుగ తెలంగాణ రైతాంగాన్ని ఉసూరుమనిపించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో సీఎం చేసిన వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పూర్తయిన సందర్భంగా రైతులందరికీ రుణమాఫీ, వానాకాలంతో పాటు ఈ యాసంగికి ఇచ్చే రైతు భరోసా మొత్తం కలుపుకొని ఎకరాకు రూ.15 వేలు ప్రకటిస్తారనుకుంటే మరోసారి మొండి చేయి చూపారన్నారు. ఈ మేరకు శనివారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'రైతు పండుగ పేరుతో రేవంత్ రెడ్డి రైతులను మరోసారి మోసం చేశారు. కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని కూడా కాంగ్రెస్ పేటెంట్ అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కాకుండా కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులతోనే రాష్ట్రంలో కోటీ 53 లక్షల టన్నుల వరి పండిందని గొప్పలు చెప్పుకోవడం తగదు. సీఎం ప్రసంగం చూస్తే రైతుల పట్ల ప్రేమ కంటే, గిరిజనుల నుంచి భూసేకరణ చేయడంలో ఘోరంగా విఫలమయ్యామనే ఆవేదనే కనిపించింది. అభివృద్ధి జరగాలంటే రైతులు నష్టపోవాలని చెబుతున్నవు. పాలమూరు బిడ్డగా ఇది నీకు న్యాయమా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఒకసారి ఫార్మాసిటీ అని గెజిట్ ఇచ్చి, బీఆర్ఎస్ పోరాటంతో వెనక్కి తగ్గి ఇప్పుడు పారిశ్రామిక కారిడార్ అని ప్రచారం చేస్తున్నావని మండిపడ్డారు. ఫార్మాసిటీ వద్దంటూ లగచర్లలో లడాయి చేసిన గిరిజన బిడ్డలను అరెస్టులు చేసి జైలుకు పంపించి, ఇప్పుడేమో సొంత జిల్లా ప్రజల మీద ఎంతో ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కార్చుతున్నావని విరుచుకుపడ్డారు. సన్నాలకు ఇచ్చే బోనస్ పేరుతో రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా బంద్ చేసే కుట్ర జరుగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. 5.19 లక్షల క్వింటాళ్ల సన్నవడ్లకు రూ.500 బోనస్ రైతులకు ఇస్తే అయ్యే భారం రూ.26 కోట్లేనని, అదే రైతుబంధుతో రూ.7,500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని హరీశ్ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధును బంద్ చేస్తారని కేసీఆర్ ముందే హెచ్చరించారని, అనుకున్నట్టే ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు.

నాలుగో విడత రుణమాఫీకి మరో రూ. 2,747.67 కోట్లు

విడుదల చేసిన ప్రభుత్వం

- ఇప్పటివరకు రూ.20.68 వేల కోట్ల రుణమాఫీ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన రూ. 2 లక్షల రుణమాఫీ హామీ అమలు ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం మరోసారి నిధులు విడుదల చేసింది. ఇప్పటివరకు మూడు విడతల్లో 22.37 లక్షల మంది రైతుల రుణాల కింద రూ. 17,933 కోట్లు బ్యాంకులకు చెల్లించిన ప్రభుత్వం, శనివారం పాలమూరు వేదికగా నాలుగో విడత రూ. 2,747.67 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెక్కును రైతులకు అందజేశారు. తద్వారా ఇప్పటివరకు రూ.20.68 వేల కోట్లు రుణమాఫీ కింద బ్యాంకులకు విడుదల చేసినట్లయింది. శనివారం పాలమూరులో ప్రకటించిన రూ. 2,747 కోట్ల మొత్తాన్ని 3,13,897 మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. తద్వారా నాలుగు విడతల్లో రాష్ట్రంలోని 25 లక్షల పైచిలుకు రైతులకు ఇప్పటివరకు రుణమాఫీ జరిగినట్టు.

భవిష్యత్తులో రూ.2 లక్షలపైన ఉన్నవారికి..

రూ. 2 లక్షలపైన రుణాలు పొందిన రైతులకు కూడా రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని గతంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అయితే రూ. 2 లక్షలపైన ఉన్న రుణం మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించిన వారికి ఈ రుణమాఫీ చేయాలని వ్యవసాయ అధికారులు లెక్కలు తీశారు. శనివారం సీఎం ప్రకటించిన రూ. 2,747 కోట్ల మొత్తాన్ని రేషన్‌కార్డులు లేనివారు, కుటుంబ నిర్ధారణ కానివారు, ఆధార్ కార్డులో తప్పులు ఉన్నవాళ్లు, బ్యాంకు ఖాతాల్లో పొరపాట్లు, పేర్లలో తప్పులు దొర్లిన 3,13,897 మంది రైతుల రుణ ఖాతాలకు జమచేస్తారు. తరువాత రూ. 2లక్షల పైన అప్పులున్న రైతులకు జమచేయాల్సి ఉంది.

నేడు ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్లు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- మోదీ మాటల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు
- త్వరలో జరిగే 'స్థానిక' ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై తమ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజల ముందు చార్జిషీట్లు పెడుతున్నట్లు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రస్థాయితో పాటు జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో కాంగ్రెస్ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై చార్జిషీట్లను ప్రజల ముందు పెట్టనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ తీరుపై అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రజలను సంఘటితం చేసి ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగాలని ఆయన పార్టీ నాయకులు, కేడర్‌కు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా నిర్మాణాత్మకంగా పనిచేయాలని కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన 'సంఘటన్ పర్వ్ వర్క్‌షాప్'లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్న మోదీ మాటల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేస్తామన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో ప్రధాని ఇటీవల సమావేశమైనపుడు తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సూచించారని అన్నారు. కేసీఆర్ సర్కార్ పాలనలో చూసిన నియంతృత్వం, అవినీతి, వైఫల్యాలను కాంగ్రెస్ పాలనలో చూస్తున్నామని కిషన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు రాహుల్ గాంధీ హామీనిచ్చినా ఇప్పటిదాకా ఒక్క కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదని ధ్వజమెత్తారు.ం గత డిసెంబర్ 7న సీఎం ప్రమాణస్వీకారం చేశాక 9నే రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి ఏడాది గడిచినా అరకొరగా తప్ప పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. ఏడాది గడిచినా ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. మహారాష్ట్ర ఫలితాల స్ఫూర్తిగా సర్పంచ్ ఎన్నికల్లో గెలవాలని ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. కాగా, క్రియాశీల సభ్యత్వాలు చేయించనివారెవరూ జిల్లా, మండల కమిటీల్లో ఉండరాదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ స్పష్టం చేశారు. రాజకీయంగా కంటే కూడా సంస్థాగతంగా, సైద్ధాంతికంగా పార్టీని బలోపేతం చేయడం వల్లనే ప్రయోజనమని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో.. రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులకు 77 లక్షల ఓట్లు పడ్డాయంటే.. ప్రజలు నమ్మకం వేశారన్నారు.

6న సరూర్‌నగర్ స్టేడియంలో బీజేపీ సభ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాది పాలనా వైఫల్యాలను ఎండగడుతూ డిసెంబర్ 6న నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బహిరంగసభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ సభలో జాతీయ నేతలు పాల్గొనే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం. ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జిషీట్ విడుదలలో భాగంగా 6 గ్యారంటీలు, 66 హామీల అమలుతీరు, ఒక్కొక్క గ్యారంటీ ప్రస్తావన, అది ఎలా ఆచరణకు నోచుకోలేదో వివరిస్తూ గ్రాఫిక్స్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, వీడియో క్లిప్పింగ్‌లు తదితరాలను ప్రదర్శించనున్నారు. ఆదివారం నుంచి ఈనెల 5 దాకా కాంగ్రెస్ పార్టీ హామీల అమల్లో విఫలం కావడాన్ని ఎత్తిచూపుతూ రాష్ట్ర, జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిల్లో చార్జిషీట్ల విడుదల, బైక్‌ర్యాలీలు, కాంగ్రెస్ గ్యారంటీల గారడీ.. ఆరు అబద్ధాలు 66 మోసాల పేరిట ఇంటింటికీ కరపత్రాల పంపిణీ, ఇతర రూపాల్లో ప్రచార కార్యక్రమాలను చేపట్టనున్నారు. అలాగే కాంగ్రెస్ ఏడాది పాలనపై, హామీల అమల్లో వెనకడుగుపై ప్రజల నుంచి ఫిర్యాదు పత్రాలను స్వీకరించనున్నారు. కాంగ్రెస్ ప్రతీ పథకం, ప్రతీ నిర్ణయం ప్రజల సంక్షేమానికి కాకుండా వారిని దోచుకోవడమే లక్ష్యంగా చేసుకుందని పేర్కొంటూ ఈ పత్రాన్ని బీజేపీ సిద్ధంచేసింది. కాంగ్రెస్ పార్టీ మహిళలు, యువత, రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకిచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను తమ ప్రచారం సందర్భంగా ప్రస్తావించాలని నిర్ణయించారు. డిసెంబర్ 5న రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రంగా చేపట్టిన కార్యక్రమాలకు ముగింపుగా 6న హైదరాబాద్‌లో సభను నిర్వహించనున్నారు.

క్లుప్తంగా...

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

- ప్రభుత్వానికి టీజీటీఏ వినతి
- పోస్టుల అప్‌గ్రెడేషన్‌పై సీఎం, రెవెన్యూ మంత్రి, సీసీఎల్‌ఏలకు ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తహసీల్దార్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ (టీజీటీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఏళ్ల తరబడి తమ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రజా ప్రభుత్వం వాటిపై దృష్టి సారించి క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని, బదిలీలు చేపట్టాలని కోరారు. కాగా, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల (ఎస్‌జీడీసీ) నుంచి సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పోస్టులను అప్‌గ్రేడ్ చేయడంపై అసోసియేషన్ రాష్ట్రకార్యవర్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్ మిత్తల్‌లకు ధన్యవాదాలు తెలిపింది. ఈ సమావేశంలో అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

పింగిలి శ్రీపాల్‌రెడ్డికి బీటీఏ మద్దతు



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డ పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థులకు బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం శనివారం మద్దతు ప్రకటించింది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నియోజకవర్గం నుంచి పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి వంగ మహేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. పీఆర్‌టీయూటీఎస్ కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో బీటీఏ నేతలు కె.చైతన్య, యం.గంగరాజు, సంతోష్‌నాయక్ తమ మద్దతు లేఖను పీఆర్‌టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి పుల్లం దామోదర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రెండు సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉద్యోగ దంపతులను కలిపినందుకు కృతజ్ఞతలు

స్టేట్ స్పౌజ్ ఫోరం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయ ఉద్యోగ దంపతులు.. ఒకేచోట పనిచేసేందుకు తీసుకున్న నిర్ణయంపై స్టేట్ స్పౌజ్‌ఫోరం హర్షం వ్యక్తం చేసింది. కుటుంబాలకు దూరంగా నరక యాతన అనుభవించిన వందలాది ఉద్యోగులను కలిపిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని స్టేట్ స్పౌజ్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.వివేక్, గడ్డం కృష్ణ, సహాయ కార్యదర్శి ఎన్‌వీసీఎస్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. నవంబర్, 2021లో జారీ అయిన జీవో 317తో కుటుంబాలు చిన్నాభిన్నమై, మూడేళ్లుగా భర్త ఒక జిల్లాలో, భార్య మరో జిల్లాలో విధులు నిర్వహిస్తూ కుటుంబాలు అస్తవ్యస్తమయ్యాయన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీల్లోని ఉపకులాలకు కూడా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈమేరకు శనివారం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావును కలిసి వినతిపత్రం అందజేశారు.

జీవో 317 బదిలీలకు ఓకే!

- స్పౌజ్, హెల్త్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు సర్కారు అనుమతి
- ఒక లోకల్ కేడర్ నుంచి మరో లోకల్ కేడర్‌కు మాత్రమే బదిలీ
- నేటి నుంచి మ్యూచువల్ బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ
- డిసెంబర్ 31 నాటికి స్పౌజ్, హెల్త్ కేటగిరీల కింద బదిలీ పూర్తి
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సుల ఆధారంగా ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. స్థానికతపై రాష్ట్రపతి ఉత్తర్వుల అమల్లో భాగంగా జీవో–317 కింద గతంలో కొత్త లోకల్ కేడర్లకు కేటాయించిన ఉద్యోగులను స్పౌజ్ కేటగిరీ, పరస్పర బదిలీలు, అనారోగ్య కారణాల కింద వేరే లోకల్ కేడర్లకు మళ్లీ బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. బదిలీలను డిసెంబర్ 31లోగా పూర్తిచేయాలని గడువు విధించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానికతపై రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను పాత లోకల్ కేడర్ల నుంచి కొత్త లోకల్ కేడర్లకు గత ప్రభుత్వం కేటాయించింది. ఇందుకోసం 2021 డిసెంబర్ 6న జీవో 317ను జారీ చేసింది. ఈ ప్రక్రియలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని సుదూర ప్రాంతాల్లోని కేడర్లకు వెళ్లిన ఉద్యోగులు ఆందోళనకు దిగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో జీవో–317, జీవో–56 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సుల మేరకు తాజాగా మూడు కేటగిరీల కింద కేడర్ మార్పునకు అనుమతిచ్చింది.

ఇక భార్యాభర్తలు ఒకేచోట!

రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే భార్యాభర్తలను ఒకవేళ వేర్వేరు లోకల్ కేడర్లకు కేటాయిస్తే కేడర్ మార్పును కోరుతూ దరఖాస్తు చేసుకోవడానికి వారికి అవకాశం కల్పిస్తామని జీవో–317లో ప్రభుత్వం పేర్కొంటోంది. పాలనావసరాలు, ఖాళీలకు లోబడి భార్యాభర్తలిద్దరినీ ఒకే కేడర్‌కు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. కొన్ని శాఖల్లో దీన్ని అమలు చేయలేదు. చాలామంది ఉద్యోగులు స్పౌజ్ కేటగిరీ కింద కేడర్ మార్పుకు దరఖాస్తు చేసుకున్నా పరిగణనలోకి తీసుకోలేదు. మంత్రివర్గం ఈ అంశాన్ని పరిశీలించి ఖాళీలకు లోబడి గరిష్ఠంగా సాధ్యమైనంత వరకు కేడర్ మార్పునకు అవకాశం కల్పించాలని సిఫార్సు చేసింది. సంబంధిత విభాగాధిపతుల నుంచి ప్రతిపాదనలు, సిఫార్సులను సేకరించి డిసెంబర్ 31 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్ని శాఖల కార్యదర్శులను తాజాగా ప్రభుత్వం ఆదేశించింది.

నేటి నుంచి పరస్పర బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ..

ఒకే శాఖలో ఒకే కేటగిరీ పోస్టులను కలిగిన ఇద్దరు వ్యక్తులు వేర్వేరు లోకల్ కేడర్లలో పనిచేస్తుంటే వారిని ఒక లోకల్ కేడర్ నుంచి మరో లోకల్ కేడర్‌కు పరస్పర బదిలీ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ నెల 1 నుంచి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా మళ్లీ కొత్తగా పరస్పర బదిలీలకు దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించింది. ఇందుకు ప్రత్యేక వెబ్ పోర్టల్ (po2018mutualtransfers.telangana.gov.in)ను రూపొందించింది. ఎప్పటిలోగా ఈ బదిలీలను పూర్తి చేయాలన్న అంశాన్ని ప్రభుత్వం స్పష్టం చేయలేదు. ఒకే యాజమాన్యం కింద ఒకే కేటగిరీ పోస్టులో ఉండి ఒకే సబ్జెక్టును ఒకే మీడియంలో బోధిస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మాత్రమే ఒక లోకల్ కేడర్ నుంచి మరో లోకల్ కేడర్‌కు పరస్పర బదిలీకి అర్హులని ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లా ప్రజాపరిషత్, మండల పరిషత్, ఇతర స్థానికసంస్థల పాఠశాలల్లోని బోధనేతర ఉద్యోగులను పరస్పర బదిలీల్లో భాగంగా మరో లోకల్ కేడర్ పరిధిలోని సంబంధిత జిల్లా ప్రజాపరిషత్, మండల పరిషత్, ఇతర స్థానిక సంస్థల్లోని పాఠశాలలకు మాత్రమే బదిలీ చేస్తామని తెలిపింది. పరస్పర బదిలీల కింద వచ్చే ఉద్యోగులను కొత్త లోకల్ కేడర్ సీనియారిటీ జాబితాలో చివరి రెగ్యులర్ ఉద్యోగి తర్వాత చివరి ర్యాంకును కేటాయిస్తామని స్పష్టం చేసింది.

అనారోగ్య కారణాల కింద బదిలీలకు పచ్చజెండా..

ఆరోగ్య కారణాల కింద ఒక లోకల్ కేడర్ నుంచి మరో లోకల్ కేడర్‌కు బదిలీ కోరుతూ ఉద్యోగులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖల కార్యదర్శులు పరీక్షించి అర్హులైన ఉద్యోగుల కేడర్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. 70 శాతం, ఆపై వైకల్యం కలిగిన ఉద్యోగులు, కారుణ్య నియామకం కింద నియమితులైన వితంతు ఉద్యోగులు, కేన్సర్ బాధిత ఉద్యోగులు, న్యూరోసర్జరీ, కిడ్నీ మార్పిడి, కాలేయం మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న ఉద్యోగులు కేడర్ మార్పునకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అవకాశం కల్పించాలని కోరింది. మానసిక వైకల్యంగల పిల్లలు కలిగిన ఉద్యోగులను వైద్య సేవలు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు బదిలీ చేయాలని సూచించింది. డిసెంబర్ 31లోగా బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని కోరింది.



టీజీఓ భవన్‌లో జరిగిన సంఘం విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఉద్యోగుల జోలికొస్తే ఖబడ్దార్

- పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగ సంఘాలు నిర్వీర్యం... ఇప్పుడిప్పుడే ఏకతాటిపైకి వస్తున్న ఉద్యోగులు
- టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులను దూషించడం, దాడులు చేయటం, బెదిరించటం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉద్యోగులను ఎవరైనా లక్ష్యంగా చేసుకుంటే.. తాము కూడా వారిని టార్గెట్ చేస్తామని స్పష్టం చేశారు. శనివారం టీజీఓ భవన్‌లో సంఘం విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగ సంఘాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని అన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించే అవకాశమే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడిప్పుడే ఉద్యోగులంతా ఏకతాటిపైకి వచ్చి సమస్యలు ఏకరువు పెడుతున్నారని తెలిపారు. ఉద్యోగులపై దాడులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చి చెప్పారు.

పెండింగ్ బిల్లులు త్వరగా పరిష్కరించాలి

సంఘం కార్యకవర్గ సమావేశంలో అన్ని కేటగిరీల్లోని ఉద్యోగులకు సంబంధించి 500 సమస్యలపై చర్చ జరిగిందని, ఇందులో కీలకమైన అంశాలు 53 ఉన్నాయని శ్రీనివాసరావు తెలిపారు. వీటిలో ఆరు అత్యంత ప్రధానమైనవని చెప్పారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను డిసెంబర్ నెలాఖరుకల్లా పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా.. ఆ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఉద్యోగుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు వివరించారు. ప్రభుత్వ డ్రైవర్ల సంఘం మనుగడలో లేకుండా పోయిందని, ప్రైవేటు అద్దె వాహనాలతోనే వ్యవస్థ నడుస్తోందని చెప్పారు. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో కొందరు అధికారులు.. ఉద్యోగులు, సంఘాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారి పేర్లతో సహా లిఖితపూర్వకంగా సీఎం, సీఎస్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



శనివారం జరిగిన తెలంగాణ తహసీల్దార్ల సంఘం కార్యవర్గ సమావేశంలో జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి తదితరులు

సిరిసిల్ల కలెక్టర్‌కు కేటీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల కలెక్టర్‌పై అసత్య ఆరోపణలు చేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. శనివారం నాంపల్లిలోని సీసీఎల్‌ఏ కార్యాలయ ఆవరణలోని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో లచ్చిరెడ్డి మాట్లాడారు. ఇటీవల కలెక్టర్ స్థాయి అధికారి నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు అనేక చోట్ల దాడులు జరుగుతున్నాయని, దాడులు చేసిన వారిని ప్రోత్సహించేలా కొందరు వ్యవహరిస్తున్నారని పరోక్షంగా బీఆర్‌ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రెవెన్యూ సంబంధిత ఉద్యోగులపై ప్రధానంగా దాడులు జరుగుతున్నాయన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ధర్మగంట పేరిట చేసిన కార్యక్రమాలకు రెవెన్యూ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారని, ఒక తహసీల్దార్‌ను ఏకంగా కార్యాలయంలోనే పెట్రోలు పోసి నిప్పంటిస్తే కనీసం పరామర్శించలేదని లచ్చిరెడ్డి మండిపడ్డారు. లగచర్ల, దిలావర్‌పూర్ తదితర ప్రాంతాల్లో జరిగిన దాడులు సరికాదన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఉద్యోగులు ఆ ప్రభుత్వానికి అండగా నిలిచి పనిచేస్తారని లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగులపై దాడులను ప్రోత్సహిస్తున్న ఘటనలపై సీఎస్, డీజీపీలను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆ 7 వేల సీట్ల పరిస్థితేంటి?

- కోర్టు ఆదేశంతో పెరిగిన 7 వేల ఇంజనీరింగ్ సీట్లు
- సీట్ల పెంపును మొదటి నుంచీ వ్యతిరేకించిన ప్రభుత్వం
- కోర్టు తీర్పు తర్వాత కూడా గుర్తించకుండా నాన్చివేత
- సర్కారు జీవో ఇస్తేనే అనుమతిస్తామంటున్న జేఎన్‌టీయూహెచ్
- డోలాయమానంలో విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ఆదేశంతో పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో పెరిగిన 7 వేల సీట్లపై సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. నిబంధనల మేరకే ఉన్నందున పెరిగిన సీట్ల భర్తీకి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన తర్వాత కూడా ప్రభుత్వం అందుకోసం జీవో ఇవ్వకపోవటంతో విద్యార్థులు, సీట్లు పెంచుకొన్న కాలేజీల యాజమాన్యాలు డోలాయమాన స్థితిలో పడ్డాయి. ప్రభుత్వం జీవో ఇస్తేనే పెరిగిన సీట్ల భర్తీకి అనుమతి ఇస్తామని జేఎన్‌టీయూహెచ్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇప్పటికే విద్యా సంవత్సరం దాదాపు సగం పూర్తి కావటంతో పెరిగిన సీట్ల భర్తీ ఉంటుందా? ఉండదా? అనే గందరగోళం నెలకొన్నది. ఈ సీట్లలో ఇప్పటికే 450 మంది వరకు విద్యార్థులు చేరిపోయారు. ఇప్పుడు ఈ సీట్లకు అనుమతి ఇవ్వకపోతే ఈ విద్యార్థుల పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఎడతెగని పంచాయితీ..: రాష్ట్రంలోని కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు బాగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీట్ల పెంపుకోసం దరఖాస్తు చేసుకోగా.. జేఎన్‌టీయూహెచ్ అధికారులు ఆయా కాలేజీల్లో తనిఖీలు చేసి సీట్ల పెంపునకు అనుమతి ఇచ్చారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి కూడా అనుమతి ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సీట్ల పెంపునకు ససేమిరా అనటంతో ఆ కాలేజీలు హైకోర్టుకు వెళ్లాయి. దీంతో ఆ 7 వేల సీట్ల పెంపునకు అనుమతి ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అయితే అప్పటికే రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తయింది. దీంతో కాలేజీలే ఈ సీట్ల భర్తీ చేపట్టి 450 సీట్లు భర్తీ చేశాయి. ఈ సీట్లను ఉన్నత విద్యా మండలి ర్యాటిఫై చేయాలి. దీనికన్నా ముందు పెరిగిన సీట్లకు జేఎన్‌టీయూహెచ్ అనుమతివ్వాలి. ఈ ప్రక్రియ ఇంత వరకూ పూర్తవ్వలేదు. ప్రభుత్వం జీవో ఇస్తే తప్ప తాము అనుమతివ్వలేమని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఇప్పటికే చేరిన విద్యార్థులకు నష్టం జరుగుతుందని కాలేజీ యాజమాన్యాలు అంటున్నాయి. వచ్చే ఏడాది అయినా పెరిగిన 7 వేల సీట్లు కౌన్సెలింగ్ పరిధిలోకి వస్తాయా? రావా? అనే సందిగ్ధత నెలకొంది. వీటిలో 4,900 సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేసే వీలుంది. మెరిట్ విద్యార్థులకు పెరిగిన సీట్లు మేలు చేస్తాయి. యాజమాన్య కోటా సీట్లు కూడా ఉన్నత విద్యా మండలి ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేస్తామని చెబుతోంది. కాబట్టి పెరిగిన సీట్లపై ప్రభుత్వం జీవో విడుదల చేయకపోతే వచ్చే ఏడాది కౌన్సెలింగ్‌కు సమస్యలు వస్తాయని అధికారులు అంటున్నారు.

ఈనాడు, ఆంధ్రజ్యోతిలకు వైఎస్ జగన్ లీగల్ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంల మధ్య అత్యంత పారదర్శకంగా జరిగిన ఈ ఒప్పందంపై తప్పుడు కథనాలు ప్రచురించినందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, దానిని ప్రముఖంగా మొదటి పేజీలో ప్రచురించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కథనాల వల్ల తమ క్లయింటు ప్రతిష్ట దెబ్బతింటుందని ముందే తెలిసి, అందుకు అనుగుణంగా తప్పుడు ఆరోపణలతో కథనాలు ప్రచురించారని తెలిపారు. ఈ మేరకు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిషర్‌తో పాటు ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావుకు, ఆమోద పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిషర్‌తో పాటు ఆంధ్ర జ్యోతి ఎడిటర్ ఎన్.రాహుల్ కుమార్‌లకు వైఎస్ జగన్ తరఫు న్యాయవాదులు లీగల్ నోటీసు పంపారు.

పోషకాహార తెలంగాణ మా లక్ష్యం: సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని పోషకాహార తెలంగాణగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పోషక లోపాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పక్కా కార్యాచరణ అమలు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న ఆరోగ్యలక్ష్మి పథకంపై శనివారం సచివాలయంలో సంబంధిత అధికారులతో సీతక్క సమీక్ష నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి పాలను సరఫరా చేయాలని, ఎలాంటి అవాంతరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల్లోని కేంద్రాలకు పాల సరఫరాలో తీవ్ర జాప్యం ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కేంద్రాన్ని లక్ష్యంగా ఎంపిక చేసుకుని పాల సరఫరా చేయాలని, రానున్న మూడు నెలల్లోగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజూ 200 మిల్లీలీటర్ల పాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించాలన్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 1.67 కోట్ల లీటర్ల సరఫరా కోసం ఆర్డర్ చేయగా...1.56 కోట్ల లీటర్ల పాలను విజయ డెయిరీ సరఫరా చేసిందని చెప్పారు. 94 శాతం మేర సరఫరా జరిగిందని, నూరుశాతం లక్ష్య సాధన ఉండాలని స్పష్టం చేశారు.

మళ్లీ గ్రామ రెవెన్యూ అధికారులు!

- విద్యార్హతల ఆధారంగా నియమించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- గతంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్‌ఏలు మళ్లీ రెవెన్యూ శాఖలోకి...
- అందులో సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన వారు నేరుగా విధుల్లోకి
- మిగతా సుమారు 8 వేల పోస్టులకు రాతపరీక్ష ద్వారా నియామకాలు చేపట్టే యోచన
- డిగ్రీ, ఇంటర్ విద్యార్హత ఉన్నవారికి వేర్వేరుగా పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. త్వరలోనే ఈ నియామకాలను పూర్తిచేసి.. గతంలో రెవెన్యూ సిబ్బంది అందించిన అన్ని సేవలను మళ్లీ వారికే అప్పగించనుంది. మొత్తంగా రాష్ట్రంలోని 10,909 రెవెన్యూ గ్రామాలకు మళ్లీ రెవెన్యూ అధికారులు రానున్నారు. గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారిలో... పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన వారికి నేరుగా బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది. మిగతా వారిలో తగిన విద్యార్హతలు ఉన్న వారికి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించి, నియామకాలు చేపట్టనున్నారు. అయితే ఈ గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థకు ప్రభుత్వం ఇంకా ఎలాంటి పేరును నిర్ణయించలేదు.

ఇబ్బందులు రాకుండా ప్రణాళిక..

గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం కోసం కొన్ని ప్రాతిపదికలను రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్నట్టు తెలిసింది. ఈ అంశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పకడ్బందీ ప్రణాళిక రూపొందిస్తున్నారు. న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా నియమితులైన వారిని నేరుగా గ్రామ రెవెన్యూ అధికారిగా విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 వేల మంది తిరిగి రెవెన్యూ శాఖలోకి రానున్నారు. దాదాపు మరో 8 వేల మందిని రాత పరీక్ష ఆధారంగా నియమించనున్నారు. గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసి.. వివిధ శాఖల్లోకి వెళ్లిన వారిలో డిగ్రీ, ఇంటర్ అర్హతలను గుర్తించి వేర్వేరుగా ఈ పరీక్ష (రెవెన్యూ సేవలే సిలబస్‌గా) నిర్వహించనున్నారు. పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టనున్నారు.

నేడు వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట గ్రామంలో జరగనుంది. తెలంగాణ వీఆర్వోల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశంలో... గ్రూప్–4 ఉద్యోగ నియామకాల ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని అసోసియేషన్ అధ్యక్షుడు గరిక ఉపేందర్‌రావు వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లోకి వెళ్లిన పూర్వ వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.



యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము.
మూర్ఖులు జ్ఞానమును, ఉపదేశమును తిరస్కరించుదురు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** అమావాస్య ఉ.11.05 వరకు తదుపరి, మార్గశిర శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** అనూరాధ ప.2.31 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.8.28 నుండి 10.08 వరకు, **దుర్ముహూర్తం:** ప.3.56 నుండి 4.44 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 6.17
సూర్యాస్తమయం : 5.20
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఉద్ధవ్ ఠాక్రే (శివసేన–యు.బి.టి.)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

శరద్ పవార్, నేను, నానా పటోలే ఒక దగ్గర కూర్చొని ఉన్నాం.

"మనమిప్పుడు ఎక్కడ కూర్చొని ఉన్నాం?" అన్నారు శరద్‌జీ హఠాత్తుగా!

83 ఏళ్ల వయసులో కూడా ఆయన, మెలకువలోంచి కళ్లు తెరిచినట్లుగా... హఠాత్తుగా, "మనమిప్పుడు ఎక్కడ కూర్చొని ఉన్నాం" అనే ప్రశ్న వేయగలిగారంటే అది ఆయనలోని తరగని రాజకీయ చైతన్యానికి ఒక స్పష్టమైన సంకేతమనే అనుకోవాలి.

ఎక్కడ కూర్చొని ఉన్నామో చెప్పబోయాన్నేను.

"ఉద్ధవ్‌జీ! మీరాగండి నేను చెబుతాను" అన్నారు నానా పటోలే!!

విస్మయంగా ఆయన వైపు చూశాను.

"సరే, మీరే చెప్పండి నానాజీ" అన్నాను.

నానాజీ ఏం చెప్పినా – మేము కూర్చొని ఉన్నది ముంబై హెర్డియా మార్గ్‌లోని ఎన్సీపీ పార్టీ ఆఫీసు తప్ప మరొకటి అవటానికి లేదు.

"మనమిప్పుడు ఎక్కడ కూర్చొని ఉన్నామంటే శరద్‌జీ... సరిగ్గా ఒక పరాజయ పీఠం మీద! అది కూడా ముగ్గురం సర్దుకుని కూర్చున్నాం..." అన్నారు నానాజీ!

అంటే... ఎన్సీపీ–శివసేన–కాంగ్రెస్.

"మీరేమంటున్నారు నానాజీ, కలిసి పోటీ



చేయటం వల్ల మన మూడు పార్టీలు ఓడిపోయాయనేనా?" అన్నాను.

"ఉద్ధవ్‌జీ... అక్కడ బీజేపీ కూటమిలో శివసేన ఉంది. ఇక్కడ కాంగ్రెస్ కూటమిలోనూ శివసేన ఉంది. అక్కడ బీజేపీ కూటమిలో ఎన్సీపీ ఉంది. ఇక్కడ కాంగ్రెస్ కూటమిలోనూ ఎన్సీపీ ఉంది. అయినప్పటికీ వాళ్లే ఎందుకు గెలిచారో తెలుసా?" అన్నారు నానాజీ.

"కానీ నానాజీ, మనమిక్కడ కూర్చున్నది వాళ్లెందుకు గెలిచారు అని కాక, మనం ఎందుకు ఓడిపోయామో ఒకర్నుంచి ఒకరం తెలుసుకోటానికి కదా..." అన్నాను.

"అదే అంటున్నాను ఉద్ధవ్‌జీ... వాళ్లెందుకు గెలిచారో తెలిస్తే, మనమెందుకు ఓడిపోయామో తెలుస్తుంది. పోనీ, మీరన్నట్లు మనం ఎందుకు ఓడిపోయామో తెలుసుకుంటే వాళ్లెందుకు గెలిచారో తెలుస్తుంది కానీ, వాళ్ల గెలుపుతో మనకు పనేమిటి? మన ఓటమి గురించి మనం ఆలోచించాలి కానీ..." అన్నారు నానాజీ!

ఆలోచనలో పడ్డాన్నేను. గెలుపోటములు అన్నవి రెండు భిన్నమైన స్థితులా లేక, పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉండే పరిస్థితులా?

"సరే చెప్పండి నానాజీ వాళ్లెందుకు గెలిచారని మీరు అనుకుంటున్నారు?" అన్నాను.

"గెలవకుండా ఎలా ఉంటారు ఉద్ధవ్‌జీ! 'విడిపోతే దెబ్బతింటాం. కలిసుంటే భద్రంగా ఉంటాం' అని కదా వాళ్ల నినాదం. అది పట్టేసింది మహారాష్ట్రా వాళ్లకు, మహారాష్ట్రలో ఉండే గుజరాతీలకు; ఇంకా... హిందువులకు, ముస్లిములకు! పైకే నినాదం. లోపల అది బెదిరింపు. ఓట్లు విడిపోతే పాట్లు తప్పవని..." అన్నారు నానాజీ.

"అందుకే ఓడామా మనం?" అన్నాను.

"కాదు" అన్నారు.

"మరి?" అన్నాను.

"శివసేన నుంచి శివసేన, ఎన్సీపీ నుంచి ఎన్సీపీ విడిపోయి, ఒకదాన్ని ఒకటి ఓడించాయి. రెండూ కలిసి కాంగ్రెస్‌ను ఓడించాయి" అన్నారు నానాజీ... 'మీతో కలిసి మేం దెబ్బతిన్నాం' అనే అర్థంలో!!

నేను మౌనంగా ఉండిపోయాను. నానాజీ కూడా కాసేపు మౌనం పాటించారు.

"మనమిక్కడ ఎంతసేపటిగా కూర్చొని ఉన్నాం?" అన్నారు శరద్‌జీ హఠాత్తుగా!

అప్పుడు గానీ... ఆయన్ని పట్టించుకోకుండా మేమిద్దరమే చాలాసేపటిగా మాట్లాడుకుంటూ ఉన్నామన్న సంగతి మాకు స్పృహలోకి రాలేదు!

'ఎక్కడ కూర్చొని ఉన్నాం' అనే తన ప్రశ్నకు, "పరాజయ పీఠం" మీద అన్న నానాజీ జవాబు ఆయన్ని సంతృప్తి పరిచే ఉండాలి.

లేకుంటే – "మనమిక్కడ ఎంతసేపటిగా కూర్చొని ఉన్నాం?" అనే కొనసాగింపు ప్రశ్న వేసి ఉండేవారు కాదు శరద్‌జీ.

వ్యక్తిత్వాన్ని దహించలేరు!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఒక మనిషి వ్యక్తిత్వాన్ని నిట్టనిలువునా దహించడానికి, అడ్డంగా నరికివేయడానికి చాలాకాలంగా కొందరు వ్యూహకర్తలు పడుతున్న ఆపసోపాలను గమనిస్తున్నాము. విషపు కత్తుల్ని విసురుకుంటూ జాగిలాలను విదిలిస్తూ పదమూడేళ్లుగా వారు పడుతున్న ప్రయాసను చూస్తున్నాము. కానీ ఏమైనది? వ్యక్తిత్వం మీద నీలాపనిందలు మోపగలరేమో! బురద చల్లగలరేమో! మసి పూయగలరేమో! వెలుగు రేకను మబ్బులు కాస్సేపు మాయం చేయగలవేమో! అది త్రుటికాలం మాత్రమే! నిక్కమైన వ్యక్తిత్వాన్ని కూడా మబ్బులు శాశ్వతంగా మాయం చేయలేవు.

ఘంటసాల గాత్ర మాధుర్యం కారణంగా భగవద్గీతలోని శ్లోకాలు కొన్ని తెలుగు వారికి బాగా పరిచయమైపోయాయి. ''నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః! ...'' అనే శ్లోకం కూడా అందులో ఒకటి. 'ఆత్మ ఎట్టి ఆయుధము చేతనూ ముక్కలు చేయబడదు, అగ్నిచే కాల్చబడదు, నీటిచే తడుపబడదు, వాయువుచే ఎండిపోదు' అని దాని తాత్పర్యం. వ్యక్తిత్వం కూడా అటువంటిదే! ఎటువంటి ఆయుధం చేతనూ ముక్కలు చేయబడదు. అగ్నిచే కాల్చబడదు.

జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వ హనన కార్యక్రమాన్ని ఒక ధారావాహికగా కొనసాగిస్తున్న తీరును గురించి ఇప్పుడు మాట్లాడుకుందాము. తెలుగు నేలపైనున్న ఒక బలమైన వర్గం చాలా ముందుచూపుతో మీడియా రంగంలో బ్రూటల్ డామినెన్స్‌ను ఏర్పాటు చేసుకోగలిగింది. ట్రెజర్ హంట్ చేయాలన్నా, పవర్ హంట్ చేయాలన్నా మీడియా కంటే పదునైన ఆయుధం లేదనే సంగతిని ఈ వర్గం గుర్తించింది. ఆయుధం మీద ఆధిపత్యాన్ని సంపాదించగలిగింది. ఎన్టీ రామారావును అధికార పీఠంపై ప్రతిష్ఠించగలిగింది. ఆయన వల్ల తమ వర్గానికి అనుకున్నంత మేలు జరగడం లేదన్న గ్రహింపు కలగగానే చంద్రబాబును ప్రత్యామ్నాయంగా నిలబెట్టిన వైనం సరిగ్గా మూడు దశాబ్దాల కిందటి చరిత్ర.

మీడియా తుపాకీ ట్రిగ్గర్‌ను చంద్రబాబు నొక్కగానే ఎన్టీ రామారావు కుప్పకూలిపోయాడు. అప్పటి నుంచి చంద్రబాబు, ఆయన మిత్ర మీడియా తోడూనీడలా కలిసిపోయారు. 'నీకింత – నాకింత' అనే డ్యూయెట్ పాడుకుంటూ రాజ్యాధికారాన్ని వారు అనుభవించసాగారు. ఎదురు నిలబడేవారి మీద మీడియా వెపన్‌ను గురిపెట్టారు. ఎన్టీ రామారావే వీరి ముందు నిలబడలేకపోవడంతో చాలామంది భయపడ్డారు.

ఒక్క రాజశేఖరరెడ్డి మాత్రమే వారిని ధిక్కరించి నిలబడ్డారు. చాలాకాలం పాటు వారిని ఎదిరించారు. విజయాలు సాధించారు. కానీ దురదృష్టం. ఆయన అకాల మరణంతో బాబు కూటమి మళ్లీ బుసలుకొట్టింది. వైఎస్సార్ మరణించిన రోజునే తమకు భవిష్యత్తులో దీటైన ప్రత్యర్థి కాగల యువకుడిని వారు గుర్తించగలిగారు. ఆరోజు నుంచే జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం మొదలైంది. ఇప్పటికి పదిహేనేళ్లు దాటింది. చంద్రబాబు పార్టీ, యెల్లో మీడియాగా పేరుపడ్డ ఆయన మిత్ర మీడియా జగన్‌మోహన్‌రెడ్డిపై నిరంతరాయంగా దాడులు జరుపుతూనే ఉన్నది.

దేశాల మధ్య జరిగే భీకర యుద్ధాల్లో కూడా కొన్ని నియమాలుంటాయి. శత్రు దేశాల మీద రసాయన బాంబులు వేయడం, విషవాయువుల్ని వెదజల్లడం వంటివి నిషిద్ధం. కానీ యెల్లో మీడియాకు ఇటువంటి విధినిషేధాలేమీ లేవు. జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రయోగించని అస్త్రం లేదు. చేయని ప్రచారం లేదు. కానీ జగన్ తట్టుకొన్నారు. తట్టుకొని జనబలంతో నిలబడ్డారు. ఘన విజయాలను నమోదు చేయగలిగారు. 'అస్త్రములే విఫలమాయె, శస్త్రములే వికలమాయె' అనుకుంటూ యెల్లో కూటమి నిర్వేద స్థితిలోకి జారిపోయింది. బీజేపీని బతిమాలుకొని వారి అండతో బాబు కూటమి ఒక 'సాంకేతిక విజయా'న్ని సాధించగలిగింది.

సాంకేతిక విజయంతో గద్దెనెక్కిన ఈ ఆరు మాసాల్లో అరడజనుకు పైగా దారుణమైన నిందల్ని జగన్‌పై మోపి, తమ 'సూపర్ సిక్స్' వైఫల్యాన్ని చర్చలోకి రాకుండా నెట్టుకొచ్చే ప్రయత్నం చేశారు. అరడజన్ నిందారోపణలు – 'సూపర్ సిక్స్' వైఫల్యాలుగా ఈ ఆరు మాసాల పుణ్యకాలం గడిచిపోయింది. తాజాగా 'సెకీ' ఒప్పందంపై ఎల్లో మీడియా దేవతా వస్త్రాలతో ఊరేగుతూ ఎంత కంపరం పుట్టిస్తున్నదో ఇప్పుడు చూస్తున్నాము. 'సెకీ' అనేది ఒక కేంద్ర ప్రభుత్వ సంస్థ. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నది ఈ కేంద్ర ప్రభుత్వ సంస్థతో! అదీ వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నికరమైన, ఉచిత విద్యుత్‌ను అందజేయడం కోసం! జగన్ కంటే ముందు అధికారంలో ఉన్న చంద్రబాబు సౌర విద్యుత్ కోసం ప్రైవేట్ సంస్థలతో ఒప్పందాన్ని చేసుకున్నారు. ఆ సంస్థలకు ఆయన సగటున యూనిట్‌కు రూ. 5.90 కట్టబెట్టారు.



> దేశాల మధ్య జరిగే భీకర యుద్ధాల్లో కూడా కొన్ని నియమాలుంటాయి. శత్రు దేశాల మీద రసాయన బాంబులు వేయడం, విషవాయువుల్ని వెదజల్లడం వంటివి నిషిద్ధం. కానీ యెల్లో మీడియాకు ఇటువంటి విధినిషేధాలేమీ లేవు. జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రయోగించని అస్త్రం లేదు. చేయని ప్రచారం లేదు. కానీ జగన్ తట్టుకొన్నారు. తట్టుకొని జనబలంతో నిలబడ్డారు. ఘన విజయాలను నమోదు చేయగలిగారు. 'అస్త్రములే విఫలమాయె, శస్త్రములే వికలమాయె' అనుకుంటూ యెల్లో కూటమి నిర్వేద స్థితిలోకి జారిపోయింది. బీజేపీని బతిమాలుకొని వారి అండతో బాబు కూటమి ఒక సాంకేతిక విజయా'న్ని సాధించగలిగింది.
>
> సాంకేతిక విజయంతో గద్దెనెక్కిన ఈ ఆరు మాసాల్లో అరడజనుకు పైగా దారుణమైన నిందల్ని జగన్‌పై మోపి, తమ 'సూపర్ సిక్స్' వైఫల్యాన్ని చర్చలోకి రాకుండా నెట్టుకొచ్చే ప్రయత్నం చేశారు. అరడజన్ నిందారోపణలు – 'సూపర్ సిక్స్' వైఫల్యాలుగా ఈ ఆరు మాసాల పుణ్యకాలం గడిచిపోయింది. తాజాగా 'సెకీ' ఒప్పందంపై ఎల్లో మీడియా దేవతా వస్త్రాలతో ఊరేగుతూ ఎంత కంపరం పుట్టిస్తున్నదో ఇప్పుడు చూస్తున్నాము. 'సెకీ' అనేది ఒక కేంద్ర ప్రభుత్వ సంస్థ. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నది ఈ కేంద్ర ప్రభుత్వ సంస్థతో! అదీ వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నికరమైన, ఉచిత విద్యుత్‌ను అందజేయడం కోసం!

జగన్‌మోహన్‌రెడ్డి 'సెకీ'తో చేసుకున్న ఒప్పందం ప్రకారం యూనిట్ ధర రూ.2.49. ఎక్కువ ధర చెల్లిస్తూ ప్రైవేట్ సంస్థలతో చేసుకున్న ఒప్పందంలో స్కామ్ ఉండే అవకాశం ఉంటుందా? సగానికంటే తక్కువ రేటు పెట్టి ప్రభుత్వ సంస్థతో చేసుకునే ఒప్పందంలో స్కామ్ ఉంటుందా? అదనపు ఛార్జీలంటూ దీనికేదో మెలికపెట్టే ప్రయత్నాన్ని యెల్లో మీడియా కొనసాగిస్తున్నది. కానీ దీనికి అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను వర్తింపచేయడం లేదని 'సెకీ' రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో స్పష్టంగానే పేర్కొన్నది. పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకీ' స్వయంగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసి వ్యవసాయ విద్యుత్ కోసం చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తూ అందుకు సహాయకంగా ఈ ఒప్పంద ప్రతిపాదన చేసింది.

ఈ ఒప్పందంలోని మూడు కీలక అంశాలను పరిశీలించాలి. మొదటిది: ఇది కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు మధ్య జరిగిన ఒప్పందం మాత్రమే! ఇందులో ఎక్కడా థర్డ్ పార్టీ ప్రమేయం లేదు. రెండు: రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంత తక్కువగా రూ.2.49కే యూనిట్ సరఫరా చేస్తామని ప్రతిపాదించడం. మూడు: ప్రత్యేక ప్రోత్సాహకం కింద ఈ ఒప్పందానికి అంతర్రాష్ట్ర రవాణా ఛార్జీలను మినహాయిస్తున్నట్టు చెప్పడం. ఇంత స్పష్టత, పారదర్శకత ఉన్న ఒప్పందం మధ్యలో స్కామ్ ఏ రకంగా దూరుతుంది?

'సెకీ'తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడానికి ముందు అదానీ అప్పటి ముఖ్యమంత్రిని కలిశారని అమెరికా దర్యాప్తు సంస్థ చెప్పిందట! యెల్లో మీడియాకు ఇది చాలదా? కోతికి కొబ్బరిచిప్ప దొరికినంత సందడి. జగన్‌మోహన్‌రెడ్డికి అదానీ ముడుపులు అందాయంటూ పతాక శీర్షికలు పెట్టి వార్తలు వేశాయి. ఇంతకంటే నీతిబాహ్యత వేరే ఉంటుందా? అత్యంత ప్రజాదరణ కలిగిన ఒక ప్రముఖ వ్యక్తి ప్రతిష్ఠతో ఆటలాడుకోవడం కాదా? 'సెకీ'తో ఒప్పందం, సీఎంను అదానీ కలవడం... రెండూ వేరువేరు విషయాలు. సౌరవిద్యుత్ ఒప్పందానికి సంబంధించినంత వరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థతో చేసుకున్నది. గతంలో ఎన్నడూ లేనంత తక్కువ ధరకు ఈ ఒప్పందం కుదిరింది. రవాణా ఛార్జీల మినహాయింపు బోనస్. ఇది రాష్ట్రానికి విజయం – లాభదాయకం!

ఇక అదానీ గానీ, అంబానీ గానీ, ఇతర పారిశ్రామికవేత్తలెవరైనా రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ప్రధానమంత్రిని కలవడం సర్వసాధారణమైన విషయం. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబును అందరికంటే ఎక్కువమందే పారిశ్రామికవేత్తలు కలిసి ఉంటారు. ఆ భేటీలన్నీ స్కామ్‌ల కోసమే అనుకోవాలా? ఒక వ్యక్తి పట్ల గుడ్డి వ్యతిరేకత, ద్వేషం, పగ పేరుకొనిపోయి ఉంటే తప్ప ఇంత దిగజారుడు ప్రచారం సాధ్యం కాదు.

ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకో కష్టం వచ్చిపడింది. గద్దెనెక్కి ఆరు మాసాలు కావస్తున్నా ఎన్నికల ముందు వారు హామీ ఇచ్చిన 'సూపర్ సిక్స్' పథకాలు ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు. నిరుద్యోగ యువతకు నెలకు 3 వేల రూపాయల భృతి ఇస్తామన్నారు. ఇవ్వలేదు సరిగదా ఎప్పటి నుంచి ఇస్తారో కూడా చెప్పలేదు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ నెలకు 15 వేలు (నీకు పదిహేను, నీకు పదిహేను ఫేమ్) ఇస్తామన్నారు. ఇప్పుడు దాని ఊసెత్తడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన 'అమ్మ ఒడి'ని ఎత్తిపారేశారు. ప్రతి రైతుకూ ఏటా 20 వేల సాయం చేస్తామన్నారు. 'రైతు భరోసా'ను ఎత్తేశారు తప్ప కొత్త సాయం గురించిన ఆలోచనే చేయలేదు. ప్రతి మహిళకూ నెలకు 1500 రూపాయలిస్తామన్నారు. అదీ మరిచిపోయారు. ప్రతి మహిళకూ ఉచిత బస్సు ప్రయాణం అదుగో ఇదుగో అనడం తప్ప ఆ బస్సు ఎప్పుడొస్తుందో తెలియదు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీకి గాను ఈ యేడాదికి ఒక్క సిలిండర్‌తో సరిపెట్టారు. 'సూపర్ సిక్స్'లోని ఐదు హామీలను అటకెక్కించి ఒక్క దాంట్లో మూడో వంతు నెరవేర్చారన్నమాట!

> హామీల అమలులో కూటమి సర్కారు దారుణ వైఫల్యం పట్ల సహజంగానే ప్రజల్లో అసంతృప్తి బయల్దేరింది. ఇంత కీలకమైన అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసం జగన్ వ్యక్తిత్వ హనన కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టు జరుగుతున్న ఘటనల ద్వారా అర్థమవుతున్నది. ఈ కార్యక్రమంలో భాగంగానే తాజాగా 'సెకీ' ఒప్పందంపై ఓ కపట నాటకాన్ని ప్రదర్శించారు. ఇంతకుముందు తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేసి విజ్ఞుల చేత చీవాట్లు తిన్న తర్వాత తోకముడిచారు. విజయవాడ వరదల సందర్భంగా పాలనాపరమైన వైఫల్యాన్ని కప్పిపుచ్చి ప్రకాశం బ్యారేజీలో వైసీపీవాళ్లు బోట్లు అడ్డంపెట్టి నగరాన్ని ముంచేశారని హాస్యపూరితమైన ఆరోపణ చేశారు. అప్పుల గణాంకాలపై ఇప్పటికీ పిల్లిమొగ్గలు వేస్తూనే అసత్య ఆరోపణలు గుప్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ఇచ్చిన లెక్కలకు విరుద్ధంగా అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. రాష్ట్రంలోని పేదలు, మధ్యతరగతి ప్రజల ఆశలకు ఆలంబనగా నిలబడి రెండు లక్షల డెబ్బయ్ మూడు వేల కోట్ల రూపాయలను వారి అకౌంట్లలోకి బదిలీ చేసిన 'నవరత్న' పథకాలను అవహేళన చేస్తూ స్కీములన్నీ స్కాములేనని ప్రచారం చేశారు.

హామీల అమలులో ఈ దారుణ వైఫల్యం పట్ల సహజంగానే ప్రజల్లో అసంతృప్తి బయల్దేరింది. ఇంత కీలకమైన అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసం జగన్ వ్యక్తిత్వ హనన కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టు జరుగుతున్న ఘటనల ద్వారా అర్థమవుతున్నది. ఈ కార్యక్రమంలో భాగంగానే తాజాగా 'సెకీ' ఒప్పందంపై ఓ కపట నాటకాన్ని ప్రదర్శించారు. ఇంతకుముందు తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేసి విజ్ఞుల చేత చీవాట్లు తిన్న తర్వాత తోకముడిచారు. విజయవాడ వరదల సందర్భంగా పాలనాపరమైన వైఫల్యాన్ని కప్పిపుచ్చి ప్రకాశం బ్యారేజీలో వైసీపీవాళ్లు బోట్లు అడ్డంపెట్టి నగరాన్ని ముంచేశారని హాస్యపూరితమైన ఆరోపణ చేశారు. అప్పుల గణాంకాలపై ఇప్పటికీ పిల్లిమొగ్గలు వేస్తూనే అసత్య ఆరోపణలు గుప్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ఇచ్చిన లెక్కలకు విరుద్ధంగా అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. రాష్ట్రంలోని పేదలు, మధ్యతరగతి ప్రజల ఆశలకు ఆలంబనగా నిలబడి రెండు లక్షల డెబ్బయ్ మూడు వేల కోట్ల రూపా యలను వారి అకౌంట్లలోకి బదిలీ చేసిన 'నవరత్న' పథకాలను అవహేళన చేస్తూ స్కీములన్నీ స్కాములేనని ప్రచారం చేశారు.

జగన్ ఐదేళ్ల పాలననూ, కూటమి సర్కార్ తాజా ఆరు మాసాల పాలననూ జనం బేరీజు వేసుకుంటున్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా ప్రకటించి, జనం ముందు జవాబుదారీ తనాన్ని నిలబెట్టుకున్న జగన్ వ్యక్తిత్వాన్నీ, ఎన్నికల హామీలన్నీ హుష్ కాకీ అంటున్న చంద్రబాబు వ్యక్తిత్వాన్ని జనం పోల్చి చూసుకుంటున్నారు. పేదబిడ్డల బంగారు భవిష్యత్తు కోసం వారి నాణ్యమైన చదువులపై వ్యక్తిగతంగా శ్రద్ధపెట్టిన జగన్ విజన్‌కూ, పేదలకు ఇంగ్లిష్ మీడియం అవసరం లేదని ఎత్తిపారేసిన చంద్రబాబు విజన్‌కూ మధ్యనున్న తేడాలోని రహస్యమేమిటో తెలుసుకుంటున్నారు. ప్రజలందరి సాధికారతకు పెద్దపీట వేసిన జగన్ ఫిలాసఫీని, కొద్దిమందికి కొమ్ముకాసే చంద్రబాబు ఫిలాసఫీని ఆమూలాగ్రంగా పరిశీలిస్తున్నారు. ఎల్లకాలం జనం కళ్లకు గంతలు కట్టడం సాధ్యం కాదు. ప్రత్యర్థి వ్యక్తిత్వహననంతో పబ్బం గడుపుకోవాలంటే ప్రతిసారీ కుదరదు. ఇప్పుడు యెల్లో మీడియాకు జగన్ లీగల్ నోటీసులు పంపించారు. ఇక జనంలో చర్చ మొదలవుతుంది. ఇద్దరి వ్యక్తిత్వాల మీద ఆ చర్చ జరగాల్సిందే!

vardhelli1959@gmail.com

ఇక ఎయిడ్స్‌కు చరమగీతం!

సందర్భం



డా॥ కూటికుప్పల సూర్యారావు

ఒకప్పుడు మశూచి వ్యాధి బారిన పడి లక్షలమంది మరణించేవారు. అలాగే ప్లేగ్ వ్యాధితో కూడా! అలాంటి భయంకరమైన రోగాలు ఇప్పుడు కలికానికి కూడా లేవు. దీనికి కారణాలు ఆ రోగాలను మట్టుబెట్టడంలో జరిగిన నిరంతర కృషి.

1980వ దశకంలో ఎయిడ్స్ అంటే మరణం. దీని బారిన పడినవారు బతికి ఉన్నా, చచ్చినవారితో సమానం అన్నట్టుగా సమాజం పరిగణించిన రోజులు అవి. హెచ్ఐవీ పాజిటివ్ అని తెలియగానే గుండెలో బండ పడినట్లే భావించి మానసికంగా మరణానికి చేరువయ్యేవారు. ఎయిడ్స్ తాకిడికి అమెరికా లాంటి అగ్ర దేశాలు కూడా విలవిలలాడి పోయాయంటే అప్పట్లో ఈ వ్యాధి కలిగించిన భయోత్పాతాన్ని అర్థం చేసుకోవచ్చు. అది ఆనాటి ముఖచిత్రం.

ఈనాడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మందే లేదనుకున్న ఈ వ్యాధికి తగిన మందులు లభిస్తున్నాయి. ఇప్పుడు ఎయిడ్స్ ఒక దీర్ఘకాలిక వ్యాధి మాత్రమే! ఎయిడ్స్‌కు గురి కాకుండా ఎలాగూ కాపాడుకోవచ్చు. ఒకవేళ వచ్చిందని తెలిసినా, 72 గంటల లోపు పోస్ట్ ప్రొఫలాక్సిస్ మందులు వాడి దాని బారి నుంచి బయటపడవచ్చు.

తొమ్మిదేళ్ల క్రితమే క్యూబాలో హెచ్ఐవీ ఎయిడ్స్, సిఫిలిస్ వ్యాధులను పూర్తిగా తుడిచి పెట్టారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ గురించి భయపడాల్సిన అవసరం ఇక ఎంత మాత్రం లేదని, గట్టిగా ప్రయత్నిస్తే, మొత్తం ప్రపంచానికి ఎయిడ్స్ నుంచి విముక్తి కలిగించవచ్చనే గట్టి సందేశాన్ని ఆ దేశం ప్రపంచ దేశాలకు పంపింది. ఎయిడ్స్ పాజిటివ్ దంపతులు నేడు చికిత్స తీసుకొని, ఆ వ్యాధి లక్షణాలు లేని, ఆరోగ్యవంతమైన పిల్లలను కనవచ్చు. హెచ్ఐవీ పాజిటివ్ వాళ్ళు... ఆ వ్యాధి సోకని వాళ్ళను నిక్షేపంగా వివాహం చేసుకొని, ఎలాంటి భయ సంకోచాలూ లేకుండా హాయిగా కాపురాలు చేసుకోవచ్చు. అనేక శాస్త్రీయ పరిశోధనల పుణ్యమా అని అలాంటి చికిత్సా పద్ధతులు, ఈనాడు సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చాయి.

బీపీ, షుగర్ బాధితులు అతి తక్కువ ఖర్చుతో ప్రతి రోజూ క్రమం తప్పకుండా మాత్రలు వాడుతూ ఆరోగ్యంగా సాధారణ జీవితం గడుపున్న మాదిరిగానే, ఎయిడ్స్ రోగులు కూడా 30 రూపాయలు ఖరీదు చేసే ఒక్క మాత్రను క్రమం తప్పకుండా రోజూ వేసుకుంటూ, తగు విశ్రాంతి, పోషకాహారం తీసుకుంటూ క్రమశిక్షణతో జీవితం గడిపితే, 80 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఆరోగ్యంగా, ఆనందంగా, ఉల్లాసంగా జీవించవచ్చు. ఈ విషయాన్ని ప్రఖ్యాత వైద్య జర్నల్ 'లాన్సెట్', ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశోధక బృందం, పలు అధ్యయన సంస్థలు అధికారికంగా ప్రకటించాయి.



వైద్యపరంగా ఇంతటి భరోసా లభిస్తున్నా, ఎయిడ్స్ రోగులు మానసికమైన భయాందోళనలతో చికిత్సకు దూరంగా ఉంటూ అల్లాడిపోతున్నారు. రోజువారీ వాడాల్సిన మాత్రలు తమ దగ్గర ఉంటే పక్కవారికి తెలిస్తే, పరువు పోతుందనే భయంతో సక్రమంగా వాడకుండా కోరి ప్రమాదాన్ని తెచ్చి పెట్టుకుంటున్నారు.

ఇంత ప్రగతి సాధించినా ఇప్పటికీ సామాన్యులే కాక, విద్యాధికులైన హెచ్ఐవీ రోగులు కూడా అపోహలు, మూఢ నమ్మకాలతో శాస్త్రీయంగా ఎలాంటి నిర్ధారణ కాని పొడులు, కషాయాలతో వ్యాధిని మరింత ముదరబెట్టుకొంటున్నారు. కొందరు పాము విషం తీసుకుంటే ఈ వ్యాధి తగ్గిపోతుందనే ప్రచారాలు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ డిసెంబర్ ఒకటవ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినం కోసం 'అందరం కలసి శ్రమిద్దాం– ఎయిడ్స్‌ను నిరోధిద్దాం' అన్న నినాదాన్ని ప్రకటించింది. 2030 నాటికి ఎయిడ్స్ లేని ప్రపంచాన్ని సృష్టించడానికి, ఆధునిక చికిత్సా పద్ధతులపై ప్రజల్లో అవగాహన పెంచాలని సంకల్పించింది.

హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నూటికి నూరుపాళ్ళు నివారించే వీలున్న వ్యాధి కనుక నిరంతరం దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండాలి. ఆత్మహత్యల నిరోధానికి కౌన్సెలింగ్ ఇస్తున్న తరహాలోనే ప్రజలకు అందుబాటులో ఎయిడ్స్ కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఒక టోల్ ఫ్రీ నంబరుతో రోగులకు, సలహాలు, సూచనలు ఇచ్చే కార్యక్రమం చేపడితే మరిన్ని సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. తామెవరు అన్నది పైకి తెలిసే అవకాశం ఉండదు కనుక రోగులు నిర్భయంగా, ఎలాంటి సంకోచమూ లేకుండా వైద్యులను సంప్రతించి సక్రమంగా చికిత్స తీసుకునే వీలుంటుంది.

నిర్మూలనకు మంచి అవకాశాలు ఉన్న ఎయిడ్స్ వ్యాధి ముప్పును ప్రపంచానికి పూర్తిగా తప్పించాలంటే కలసికట్టు కృషి అవసరం. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు పరస్పర సహకారంతో ప్రజల్లో, ప్రత్యేకించి ఎయిడ్స్ బాధితుల్లో చక్కటి అవగాహన కల్పించే ప్రయత్నాలు నిరంతరం చేయగలిగితే... మశూచి, ప్లేగు వ్యాధుల మాదిరిగానే అతి త్వరలోనే ఎయిడ్స్ అనే భయంకర రోగాన్ని ప్రపంచం నుంచి తరిమివేయడం అసాధ్యం ఏమీ కాదు. అలాంటి శుభ దినం త్వరలోనే రాగలదని ఆశిద్దాం.


వ్యాసకర్త 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ సభ్యులు । 93811 49295

(నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం)

మాటలంటే మాటలా?

ఏ సందర్భంలో చెప్పాల్సిన మాట ఆ సందర్భంలో చెప్పి, తన మాటల వల్ల అటు ఇతరులకూ నొప్పి కలగకుండా, ఇటు తానూ ఇబ్బందిపడి, నొచ్చుకొనే పని లేకుండా, తప్పించుకొనేవాడు ధన్యుడు అని సుమతీ శతకం నీతి. దీనికి, 'ఎక్కడి మాటలు అక్కడ చెప్పేసి, పబ్బం గడిపేసుకొని, పారిపోవటం ఉత్తమ మార్గం!' అని అర్థం చెప్తే, అది కొంత వంకరగా, నకారాత్మకంగా ఉంటుంది. అది 'లౌక్యం' అవుతుంది కానీ సత్పురుషుడు అనుసరించాల్సిన 'నీతి'గా అనిపించదు.

సుమతీకారుడి సూక్తికి సకారాత్మకంగానే అర్థం చెప్పుకోవచ్చు. మనిషి లోక వ్యవహారాలలో, మాటలను ఎప్పుడూ ఆచి తూచి వాడాలి. ఎందుచేత? మరీ కరుకుగా, పరుషంగా, నిక్కచ్చిగా మాట్లాడితే, ఎదుటివాడిని నిష్కారణంగా నొప్పించిన వాళ్లమవుతాం. అలాగని మరీ మెతక దనంగా పోతే, ఎదుటివాడు దాన్ని మన బలహీనతగా, పిరికితనంగా భావించి, మనల్ని నొప్పించే పరిస్థితికి దారి తీయవచ్చు. అయితే, అదీ ఇదీ రెండూ జరగకుండా, జాగ్రత్తగా మాట్లాడటం కత్తి మీద సాములాగా కష్టమైన విషయం. కాబట్టి, మధ్యే మార్గంగా, అవసరమైన సందర్భాలలో మాత్రమే, అవసరమైనంత వరకూ మాత్రమే మాట్లాడి, ఆపైన మౌనం వహిస్తే, అతి ప్రసంగం వల్ల వచ్చే సమస్యల నుండి తప్పించుకోవచ్చు. నిగ్రహంతో, ఉపాయంతో, అనవసరపు సమస్యలు రేకెత్తకుండా నివారించుకోవటం తప్పూ కాదు, పలాయనమూ కాదు. అది సత్పురుషుడి కర్తవ్యమే!



తిక్కన గారి ఉద్యోగ పర్వంలో విదురుడు కూడా ఇలాంటి హితవే చెప్తాడు. '**ఎదిరికి హితమును, నిజమును,/ మదికింపును కాగ పలుకు మాటలు పెక్కై/ యొదవినను లెస్స...**' మాట్లాడితే ఎదుటి వారికి హితం కలిగించే మాటలు మాట్లాడాలి. సత్యమే మాట్లాడాలి. అసత్యం కూడదు. అది కూడా ఎదుటివాడి మనసుకు 'ఇంపు'గా, ప్రియంగా ఉండేలా మాట్లాడాలి. ఈ నియమాలు పాటించగలిగితే, ఎన్ని మాటలు మాట్లాడినా, కొంత అధిక ప్రసంగం చేసినా మంచిదే. తప్పులేదు. అలా కాకుండా, ఆ నియమాలు పాటించలేకపోతే? అదీ ఆయనే చెప్పాడు. '... **అటు గాకన్,/ 'ఇది, అది' అనక ఊరకునికి ఎంతయు ఒప్పున్!**' ఇదీ, అదీ అని ఏమీ మాట్లాడకుండా, మౌనంగా ఊరుకోవటమే శ్రేష్ఠం. మైత్రీ–వైరమూ, శాంతీ – అలజడీ, పుణ్యం – పాపం ఇవన్నీ మాట్లాడే పద్ధతి వల్ల కలిగే ఫలితాలే.

– ఎం. మారుతి శాస్త్రి

కృష్ణాలో తెలంగాణకు 70% వాటా దక్కాలి

- నీటి పారుదల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- 70% కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉంది.. ఏపీలో 30 శాతమే ఉంది
- దీని ప్రకారమే జలాల్లో తెలంగాణకు వాటా రావాలి
- ఆ దిశగా కృష్ణా ట్రిబ్యునల్‌–2 ఎదుట వాదనలు వినిపించాలని అధికారులకు సూచన
- ట్రిబ్యునల్‌ నీటి పంపకాలు చేయనప్పుడు కృష్ణా బోర్డు నిర్ణయాలను ఎందుకు పట్టించుకోవాలని ప్రశ్న

సాక్షి, హైదరాబాద్‌: నది పరీవాహక ప్రాంతాన్ని ప్రామాణికంగా తీసుకుని నీటి కేటాయింపులు జరపాలని అంతర్జాతీయ నీటి సూత్రాలు స్పష్టం చేస్తున్నాయని.. కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉంటే.. ఏపీలో 30 శాతమే ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దీని ప్రకారం కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 1,005 టీఎంసీల వాటాలో 70 శాతం వాటా తెలంగాణకు దక్కేలా జస్టిస్‌ బ్రజేశ్‌కుమార్‌ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్‌–2 ఎదుట వాదనలు వినిపించాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌ శనివారం నీటి పారుదల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలసి సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తే.. బదులుగా నాగార్జునసాగర్‌ ఎగువన 80 టీఎంసీల కృష్ణా జలాలను పరీవాహక రాష్ట్రాలు వినియోగించుకోవచ్చంటూ గతంలో జరిగిన ఒప్పందాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ 80 టీఎంసీల్లో మహారాష్ట్ర, కర్ణాటక 35 టీఎంసీలను వాడుకుంటుండగా.. మిగతా 45 టీఎంసీలపై సంపూర్ణ హక్కు తెలంగాణకే ఉందని చెప్పారు. సాగర్‌ ఎగువన తెలంగాణలోని ప్రాజెక్టుల ద్వారా ఈ నీటిని వినియోగించుకోవడానికి ప్రణాళికలు రూపొందించి



అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరగొద్దు

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన వాటాలను సాధించుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు వీసమెత్తు నష్టం వాటిల్లకుండా కృష్ణా ట్రిబ్యునల్‌–2 ఎదుట సమర్థవంతంగా వాదనలు వినిపించాలన్నారు. ఈ వాదనలను బలపరిచే సాక్ష్యాలు, రికార్డులు, ఉత్తర్వులను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

త్వరలో ట్రిబ్యునల్‌లో వాదనలు..

కృష్ణా ట్రిబ్యునల్‌–2 ఇప్పటివరకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అభిప్రాయాలు, ఆధారాలను సేకరించిందని... త్వరలోనే ఇరు రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాల్సి ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ఆ తర్వాత ట్రిబ్యునల్‌ నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. అయితే కేంద్ర జలశక్తి శాఖకు ఇచ్చిన నివేదికలన్నింటినీ వరుస క్రమంలో సిద్ధంగా ఉంచుకోవాలని, వాటి ఆధారంగా ట్రిబ్యునల్‌ ఎదుట వాదనలు వినిపించాలని సీఎం సూచించారు.

కృష్ణా బోర్డును ఎందుకు పట్టించుకోవాలి?

తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీని కృష్ణా ట్రిబ్యునల్‌–2 పూర్తి చేయలేదని.. ఇక కృష్ణా బోర్డు నిర్ణయాలను తెలంగాణ ఎందుకు పట్టించుకోవాలని సీఎం రేవంత్‌ ప్రశ్నించారు. నీటి వాటాల పంపిణీ పూర్తయ్యే వరకు కృష్ణా బోర్డు జోక్యం ఉండకూడదంటూ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని అధికారులకు సూచించారు. ఇక ఏపీ కోటాకు మించి నీటిని తరలించుకుపోతోందన్న అంశం ప్రస్తావనకు రాగా.. టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుతో దీనికి అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు పేర్కొన్నట్టు తెలిసింది. దీంతో శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ, బానకచర్ల క్రాస్‌ రెగ్యులేటరీ, తెలుగు గంగ, కేసీ కాల్వ, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలుగోడు ప్రాజెక్టుల ద్వారా ఏపీ తరలిస్తున్న నీటి వివరాలను సేకరించి రికార్డు చేయాలని సీఎం సూచించినట్టు సమాచారం.

నీటి వాటాల్లో అన్యాయంపై నివేదిక తయారు చేయాలి

సీతారామ ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీకి అవసరమైన అనుమతులను సాధించాలని.. మొత్తం ఆయకట్టుకు నీరందేలా పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, నీటి వాటాలకు సంబంధించి సమర్థంగా వాదనలు వినిపించేందుకు 2014 నుంచి ఇప్పటి వరకు ఉన్న జీవోలు, తీర్పులతో పాటు ఉమ్మడి రాష్ట్రంలోని జీవోలు, మెమోలు, డీపీఆర్‌లు, నాటి నుంచి నీటి వాటాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్రంగా నివేదిక తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కృష్ణా ట్రిబ్యునల్‌–2 ఎదుట తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్‌ న్యాయవాది వైద్యనాథన్, అడ్వొకేట్‌ జనరల్‌ సుదర్శన్‌రెడ్డి, అదనపు ఏజీ రజనీకాంత్‌రెడ్డి, ప్రభుత్వం తరఫు న్యాయవాది ఖుష్‌ వోరా, అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ నేత బాలమల్లేశ్‌ హఠాన్మరణం

- సీపీఐ శ్రేణులు, నేతల దిగ్భ్రాంతి
- సంతాపం తెలిపిన వివిధ పార్టీల నేతలు



అల్వాల్‌: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్‌.బాలమల్లేశ్‌ యాదవ్‌ (56) శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. యాప్రాల్‌లో నివసిస్తున్న ఆయనకు మధ్యాహ్నం గుండెనొప్పి రావడంతో.. సమీపంలోని కందిగూడలోని శ్రీనివాస ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుండి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఏఎస్‌రావు నగర్‌లోని పోలోమి ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. బాలమల్లేశ్‌ మృతి విషయం తెలియడంతో కమ్యూనిస్టు శ్రేణులతోపాటు వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. పార్టీ కార్యకర్తలు, మహిళలు పోలోమి ఆసుపత్రిలో బాలమల్లేశ్‌ పార్థివ దేహం వద్ద బోరున విలపించారు. ఆయన మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్‌ బోస్, రాష్ట్ర నేత జి.దామోదర్‌రెడ్డి, దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ శంకర్, మండల కార్యదర్శులు కిషన్, నర్సింహులు.. పోలోమి ఆసుపత్రికి హుటాహుటిన చేరుకుని బాలమల్లేశ్‌ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దివంగత నేత పార్థివదేహాన్ని యాప్రాల్‌లోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం పార్థివదేహాన్ని హిమాయత్‌నగర్‌లోని సీపీఐ కేంద్ర కార్యాలయానికి తరలించి, మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు, పార్టీ వర్గాలు తెలిపాయి. బాలమల్లేశ్‌కు భార్య వందన, కుమారుడు నిశాంత్, కుమార్తె నిఖిత ఉన్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..: విద్యార్థి దశలోనే ఏఐఎస్‌ఎఫ్‌పై ఆకర్షితుడైన బాలమల్లేశ్‌ 1984లోనే చురుకైన కార్యకర్తగా విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశారు. తన అంకితభావం ఫలితంగా దక్కిన ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి పదవిలో.. 1998 వరకు విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 2004లో సీపీఐలో చేరి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చివరి వరకు పార్టీ పటిష్టానికి జిల్లా వ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేశారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా వారికి అందుబాటులో ఉండేవారు.

అమెరికాలో దుండగుల కాల్పుల్లో ఖమ్మం యువకుడి మృతి

- ఎంబీఏ చదివేందుకు ఐదు నెలల క్రితమే వెళ్లిన సాయితేజ



ఖమ్మం క్రైం: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఖమ్మం జిల్లా కు చెందిన యువకుడు అక్కడ దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు. ఖమ్మం రూరల్‌ మండలం రామన్నపేటకు చెందిన నూకారపు కోటేశ్వరరావు ఖమ్మం రాపర్తినగర్‌లోని రమణగుట్టలో కొన్నేళ్లుగా వ్యాపారం చేస్తూ భార్య వాణి, కుమార్తె ప్రియ, కుమారుడు సాయితేజతో కలసి ఉంటున్నారు. సాయి తేజ (25) హైదరాబాద్‌లో బీబీఎం పూర్తిచేశాడు. అమెరికాలోని చికాగో ప్రాంతంలో ఉన్న కాంకార్డ్స్‌ వర్సిటీలో ఎంబీఏ చే యడానికి ఈ ఏడాది జూన్‌ 15న వెళ్లాడు. అక్కడ చదువుతూనే ఓ స్టోర్‌లో పార్ట్‌టైం ఉద్యోగం కూడా చేస్తున్నాడు. భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఆయన పనిచేస్తున్న స్టోర్‌లోకి తుపాకులతో వచ్చి క్యాష్‌ కౌంటర్‌లో ఉన్న నగదు ఇవ్వాలని సాయితేజను బెదిరించారు. దీంతో అతను నగదు ఇచ్చేసి ఓ పక్కన నిల్చున్నాడు. ఇంతలోనే దుండగులు కాల్పులు జరపడంతో సాయితేజ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సాయితేజ స్నేహితులకు సమాచారం ఇవ్వగా వారు కుటుంబసభ్యులకు ఫోన్‌లో తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తానా సభ్యులకు ఫోన్‌ చేయగా, సాయితేజ మృతదేహాన్ని ఖమ్మం పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా వార్షికోత్సవాలు నిర్వహించండి

- మావోయిస్టు పార్టీ పిలుపు

చర్ల: విప్లవోద్యమ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న కగార్‌ విప్లవ ప్రతిఘాతక యుద్ధాన్ని తిప్పికొడుతూ ఈ నెల 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ (ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం) 24వ వార్షికోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మావో యిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం లేఖ విడుదల చేసింది. దేశంలో నూతన ప్రజాస్వామిక, విప్లవ విజయసాధన కోసం ప్రజాయుద్ధం కొనసాగిస్తున్న పార్టీ, పీఎల్‌జీఏలను రాష్ట్రంలో బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొంది. బ్రాహ్మణీయ, హిందూత్వ, ఫాసిస్టు శక్తులు వ్యూహాత్మక పథకంలో భాగంగా కగార్‌ ఆపరేషన్‌ పేరుతో దాడులు కొనసాగిస్తున్నాయని, వాటికి తలవంచకుండా భీకర యుద్ధం చేస్తున్నామని తెలిపింది. గతేడాది కాలంలో దేశవ్యాప్తంగా 254 మంది పీఎల్‌జీఏ వీర గెరిల్లాలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని పార్టీ ప్రకటించింది. తెలంగాణలో కమాండర్‌ సాగర్‌తో పాటు అచ్చన్న, మంగు, వగ్రేశ్‌ ఏరాయి, తులసి, రాము, మణిరాం, విజయేందర్, కోసి, గంగాల్, లక్ష్మణ్, దుర్గేశ్, బుద్ర, రాజు అమరులయ్యారని, వారికి నివాళులర్పిస్తున్నామని పార్టీ తెలిపింది. దళిత, ఆదివాసీ, పీడిత ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడిన సాయిబాబా ఈ ఏడాది అక్టోబర్‌ 12న కన్నుమూశారని, జేఎస్‌ఎం కళాకారుడు రడం శ్రీను కూడా అదే రోజున అనారోగ్యంతో మృతిచెందాడని, వారికి జోహార్లు అర్పిస్తున్నామని పేర్కొంది.

అప్పు తీరక ఒకరు.. అప్పు పుట్టక మరొకరు

- కూతురి పెళ్లి అప్పు తీరక..
- కూతురి పెళ్లికి అప్పు దొరక్క..
- ఇద్దరు రైతుల బలవన్మరణం



నాగరాజు

ఇల్లంతకుంట(మానకొండూర్‌)/అక్కన్నపేట(హుస్నాబాద్‌): కూతురి పెళ్లికి చేసిన అప్పు తీరక ఒకరు.. కూతురి పెళ్లికి అప్పు పుట్టక మరొకరు.. ఇద్దరు రైతులు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. వేర్వేరు జిల్లాల్లో జరిగిన ఈ సంఘటనల వివరాలివి.రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేట గ్రామానికి చెందిన కోమటి నాగరాజు (49), లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. తనకున్న నాలుగు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడేళ్ల క్రితం పెద్ద కూతురి వివాహానికి రూ.15 లక్షల అప్పు చేశాడు. అప్పు తీరకపోవడంతో తరచూ భార్యకు చెప్పి బాధపడేవాడు. శనివారం ఉదయం తన పొలంలో క్రిమిసంహారక మందు తాగి.. విషయాన్ని చిన్న కూతురికి ఫోన్‌లో తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న నాగరాజును ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్‌ తెలిపారు.



బాలునాయక్

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్‌చెర్వు తండా గ్రామ పరిధిలోని దుబ్బతండాకు చెందిన భానోతు బాలునాయక్‌ తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వివిధ రకాల పంటలు సాగు చేసినా సుమారు రూ.5 లక్షల అప్పు తీరలేదు. ఈలోగా వచ్చే ఫిబ్రవరిలో జరగనున్న కుమార్తె వివాహానికి డబ్బు కోసం పలుచోట్ల ప్రయత్నించినా ఎవరూ అప్పు ఇవ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై.. శుక్రవారం రాత్రి మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగాడు. భార్య గమనించి, ఇరుగుపొరుగు వారి సాయంతో నంగునూర్‌ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించింది. అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య సుగుణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్‌ తెలిపారు.

ఏఈఈ అక్రమాస్తులు రూ.200 కోట్లపైనే..!

▶ మొదటి పేజీ తరువాయి

విలువ రూ. 17,73,53,500గా వెల్లడించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో ఆ ఆస్తుల విలువ రూ. 200 కోట్లపైనే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏసీబీ సోదాల సమయంలో పెద్ద మొత్తంలో ఖరీదైన వస్తువులు, విలువైన ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు ఖాతాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉందని తెలిసింది. మరోవైపు పలు రియల్‌ ఎస్టేట్‌ సంస్థలకు, నిఖేశ్‌కుమార్‌కు మధ్య జరిగిన లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా రాజ పుష్ప అనే రియల్‌ ఎస్టేట్‌ సంస్థలో ఆయనకు 56 ఆస్తులు ఉన్నట్లు పత్రాలు లభించాయి. అలాగే మరో సంస్థలో ఆయనకు చెందిన 26 ఆస్తుల పత్రాలు కూడా బయటపడ్డాయి.

రూ. లక్ష తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి..
రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్‌ సర్కిల్‌ ఎస్‌ఈ కార్యాలయంలో ఏడబ్ల్యూ సెక్షన్‌లో ఏఈఈగా పనిచేస్తున్న సమయంలో నిఖేశ్‌కుమార్‌ మరికొందరు అధికారులతో కలిసి మణికొండ, నేక్నామ్‌పూర్‌లో ఒక భవన నిర్మాణానికి అనుమతలిచ్చేందుకు రూ. 2.5 లక్షల లంచాన్ని తీసుకొనేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇందులో ముందుగా రూ. లక్షన్నర తీసుకున్నారు. ఈ ఏడాది మే 30న లంచం మొత్తంలోని మిగిలిన రూ. లక్ష తీసుకుంటుండగా ఈఈ కె.భన్సీలాల్, నిఖేశ్‌కుమార్‌ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీంతో నిఖేశ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్‌ చేశారు. ఏసీబీ అధికారుల ప్రాథమిక దర్యాప్తులో లంచాల సొమ్ముతో నిఖేశ్‌కుమార్‌ పెద్ద మొత్తంలో ఆస్తులు కూడబెట్టినట్లు ఆధారాలు సేకరించిన ఏసీబీ అధికారులు ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి తాజాగా సోదాలు చేపట్టారు.

బఫర్‌ జోన్‌లో అక్రమంగా నిర్మాణ అనుమతులు..

చెరువులు, కుంటల దగ్గర భూముల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్‌ జోన్‌లలో నిర్మాణాలకు ఎన్‌ఓసీలు జారీ చేసే విభాగంలో నిఖేశ్‌ విధులు నిర్వర్తించిన సమయంలో గండిపేట బఫర్‌ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చి భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

హక్కుల పరిరక్షణకు న్యాయవాదులు కృషిచేయాలి

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ నగేశ్‌ భీమపాక



నయీంనగర్‌: ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన భారత రాజ్యాంగం, ప్రజల హక్కుల పరిరక్షణకు న్యాయవాదులు క్రియాశీలకంగా కృషి చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ నగేశ్‌ భీమపాక అన్నారు. శనివారం హనుమకొండ హరిత హోటల్‌లో ఇండియన్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ లాయర్స్‌ (ఐఏఎల్‌) రాష్ట్ర రెండవ మహాసభల్లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న అనేక హక్కులు, విశ్వాసాలను గుర్తించకపోతేనే సమస్యలు ఉత్పన్నమవుతాయని, వాటి పరిరక్షణలో న్యాయవాదులు ముందంజలో ఉండాలని సూచించారు. పౌరులు తమ హక్కులతో పాటు దేశం పట్ల బాధ్యతలను కూడా గుర్తెరగాలన్నారు. దేశానికి వారు ఏమిచ్చారని ఆలోచించకుండా దేశం తనకేం ఇచ్చిందని ఆశిస్తున్నారని, ఇది సరికాదని జస్టిస్‌ నగేశ్‌ పేర్కొన్నారు. సోషల్‌ మీడియా వచ్చిన తర్వాత వ్యక్తిగత జీవితం ఎవరి చేతిలో లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు.

టమాటా లోడుతో వెళ్తున్న వ్యాన్‌ బోల్తా



డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన టమాటాలోడు వ్యాన్‌

- సూర్యాపేట జిల్లాలో ఘటన

కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద టమాటాల లోడుతో వెళ్తున్న వ్యాన్‌ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో టమాటాలు కిందపడగా వాటిని ఏరుకోవడానికి జనం ఎగబడ్డారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన వ్యాపారి కర్నూలు నుంచి వ్యాన్‌లో టమాటాలు తీసుకొస్తున్నాడు. వ్యాన్‌ కోదాడ మీదుగా జగ్గయ్యపేటకు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో కోదాడ మండలం చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద శనివారం తెల్లవారుజామున డివైడర్‌ను వ్యాన్‌ ఢీకొని బోల్తాపడింది. గమ్యస్థానానికి 10 కిలోమీటర్లు ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్‌ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఘటనలో టమాటాలన్నీ కిందపడ్డాయి. కొన్ని చితికిపోగా మిగతావి తీసుకెళ్లడానికి జనం ఎగబడ్డారు. ఇక మిగిలిన వాటిని ఏరుకొని వేరేవ్యాన్‌లో వేసుకొని వ్యాపారి జగ్గయ్యపేటకు తీసుకెళ్లాడు. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటైన తర్వాత నాలుగో చైర్మన్‌గా బుర్రా వెంకటేశం నిలవనున్నారు. ఆయన వయసు 62 ఏళ్లు పూర్తయ్యే వరకు లేదా ఆరేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. పదవీ విరమణ చేసిన అధికారులను టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమిస్తే... సంస్కరణలు తీసుకురావడం, అమలు చేయడానికి తగిన సమయం ఉండదన్న ఉద్దేశంతో బుర్రా వెంకటేశంను సీఎం రేవంత్‌రెడ్డి ఎంపిక చేశారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

వివిధ హోదాల్లో పనిచేసి..: బుర్రా వెంకటేశం ప్రస్తుతం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్నారు. గవర్నర్‌ ముఖ్య కార్యదర్శిగా, జేఎన్టీయూ వీసీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. జనగామ జిల్లా కేశవాపురం గ్రామానికి చెందిన బుర్రా వెంకటేశం.. 1995 సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయనే టాపర్. ఆయన 200 5– 2009 మధ్య మెదక్, గుంటూరు జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. హోంశాఖ కార్యదర్శిగా, టూరిజం– సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా, కార్యదర్శిగా సుదీర్ఘకాలం కొనసాగారు. జిల్లా కలెక్టర్‌గా తన అనుభవాలతో 'పాత్‌వేస్‌ టు గ్రేట్‌ నెస్‌–కమింగ్‌ టుగెదర్‌ ఫర్‌ చేంజ్‌'పుస్తకం కూడా రాశారు.

కీలక కార్యక్రమాలతో గుర్తింపు
బుర్రా వెంకటేశం రాష్ట్రంలో అంతర్జాతీయ కైట్‌ ఫెస్టివల్, అంతర్జాతీయ స్వీట్స్‌ ఫెస్టివల్, అంతర్జాతీయ ఫోటోగ్రఫీ ఫెస్టివల్, హైదరాబాద్‌ హెలీ టూరిజం పేరిట విభిన్న కార్యక్రమాలను పరిచయం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. పరీక్ష తేదీ నుంచి కేవలం 65 రోజుల రికార్డు సమయంలో ఏకంగా 11 వేల ఉపాధ్యాయ పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి చేశారు. అదే సమయంలో 35వేల మంది టీచర్లకు పదోన్నతులు, 22 వేల మందికి బదిలీల ప్రక్రియలనూ విజయవంతంగా నిర్వహించారు. 2005లో ప్రధానమంత్రి మన్మోహన్‌ సింగ్‌ నుంచి ప్రశంసా పత్రాన్ని.. 2016లో రాష్ట్రపతి ప్రణబ్‌ ముఖర్జీ నుంచి అత్యుత్తమ పౌర పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన సామాజిక సేవకు గుర్తింపుగా ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ పది బంగారు పతకాలను అందజేసింది. 2019లో 'సెల్ఫీ ఆఫ్‌ సక్సెస్‌'అనే పుస్తకం రాశారు. రామాయణ పరివారం, జీవన ధాన్య శతకం, 'బుద్ధ శతకం'కూడా రాశారు.

పదవికి ముందు పదోన్నతి
విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టీజీపీఎస్సీ చైర్మన్‌గా ఆయన పేరు ఖరారైన నేపథ్యంలో ఈ పదోన్నతి ఇవ్వడం గమనార్హం.

బడికి వెళ్లమన్నందుకు ఆత్మహత్య

- ఉరేసుకున్న పదవ తరగతి విద్యార్థి



గోవిందు

చిలప్‌చెడ్‌ (నర్సాపూర్‌): పదవ తరగతి చదువుకుంటున్న ఓ విద్యార్థి బడికి వెళ్ల మన్నందుకు ఆత్మహత్యకు పాల్పడ్డా డు. ఈ ఘటన మెదక్‌ జిల్లా చిలప్‌చెడ్‌ మండలం గన్యాతండా గ్రామ పంచాయతీలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింహులు కథనం మేరకు.. గన్యాతండాకు చెందిన గుగ్లోత్‌ శివ రాం–సుగుణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. కుమారుడు గోవిందు (16) గన్యతండాకు పక్కనే ఉన్న గౌతాపూర్‌ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. 15 రోజులుగా గోవిందు బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శనివారం ఉదయం గోవిందు చిన్న అక్క పూజ కాలేజీకి వెళ్తూ తమ్ముడిని కూడా స్కూల్‌కి వెళదామని చెప్పింది. కొంతదూరం వెళ్లినా గోవిందు రాకపోయేసరికి, తిరిగి ఇంటికి వెళ్లింది. తలుపులు మూసి ఉండటంతో చుట్టుపక్కలవారిని పిలిచింది. వారు తలుపులు పగులగొట్టి చూడగా గోవిందు ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. స్కూల్‌కి వెళ్లమన్నందుకు తమ కుమారుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని విద్యార్థి తండ్రి శివరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో రైతుపై పులి దాడి

- ఆసిఫాబాద్‌ జిల్లా సిర్పూర్‌ (టి)లో ఘటన
- తీవ్రంగా గాయపడిన రైతు సురేశ్‌
- కాగజ్‌నగర్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు
- గొడ్డలితో ఎదురుదాడి చేసి ప్రాణాలు కాపాడుకున్న సురేశ్‌

సాక్షి, హైదరాబాద్‌/ సిర్పూర్‌(టి): కుమ్రంభీం ఆసిఫాబాద్‌ జిల్లాలో పెద్దపులి మరోసారి మనుషులపై దాడి చేసింది. కాగజ్‌నగర్‌ మండలం నజ్రుల్‌నగర్‌ విలేజ్‌ నం.13 వద్ద శుక్రవారం మోర్లె లక్ష్మి (21) అనే మహిళా రైతుపై దాడిచేసి చంపివేసిన పులి.. మరుసటి రోజే సిర్పూర్‌ (టి) మండలంలో సురేశ్‌ అనే రైతుపై దాడి చేసింది. పులి దాడిలో తీవ్రంగా గాయపడిన సురేశ్‌.. కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ రెండు దాడులు పత్తి చేలో పనిచేస్తున్నవారిపైనే జరగటం గమనార్హం.

గొడ్డలితో ఎదురుదాడి

సిర్పూర్‌(టి) మండల కేంద్రంలోని దుబ్బగూడ కాలనీకి చెందిన సురేశ్, సుజాత దంపతులు.. గ్రామ శివారులో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని మూడెకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. శనివారం భార్యాభర్తలు చేనులో పత్తి ఏరుతుండగా.. ఉదయం 11 గంటల సమయంలో పెద్దపులి ఒక్కసారిగా సురేశ్‌పై దాడి చేసింది. దీంతో భార్యాభర్తలు ఇద్దరు గట్టిగా కేకలు వేసి పులిని తరిమేందుకు ప్రయత్నించారు. అప్పటికీ పులి వెనక్కు తగ్గకపోవటంతో సురేశ్‌ తన వద్ద ఉన్న గొడ్డలితో పులిపై ధైర్యంగా ఎదురుదాడి చేశాడు. దీంతో పులి అడవిలోకి పారిపోయింది. పులి పంజా విసరటంతో సురేశ్‌



రైతు సురేశ్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

మెడ భాగంలో తీవ్ర గాయమైంది. వెంటనే అతడిని సుజాత గ్రామంలోకి తీసుకొచ్చి స్థానికుల సాయంతో సిర్పూర్‌(టి) ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. సురేశ్‌ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌ పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.


అదే పులి మళ్లీ దాడి..

కాగజ్‌నగర్‌ మండలంలో మహిళపై శుక్రవారం దాడిచేసిన పెద్దపులే.. శనివారం సిర్పూర్‌ (టి)లోనూ రైతుపై దాడి చేసి ఉంటుందని ఎఫ్‌ఆర్‌వో ఇక్బాల్‌ తెలిపారు. శుక్రవారం పులి ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులు డ్రోన్‌ కెమెరాల ద్వారా గాలించారు. నజ్రుల్‌నగర్‌ విలేజ్‌ నం.13 నుంచి సిర్పూర్‌(టి) మండల కేంద్రం 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. పెద్దబండ సమీపంలో రోడ్డు దాటి సిర్పూర్‌(టి) మండల కేంద్రం వైపు పులి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతం మహారాష్ట్రలోని తాడోబా పులుల అభయారణ్యానికి సమీపంలోనే ఉంది. ఇటిక్యాల పహాడ్‌ గ్రామం దాటితే పెద్దపులి మళ్లీ మహారాష్ట్రకు వెళ్లిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పులి దాడి ఘటనపై అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వ్యవసాయ పనులకు వెళ్లేవారు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని, అటవీ అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తిచేశారు. కాగజ్‌నగర్‌లోని ఈజ్గాంలో పులి దాడిలో మరణించిన కళ్యాణి కుటుంబానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూ.10 లక్షల పరిహారం అందజేసినట్టు తెలిపారు.

పులి కోసం గాలింపు

కాగజ్‌నగర్‌ రూరల్‌: మనుషులపై వరుసగా దాడులు చేస్తున్న పెద్దపులి కోసం అటవీశాఖ అధికారులు గాలింపు ముమ్మరం చేశారు. సిర్పూర్‌(టి), కాగజ్‌నగర్‌ రేంజ్‌లలో 40 మంది సిబ్బంది ఆరు బృందాలుగా విడిపోయి పులి ఆచూకీ కోసం శనివారం వెతికారు. పాదముద్రల ఆధారంగా డ్రోన్‌ కెమెరా ద్వారా పులి జాడ తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే దాని జాడ దొరకలేదు. దీంతో సమీప గ్రామాల్లోని ప్రజలను డప్పు చాటింపు ద్వారా అప్రమత్తం చేస్తున్నారు. కాగా శుక్రవారం పులిదాడిలో మృతిచెందిన మోర్లె లక్ష్మి కుటుంబ సభ్యులకు డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌ టిబ్రేవాల్‌ శనివారం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందించారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.

గొడ్డలితో దాడి చేయటంతో పులి పారిపోయింది



చేనులో పత్తి ఏరేందుకు ఉదయం ఇద్దరం కలిసి వెళ్లాం. అంతలోనే పెద్దపులి నా భర్త సురేశ్‌పై దాడి చేసింది. ఆయన చేతిలో ఉన్న గొడ్డలితో పులిపై ఎదురుదాడి చేశారు. నేను భయంతో గట్టిగా కేకలు వేయడంతో అది సురేశ్‌ను వదిలి వెళ్లిపోయింది.

– సుజాత, బాధితుడు సురేశ్‌ భార్య



ద్రావకాన్ని తుడుచుకుంటున్న కేజ్రీవాల్

కేజ్రీవాల్ ర్యాలీలో కలకలం

ఆయనపై ఓ ద్రావకం చల్లిన దుండగుడు

- అది నీరేనంటున్న పోలీసులు
- కాదు, యాసిడ్ అని ఆరోపిస్తున్న ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికలకు గాను ముందస్తుగా ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. శనివారం మాలవీయ నగర్‌లోని సావిత్రీ నగర్‌లో శనివారం జరిగిన పాదయాత్ర సందర్భంగా కేజ్రీవాల్‌పై ఓ వ్యక్తి గుర్తు తెలియని ద్రావకాన్ని చల్లడం తీవ్ర కలకలం రేపింది. చుట్టూ భద్రతా సిబ్బంది మోహరించి ఉండగా ప్రజలకు అభివాదం చేస్తున్న కేజ్రీవాల్ సమీపానికి చేరుకున్న ఓ వ్యక్తి ద్రావకాన్ని చల్లాడు. దీంతో, అక్కడున్న వారు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. భద్రతా సిబ్బందిపై కూడా ఆ ద్రావకం పడటంతో వారు తుడుచుకున్నారు. ఈ చర్యకు పాల్పడిన వ్యక్తిని ఢిల్లీ రవాణా సంస్థకు చెందిన ఖాన్‌పూర్ బస్ డిపోలో పనిచేసే అశోక్ ఝా అనే బస్ మార్షల్‌గా పోలీసులు గుర్తించారు. కేజ్రీవాల్‌పై అతడు చల్లింది నీరు మాత్రమేనని తెలిపారు. గత ఆరు నెలలుగా వేతనం అందకపోవడం, కేజ్రీవాల్ వాగ్దానాలను అమలు చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనై ఈ చర్యకు పాల్పడినట్లు అతడు చెప్పాడన్నారు. ఈ పరిణామంపై ఆప్ స్పందించింది. దేశ రాజధానిలో మాజీ ముఖ్యమంత్రికి సైతం భద్రత కరువైతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. బీజేపీ పాలనలో ఢిల్లీలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆప్ విమర్శించింది. కేజ్రీవాల్‌ను సజీవ దహనం చేసేందుకే దుండగుడు ఆయనపైకి యాసిడ్ చల్లాడని ఆప్‌కు చెందిన ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. బీజేపీకి చెందిన అతడి చేతుల్లో యాసిడ్ బాటిల్‌తోపాటు అగ్గిపెట్టె కూడా ఉన్నాయన్నారు. సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. గత 35 రోజుల్లో కేజ్రీవాల్‌పై జరిగిన మూడో దాడి అని ఆయన అన్నారు. ఘటనపై కేజ్రీవాల్ స్పందించారు. తన పాదయాత్రకు అడ్డంకులు సృష్టించడం మాని ఢిల్లీలో నేరాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని హోం మంత్రి అమిత్‌షాను కోరారు. 'నన్ను అడ్డుకుంటే ఢిల్లీలో షూటౌట్లు, నేరాలు ఆగుతాయా? మహిళలు, వ్యాపారులు సురక్షితంగా ఉంటారా?' అని ఆయన ఎక్స్‌లో ప్రశ్నించారు.

కాలపరిమితి ఆదేశాలు సరికాదు

- కింది కోర్టుల్లో నిర్దిష్ట కాలపరిమితిలోపు విచారణ కష్టం
- హైకోర్టు ఆదేశాలను కొట్టేస్తూ వ్యక్తికి బెయిల్ ఇచ్చిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: ట్రయల్ కోర్టుల పరిధిలో కేసుల విచారణకు కాలపరిమితిని విధిస్తూ ఆదేశాలిచ్చే సంస్కృతిని హైకోర్టులు విడనాడాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఈ మేరకు ఒక వ్యక్తికి బెయిల్‌ను నిరాకరిస్తూ, కాలపరిమితిలోపు విచారణ పూర్తిచేయాలంటూ ట్రయల్ కోర్టుకు హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టేసింది. గత సోమవారం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు శనివారం వెలుగులోకి వచ్చాయి. నకిలీ నోట్ల కేసులో రెండున్నరేళ్లుగా విచారణ ఖైదీగా జైలులో మగ్గిపోతున్న ఒక వ్యక్తికి బెయిల్ మంజూరుచేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ''కాలపరిమితిలోపు కేసు విచారణ పూర్తికాని పక్షంలో బెయిల్ కోసం నిందితుడు చట్టాల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కోర్టులు చట్టప్రకారం వీలైతే ఆ నిందితుడికి బెయిల్ ఇవ్వడానికే మొగ్గుచూపాలి. మరో అవకాశంలేని పక్షంలో మాత్రమే అతడిని విచారణ ఖైదీగా జైలుకు పరిమితం చేయాలి. బెయిల్ అనేది నియమం, జైలు అనేది ఒక మినహాయింపు అనే సూత్రం ఇక్కడా వర్తిస్తుందని హైకోర్టులు గుర్తుంచుకోవాలి'' అని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ''ప్రతి కోర్టులోనూ క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కేసు విచారణను కాలపరిమితిలోపు ముగించాలని ట్రయల్ కోర్టులను హైకోర్టులు ఆదేశిస్తే ఆయా కిందికోర్టుల పనితీరుపై తీవ్ర ఒత్తిడి, ప్రభావం పడుతుంది. ఇలాంటి ఆదేశాలను కచ్చితంగా అమలుచేయడం ట్రయల్ కోర్టుకు కష్టమవుతుంది. బెయిల్‌ను నిరాకరిస్తూ నిందితులకు కంటితుడుపు చర్యగా ఆ కేసు విచారణను త్వరగా పూర్తిచేయిస్తామని హైకోర్టులు చెబుతున్నాయి. ఇలాంటి ఆదేశాలతో సంబంధిత వ్యక్తులకు అనవసరంగా ఆశ కల్పించిన వారమవుతాం. ఇది ఒకరకంగా వాళ్లకు తప్పుడు సందేశం పంపినట్లే'' అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

నాటోలో చేర్చుకోండి.. యుద్ధం ఆపేస్తాం

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టీకరణ



కీవ్: ఉక్రెయిన్–రష్యా యుద్ధం రెండున్నరేళ్లుగా కొనసాగుతోంది. ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ అంతుబట్టడం లేదు. ఇరుదేశాల సైనికులు నీరసించిపోతున్నారు. శత్రుదేశంలో ఇక పోరాడలేమంటూ ఉక్రెయిన్, రష్యా జవాన్లు తేల్చిచెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధానికి ముగింపు పలకాలని రెండు దేశాలూ యోచిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఉక్రెయిన్ భూభాగంలోకి చొచ్చుకొచ్చిన రష్యా సైన్యం అక్కడే తిష్టవేసింది. తూర్పు, దక్షిణ ఉక్రెయిన్ భూభాగాలు రష్యా నియంత్రణలోకి వెళ్లిపోయాయి. ఉక్రెయిన్‌లో ఐదింట ఒక వంతు భూభాగాన్ని రష్యా ఆక్రమించింది. సాంకేతికంగా, చట్టపరంగా ఇది ఉక్రెయిన్ పరిధిలోనిదే. అయినప్పటికీ ప్రస్తుతం దానిపై ఉక్రెయిన్ ప్రభుత్వానికి పట్టులేదు. మరోవైపు నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్(నాటో) కూటమిలో చేరికపట్ల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఉత్సాహం చూపిస్తున్నారు. కనీసం ఇప్పుడు తమ నియంత్రణలో ఉన్న భూభాగాన్ని అయినా నాటోలో చేర్చుకుంటే యుద్ధంతో అత్యంత కీలక దశను ముగించే అవకాశం ఉందని చెప్పారు. ఇదంతా చాలా వేగంగా జరగాలని అభిప్రాయపడ్డారు. తాజాగా స్కై న్యూస్ సంస్థకు జెలెన్‌స్కీ ఇంటర్వ్యూ ఇచ్చారు. తమ అధీనంలో ఉన్న ప్రాంతానికి పూర్తి భద్రత కల్పిస్తామంటూ హామీ ఇవ్వాలని నాటోను కోరారు. అలాగైతే కాల్పుల విరమణకు అంగీకరిస్తామని తెలిపారు. ఆ తర్వాత అంతర్జాతీయ సరిహద్దుల పరిధిలో ఉన్న మొత్తం భూభాగాన్ని.. రష్యా ఆక్రమించిన ప్రాంతాలతో సహా నాటోలో చేర్చుకోవాలని చెప్పారు. దాంతో రష్యా ఆక్రమించిన భూమిని దౌత్య మార్గాల్లో మళ్లీ తాము స్వాధీనం చేసుకొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం కల్పిస్తే రష్యాతో యుద్ధాన్ని ఆపేయడానికి సిద్ధంగా ఉన్నామని జెలెన్‌స్కీ స్పష్టంచేశారు. కానీ, సభ్యత్వం విషయంలో నాటో దేశాల నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని వెల్లడించారు. మరోవైపు ఉక్రెయిన్‌ను ఇప్పటికిప్పుడు తమ కూటమిలో చేర్చుకోవడానికి నాటోలోని కొన్ని దేశాలు ఇష్టపడడం లేదని సమాచారం.





అరెస్టు అయిన పూజారులు

ఇద్దరు పూజారుల అరెస్టు

- జైల్లో ఉన్న చిన్మయ్ దాస్‌ను కలిసేందుకు వెళ్లగా ఘటన
- ఢాకాలోని ఇస్కాన్ కేంద్రంపై దాడి

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందువుల నిర్బంధం, అఘాయిత్యాలు కొనసాగుతున్నాయి. ముస్లిం అతివాదులు మైనారిటీలు, ముఖ్యంగా హిందువులు లక్ష్యంగా దాడులకు పాల్పడుతుండటం తెలిసిందే. ఇప్పటికే హిందూ మత పెద్ద చిన్మయ్ కృష్ణ దాస్‌ను దేశ ద్రోహం నేరం మోపి జైలులో పెట్టిన బంగ్లా మధ్యంతర ప్రభుత్వం తాజాగా ఆయన శిష్యులిద్దరినీ అరెస్ట్ చేసింది. ఇస్కాన్ కార్యాలయంపై శనివారం గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. చిట్టోగ్రామ్‌లోని జైలులో ఉన్న చిన్మయ్ దాస్‌కు గురువారం ఆహారం ఇచ్చేందుకు వెళ్లిన ఆయన శిష్యులు రుద్రకోటి కేశబ్ దాస్, రంగనాథ్ శ్యామ సుందర్ దాస్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కుండలినీ ధామ్ మఠానికి చెందిన ప్రొఫెసర్ కుశాల్ బరుణ్ చక్రవర్తి తెలిపారు. ఈ విషయాన్ని కోల్‌కతా ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధారాం దాస్ 'ఎక్స్'లో వెల్లడించారు. ముందుగా ఎటువంటి హెచ్చరికలు లేకుండానే వీరిని నిర్బంధంలోకి తీసుకున్నారని వివరించారు. అదేవిధంగా, ఢాకాలోని కిశోర్‌గంజ్ జిల్లా భైరబ్‌లో ఉన్న ఇస్కాన్ కార్యాలయంపై దుండుగులు దాడి చేసిన దృశ్యాలను కూడా ఆయన పోస్ట్ చేశారు.

బంగ్లాదేశీయులకు ఆస్పత్రుల్లో నో ఎంట్రీ

కోల్‌కతా/అగర్తలా: బంగ్లాదేశీయులకు తాము వైద్యం చేయబోమని కోల్‌కతాలోని జేఎన్ రే హాస్పిటల్, త్రిపుర రాజధాని అగర్తలాలో ఉన్న ఐఎల్ఎస్ ఆస్పత్రి ప్రకటించాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, భారత జాతీయ పతాకాన్ని అవమానించిన ఘటనలకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. తదుపరి నిర్ణయం ప్రకటించే వరకు బంగ్లాదేశ్ పౌరులను చేర్చుకోబోమని శుక్రవారం స్పష్టం చేశాయి.


అఘాయిత్యాలను అడ్డుకోండి: ఆర్ఎస్ఎస్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులపై దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడి మధ్యంతర ప్రభుత్వాన్ని కోరింది. అదేవిధంగా, హిందూ మత పెద్ద చిన్మయ్ కృష్ణ దాస్‌ను తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలంది. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబళె శనివారం ఈ మేరకు ఒక ప్రకటన చేశారు.

సీఎం పదవి బీజేపీకే

- షిండే సేన, ఎన్సీపీలకు డిప్యూటీలు
- ఎన్సీపీ అధినేత అజిత్ స్పష్టీకరణ
- వీడుతున్న 'మహా' పీటముడి
- ఫడ్నవీస్ హ్యాట్రిక్‌కు లైన్ క్లియర్!
- 5న ప్రమాణస్వీకారం: బావంకులే

ముంబై/పుణే: మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమిలో సీఎం పదవిపై పడ్డ పీటముడి క్రమంగా వీడుతోంది. వారం రోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడ్డట్టే కన్పిస్తోంది. ముఖ్యమంత్రిగా తననే కొనసాగించాలని పట్టుబడుతూ వచ్చిన శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే ఎట్టకేలకు అలకపాన్పు వీడి డిప్యూటీ సీఎం పదవికి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. కూటమి భాగస్వామి అయిన ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ తాజా వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. సీఎం పదవి బీజేపీదేనని ఆయన శనివారం తేల్చేశారు. శివసేన, ఎన్సీపీ నుంచి చెరో ఉప ముఖ్యమంత్రి ఉంటారన్నారు. ఇటీవల ఢిల్లీలో బీజేపీ అధిష్టానం సమక్షంలో జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఏ పార్టీకి ఎన్ని మంత్రి పదవులన్నది త్వరలో తేలుతుందన్నారు. డిసెంబర్ 5న కొత్త సర్కారు కొలువుదీరే అవకాశముందని ఆయన వివరించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమవుతోందన్న విపక్షాల విమర్శలను అజిత్ కొట్టిపారేశారు. ''మహారాష్ట్రలో ఇలా జరగడం కొత్త కాదు, అనూహ్యమూ కాదు. 1999లో ప్రభుత్వ ఏర్పాటుకు ఏకంగా నెల రోజులు పట్టింది'' అని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకార తేదీని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బావంకులే కూడా ధ్రువీకరించారు. 5న సాయంత్రం ఐదింటికి సౌత్ ముంబైలోని ఆజాద్ మైదాన్లో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో కార్యక్రమం జరుగుతుందంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ దిగ్గజం దేవేంద్ర ఫడ్నవీస్ సీఎం కావడం లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన గతంలో రెండుసార్లు సీఎంగా చేయడం తెలిసిందే. మహాయుతి సర్కారులో ఫడ్నవీస్, అజిత్ పవార్ ఇద్దరూ ఉప ముఖ్యమంత్రులుగా కొనసాగిన విషయం తెలిసిందే. నవంబర్ 23న వచ్చిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడం తెలిసిందే. 288 స్థానాలకు గాను మహాయుతికి ఏకంగా 233 వచ్చాయి. బీజేపీ 132, శివసేన 57, ఎన్సీపీ 41 స్థానాలు నెగ్గాయి. అయితే సీఎం ఎవరు కావాలన్న దానిపై అప్పటి నుంచీ ప్రతిష్టంభన నెలకొంది. సీఎం అభ్యర్థి, ప్రభుత్వ కూర్పు తదితరాలపై మంగళవారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా సమక్షంలో ఫడ్నవీస్, షిండే, పవార్ చర్చలు జరిపారు. అంతకుముందు షిండే మీడియాతో మాట్లాడుతూ సీఎంగా ఎవరుండాలన్న దానిపై నిర్ణయాధికారాన్ని బీజేపీకే వదిలేసినట్టు చెప్పడం తెలిసిందే. కానీ ఢిల్లీ భేటీ అనంతరం ముంబై రావాల్సిన ఆయన నేరుగా సతారా జిల్లాలోని తన స్వగ్రామానికి వెళ్లిపోవడం, శుక్రవారం ముంబైలో జరగాల్సిన మహాయుతి భేటీ రద్దవడం అనుమానాలకు తావిచ్చింది. షిండే అలకపాన్పు ఎక్కినట్టు వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాణస్వీకారం తదితరాలపై అటు అజిత్, ఇటు బావంకులే నుంచి తాజాగా స్పష్టత రావడంతో ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయినట్టేనని భావిస్తున్నారు. మహాయుతి భేటీ ఆదివారం జరుగుతుందని తాజా సమాచారం.



అజిత్ పవార్

సేనలో అసంతృప్తి!

తాజా పరిణామాలపై శివసేన నేతలు అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. రెండేళ్లకు పైగా సీఎంగా చేసిన షిండేకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడమంటే స్థాయిని తగ్గించడమేనని వారంటున్నారు. షిండేను పక్కన పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన సన్నిహితుడు, పార్టీ సీనియర్ నేత సంజయ్ సిర్సత్ ఆరోపించారు. తమకు హోం శాఖ ఇచ్చి తీరాలని శనివారం పీటీఐతో మాట్లాడుతూ ఆయనన్నారు. షిండే దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతూ స్వగ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్నారని ఆయన సన్నిహిత వర్గాలు స్పష్టతనిచ్చాయి. మహాయుతి కూటమి సాధించిన అనూహ్య, అసహజ విజయమే ప్రభుత్వ ఏర్పాటులో ఆలస్యానికి దారి తీస్తోందని శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. కూటమిలో కీచులాటలతో విసిగే షిండే సొంతూరి బాట పట్టారని ఎద్దేవా చేశారు. ''2019లో ఎంవీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా అడ్డుకునేందుకు మోదీ రాష్ట్రపతి పాలన విధించారు. ఈసారి ఫలితాలు వెల్లడైన వారం దాటినా ఏ పార్టీ కూడా ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. అయినా రాష్ట్రపతి పాలన ఊసే లేదు'' అంటూ దుయ్యబట్టారు.

'మహా' ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్ ఆరోపణలు

పుణె: ఇటీవల ముగిసిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమరంలో గతంలో ఎన్నడూలేనంతటి స్థాయిలో అధికార, నగదు దుర్వినియోగ పర్వం ఆవిష్కృతమయిందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ–ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ ఆరోపించారు. ఇంతటి దుర్వినియోగం గతంలో ఏ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనూ జరగలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఈవీఎంల దుర్వినియోగం జరిగిందంటూ కురువృద్ధుడు, 95 ఏళ్ల సామాజిక కార్యకర్త డాక్టర్ బాబా అధవ్ చేపట్టిన నిరసన కార్యక్రమ వేదికను సందర్శించి మద్దతు ప్రకటించిన సందర్భంగా శనివారం శరద్ పవార్ మాట్లాడారు. సంఘ సంస్కర్త జ్యోతిరావ్ పూలే నివాసమైన పూలేవాడలో అధవ్ ఈ నిరసన దీక్ష చేపట్టారు. ''స్థానిక ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, నగదు పంపిణీ చూస్తుంటాం. కానీ ఈసారి శాసన సభ ఎన్నికల్లో జరిగిన దుర్వినియోగం మరే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కనిపించలేదు. ఇవి చూసి ప్రజల్లో అసహనం పెరిగిపోయింది. అందుకే ఇలా బాబా అధవ్ మాదిరిగా జనం నిరసనలకు దిగారు. సామాజిక సిద్ధాంతకర్త జయప్రకాశ్ నారాయణ్ గతంలో పిలుపు ఇచ్చినట్లు ప్రజలంతా నేడు ఐక్యంగా పోరాడాలి. సామాజిక ఉద్యమం ఉధృతంగా కొనసాగించాల్సిన తరుణమిది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య పునాదులను పెకలించివేస్తున్న పెడపోకడలను అడ్డుకుందాం'' అని అన్నారు.

ఈవీఎంలపై దేశమంతటా చర్చ

''దేశంలో ఈవీఎంల దుర్వినియోగంపై చర్చ జరుగుతోంది. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో విపక్షాలు ప్రస్తావించాలనుకున్న ప్రతిసారీ ప్రభుత్వం వీళ్లకు మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదు. పార్లమెంట్ ఉభయసభలు వారంలో ఆరు రోజులు జరిగితే కనీసం ఒక్కరోజు కూడా విపక్షనేతలకు మాట్లాడే అవకాశం దక్కట్లేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై మోదీ సర్కార్ ఎలా దాడిచేస్తోందో ఇక్కడే తెలుస్తోంది. ఈవీఎంలలో అదనంగా ఓట్లను ఎలా జతచేస్తారో కొందరు నాకు ఒక ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. కానీ వీటిని నిరూపించే బలమైన సాక్ష్యాలు మన దగ్గర లేవు. అయితే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను చూశాక వీటిని నమ్మక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఓడిన నేతల్లో ఏకంగా 22 మంది రీకౌంటింగ్ అడుగుతున్నారంటే ఈవీఎంలలో ఏదో తప్పు జరుగుతోందని అర్థమవుతోంది. బాలాసాహెబ్ థోరట్‌లాంటి కాంగ్రెస్ నేతలు ఆరోపించినట్లుగా చివరి రెండు గంటల్లో ఏకంగా 7 శాతం పోలింగ్ జరిగిందంటే నమ్మశక్యంగా లేదు. థోరట్ ఒక్కరే కాదు చాలా మంది ఇలాంటి ఎన్నో ఉదాహరణలను చూపిస్తున్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఒక సమావేశాన్ని సైతం ఏర్పాటుచేసింది. దీనిపై విపక్షాల ఇండియా కూటమి ఒక ఉమ్మడి నిర్ణయం తీసుకోవడంపై చర్చ జరిగింది. సోమవారం దీనిపై కొన్ని ఉమ్మడి నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. దాదాపు 15 శాతం ఓట్లను ముందే ఈవీఎంలలో సెట్ చేసి ఉంచుతారని కొందరు చెబితే నేను నమ్మలేదు. కానీ తాజా ఫలితాలను చూశాక ఈ ఆరోపణల్లో ఎంతోకొంత నిజం ఉందని గత ఐదు రోజులుగా నాక్కూడా అనిపిస్తోంది'' అని శరద్‌పవార్ అన్నారు.



శనివారం అధవ్ దీక్షా వేదిక వద్ద మాట్లాడుతున్న శరద్ పవార్

వీవీప్యాట్‌లను లెక్కించాలి: ఉద్ధవ్‌ఠాక్రే

అధవ్‌కు మంచినీళ్లు ఇచ్చి దీక్షను విరమింపజేసిన సందర్భంగా శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడారు. ''బూత్‌లో ఓటు పోలయిందని అందరికీ తెలుసు. కానీ ఈవీఎంలో ఏ పార్టీ తరఫున అది రిజిస్టర్ అయిందో ఎలా తెలియాలి?. అందుకే ఎన్నికల్లో అన్ని వీవీప్యాట్ రశీదులను లెక్కించాల్సిందే. పోలింగ్ రోజు చివరి గంటలో ఏకంగా 76 లక్షల ఓట్లు పోలయ్యాయని చెబుతున్నారు. ఈ లెక్కన ప్రతి పోలింగ్‌కేంద్రంలో ఆఖర్లో ఏకంగా వేయి మంది ఓటేశారని అర్థం. మరి చివరిగంటలో ప్రతిపోలింగ్‌కేంద్రం బయట అంతమంది క్యూ వరసల్లో లేరు'' అని ఉద్ధవ్ అన్నారు.

ప్రతి దాడీ బలోపేతం చేస్తుంది

- అమెరికా అభియోగాలపై అదానీ
- చట్టాలను ఉల్లంఘించినట్టు చెప్పలేదు
- మీడియాలో విద్వేషపూరిత కథనాలు
- సవాళ్లు తమకు కొత్తేమీ కాదని వ్యాఖ్యలు



జైపూర్: అదానీ గ్రూప్‌పై ఇటీవల అమెరికాలో దాఖలైన అభియోగాలపై సంస్థ చైర్మన్ గౌతమ్ అదానీ తొలిసారి బహిరంగంగా స్పందించారు. చట్టాలు, నిబంధనల అమలుకు తమ గ్రూప్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రతి దాడీ తమను మరింత బలోపేతమే చేస్తుందన్నారు. ఆయన శనివారం ఇక్కడ 51వ జెమ్స్, జువెల్లరీ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ''నిబంధనల అమలుకు సంబంధించి ఇటీవలే అమెరికా నుంచి కొన్ని ఆరోపణలు ఎదుర్కొన్నాం. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడం మాకిది మొదటిసారేమీ కాదు. ప్రతి దాడీ మమ్మల్ని మరింత బలోపేతమే చేస్తుంది'' అని పేర్కొన్నారు. ''ఈ అంశానికి సంబంధించి మీడియాలో మాపై పుంఖానుపుంఖాలుగా వివక్ష, విద్వేషపూరిత కథనాలు వచ్చాయి. ఇంతా చేస్తే మా సంస్థకు సంబంధించిన వారెవరిపైనా అమెరికాలో ఎఫ్‌సీపీఏ చట్టాలను ఉల్లంఘించినట్టు గానీ, న్యాయ ప్రక్రియను అడ్డుకోజూసినట్టు గానీ ఒక్క అభియోగమూ నమోదు కాలేదు'' అని అదానీ గుర్తు చేశారు. నియంత్రణ సంస్థల నియమ నిబంధనలన్నింటికీ కట్టుబడి ఉండటంలో తమ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటిస్తుందన్నారు. ''నేటి సమాజంలో వాస్తవాల కంటే పుకార్లే వేగంగా వ్యాపిస్తాయి. ఇన్నేళ్లలో అదానీ గ్రూప్ పెను సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎన్నో రంగాల్లో మార్గదర్శకంగా నిలిచినందుకు మేం చెల్లించిన మూల్యమది. ఆ సవాళ్లే మమ్మల్ని తీర్చిదిద్దాయి. వాటన్నింటినీ ఎప్పటికప్పుడు అధిగమిస్తూనే వస్తున్నాం. సవాళ్లను తట్టుకుని నిలుస్తూ కొత్త దారి వెదుక్కుంటూ ధైర్యంగా సాగడమే మాకు తెలుసు'' అని అదానీ చెప్పుకొచ్చారు.

హిండెన్‌బర్గ్‌పై చట్టపరంగా చర్యలు

తమ గ్రూప్‌పై గతేడాది హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను కూడా అదానీ తోసిపుచ్చారు. ఆ సంస్థపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. ''మాపై హిండెన్‌బర్గ్ చేసింది ఆరోపణలు నిజానికి మా ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బ తీయడంతో పాటు సంస్థను రాజకీయ వివాదంలోకి కూడా లాగేందుకు చేసిన భారీ కుట్ర. ఆ ఆరోపణలను ఒక వర్గం మీడియా తమ స్వార్థ ప్రయోజనాల కోసం విపరీతంగా ప్రచారం చేసింది. అంతటి సంక్షోభంలో కూడా మేం విలువలతో ఎక్కడా రాజీ పడలేదు. అదే ఏడాది సంస్థను ఆర్థికంగా సమున్నత శిఖరాలకు చేర్చి తలెత్తుకు నిలిచాం. మేం ఎలాంటి అవకతవకలకూ పాల్పడలేదని చివరికి సుప్రీంకోర్టే తేల్చింది'' అని చెప్పారు.

అటు ప్రేమ, ఇటు వివక్ష

- అదానీ, వయనాడ్ బాధితులపై మోదీ ద్వంద్వ వైఖరి
- ప్రధానిపై రాహుల్‌గాంధీ విమర్శలు



కోజికోడ్‌లో సభలో ప్రజలకు రాహుల్ గాంధీ అభివాదం, పక్కన ప్రియాంక

కోజికోడ్(కేరళ): పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ పట్ల అమితమైన ప్రేమ చూపిస్తున్న ప్రధాని మోదీ కేరళలోని వయనాడ్ బాధితుల పట్ల విపక్ష కనబరుస్తున్నారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఘన విజయం తర్వాత కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ తొలిసారిగా సొంత నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా కోజికోడ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆమెతో కలిసి రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు. ''అందర్నీ సమాన దృష్టిలో చూడాలని మన రాజ్యాంగం ప్రబోధిస్తోంది. కానీ మన ప్రధానికి మాత్రం అవేం పట్టవు. అమెరికాలో అదానీపై కేసులు నమోదయ్యాక ఆయనను భారతీయులంతా ఒక నిందితుడిగా చూస్తుంటే ప్రధాని మోదీ మాత్రం ఆయనను ప్రత్యేకంగా చూస్తున్నారు. అమెరికాలో అదానీపై నేరాభియోగాలు నమోదైనా ప్రధాని మోదీ అస్సలు పట్టించుకోరు. ఆయనను నేరస్తుడు అని అమెరికా సంబోధించినా భారత ప్రభుత్వం ఆయనపై ఎలాంటి నేరాభియోగాలు మోపదు. అదానీపై ఇంతటి ప్రేమ ఒలకబోసే ప్రధాని కేరళలో ప్రకృతి విలయంతో సర్వం కోల్పోయిన వయనాడ్ బాధితుల బాధలను చెవికెక్కించుకోరు. అవసరమైన సహాయక సహకారాలు మద్దతు ఇవ్వాలనే ఆలోచన ఆయనకు లేదు. ఇలాంటి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ సమర్థవంతంగా ప్రజల కోసం పోరాడుతోంది. మన మీద నమ్మకంతో, కాపాడుతామన్న విశ్వాసంతో ప్రజలు మన వద్దకు వస్తున్నారు. వయనాడ్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు న్యాయం జరిగేంతవరకు పోరాడతా'' అని అన్నారు. అంతకుముందు రాహుల్ వయనాడ్ మృతులకు నివాళులర్పించారు.

బీజేపీ, ప్రకృతి విపత్తు ఒక్కటే: ప్రియాంక

రాహుల్ తర్వాత ప్రియాంకాగాంధీ ప్రసంగించారు. ''ప్రకృతి విపత్తు, బీజేపీ మధ్య చాలా పోలికలు ఉన్నాయి. రెండింటి శైలి ఒక్కటే. ప్రకృతి విపత్తు ఎలాగైతే తనకు నచ్చినట్లు చేస్తుందో బీజేపీ కూడా ఎలాంటి నియమనిబంధనలు, వివరణలు, ప్రజాస్వామ్యయుతవిధానాలను అవలంబించదు. బీజేపీ నుంచి ఎదుర్కొంటున్న రాజకీయసవాళ్లు అచ్చు కొండచరియలు విరిగిపడటం లాంటిదే. రాజకీయసమరంలో పాటించాల్సిన కనీస ధర్మాలనూ బీజేపీ పాటించదు. రాజ్యాంగబద్ద సంస్థలనూ నాశనంచేస్తోంది. విధ్వంసకర అజెండాకు మాత్రమే బీజేపీ కట్టుబడి ఉంటుంది. వయనాడ్ ప్రజల మనిషిగా పార్లమెంట్‌లో మాట్లాడతా. ఇక్కడి వారి సమస్యలను ప్రస్తావిస్తా. సోదరుడు రాహుల్‌గాంధీపై చూపించిన ప్రేమను నాపైనా చూపించినందుకు మీకు రెండింతల ధన్యవాదాలు. గెలిచి ఇక్కడికొచ్చా. వయనాడ్ ప్రజల ఉజ్వల భవిత కోసం నా శాయశక్తుల కృషిచేస్తా'' అని ప్రియాంక గాంధీ అన్నారు.

అనుమానాలను నివృత్తి చేస్తాం..రండి!

కాంగ్రెస్‌ను 3న ఆహ్వానించిన ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రతీ దశలోనూ పారదర్శకంగా జరిగాయని కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) స్పష్టం చేసింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్, కౌంటింగ్ సమయంలో అవకతవకలు జరిగాయని, ఆధారాలు చూపేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కాంగ్రెస్ రాసిన లేఖకు ఈసీ స్పందించింది. అనుమానాల నివృత్తి కోసం డిసెంబర్ 3న ఢిల్లీలోని తమ కార్యాలయానికి రావాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందాన్ని ఈసీ ఆహ్వానించింది. ఎన్నికల ప్రక్రియ ప్రతి దశలోనూ కాంగ్రెస్‌తోపాటు అన్ని రాజకీయ పార్టీ అభ్యర్థులు/ఏజెంట్ల ప్రమేయం ఉందని వివరించింది. ఓటింగ్ సరళిపై ఎలాంటి అనుమానాలకు అక్కర్లేదని, పోలింగ్ బూత్‌ల వారీగా అభ్యర్థులందరికీ ఆ డేటాను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని నొక్కి చెప్పింది. కాంగ్రెస్ పార్టీకి ఉన్న చట్టపరమైన ఆందోళనలను, అనుమానాలను పరిశీలించి రాతపూర్వకంగా బదులిస్తామని ఈసీ స్పష్టం చేసింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకు మహాయుతి కూటమిలోని బీజేపీ 132, శివసేన (షిండే) 57, ఎన్సీపీ (అజిత్) 41 సీట్లు సాధించగా, మహా వికాస్ అఘాడీ పక్షాలైన కాంగ్రెస్‌కు 16, శివసేన (ఉద్ధవ్)కు 20, ఎన్సీపీ (శరద్) పార్టీకి 10 స్థానాలు దక్కడం తెలిసిందే.



చెన్నైలో ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు

తీరం దాటిన ఫెంగల్

తమిళనాట భారీ వర్షాలు

చెన్నై ఎయిర్‌పోర్టు మూత

సాక్షి, చెన్నై: తమిళనాడును వణికించిన ఫెంగల్ తుపాన్ శనివారం రాత్రి పుదుచ్చేరి సమీపంలో తీరం దాటింది. దాని ప్రభావంతో చెన్నైతోపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా ఉత్తర తమిళనాడులో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. శుక్రవారం రాత్రి నుంచి పుదుచ్చేరి, కడలూరు, విల్లుపురం, కళ్లకురిచ్చి, చెంగల్పట్టు, కాంచీపురం, చెన్నై, తిరువళ్లూరు, వేలూరు, రాణిపేట తదితర జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. శనివారం కూడా బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కొనసాగింది. చెన్నై నగరం, శివార్లలోని అనేక లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. రోడ్లపై వరద నీరు పోటెత్తింది. చెన్నై శివారులోని వేళచ్చేరి, పళ్లికరణైతో పాటు నగరంలోని అనేక ప్రాంతాల్లో జనం తమ వాహనాలను రక్షించుకునేందుకు సమీపంలోని ఫ్లై ఓవర్లపై పార్క్ చేశారు. నగరంలో వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. సముద్ర తీర మార్గాలు, బీచ్‌లను మూసివేశారు. పలు రైళ్లు ఆలస్యమయ్యాయి. ఎలక్ట్రిక్ రైళ్లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఎయిర్‌పోర్టు రన్‌వే పైకి భారీ వరద నీరు చేరింది. విమానాశ్రయాన్ని ఆదివారం ఉదయం దాకా మూసేశారు. 19 విమానాలను బెంగళూరు, హైదరాబాద్‌కు మళ్లించగా, 55 సర్వీసులను రద్దు చేశారు.

మరింత భారీ వర్షాలు!

శనివారం అర్ధరాత్రి నుంచి మరింత భారీ వర్షాలు పడవచ్చని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. సహాయక చర్యలకు విపత్తు నిర్వహణ, పోలీసు, అగ్నిమాపక బృందాలు, ఆర్మీ, నేవీ, సిబ్బందిని రంగంలోకి దించారు.

అదుపుతప్పిన కార్లు.. ఏడుగురు బలి

- ఏపీలో జాతీయ రహదారులపై రెండు వేర్వేరు ప్రమాదాలు
- కార్లు బోల్తాకొట్టడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీ
- విజయనగరం జిల్లాలో నలుగురు, కృష్ణాజిల్లాలో ముగ్గురు దుర్మరణం

భోగాపురం/కంకిపాడు (పెనమలూరు): ఏపీలో రెండు జాతీయ రహదారులపై శనివారం సంభవించిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమా దాల్లో ఏడుగురు మృత్యువాత పడ్డారు. విజయనగరం జిల్లాలో కారు అదుపుతప్పి డివైడర్ దాటి పక్క లేన్‌లోకి బోల్తాకొట్టగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ దానిని ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే బలయ్యారు. అలాగే, కృష్ణాజిల్లా కంకిపాడు వద్ద కూడా ఇదే తరహాలో ప్రమాదం జరగడంతో కారును చేపల లోడు వ్యాన్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలోనూ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మరణించారు.

పోలిపల్లి జాతీయ రహదారిపై కారును ఢీకొన్న లారీ

మామయ్యను తీసుకొచ్చేందుకు బయల్దేరి..

శ్రీకాకుళానికి చెందిన గవిడి కౌశిక్ (27) హైదరాబాద్ నుంచి వస్తున్న తన మామయ్యను విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి తీసుకొచ్చేందుకు డ్రైవర్ జయేష్ (20)తో కలిసి కారులో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం బయల్దేరాడు. కౌశిక్ స్నేహితుడైన శ్రీకాకుళం పట్టణానికి చెందిన వడ్డే అభినవ్ (27) తన భార్య మణిమాల (24)ను ఐబీపీఎస్ పరీక్ష రాసేందుకు అదే కారులో విశాఖపట్నం ప్రయాణమయ్యారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వచ్చే రహదారి పైకి దూసుకెళ్లింది. అదే సమయంలో విశాఖపట్నం నుంచి వస్తున్న లారీ కారును బలంగా ఢీకొట్టడంతో రెప్పపాటులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో గవిడి కౌశిక్, వడ్డే అభినవ్, జయేష్ అక్కడికక్కడే మరణించారు. కొనఊపిరితో ఉన్న మణిమాలను సుందరపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఘటనా స్థలం వద్దే ఆమె ప్రాణం విడిచింది. మృతులందరూ శ్రీకాకుళం పట్టణానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

చేపల లోడ్ వ్యానును ఢీకొన్న కారు..

మరో ఘటనలో విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు ప్రయాణిస్తున్న కారు కంకిపాడు బైపాస్ మార్గంలోకి వెళ్తుండగా అదుపుతప్పి ఒక్కసారిగా డివైడరు పైనుంచి దూసుకుపోయి మచిలీపట్నం నుంచి కంకిపాడు వైపు వస్తున్న చేపల లోడు వ్యాన్‌ను వేగంగా ఢీకొంది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మచిలీపట్నం బలరాంపేట వాసులు చీలి ప్రభు (29), చింతా రవి (38), చీలి భాను (27) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. వ్యాన్‌లో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణను అగ్రస్థానంలో ఉంచుతాం

- టీ కన్సల్ట్స్ ఆధ్వర్యంలో 117 ఒప్పందాలు ఆర్థికాభివృద్ధికి కీలకమైన అడుగు: మంత్రి శ్రీధర్‌బాబు
- 'టీహబ్'లో టీకన్సల్ట్స్ ఆధ్వర్యంలో కొలాబరేషన్ కాన్‌క్లేవ్–2024 కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో 'టీకన్సల్ట్స్' సంస్థ ఆధ్వర్యంలో కొలాబరేషన్ కాన్‌క్లేవ్–2024ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆవిష్కర్తలు, పెట్టుబడిదారుల మధ్య వంతెనలను నిర్మించడంలో టీకన్సల్ట్స్ ఒక బెంచ్‌మార్క్‌ను సెట్ చేసిందని ఆయన గుర్తు చేశారు. టీహబ్‌లో ఒకరోజు, ఒకే వేదికపై 117 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడంతో ఆర్థిక ప్రగతికి సంబంధించి ముఖ్యమైన అడుగు పడిందన్నారు. టీకన్సల్ట్స్, దాని వ్యవస్థాపకుడు సందీప్‌కుమార్ మక్తాల నిబద్ధతను ఆయన కొనియాడారు. రాష్ట్రం మరింతగా అభివృద్ధి పథంలో దూసుకెళ్లే క్రమంలో టీకన్సల్ట్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా మారుతున్నాయన్నారు. సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ ఈ కాన్‌క్లేవ్‌లో 117 ఒప్పందాలు కుదరడం అనేది సహకారం ద్వారా ఎన్ని గొప్ప అవకాశాలు వస్తాయో నిరూపిస్తోందన్నారు. ఈ సమావేశంలో అన్‌టాప్డ్ ఇన్వెస్టర్ ప్రోగ్రాం, టీకన్సల్ట్ హెల్త్ డాక్టర్స్ పూల్, టాలెంట్ కనెక్ట్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. పలు సంస్థలు, బీఐసీసీఐ సంస్థ, టీకన్సల్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాన్‌క్లేవ్–2024ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు

రిజర్వేషన్లు లేక బీసీలకు తీవ్ర అన్యాయం: జాజుల

ఖైరతాబాద్ (హైదరాబాద్): పదోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా మనం హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పీఎం కార్యాలయం నుంచి సీఎం కార్యాలయం వరకు బీసీలకు ఎక్కడా స్థానమే లేదు. 60 శాతం జనాభా ఉన్నా మనకు అనుకూలంగా జీవోలు, పాలసీలు రావు... మనం ఎక్కడ ఉన్నామో బీసీలు అర్థం చేసుకోవాలన్నారు. బీసీ ఉద్యోగుల వెంట బీసీ సంఘం ఉందని, ఏ సమస్యలు ఎదురైనా పోరాడుతుందని హామీ ఇచ్చారు. ఎవరికీ లేని క్రీమీ లేయర్ కేవలం బీసీలకే ఎందుకుని జాజుల ప్రశ్నించారు. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై పునఃసమీక్షించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ పోటీలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి టీంకు గోల్డ్ మెడల్

సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖ, పారా మిలటరీ బలగాల కోసం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీలలో మల్టీ జోన్–1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి నాయకత్వంలోని బృందం బంగారు పతకం గెలుచుకుంది. ఈ పోటీలు నవంబర్ 26 నుంచి శనివారం వరకు బెంగళూరులో జరిగాయి. ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ (నారాయణపేట ఏఆర్) జోడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డీఎస్పీలు రామ్ కుమార్, సత్యనారాయణ జట్టుపై 9–6 స్కోర్‌తో విజయం సాధించింది.

'ఫైజల్'తో విమానాల రద్దు.. మళ్లింపు

శంషాబాద్ (హైదరాబాద్): తమిళనాడులో ఫైజల్ తుపాను ప్రభావంతో చెన్నై ఎయిర్‌పోర్టులో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో శంషాబాద్ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే విమానాలను పెద్దఎత్తున రద్దు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి చెన్నై వెళ్లాల్సిన ఐదు విమానాలతో పాటు.. అక్కడి నుంచి రావల్సిన మూడు విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతి వెళ్లాల్సిన ఏడు విమానాలతో పాటు.. అక్కడి నుంచి రావలసిన ఏడు విమానాలు కూడా పూర్తిగా రద్దయినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటు ఢిల్లీ నుంచి చెన్నైకి బయల్దేరిన ఎయిర్ ఇండియా –429 విమానాన్ని.. అక్కడి ప్రతికూల వాతావరణంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. ఇందులో 147 మంది ప్రయాణికులున్నారు. ముంబై ఎయిర్‌పోర్టు నుంచి చెన్నై బయల్దేరిన ఇండిగో ఎయిర్‌లైన్స్‌కి చెందిన 683 విమానాన్ని కూడా.. ప్రతికూల వాతావరణం వల్ల శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. ఇందులో 200 మంది ప్రయాణికులున్నారు

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

ఫారం–VI(A)

(కేంద్ర చట్టం 30/2013 యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 సబ్ రూలు (1)ను అనుసరించి)

ప్రాథమిక ప్రకటన

నెం.E/421/2024-1, గెజిట్ నెం.4 — తేది:20-11-2024, తేది:23-11-2024

[illegible] ... 17115.96 ... ఎన్.హెచ్–44 ... [illegible]

[illegible] ... 17115.96 ... [illegible]

ప్రాథమిక ప్రకటన కోసం ఆస్తికి సంబంధించిన షెడ్యూలు

జిల్లా : హైదరాబాద్ — మండలము : సికింద్రాబాద్ — గ్రామం : బోలక్‌పూర్

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	[illegible]	[illegible]	[illegible]	294.81	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	[illegible]	294.81

మొత్తం 294.81

జిల్లా : హైదరాబాద్ — మండలము : తిరుమలగిరి — గ్రామం : తోకట్ట

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
[illegible]													

మొత్తం 16821.15

[illegible] ... 2013 ... సెక్షన్ 11(1) ... నెం.30/2013 ... [illegible]

[illegible]

[illegible] ... ఎన్.హెచ్–44 ... 11583/... 1(2)/2024 ... తేది (1) 24.9.2024 ... 2013 ... RFCTLARR ... (1) 21/2017 ... [illegible]

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, [illegible], హైదరాబాద్.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), హైదరాబాద్.
సం/- జిల్లా కలెక్టర్, హైదరాబాద్ జిల్లా.

ఫారం–VI(A)

(కేంద్ర చట్టం 30/2013 యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 సబ్ రూలు (1)ను అనుసరించి)

ప్రాథమిక ప్రకటన

నెం.E/121/2024-2, గెజిట్ నెం.5 — తేది:20-11-2024, తేది:23-11-2024

[illegible] ... 7180.78 ... ఎన్.హెచ్–44 ... [illegible]

[illegible] ... 7180.78 ... [illegible]

ప్రాథమిక ప్రకటన కోసం ఆస్తికి సంబంధించిన షెడ్యూలు

జిల్లా : హైదరాబాద్ — మండలము : తిరుమలగిరి — గ్రామం : తోకట్ట

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	261	[illegible]	[illegible]	7180.78	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	[illegible]	10.78
[illegible]													

మొత్తం 7180.78

[illegible] ... 2013 ... సెక్షన్ 11(1) ... నెం.30/2013 ... [illegible]

[illegible] ... ఎన్.హెచ్–44 ... 1(2)/2024 ... 24.9.2024 ... 2013 ... RFCTLARR ... [illegible]

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, [illegible], హైదరాబాద్.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), హైదరాబాద్.
సం/- జిల్లా కలెక్టర్, హైదరాబాద్ జిల్లా.

యూజీసీ గుర్తింపుకోసం మహిళా వర్సిటీ విద్యార్థినుల ఆందోళన


మహిళా యూనివర్సిటీలో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ విద్యార్థినులు యూజీసీ గుర్తింపుకోసం ఆందోళనబాట పట్టారు. శనివారం యూజీ, పీజీ విద్యార్థినులు పెద్ద ఎత్తున యూనివర్సిటీలో ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ యూనివర్సిటీకి యూజీసీ గుర్తింపు వచ్చేలా ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. వందల సంఖ్యలో విద్యార్థినులు క్యాంపస్ ఆవరణలో బైఠాయించడంతో అక్కడ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఈ సమాచారం తెలుసుకున్న సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ పోలీసు బలగాలతో అక్కడికి చేరుకున్నారు. విద్యార్థినులు రోడ్డుపైకి రాకుండా గేట్లు మూసివేయడంతో ఆగ్రహించిన వారు పెద్దపెట్టున నినాదాలు చేశారు. మూడు గంటల పాటు ఈ ఆందోళన కొనసాగింది. తమ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రం చేస్తామని వారు హెచ్చరించారు. మహిళా కళాశాలగా ఉన్న ఈ విద్యాసంస్థను గత ప్రభుత్వం మహిళా యూనివర్సిటీగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ విద్యాసంస్థకు చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మార్చినప్పటికీ ఇంతవరకు యూజీసీ గుర్తింపు రాలేదని విద్యార్థినులు చెపుతున్నారు. తమ డిగ్రీ కోర్సు పూర్తి కావస్తోందని, అయితే ఇంతవరకు యూజీసీ గుర్తింపు రాకపోవడంతో ఏ ప్రాతిపదికన సర్టిఫికెట్లు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

(...7వ పేజీ తరువాయి)

ఫారం-VI(A)

కేంద్ర చట్టం 30/2013 యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 సబ్ రూలు (1) ను అనుసరించి

ప్రాథమిక ప్రకటన

సం.డి/424/2024-3, తేది:20-11-2024
గెజిట్ నెం.6 తేది:23-11-2024

[illegible] 11472.00 [illegible]

[illegible] 11472.00 [illegible]

ప్రాథమిక ప్రకటన కోసం ఆస్తికి సంబంధించిన షెడ్యూలు

జిల్లా : హైదరాబాద్ మండలము : తిరుమలగిరి గ్రామం : తోకట్ట

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

మొత్తం 11472.00

[illegible]

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, సప్తం భూ పరిపాలన భూ సేకరణ అధికారి, హైదరాబాద్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), హైదరాబాద్
సం/- జిల్లా కలెక్టర్, హైదరాబాద్ జిల్లా

ఫారం-VI(A)

కేంద్ర చట్టం 30/2013 యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 సబ్ రూలు (1) ను అనుసరించి

ప్రాథమిక ప్రకటన

సం.డి/424/2024-4, తేది:20-11-2024
గెజిట్ నెం.7 తేది:23-11-2024

[illegible]

ప్రాథమిక ప్రకటన కోసం ఆస్తికి సంబంధించిన షెడ్యూలు

జిల్లా : హైదరాబాద్ మండలము : తిరుమలగిరి గ్రామం : [illegible]

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
[illegible]	[illegible]	[illegible]	[illegible]	2146.64	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

మొత్తం 2146.64

జిల్లా : హైదరాబాద్ మండలము : తిరుమలగిరి గ్రామం : [illegible]

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

మొత్తం : 7816.60

[illegible]

ఫారం-VI(A)

కేంద్ర చట్టం 30/2013 యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 సబ్ రూలు (1) ను అనుసరించి

ప్రాథమిక ప్రకటన

సం.డి/424/2024-5, తేది:20-11-2024
గెజిట్ నెం.8 తేది:23-11-2024

[illegible] 7961.79 [illegible]

[illegible] 7961.79 [illegible]

ప్రాథమిక ప్రకటన కోసం ఆస్తికి సంబంధించిన షెడ్యూలు

జిల్లా : హైదరాబాద్ మండలము : తిరుమలగిరి గ్రామం : తోకట్ట

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

మొత్తం 7961.79

[illegible] RFCTLARR [illegible]

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, సప్తం భూ పరిపాలన భూ సేకరణ అధికారి, హైదరాబాద్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), హైదరాబాద్
సం/- జిల్లా కలెక్టర్, హైదరాబాద్ జిల్లా

ఫారం-VI(A)

కేంద్ర చట్టం 30/2013 యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 సబ్ రూలు (1) ను అనుసరించి

ప్రాథమిక ప్రకటన

సం.డి/424/2024-6, తేది:20-11-2024
గెజిట్ నెం.9 తేది:23-11-2024

[illegible] 8459.30 [illegible]

[illegible] 8459.30 [illegible]

ప్రాథమిక ప్రకటన కోసం ఆస్తికి సంబంధించిన షెడ్యూలు

జిల్లా : హైదరాబాద్ మండలము : తిరుమలగిరి గ్రామం : తోకట్ట

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

మొత్తం 8459.30

[illegible] RFCTLARR [illegible]

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, సప్తం భూ పరిపాలన భూ సేకరణ అధికారి, హైదరాబాద్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), హైదరాబాద్
సం/- జిల్లా కలెక్టర్, హైదరాబాద్ జిల్లా

DIPR RO No. 394/LA/PF-Agency/Advt-1/2024-25



భార్యాభర్తల డ్రగ్స్ దందా

అసోం నుంచి మాదక ద్రవ్యంతో నగరానికి వచ్చి, విక్రయానికి ప్రయత్నించిన భార్యా భర్తల్ని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.
-10లో



టాప్ పోస్ట్.. సిటీ హోస్ట్!

మన భాగ్య నగరం సివిల్స్ కోచింగ్‌కు హబ్‌గా మారిపోయింది. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారు అశోక్ నగర్‌కు క్యూ కడుతున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
30.0/21.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన ఫ్యాషన్ షోలో మోడళ్లు తళుక్కుమన్నారు. వివిధ రకాల థీమ్స్ వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్‌తో సందడి చేశారు. పలువురు సినీ తారలు అందచందాలతో ఆకట్టుకున్నారు.

మురిపించిన ముద్దుగుమ్మలు!



గ్రేటర్‌లో 10.52 లక్షలకు చేరుకున్న గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య

- మార్చి నెలతో పోలిస్తే.. నవంబర్‌లో 20.71% పెరుగుదల
- డిసెంబర్‌లో మరింత పెరిగే అవకాశం
- చలి తీవ్రతతో తగ్గుతున్న విద్యుత్ వినియోగం
- ఎక్కువ మంది 150 యూనిట్లలోపే వాడకం

గ్రేటర్‌లో గృహజ్యోతి లబ్ధిదారులు ఇలా..

సర్కిల్	మార్చి	నవంబర్	పెరుగుదల (శాతం)
బంజారాహిల్స్	31,574	36,657	16.10
సైబర్‌సిటీ	63,298	73,502	16.12
హబ్సిగూడ	1,12,759	1,28,680	14.12
హైదరాబాద్ సెంట్రల్	56,636	68,010	20.08
హైదరాబాద్ సౌత్	63,895	98,441	54.07
మేడ్చల్	1,06,133	1,15,982	9.28
రాజేంద్రనగర్	1,01,487	1,33,013	31.06
సంగారెడ్డి	1,80,540	2,13,016	17.19
సరూర్‌నగర్	93,100	1,14,410	22.89
సికింద్రాబాద్	62,419	70,721	13.30

సాక్షి, సిటీబ్యూరో: గృహజ్యోతి పథకం లబ్ధిదారుల సంఖ్య గ్రేటర్‌లో రోజురోజుకూ పెరుగుతోంది. 200 యూనిట్లలోపు వినియోగించే గృహాలకు ఈ పథకం కింద ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో లబ్ధిదారుల సంఖ్య 8,71,841 ఉండగా, నవంబర్ నాటికి 10,52,432కు చేరింది. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రభుత్వం గత మార్చి నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే.

చలిగాలులు వీస్తుండటంతో..

గృహజ్యోతి పథకానికి గ్రేటర్‌లో 21 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు పదిన్నర లక్షల మందికిపైగా అర్హత సాధించారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉత్తరాది నుంచి చలి గాలులు వీస్తుండటంతో ఇప్పటికే ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు ఆఫ్ చేశారు. ఫలితంగా నిన్నా మొన్నటి వరకు నెలకు సగటున 200 యూనిట్లకుపైగా విద్యుత్ వినియోగించిన వారు.. ప్రస్తుతం 150 యూనిట్ల లోపే వాడుతున్నారు. ఫలితంగా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఈ లబ్ధిదారుల సంఖ్య మరింత పెరగనున్నట్లు డిస్కం అంచనా వేస్తోంది.

9 నెలల్లో కోటికి చేరిన జీరో బిల్లులు..

గృహజ్యోతి పథకం కింద ఒక్కో వినియోగదారుకు నెలకు సగటున రూ.1,150 నుంచి రూ.1,200 వరకు లబ్ధి చేకూరుతోంది. సర్కిళ్ల వారీగా పరిశీలిస్తే.. లబ్ధిదారుల పెరుగుదల రేటు హైదరాబాద్ సౌత్‌లో అత్యధికంగా 54.07 శాతం నమోదైంది. మేడ్చల్ సర్కిల్‌లో అతి తక్కువగా 9.28 శాతం నమోదైంది. గ్రేటర్ మొత్తంగా పరిశీలిస్తే.. 20.71 శాతం నమోదు కావడం గమనార్హం. గత తొమ్మిది మాసాల కాలంలో ఈ పథకం కింద గ్రేటర్‌లో సుమారు కోటి జీరో బిల్లులు జారీ అయ్యాయి. పథకం అమలుతో ప్రభుత్వంపై నెలకు సగటున రూ.100 కోట్లకుపైగా భారం పడుతోంది.

యువత చేతుల్లో దేశ భవిష్యత్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



కశ్మీర్ యువతతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

ఏజీవర్సిటీ: దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కశ్మీర్ యూత్ ఎక్స్చేంజీ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికసిత్ భారత్‌లో యువత భాగస్వాములు కావాలని, దేశ అభ్యున్నతికి, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా యువత కృషి చేయాలన్నారు. కశ్మీర్ యువత నగరంలో చూసిన విషయాలను తమ కుటుంబీకులు, బంధువులు, స్నేహితులతో పంచుకోవాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం తెలంగాణ డైరెక్టర్ విజయరావు మాట్లాడుతూ.. 6 రోజుల కార్యక్రమంలో కశ్మీర్ యువత ఎన్నో మంచి విషయాలను తెలుసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుష్బూ గుప్తా, ఏపీఎం యాదగిరి, కరీంనగర్ డీవైఓ రాంబాబు, రంగారెడ్డి జిల్లా డీవైఓ ఐనయ్య పాల్గొన్నారు.

గ్రేటర్‌పై ప్రగతి సంతకం!



హై సిటీ పనులకు అంకురార్పణ

- రూ.5,942 కోట్లు ఫ్లై ఓవర్లు, రహదారుల పనులకు శంకుస్థాపనలు
- రూ. 586 కోట్లతో వరద కాల్వలు, చెరువులకు సైతం..
- ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా..

సాక్షి, సిటీబ్యూరో: 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు' పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా జీహెచ్‌ఎంసీకి సంబంధించి రూ.5,942 కోట్ల అంచనా వ్యయంతో పలు ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, రహదారుల పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వీటితో పాటు మరో రూ.586 కోట్లతో వరద కాల్వలు, చెరువులకు సంబంధించిన పనుల శంకుస్థాపనలకు సైతం రెడీ అవుతోంది. వీటన్నింటినీ హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు కింద చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారానికి..

నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు తదితరాలు నిర్మించినా ఇంకా పలు చోట్ల సమస్యలున్నాయి. వానొస్తే నగరంలోని పలు ప్రాంతాలు చెరువులుగా మారుతున్నాయి. ఆ సమస్య పరిష్కారానికి దాదాపు రూ.950 కోట్ల పనులు జరిగినా ఇంకా చేయాల్సిన పనులున్నాయి. వీటన్నింటినీ హై సిటీ కింద చేపట్టేందుకు శంకుస్థాపన చేయనున్నారు. కొన్ని పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసినప్పటికీ, నిధులు విడుదల కాలేదు. వీటిలో కొన్ని గత ప్రభుత్వ హయాంలో మంజూరైనవి ఉన్నాయి. కొన్నింటికి పరిపాలన అనుమతులు జారీ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వాస్తవంగా ఎన్ని పనులకు శంకుస్థాపనలు జరుగుతాయో ఖరారు కావాల్సి ఉంది. ఈనెల 3న ఆయా పనులకు శంకుస్థాపనలు చేసే అవకాశముంది.

ఇవీ పనులు..

పరిపాలన అనుమతులు జారీ అయిన వాటిలో దిగువ పనులు ఇలా ఉన్నాయి.

- రేతిబౌలి, నానల్‌నగర్ జంక్షన్ల వద్ద మల్టీ లెవెల్ ఫ్లై ఓవర్ (రూ.398 కోట్లు).
- ఖాజాగూడ జంక్షన్, ఐఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ (రూ.837కోట్లు).
- కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద 3లేన్ల ఫ్లై ఓవర్లు (రూ.180 కోట్లు).
- ఫాక్స్‌సాగర్ సర్‌ప్లస్ నాలా వద్ద స్టీల్ గర్డర్ బ్రిడ్జి (రూ.56 కోట్లు).

సికింద్రాబాద్ జోన్‌లో ..

రసూల్‌పురా ఫ్లై ఓవర్(రూ.150 కోట్లు), పాటిగడ్డ ఆర్‌ఓబీ (రూ.80 కోట్లు), ఆర్‌కేపురం ఆర్‌ఓబీ (రూ.210 కోట్లు).. ఆర్‌యూబీ (రూ.35 కోట్లు), చిలకలగూడ ఆర్‌యూబీ(రూ.30 కోట్లు), ఏఓసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్లు (రూ.960 కోట్లు).

చార్మినార్ జోన్‌లో..

ప్రస్తుతమున్న ఒవైసీ ఫ్లై ఓవర్‌కు సంతోష్‌నగర్ వైపు డౌన్‌ర్యాంప్, హఫీజ్‌బాబా నగర్ జంక్షన్-బాలాపూర్ చర్చిరోడ్ జంక్షన్ వరకు గ్రేడ్ సెపరేటర్, బండ్లగూడ- ఎర్రకుంట క్రాస్‌రోడ్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ (రూ.339 కోట్లు), మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్‌రోడ్, కాటేదాన్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ పరిష్కారానికి ఫ్లై ఓవర్ (రూ.200 కోట్లు), ఆరాంఘర్ జంక్షన్ వద్ద ఆర్‌యూబీ (రూ.59 కోట్లు). వివిధ ప్రాంతాల్లో రహదారుల విస్తరణలు. పరిపాలన అనుమతులు జారీ కావాల్సిన పనులు కూడా గణనీయంగా ఉన్నాయి.

కేబీఆర్ పార్క్ వద్ద..

కేబీఆర్ పార్క్ చుట్టూ ఆరు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు తదితర పనులకు ప్రభుత్వం ఇప్పటికే రూ.826 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచే వీటిని విడుదల చేసేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఆదేశాల 'లీక్'పై కలెక్టర్ సీరియస్

డిప్యూటీ ఈవో, డీఐఓఎస్‌ల భేటీపై ఆరా

- చర్యలు తీసుకోవాల్సిందేనని హుకుం జారీ

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ కౌన్సెలింగ్ పోస్టింగ్‌ల కేటాయింపు కోసం ఖాళీలు చూపించడంలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ ఈవో, డీఐఓఎస్‌లపై చర్యలు తీసుకోవాలనే ఆదేశాలు లీక్ కావడంపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. మరోవైపు డిప్యూటీ ఈవో, డీఐఓఎస్‌లు విధులకు ఎగనామం పెట్టి మూకుమ్మడిగా ప్రత్యేకంగా సమావేశం కావడాన్ని తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. డీఎస్సీ టీచర్ల పోస్టింగ్‌ల భర్తీకి ఖాళీలు చూపించడంలో నిర్లక్ష్యం వహించిన ఒక డిప్యూటీ ఈఓ, ఆరుగురు డీఐఓఎస్‌లకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ కోరడంతో పాటు జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్‌ఈఎం) విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. దీని ఆధారంగా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత సెక్షన్ నుంచి కలెక్టర్ ఆదేశాలు బహిరంగపర్చడంతో హుటాహుటిన డిప్యూటీ ఈవో, డీఐఓఎస్‌లంతా ఆలియా ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సమావేశమై ఉపద్రవం నుంచి బయటపడే మార్గం కోసం చర్చించారు. సమావేశానికి అన్ని ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయుల సంఘాల మద్దతు కూడగట్టుకునేందుకు ఆహ్వానించగా.. కేవలం రెండు సంఘాలు మాత్రమే హాజరయ్యాయి. మిగతా సంఘాలు దూరం పాటించాయి. అధికార పార్టీకి అనుబంధమున్న ఒక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర స్థాయి బాధ్యుడి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి చర్యలు తీసుకోకుండా ఒత్తిడి తేవాలని, అవసరమైతే మూకుమ్మడిగా అదనపు బాధ్యతలతో విధులు నిర్వర్తించలేమన్న అల్టీమేటం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

అందుబాటులో లేని కలెక్టర్

అధికార పార్టీకి అనుబంధమున్న ఉపాధ్యాయ సంఘం బాధ్యుడి ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ ఈవో, డీఐఓఎస్‌లంతా కలిసి కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలిసేందుకు వీలులేకుండా పోయింది. అవసరమైతే జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకొద్దామని సదరు బాధ్యుడు వారికి భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఆమోద ముద్ర పడలేదు!

బల్దియా బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ నో

- ముసాయిదా వాస్తవ విరుద్ధంగా ఉందన్న సభ్యులు
- మార్పుచేర్పుల కోసం సమావేశం వాయిదా



సాక్షి, సిటీబ్యూరో: వచ్చే ఆర్థిక సంవత్సర (2025-26) ముసాయిదా బడ్జెట్‌ను శనివారం జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశం ఆమోదించ లేదు. బడ్జెట్ తప్పుల తడకగా ఉందని, వాస్తవాలకు.. అంకెలకు పొంతన లేదని పలువురు సభ్యులు బడ్జెట్ రూపకల్పనను తప్పుబట్టారు. సమావేశానికి ముందురోజు రాత్రి బడ్జెట్ కాపీలు ఇస్తే ఎప్పుడు చదివి.. అర్థం చేసుకొని, సమావేశంలో చర్చించాలని కొందరు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతులు సైతం ఒక్కోసారి ఒక్కో పేజీ పంపించారన్నారు. అడ్వర్టయిజ్‌మెంట్, ఎస్టేట్స్ విభాగాల ద్వారా రావాల్సిన ఆదాయాన్ని చాలా తక్కువగా చూపించారని కొందరు ఆక్షేపించారు. రూ.8,340 కోట్ల బడ్జెట్‌లో వాస్తవంగా వచ్చేవి ఎన్ని? రాని నిధులతో బడ్జెట్ ఎందుకని కొందరు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్స్‌గా పేర్కొన్న రూ.3,800 కోట్లు ఇస్తుందా? అని ఇంకొందరు ప్రశ్నించారు.

ఆక్షేపణలు.. అసంతృప్తులు

ఇంకుడుగుంతల నిర్మాణానికి, వన మహోత్సవాలకు భారీగా నిధులు కేటాయిస్తున్నా ఆ పనులు ఎక్కడ చేస్తున్నారో తమకు తెలియడం లేదని కొందరు తప్పుబట్టారు. హార్వెస్టింగ్ పిట్స్‌కు భారీగా ఖర్చు చేస్తుండటం తమకు తెలియదని, తమ ప్రాంతంలో కూడా ప్రతిపాదనలు ఇచ్చేవాళ్లం కదా అని గత ఖర్చులపై ఆక్షేపించారు. తమకు కార్పొరేటర్ నిధులు ఎలాగూ ఇవ్వడం లేదు.. నియోజకవర్గాల వారీగా కేటాయించాలని ఒకరిద్దరు అడిగారు. ప్రొటోకాల్ పాటించడం లేదని కొందరు తప్పుబట్టారు. ఇలా సభ్యుల నుంచి ఎదురైన వివిధ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక, మార్పుచేర్పులతో మరోసారి సమావేశంలో చర్చించి ఖరారు చేద్దామని మేయర్ సమావేశాన్ని వాయిదా వేశారు. వృథా ఖర్చులను తగ్గించి ఆదాయాన్ని పెంచేలా బడ్జెట్ ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. ఆదాయ వనరులు పెంచుకున్నప్పుడు జీహెచ్‌ఎంసీలో అభివృద్ధి పనులు కొనసాగుతాయన్నారు. జోన్ల వారీగా జీఐఎస్ ఇంటింటి డ్రోన్ సర్వే పూర్తయిందని, ఆమేరకు 24 లక్షల గృహాలున్నాయన్నారు. ఫిజికల్‌గా 1.25 లక్షల ఇళ్ల సర్వే మాత్రమే పూర్తయిందన్నారు.

పాతబస్తీకే ఎక్కువ నిధులా?

కొత్త బడ్జెట్‌పై స్టాండింగ్ కమిటీ సమావేశానికి ముందు బీజేపీ ధర్నా



సాక్షి, సిటీబ్యూరో: పన్నులు చెల్లించేది కొన్ని సర్కిళ్ల ప్రజలైతే.. అభివృద్ధి పనులకు అధిక నిధులు మాత్రం పన్నులు చెల్లించని పాతబస్తీకి కేటాయిస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ కార్పొరేటర్లు ధర్నా చేశారు. శనివారం సాయంత్రం కొత్త బడ్జెట్‌పై స్టాండింగ్ కమిటీ సమావేశం జరగడానికి ముందు సమావేశ మందిరం ఎదుట ప్లకార్డులతో పార్టీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్, ఒకరిద్దరు అధికారుల కనుసన్నల్లో జీహెచ్‌ఎంసీ కార్యకలాపాలు నడిచాయని, ఇప్పుడు సైతం పాలకమండలి సభ్యులకు తెలియకుండానే పలు కార్యక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. జీహెచ్‌ఎంసీ గురించి అవగాహన రాకముందే కమిషనర్లను తరచూ మారుస్తుండటంతో జీహెచ్‌ఎంసీ పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. పన్నులు చెల్లిస్తోంది ఎల్‌బీనగర్, ఉప్పల్, కూకట్‌పల్లి తదితర న్యూసిటీ ప్రాంతాల వారైతే నిధులు మాత్రం ఎంఐఎం కార్పొరేటర్లున్న ఓల్డ్‌సిటీకి వెచ్చిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం రహస్యంగా చర్చించుకొని కొత్త బడ్జెట్‌ను రూపొందించాయన్నారు. ఏపార్టీ అధికారంలో ఉంటే వారితో కుమ్మక్కవుతూ ఎంఐఎం లాభపడుతోందన్నారు. పన్నులు కట్టే ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయాల్సిందిగా కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం సమర్పించగా.. సమీక్షిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. వంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రకటనల విభాగం పద్దు కింద గత బడ్జెట్‌లో కేవలం రూ.20 కోట్ల ఆదాయం చూపారని, తాము రూ.500 కోట్లు వస్తాయని సవాల్ చేయగా, అధికారులు చేపట్టిన చర్యలతో రెండు నెలల్లోనే రూ.70 కోట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్, ఎంఐఎంల మధ్య చికెన్ షాపులకు సంబంధించిన పంచాయితీ.. పైకి మాత్రమేనని, లోపల రెండూ ఒకటేనని ఆరోపించారు.

నీటి వనరులను సంరక్షించి.. జీవ వైవిధ్యాన్ని కాపాడతాం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

సనత్‌నగర్: జీవకోటికి ప్రాణాధారమైన నీటి వనరులను సంరక్షించి జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నేషనల్ బయో డైవర్సిటీ అథారిటీ, ఐసీఎల్‌ఈఐ సంయుక్తాధ్వర్యంలో రెండు రోజుల పాటు బేగంపేట్‌లోని ఓ హోటల్‌లో పట్టణ జీవ వైవిధ్యంపై జరిగిన జాతీయ స్థాయి సదస్సు శనివారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైన రంగనాథ్ మాట్లాడుతూ.. జీవ వైవిధ్యంలో భాగంగానే చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణపై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండేలా చేసి పరిసరాల్లో మొక్కలను నాటుతామని, పర్యావరణాన్ని కాపాడడంతో పాటు జీవ వైవిధ్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. హైడ్రా అమల్లోకి వచ్చాక.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల అంశంపై అందరూ చర్చించుకుంటున్నారన్నారు. తాము కొంటున్న ఇల్లు, ఇంటి స్థలం చెరువులో ఉందా.. ప్రభుత్వ స్థలమా? అన్ని విధాలా సరైనదేనా అనే విషయాలను తెలుసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. శిఖం భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనే విషయాన్ని కూడా ప్రజలు తెలుసుకున్నారన్నారు. ఆక్రమణదారులను ఎవరినీ వదలబోమని స్పష్టం చేశారు. నగరంలో చెరువులు 61 శాతం కబ్జాకు గురయ్యాయని తెలిపారు. పటిష్ట చర్యలు చేపట్టకపోతే.. ప్రస్తుతం ఉన్న 39 శాతం చెరువులు కూడా వచ్చే 15 ఏళ్లలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. హైడ్రా అంటే కూల్చడం కాదని, చెరువులను పునరుద్ధరించి.. అక్కడ చక్కటి వాతావరణం ఏర్పడేలా చేయడమే హైడ్రా లక్ష్యమని ఉద్ఘాటించారు. చక్కటి వాతావరణంలో మెరుగైన ప్రజా జీవనం కల్పించడం, ప్రజలకు కూడా హైడ్రా చర్యలపై అవగాహన వచ్చిందని రంగనాథ్ పేర్కొన్నారు. చెరువులను పరిరక్షించడం, పునరుద్ధరించడంలో హైడ్రా చర్యలను నేషనల్ బయో డైవర్సిటీ అథారిటీ చైర్మన్ అచలేందర్‌రెడ్డి అభినందించారు.



రూ. 52 కోట్ల పత్తి బుగ్గిపాలు

అగ్ని ప్రమాదంతో కుప్పకూలిన గోదాం

- మేడ్చల్ జిల్లా గోసాయిగూడలో ఘటన

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి గోసాయిగూడలోని ఓ పత్తి గోదాములో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు గోదాం కుప్పకూలింది. భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోసాయిగూడలోని ఓ ప్రైవేటు గోదాంలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సేకరించిన పత్తిని నిల్వ ఉంచారు. గత ఏడాది గోదాంను సీసీఐ అద్దెకు తీసుకుని ఆదిలాబాద్‌లో కొనుగోలు చేసిన పత్తిని ఇక్కడ నిల్వ ఉంచారు. శనివారం మధ్యాహ్నం గోదాంలో ఉన్న గేటుకు వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పత్తిపై పడటంతో మంటలు అంటుకున్నాయి. కొద్ది సేపట్లోనే మంటలు వ్యాపించి ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. మంటల వేడికి గోదాం గోడలు దెబ్బతిని పైకప్పు కూలిపోయింది. ఆ పక్కనే కెమికల్ గోదాం కూడా ఉండడంతో స్థానికుల ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు హుటా హుటిన ఫైర్ ఇంజిన్లతో ఘటన స్థలికి వచ్చారు. రెండు వాహనాలతో మంటలు అదుపులోకి రాకపోవడంతో చర్లపల్లి, మల్కాజిగిరి, ఇతర ప్రాంతాల నుంచి ఆరు అగ్నిమాపక వాహనాలను రప్పించి 40 మంది సిబ్బందితో నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పక్కన ఉన్న గోదాంలకు మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. కెమికల్ గోదాంలను ఖాళీ చేయించారు. ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేసేలోపు గోదాంలోని పత్తి బూడిదగా మారింది. గోదాంలోని కార్మికులు అప్రమత్తంగా ఉండడంతో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.52 కోట్ల విలువైన పత్తి అగ్నికి ఆహుతైనట్లు సమాచారం.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కుప్పకూలిన గోదాం



తుపాన్ ఎఫెక్ట్.. మారిన వాతావరణం

ఆకాశం మేఘావృతం.. చల్లని గాలులు

సాక్షి, సిటీబ్యూరో: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఫెంగల్ తుపానుగా మారడంతో నగర వాతావరణంపై ప్రభావం పడింది. ఆకాశం మేఘావృత్తం కాగా, చల్లని గాలులు వీచాయి. పగటి ఉష్ణోగ్రత పడిపోయింది. సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత -2.3 డిగ్రీలు తగ్గి సగటున 28.7 డిగ్రీలు నమోదైంది. అయితే రాత్రిపూట ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

సన్నీలియోన్ షోకు పోలీసుల అనుమతి నిరాకరణ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నంబర్.10లోని ఇల్లీయూజన్ పబ్‌లో శనివారం వీకెండ్ నైట్‌లైఫ్‌లో భాగంగా ప్రముఖ బాలీవుడ్ నటీ సన్నీ లియోన్ లైవ్ ఫెర్ఫార్మెన్స్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రాత్రి 11 గంటల నుంచి 12.30 గంటల వరకు ఆమె ఈ పబ్‌లో ఒప్పందం ప్రకారం డీజే ప్లే చేస్తూ కుర్రకారుకు హుషారు తెప్పించాలి. ఇందుకోసం నిర్వాహకులు జూబ్లీహిల్స్ పోలీసుల అనుమతి కోరగా, ఇందుకు నిరాకరించారు. ఉదయం నుంచే సన్నీ లియోన్ రాకకోసం కుర్రకారు ఎదురు చూస్తుండగా, అనుమతి నిరాకరిస్తూ పోలీసులు ఫైల్ పక్కన పెట్టారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సన్నీ లియోన్ ప్రోగ్రామ్ నిర్వహించాలని నిర్ణయించుకున్న నిర్వాహకులు ఉన్నతాధికారులను కూడా కలిశారు. ఎలాగైనా ఆమెను పబ్‌కు తీసుకు రావాలని ప్రయత్నించారు. మరోవైపు ఆమెను ఎట్టి పరిస్థితుల్లోనూ పబ్‌లోకి రానివ్వొద్దంటూ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పబ్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. టికెట్లు కొనుగోలు చేసిన యువతీ యువకులు రాత్రి 8 గంటల నుంచే పబ్‌కు చేరుకోవడం ప్రారంభించారు. ఒక వైపు పోలీసుల మోహరింపు..మరో వైపు అనుమతుల నిరాకరణ...ఇంకో వైపు హోటల్లో సన్నిలియోన్ ఎదురు చూపుల మధ్య హైడ్రామా రక్తి కట్టింది. ఈ క్రమంలో చివరకు నిర్వాహకులు సన్నీలియోన్ ఆరోగ్యం బాగాలేనందున ప్రోగ్రామ్ క్యాన్సిల్ అయినట్లు ఓ వీడియోను విడుదల చేశారు. రూ.లక్షలు పోసి టికెట్లు కొన్న యువతీ యువకులు నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా అడ్డదారిలోనైనా ఆమెను తీసుకొస్తారేమోనని అనుమానించి పబ్ చుట్టూ 100 మంది పోలీసులను మోహరించారు. రాత్రి 1 గంటకు ఇక ఆమె రాదని నిర్ధారించుకున్న పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

భార్యాభర్తల డ్రగ్స్ దందా!

- దీని కోసమే అసోం నుంచి నగరానికి రాక
- అద్దె ఇంట్లో ఉంటూ విక్రయానికి ప్రయత్నం
- వలపన్ని పట్టుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: ఈశాన్య రాష్ట్రమైన అసోం నుంచి మాదకద్రవ్యం ఏంఫెటమైన్‌తో నగరానికి వచ్చి, విక్రయానికి ప్రయత్నించిన భార్యాభర్తల్ని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.20 లక్షలు విలువైన 254 గ్రాముల డ్రగ్, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుదీంద్ర శనివారం వెల్లడించారు. అసోంలోని లాల్‌పానీ గ్రామానికి చెందిన ఆతిఫ్ అస్లం ఖాన్ గతంలో నగరానికి వలసవచ్చి నిమ్స్ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేశాడు. దాదాపు ఐదారేళ్లు ఇక్కడ ఉండటంతో ఇతడిలా వచ్చి, సిటీలో నివసిస్తున్న పలువురు అసోం వారితో పరిచయం ఏర్పడింది. అసోంలోని మొరాంగా గ్రామానికి చెందిన సుభానీ బేగంను వివాహం చేసుకున్న అస్లం ఖాన్ స్వస్థలానికి వలసవెళ్లాడు. తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం మార్గాలు అన్వేషించాడు. అసోంలో తయారయ్యే మాదకద్రవ్యం ఏంఫెటమైన్‌ను ఆ రాష్ట్రానికి చెందిన అనేక మంది వినియోగిస్తూ ఉంటారు. దీంతో ఆ డ్రగ్ దందా చేయాలని నిర్ణయించుకున్నాడు. డ్రగ్‌పెడ్లర్ ప్రణోయ్ దాస్‌కు రూ.2 లక్షలు చెల్లించిన అస్లం ఖాన్ 300 గ్రాముల ఏంఫెటమైన్ ఖరీదు చేశాడు. భార్య సుభానీ బేగంతో కలిసి మాదకద్రవ్యం తీసుకుని అస్లం ఖాన్ గత నెల్లో రైలు మార్గంలో నగరానికి చేరుకున్నాడు. బేగంపేటలోని ప్రకాష్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లో ఓ బైక్ ఖరీదు చేశాడు. దీనిపై సంచరిస్తూ నగరంలో ఉన్న అసోం వాసులకు ఏంఫెటమైన్ విక్రయించడం మొదలెట్టాడు. డిమాండ్‌ను బట్టి రేటు నిర్ధారిస్తూ తమ వద్ద ఉన్న 300 గ్రాములు అమ్మడం ద్వారా రూ.25 లక్షలు సంపాదించాలని, ఆ మొత్తంతో స్వస్థలానికి తిరిగి వెళ్లిపోవాలని పథకం వేశారు. ఇప్పటి వరకు 11 మంది అసోం వాసులకు 46 గ్రాములు విక్రయించారు. వీరి దందాపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య నేతృత్వంలో ఎస్సై జి.నవీన్ తమ బృందంతో వలపన్నారు. శనివారం ఇద్దరితో పాటు 11 మంది వినియోగదారులను పట్టుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వీరిని బేగంపేట పోలీసులకు అప్పగించారు.

సినీ సెలబ్రిటీల పేర్లు చెప్పి మోసం

- వ్యాపారం పేరిట పలువురి నుంచి రూ.40 కోట్ల వరకు వసూలు
- పోలీసుల అదుపులో నిందితుడు



తోనంగి కాంతిదత్

బంజారాహిల్స్: 'నా వ్యాపార సంస్థల్లో ప్రముఖ బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా భాగస్వామి..మా ఉత్పత్తులకు టాలీవుడ్ నటి సమంత బ్రాండ్ అంబాసిడర్..మా సంస్థలకు కోలీవుడ్ నటి కీర్తి సురేష్ బ్రాండ్ అంబాసిడర్...' అంటూ వర్ధమాన వ్యాపారవేత్తలను మోసగించి కోట్లాది రూపాయలు వసూలు చేసిన నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..వైజాగ్‌కు చెందిన తోనంగి కాంతిదత్ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో తృతీయ ఫైన్ జ్యువెలరీ పేరుతో వైజాగ్‌కు చెందిన శ్రీజ రెడ్డి తిప్పలతో స్టోర్ ఓపెన్ చేయించాడు. ఇందుకోసం ఆమె రూ.2.50 కోట్లు వెచ్చించింది. ఈ స్టోర్ ప్రారంభోత్సవానికి గతేడాది సెప్టెంబర్ 7న బాలీవుడ్ నటి పరిణితి చోప్రాను కాంతిదత్ తీసుకొచ్చాడు. ఇందుకోసం రూ.కోటీ 50 లక్షలు ఆమెకు ఇవ్వాలంటూ శ్రీజరెడ్డి దగ్గర తీసుకున్నాడు. అయితే ఈ విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి డైరెక్టర్ పదవి నుంచి తొలగించి తన తల్లిని ఆ స్థానంలో నియమించాడు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన కాంతిదత్‌పై బాధితురాలు శ్రీజరెడ్డి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఆయనపై చీటింగ్ కేసు నమోదు చేశారు. కొద్ది రోజులుగా ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.3.50 కోట్లు తీసుకొని తృతీయ జ్యువెలరీలో డైరెక్టర్‌గా చేర్చుకున్నాడు. ఆయనను కూడా పరిణీతి చోప్రాకు తృతీయ జ్యువెలరీలో వాటా ఉందంటూ నమ్మించాడు. కొద్ది రోజులకే ప్రవీణ్ కుమార్ కూడా మోసపోగా సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. గౌతమ్ అనే వ్యక్తిని కూడా నమ్మించి మోసగించడంతో ఆయన కూడా ఫిర్యాదు చేశాడు. ఎట్టకేలకు నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా సెలబ్రిటీల ముసుగులో రూ.40 కోట్ల వరకు మోసానికి పాల్పడినట్లుగా తేలింది. మయోమి కెఫేల పేరుతో పెద్ద ఎత్తున మోసానికి పాల్పడటమే కాకుండా వెండర్లకు బిల్లులు ఎగ్గొట్టడం, ఉద్యోగులకు జీతాలు ఎగ్గొట్టినట్లుగా వారంతా జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సస్టైన్ కార్ట్ పేరుతో ప్రముఖ డిజైనర్ శిల్పారెడ్డిని కూడా మోసగించినట్లు ఆమె ఇప్పటికే ఓ వీడియో విడుదల చేసింది. నిందితుడు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడినట్లుగా పోలీసులకు కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు అందాయి. లోతుగా విచారణ చేపడితే ఇంకా చాలా మోసాలు వెలుగు చూస్తాయని పోలీసులు భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రికవరీ ఆఫీసర్ వారి కార్యాలయం, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ - 1, హైదరాబాద్

3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ - 500 001.

ఫారం నెం.13

అమ్మకపు ప్రకటన

(బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ సంస్థల బకాయిల వసూలు చట్టం, 1993తో చదువబడే ఆదాయపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూల్ రూల్ 38, 52(2) ప్రకారం)

ఓ.ఎ.నెం.625/2019 లోని ఆర్.పి.నెం.333/2020

వీరి మధ్య :

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ -2 (SAMB - II), 1వ అంతస్తు, టీఎస్ఆర్‌టీసీ బస్ స్టేషన్ కాంప్లెక్స్, కాచిగూడ, హైదరాబాద్ ... సర్టిఫికేట్ హోల్డర్ మరియు

శ్రీ టి. మోహన్ రెడ్డి @ తలమాటి మోహన్ & ఇతరులు ... సర్టిఫికేట్ డెటార్స్

[illegible]

1. శ్రీ టి. మోహన్ రెడ్డి @ తలమాటి మోహన్, తండ్రి : శ్రీ టి. సుబ్బారెడ్డి, వయస్సు: మేజర్, వృత్తి : వ్యాపారం, ఫ్లాట్ నెం.89/ఎ, ఐశ్వర్య, 1వ ఫ్లోర్, సాగర్ సొసైటీ, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34. వేరొక చిరునామా: వెందోడు గ్రామం, గూడూరు మండలం, నెల్లూరు - 524131 ... సర్టిఫికేట్ డెటార్ నెం.1
2. శ్రీ టి. సుబ్బారెడ్డి, తండ్రి : శ్రీ టి. రామిరెడ్డి, వయస్సు: మేజర్, వృత్తి : వ్యాపారం, ఫ్లాట్ నెం.89/ఎ, ఐశ్వర్య, 1వ ఫ్లోర్, సాగర్ సొసైటీ, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34. వేరొక చిరునామా: వెందోడు గ్రామం, గూడూరు మండలం, నెల్లూరు - 524131. ...సర్టిఫికేట్ డెటార్ నెం.2
3. శ్రీ టి. చంద్ర మోహన్ రెడ్డి ... సర్టిఫికేట్ డెటార్ నెం.3
4. శ్రీ జి. శ్రీనివాస రెడ్డి, తండ్రి : శ్రీ జి. వెంకట రెడ్డి, వయస్సు: మేజర్, వృత్తి : వ్యాపారం, ఇ.నెం.6-3-442/2, శ్రీకృష్ణ నగర్, ఖానామెట్, హైదరాబాద్. వేరొక చిరునామా: పోస్ట్ బాక్స్ నెం.63, ... - 0866550063, యుఎస్ఏ. ...సర్టిఫికేట్ డెటార్ నెం.4

[illegible]

[illegible]

ఆస్తుల షెడ్యూలు

లాట్ నెం.1: సేల్ డీడ్ నెం.4065/2012, తేది.02.07.2012 ప్రకారం సి.డి.నెం.4 ... శ్రీనివాసరెడ్డి గారికి చెందిన ఆస్తి : తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ... [illegible]

రిజర్వు ధర : రూ. 80,00,000/-, ధరావత్తు : రూ. 8,00,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-
వేలం తేది : 02-01-2025 & వేలం సమయం : ఉ॥ 11 గం॥ల నుండి ఉ॥ 11.30 గం॥ల వరకు
(వేలం ముగిసే వరకు ప్రతి బిడ్‌కు 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

లాట్ నెం.2: సేల్ డీడ్ నెం.4068/2012, తేది.27.06.2012 ప్రకారం సి.డి.నెం.4 ... శ్రీనివాసరెడ్డి గారికి చెందిన ఆస్తి ... [illegible]

రిజర్వు ధర : రూ. 57,00,000/-, ధరావత్తు : రూ. 5,70,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-
వేలం తేది : 02-01-2025 & వేలం సమయం : మ॥ 12 గం॥ల నుండి మ॥ 12.30 గం॥ల వరకు
(వేలం ముగిసే వరకు ప్రతి బిడ్‌కు 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

లాట్ నెం.3: సేల్ డీడ్ నెం.4069/2012, తేది.27.06.2012 ప్రకారం సి.డి.నెం.4 ... శ్రీనివాసరెడ్డి గారికి చెందిన ఆస్తి ... [illegible]

రిజర్వు ధర : రూ. 59,00,000/-, ధరావత్తు : రూ. 5,90,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-
వేలం తేది : 02-01-2025 & వేలం సమయం : మ॥ 1.00 గం॥ నుండి మ॥ 1.30 గం॥ల వరకు
(వేలం ముగిసే వరకు ప్రతి బిడ్‌కు 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

లాట్ నెం.4: సేల్ డీడ్ నెం.4070/2012, తేది.27.06.2012 ప్రకారం సి.డి.నెం.4 ... శ్రీనివాసరెడ్డి గారికి చెందిన ఆస్తి ... [illegible]

రిజర్వు ధర : రూ. 59,00,000/-, ధరావత్తు : రూ. 5,90,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-
వేలం తేది : 02-01-2025 & వేలం సమయం : మ॥ 2.00 గం॥ల నుండి మ॥ 2.30 గం॥ల వరకు
(వేలం ముగిసే వరకు ప్రతి బిడ్‌కు 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

లాట్ నెం.5: ... [illegible]

రిజర్వు ధర : రూ.1,34,00,000/-, ధరావత్తు : రూ.13,40,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-
వేలం తేది : 02-01-2025 & వేలం సమయం : మ॥ 3.00 గం॥ల నుండి మ॥ 3.30 గం॥ల వరకు
(వేలం ముగిసే వరకు ప్రతి బిడ్‌కు 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

లాట్ నెం.6: సేల్ డీడ్ నెం.15799/2005, తేది.21.11.2005 ప్రకారం సి.డి.నెం.4 ... శ్రీనివాస్ రెడ్డి గారికి చెందిన ఆస్తి : రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం ... [illegible]

రిజర్వు ధర : రూ.1,95,00,000/-, ధరావత్తు : రూ.19,50,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-
వేలం తేది : 02-01-2025 & వేలం సమయం : సా॥ 4.00 గం॥ల నుండి సా॥ 4.30 గం॥ల వరకు
(వేలం ముగిసే వరకు ప్రతి బిడ్‌కు 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

లాట్ నెం.7: సేల్ డీడ్ నెం.15898/2005, తేది.21.11.2005 ప్రకారం సి.డి.నెం.4 ... శ్రీనివాస్ రెడ్డి గారికి చెందిన ఆస్తి : రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం ... [illegible]

రిజర్వు ధర : రూ.1,75,00,000/-, ధరావత్తు : రూ.17,50,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-
వేలం తేది : 02-01-2025 & వేలం సమయం : సా॥ 5.00 గం॥ల నుండి సా॥ 5.30 గం॥ల వరకు
(వేలం ముగిసే వరకు ప్రతి బిడ్‌కు 3 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)

(నా స్వహస్తంతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో హైదరాబాద్ వద్ద 08వ రోజు నవంబరు, 2024న జారీచేయబడినది)

(బి.ఉమా మహేశ్వరి)
రికవరీ ఆఫీసర్

కుర్చీలు మాయం!



బంజారాహిల్స్: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ ప్రతీ వార్డుకు ఒక వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. గడిచిన పదినెలల కాలంలో వార్డు కార్యాలయాలన్నీ కుంటుపడ్డాయి. కాగా తాజాగా ఈ వార్డు కార్యాలయంలో వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన కుర్చీలు, ఇతర సామగ్రి మాయవుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని వసతులతో కార్యాలయాలు ఏర్పాటు చేసినా వార్డు కార్యాలయాల్లోకి సిబ్బంది, అధికారులు మాత్రం రాకపోవడంతో ప్రజలకు సేవలు అందడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజీగూడలలో అధికారులు వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయగా, ఈ కార్యాలయాలపై సరైన నిఘా లేకపోవడంతో ఫర్నిచర్ మాయమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వార్డు కార్యాలయాలల్లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్, ఇతర సామగ్రిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

బోరబండ పీఎస్‌కు కొత్తగా ఆరుగురు కానిస్టేబుళ్లు



నూతనంగా చేరిన పీసీలతో ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్‌కు కొత్తగా ఆరుగురు కానిస్టేబుళ్లు శనివారం విధుల్లో చేరారు. అందులో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. వారికి ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ పలు విభాగాలకు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ కొత్తగా విధుల్లో పీసీలు అంకితభావంలో విధులు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆంకాక్షించారు. నూతన పీసీల చేరికతో స్టేషన్‌లో శాంతి భద్రతలు నిర్వహణ వేగవంతం అవుతుందని అన్నారు.

11న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



పోస్టర్లు విడుదల చేస్తున్న సీఎన్ రెడ్డి, క్రైస్తవ ప్రతినిధులు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో డిసెంబర్ 11న గ్రాండ్స్ క్రిస్మస్ వేడుకలు ఏర్పాటు చేయడం జరిగిందని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11న సాయంత్రం 5 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. వేడుకల్లో క్రైస్తవ మతపెద్దలు, ప్రముఖ దైవ సందేశకులు పాల్గొంటారని ఆయన చెప్పారు. పవిత్ర ఈదైవ కార్యంలో ప్రతి క్రైస్తవ సోదరుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి కన్వీనర్ బండారి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మాల మాదిగల మధ్య ఘర్షణ పెరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులు, మేధావులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, సజయ, వి.బాలరాజు, ఎం.జంగయ్య, స్టాలిన్, జె.చక్రవర్తి, ఈ.గోవింద్, జక్కుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలి

వెంగళరావునగర్: ప్రభుత్వ గురుకుల, రెసిడెన్సియల్ స్కూల్స్, కాలేజీల్లో విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని ఇచ్చేందుకు మానసిక వైద్యాధికారులు ఎంతో అవసరమని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు సూచించారు. వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో శనివారం జరిగిన సీపీఎం గ్రేటర్ సెంట్రల్ సిటీ 23వ మహాసభలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాఘవులు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకుల స్కూల్స్‌లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు ఇవ్వడం, టీచర్స్‌ను నియమించడంతో పాటుగా వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచంలోని ఏ దేశంలోనైనా స్టూడెంట్స్‌కు ప్రత్యేక వసతులు కల్పిస్తారని, ఈ విషయాలు మన ప్రభుత్వాలు అధ్యయనం చేయాలన్నారు.

హ్యాపీ రిటైర్మెంట్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం 12 మంది పోలీసు అధికారులు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని కమిషనర్ సీవీ ఆనంద్ బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ భవనంలో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. సుదీర్ఘ కాలం పాటు వీరికి సహకరించిన వారి కుటుంబ సభ్యులకు సీపీ ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ పీ. శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్. శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సైన్స్ ఫెయిర్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బీఎస్‌ఆర్ బ్రిలియంట్ స్కూల్‌లో నిర్వహించిన మెగా సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం అబ్బురపరిచింది. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల నమూనాలు ఆలోచింపజేశాయి. వాయి కాలుష్యం, వ్యవసాయం, మానవ శరీర నిర్మాణం, గ్రహాలు, అంతరిక్షం, ప్రాజెక్టులు, పట్టణాలు, టెర్రస్ గార్డెనింగ్ వంటి నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ వీరారెడ్డి, ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

‘ఓటీఎస్’తో రూ.7.98 కోట్లు వసూలు

- జల మండలి డివిజన్–6 పరిధిలో స్పందన అంతంత మాత్రమే
- అవగాహన కలిగించినా ముందుకురాని బకాయిదారులు
- సుమారు 42 వేల మందిలో స్పందించింది 5,369 మందే



ఓటీఎస్‌పై అవగాహన కలిగిస్తున్న జలమండలి డివిజన్‌-6 జీఎం హరిశంకర్ (ఫైల్)



బంజారాహిల్స్: వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీంలో భాగంగా వినియోగదారులకు జలమండలి పెండింగ్ నల్లా బిల్లులపై రాయితీ ప్రకటించి సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఈ స్కీం అక్టోబర్ 1వ తేదీన ప్రారంభం కాగా జలమండలి డివిజన్–6 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా, ఎల్లారెడ్డిగూడ, సోమాజీగూడ, ఎస్పీఆర్‌హిల్స్, బోరబండ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, ఎస్‌ఆర్ నగర్, ఫతేనగర్ సెక్షన్ల పరిధిలో మొత్తం ఓటీఎస్ పథకాన్ని 5,369 మంది వినియోగదారులు ఉపయోగించుకున్నారు. వీరి ద్వారా జలమండలి డివిజన్–6 పరిధిలో రూ.7.98 కోట్లు వసూలైంది. నవంబర్ 30తో ఓటీఎస్ గడువు ముగిసింది. డివిజన్–6 పరిధిలో నీటి బకాయిదారులు 42 వేల మంది ఉండగా, అందులో 5,369 మంది మాత్రమే బకాయిలు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. దీంతో ఓటీఎస్ పథకం ద్వారా భారీగా బకాయిలు వసూలు చేయాలని భావించిన బోర్డుకు తీవ్ర నిరాశే ఎదురైంది. ఈ పథకాన్ని వినియోగించుకోవాలని అధికారులు భారీగానే అవగాహన కలిగించారు. లైన్‌మెన్లు, సెక్షన్ల మేనేజర్లు ప్రతీ బకాయిదారుడికి సమాచారం ఇచ్చారు. క్యాన్ నెంబర్ కొడితే బకాయిదారుడు చెల్లించాల్సిన మొత్తంలో ఎంత బిల్లు చెల్లించవచ్చో అప్పటికప్పుడు చూసుకునే విధంగా సాఫ్ట్‌వేర్ రూపొందించి ఆ మేరకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అయితే ఉచిత మంచినీరు వస్తుండడంతో చాలా మంది బకాయిదారులు చెల్లించడానికి ముందుకు రాలేదని తెలుస్తుంది. బకాయి ఉన్నా సరే నల్లా కనెక్షన్ కట్ చేయడానికి అధికారులు సాహసించరన్న ఉద్దేశంతో వినియోగదారులు ఆసక్తి కనబరచలేదని తెలుస్తోంది. కొంతమందికి లక్ష నుంచి రూ.2 లక్షల దాకా నీటి బకాయిలు ఉన్నాయి. వీళ్లల్లో కూడా కొంతమంది ముందుకురాలేదు. మరోసారి ఈ పథకాన్ని పొడిగించే అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఉద్యోగ విరమణ సహజం



వెంగళరావునగర్: ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి సహజమేనని, ఇక నుంచి కూడా భవిష్యత్ మరింత సానుకూలంగానే నడవాల్సి ఉంటుందని దేవాదాయ ధర్మాదాయశాఖ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ గుమ్మడిదల సుధాకర్ అన్నారు. వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని శ్రీరామాంజనేయస్వామి దేవాలయంలో గత కొన్నేళ్ళుగా వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. దీనిని పురస్కరించుకుని ఆలయంలో ఆయనతో పాటుగా ఆయన సతీమణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఓ సుధాకర్‌తో పాటుగా ఆలయ పూజారులు, సూర్యనారాయణ కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల బైక్ ర్యాలీ



ర్యాలీలో బోడ రవికిరణ్ మాదిగ

రహమత్‌నగర్: ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలని డిమాండ్ చేస్తూ జనవరి 19వ తేదీన జరిగే చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్రం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి హైద్రాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ రవికిరణ్ మాదిగ కోరారు. ప్రచారంలో భాగంగా శనివారం ఆయన జూబీహిల్స్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవించి ఏబీసీడీలుగా వర్గీకరణ ప్రక్రియ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

7న వీఎం హోంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరించిన జస్టిస్ చంద్రకుమార్

బంజారాహిల్స్: గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను డిసెంబర్ 7న సరూర్‌నగర్ వీఎం హోమ్ రెసిడెన్సియల్ స్కూల్‌లో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జస్టిస్ చంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచభూతాలను పరిరక్షించుకుని వాటి సమతుల్యానికి భంగం కలిగించకుండా మానవ జీవితాన్ని కొనసాగించాలని తెలిపారు. ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా నడుచుకుంటే విలయాలు సంభవిస్తాయన్నారు. భగవద్గీత పఠనం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీటీడీ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ గూడూరు హరినాథ్, హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు సురేందర్, శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్ సీనియర్ జర్నలిస్ట్ బండ సంగారెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లకావత్ సిల్మా, భజన మండలి సభ్యులు అమర్నాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024





శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024 మహిళలను అమితంగా ఆకట్టుకుంటుంది. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేతకళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. వస్త్ర ప్రదర్శన డిసెంబర్ 2 వరకూ కొనసాగుతుంది.

సోషలిజంతోనే అసమానతలను రూపుమాపొచ్చు

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మహాసభలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

వెంగళరావునగర్: సమాజంలోని అసమానతలను కూకటివేళ్లతో సహా పెకిలివేయడం కేవలం సోషలిజం వల్ల మాత్రమే సాధ్యమవుతుందని సీపీఎంపొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు తెలియజేశారు. సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ 23వ మహాసభలు స్థానిక వెస్ట్ శ్రీనివాసనగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సభలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ సోషలిజం అంటే నమ్మకమని, సమాజంలోని దోపిడీని అంతం చేయడమే అన్నారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ 5.4 శాతం వరకు పడిపోయిందని, పెట్టుబడిదారీ విధానం కూడా దీనిని కట్టడి చేయలేకపోవడుందన్నారు. ఇక పెట్టుబడిదారీ విధానానికి నూకలు చెల్లినట్టేనని చెప్పారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ విప్లవ పార్టీలకు సీట్లు, ఓట్లు అనేవి చాలా చిన్న విషయమని, అయితే పార్టీ పెరగకపోవడంతో సమీక్ష చేసుకోవాలని తెలిపారు. గత కొన్నేళ్లుగా మన పార్టీకి సీట్లు, ఓట్లు తగ్గాయన్నారు. ప్రతి మూడేళ్ళకొకసారి పార్టీ మహాసభలు జరుగుతాయని, ఈ కాలంలో మనం చేసిన కృషి, బలహీనతలు సమీక్షించుకోవాలన్నారు. రాజ్యాంగం సమానత్వాన్ని, స్వేచ్ఛను సూచిస్తుండగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వీటిని నాశనం చేయాలని పూనుకున్నాయని, వీరి లక్ష్యం హిందూరాజ్యస్థాపన అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ అప్రజాస్వామికంగా పాలన వల్లనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి స్వాగతించామని, అయితే 10 నెలలో మహిళలను బస్సు ఎక్కించడం తప్ప మిలిగిన గ్యారంటీలు పక్కన బెడుతున్నారని విమర్శించారు. తొలుత సీపీఎం సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ కమ్యూనిస్ట్ కార్మిక, ఉద్యమ నిర్మాత ఎస్.వి.భాస్కర్‌రావు రచించిన పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు. మహాసభలో పార్టీ మాజీ నగర కార్యదర్శి రఘుపాల్, పీఎస్‌ఎన్‌మూర్తి, నిర్మల, నరహరి తదితరులు మాట్లాడగా, అధ్యక్షవర్గంగా దశరథ్, నాగలక్ష్మి, వెంకటేష్‌లు వ్యవహరించారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, నరసింహారావు, ప్రభాకర్, గ్రేటర్ కార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు, రాజన్న, మహేందర్, నగర కమిటీ సభ్యులు కుమారస్వామి, వెంకటేష్, మారన్న తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పబ్లిక్ స్కూల్ ప్రతినిధులు..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రతిష్టాత్మకమైన మూడు అవార్డులను గెలుచుకుంది. టైమ్స్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డును వరుసగా నాలుగోసారి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు వరించింది. అదేవిధంగా ‘మోస్ట్ ట్రస్టెడ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్’ ప్రతిష్టాత్మకమైన బిరుదును, అలాగే సెంట్రల్ జోన్‌లో సీబీఎస్ఈ కరిక్యులంతో కూడిన పాఠశాలల్లో ఉత్తమ పాఠశాలగా నెంబర్–1 స్థానం పొందింది. ఈ మూడు అవార్డులను ఈ నెల 29న జరిగిన టైమ్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో పాఠశాల అధ్యక్షులు మురళీముకుంద్, డైరెక్టర్ వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ కాంచనవల్లి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విధుమోహన, ద్వితీయ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి శ్రీరామ్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి విజయానికి సహకరించిన అధ్యాపకులకు, మద్దతునిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తిరుగులేని నిబద్ధతకు, విద్యా, పాఠ్యేతర విజయాలకు ఈ అవార్డులు నాందిగా నిలుస్తాయన్నారు. నాణ్యమైన విద్య, జీవన నైపుణ్యాలతో విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో నిరంతరం శ్రమిస్తామన్నారు. భవిష్యత్తులో పాఠశాల మరిన్ని విజయాలను సాధించేందుకు ఈ అవార్డులు ఒక ప్రేరణగా నిలుస్తాయన్నారు.

మహేష్‌యాదవ్ సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



పేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: అన్ని కాలాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్న మహేష్‌యాదవ్ ఆదర్శంగా నిలిచాడని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శివలాల్‌యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో నిరుపేదలకు ఉచితంగా దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై నిరుపేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలాల్లో క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్న మహేష్‌యాదవ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు మిన్న అన్న నినాదాన్ని పాటిస్తూ తాను సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేయాలనే లక్ష్యంతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. ఖైరతాబాద్ ప్రాంతవాసులకు తాను ఉన్నంత కాలం సేవా కార్యక్రమాలు చేపడుతానని తెలిపారు. అనంతరం వాసవి హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు కాటం నర్సింహ్మ యాదవ్, కె.రాజు, గంగాధర్ యాదవ్, కమ్మరి వినయ్, మురళి, పూస అనిల్, శివ, రమాదేవి, ట్రస్ట్ సభ్యులు శ్రీధర్, సుజాత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు తెలిపిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



బంజారాహిల్స్: ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.13లోని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసానికి ఎన్యుమరేటర్లు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన తన వివరాలను ఎన్యుమరేటర్లు ఏఎంసీ సాయి శ్రీనివాస్, నవ్యలకు తెలియజేశారు.

ముమ్మరంగా ‘ఆపరేషన్ రోప్’



ఫిలించాంబర్ వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఫిలింనగర్: పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై కొంతమంది వ్యాపారులు ఏర్పాటు చేస్తున్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ఆపరేషన్ రోప్‌ను ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఫిలించాంబర్ వద్ద ఏర్పాటు చేసిన ఆక్రమణలను తొలగించి వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు.మరోసారి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకం

హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ప్రొఫెసర్ బాలకృష్ణ

బంజారాహిల్స్: సమాజంలో న్యాయవాదుల పాత్ర, లీగల్ ఎడ్యుకేషన్ పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూం లా కాలేజీలో శనివారం జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి కోర్సు పూర్తి చేసుకున్న న్యాయవాద విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మన దేశంలో గతంలో న్యాయ విద్యపై నిర్లక్ష్యం జరిగిందని అందువల్ల ఇతర దేశాల్లో ఇంజినీరింగ్, ఐటీ, వైద్య రంగంతో పాటు ఇతర రంగాల్లో మన వారు పెద్ద సంఖ్యలో ఉంటారని కానీ న్యాయవాద రంగంలో మాత్రం మనవాళ్లు తక్కువగా ఉంటారని అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని, లీగల్ ఎడ్యుకేషన్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన పెరిగిందని న్యాయవాద వృత్తిలోకి వచ్చేందుకు యువత ఆసక్తి చూపిస్తున్నారని ఇది మంచి పరిణామమన్నారు. న్యాయవాద పట్టాలు పొందిన విద్యార్థులు డిజిటలైజేషన్‌తో పోటీపడి మరీ నిత్యం కొత్త విషయాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సబ్జెక్టు ఉన్న వారు మాత్రమే విజయం సాధించగలుగుతారని ప్రతి ఒక్కరూ సబ్జెక్టుపై దృష్టిపెట్టాలని సూచించారు. వచ్చే పదేళ్లలో లీగల్ ఎడ్యుకేషన్‌కు ఇంకా డిమాండ్ పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్. ప్రొఫెసర్ వి. గీతారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘బీవీబీపీ’లో స్పోర్ట్స్ డే వేడుకలు





ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమం వార్షిక స్పోర్ట్స్‌మీట్ శనివారం పాఠశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిట్టిపొట్టి దుస్తులు ధరించి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. అనంతరం విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ ఎస్. గోపాల కృష్ణన్, ప్రిన్సిపాల్ అరుణ శ్రీలు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. స్పోర్ట్స్ మీట్ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





డిప్యూటీ సీఎం భట్టికి ఘనస్వాగతం



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

శంషాబాద్: జార్ఖండ్ సార్వత్రిక ఎన్నికల గెలుపులో కీలకపాత్ర పోషించిన రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు శంషాబాద్ విమానాశ్రయంలో శనివారంరాత్రి ఘనంగా స్వాగతం పలికారు. జార్ఖండ్ కూటమి ప్రభుత్వ ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆయన తిరిగి వచ్చిన సందర్భంగా శనివారంరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖమ్మం కాంగ్రెస్ పార్టీ నేతలతోపాటు స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికినవారిలో ఖమ్మం కాంగ్రెస్ నేతలు దుర్గాప్రసాద్, మహ్మద్ జావెద్, పోడెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

16లోపు హజ్ యాత్రికులు రెండో విడత డబ్బు చెల్లించాలి

లేనిపక్షంలో వారి స్థానంలో ఇతరులకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ నుంచి 2025 హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులు ప్రయాణ ఖర్చుల నిమిత్తం చెల్లించే రెండో విడత డబ్బుల గడువు ఈ నెల 16వ తేదీ వరకు చెల్లించాలని రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి లియాకత్ హుస్సేన్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ హజ్ యాత్రకు ఎంపికైనవారు ఇప్పటికే మొదటి విడతగా రూ.లక్షా 30 వేలు చెల్లించారని చెప్పారు.. రెండో విడుతగా రూ. లక్షా 42 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక మిగతావి మూడో విడతగా చెల్లించాలని, వాటి వివరాలు అతిత్వరలో కేంద్ర హజ్ కమిటీ ప్రకటిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ద్వారా 5 వేల మంది హజ్ యాత్రకు ఎంపికయ్యారని, డబ్బులు చెల్లించని వారి స్థానంలో ఇతరులకు అవకాశం ఇస్తామని పేర్కొన్నారు. ఏమైనా సందేశాలు ఉంటే 040–23298793 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

18న జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ హౌజింగ్ సొసైటీ ఎన్నికలు డిసెంబర్ 18వ తేదీన జరుగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర కోఆపరేటివ్ ఎన్నికల సంఘం ఉత్తర్వులు విడుదల చేసింది. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యాలయంలోనే సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. డిసెంబర్ 7వ తేదీ నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయి. ఈ ఎన్నికల్లో 9 మందితో కూడిన పాలకమండలిని ఎన్నుకోనున్నారు.

సర్వే వివరాలు అందించిన మంత్రి సురేఖ



బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేలో భాగంగా మంత్రి కొండా సురేఖ శనివారం తన కుటుంబ వివరాలను అందజేశారు. ఖైరతాబాద్ సర్కిల్–17 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, సూపర్‌వైజర్ గంగాధర్, ఎన్యుమరేటర్లు రమేష్, వెంకట్‌బాబు జూబ్లీహిల్స్ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని మంత్రి నివాసానికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఎన్యుమరేటర్లు అడిగిన అన్ని వివరాలను అందజేయగా వారు ఫారంలో భర్తీ చేశారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరును మంత్రి వారిని అడిగి తెలుసుకున్నారు.

జలమండలి టెక్నికల్ డైరెక్టర్ పదవీ విరమణ



పదవీ విరమణ చేసిన టెక్నికల్ డైరెక్టర్ పి.రవి కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి టెక్నికల్ డైరెక్టర్ పి.రవికుమార్ పదవీ విరమణ పొందారు. శనివారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన వీడ్కోల కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ హాజరై ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పనిని ప్రేమించేవారికి పదవీవిరమణ అనేది కష్టమైనదన్నారు. నిబద్ధత, అంకితభావం ఉన్న ఆయన విపత్కర పరిస్థితులను సైతం అవలీలగా ఎదుర్కొన్నారని కొనియాడారు. అనంతరం జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో రవికుమార్‌ను సన్మానించారు. 1987 ఏటగా సర్వీసులో చేరిన రవికుమార్ జలమండలిలో డీజీఎం, జీఎం, సీజీఎం, డైరెక్టర్‌గా వివిధ హోదాల్లో 38 ఏళ్లు బోర్డుకు సేవలందించారు. కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్–1, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న ఆటో, మోటార్ క్యాబ్‌ల బంద్

పోస్టర్ ఆవిష్కరించిన నేతలు



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నేతలు

ముషీరాబాద్: మోటార్ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయనందున ఆటో సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 7వ తేదీన ఆటో, క్యాబ్, వ్యాన్ తదితర వాహనాల బంద్ నిర్వహిస్తున్నామని టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రవీణ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని ఆటో, వ్యాన్, ట్యాక్సీ వాహనాల డ్రైవర్లు బంద్‌లో పాల్గొనాలని సూచించారు. డిసెంబర్ 7 ఉదయం 10.30 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు వేలాదిమంది ఆటో డ్రైవర్లతో ప్రదర్శన, ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.హనుమేష్, నాయకులు మహ్మద్ అఫ్జల్, యూసుఫ్, మధుసూదన్, ఎం.ఎస్.రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



జాగ్రత్త!

రోగాలులు వస్తున్నాయి..

గ్రేటర్ వ్యాప్తంగా పెరుగుతున్న చలి తీవ్రత

- వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుందంటున్న వైద్యులు
- అస్తమా, సీవోపీడీ, హైపోథెర్మియా వచ్చే ప్రమాదం
- పౌష్టికాహారం, గోరువెచ్చని నీరు తీసుకోవాలని సూచన

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరంలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. చల్లటి గాలులు కూడా వణికిస్తున్నాయి. అయితే చలిగాలులు అనేక రకాల వ్యాధులను కూడా మోసుకొస్తున్నాయి. ఈ సీజన్‌లో ప్రజల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చలిగాలులు శరీరంలోకి వెళ్లడంతో వైరస్‌లు మరింత వృద్ధి చెందే ప్రమాదం ఉందని అంటున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది చలితీవ్రత పెరిగిందని వాతావరణ నిపుణులు కూడా పేర్కొంటున్నారు.

సమస్యలు..

ఫ్లూ, సైనసైటిస్, ఊపిరితిత్తుల్లో వైరల్ ఇన్‌ఫెక్షన్, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి(సీవోపీడీ), ఆస్తమా వంటి సమస్యలు తలెత్తుతాయి. హైపోథెర్మియా, చర్మం లోపలి కణజాలం గడ్డ కట్టి గాయాలు కావటం, పెర్నియో, ఇమ్మర్షన్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలు..

దగ్గు, జలుబు, గొంతునొప్పి, తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ఆయాసం, న్యూమోనియా వంటి లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు..

చలి ఎక్కువగా ఉన్న సమయాల్లో మాస్కులు ధరించాలి. దీంతో వైరస్ సోకదు. వేరేవారికి సోకకుండా ఉంటుంది. ఎవరైనా వాతావరణాన్ని అంచనా వేసుకుని బయటకు రావాలి. మరీ చలి తీవ్రత అధికంగా ఉంటే బయటకు రాకుండా ఉంటే మంచిది. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ వ్యాధులతో బాధపడేవారు బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. ఇన్‌హేలర్లను వాడుతుండాలి.

ఎవరికి ఇబ్బంది..

చలి తీవ్రత నేపథ్యంలో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు వేడివేడిగా సరైన ఆహారం తీసుకోవాలి. పూర్తిగా కప్పి ఉంచేలా వస్త్రాలను ధరించాలి. చలిగాలులు ఉన్నప్పుడు చిన్నారులను బయట తిప్పకూడదు. ఎక్కువరోజులు జలుబు, ఫ్లూ, ముక్కు నుంచి రక్తం రావటం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చలిగాలుల్లో ఆరు బయట పనిచేసే కార్మికులు, వీధుల్లో గడిపే నిరాశ్రయులు జాగ్రత్తగా ఉండాలి.



> **వ్యాధి నిరోధకశక్తి పెంచుకోవాలి..**
>
> చలికాలంలో వ్యాధి నిరోధకత తక్కువగా ఉంటుంది. దీంతో పౌష్టికాహారం తీసుకోవడం చాలా మంచిది. ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన ఉసిరి, నిమ్మకాయల రసం తీసుకోవాలి. ఎక్కువగా నీటిని తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం మరింత మంచిది. విపరీతమైన చలికి జాగ్రత్తలు తీసుకోకపోతే, అవయవాల్లో గాయాలై మరణాలు సంభవించవచ్చు.
>
> – డాక్టర్ ఎం.రాజీవ్, పల్మనాలజిస్ట్, టీజీఎంఎస్ సభ్యుడు

కారణాలు..

ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల వైరస్‌కు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. దీంతో శరీరంలో వైరస్ కణాలు వేగంగా వృద్ధి చెందుతాయి. ఈ వాతావరణంలో ఒకరి నుంచి మరొకరికి వేగంగా ఫ్లూ వ్యాప్తి చెందుతుంది.



నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శనకు అందుబాటులో ఉంటుంది.
- జె.ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈశ్వరీబాయి 106వ జయంతి వేడుకలు రవీంద్రభారతిలో సాయంత్రం 5.30 గంటలకు జరుగుతాయి.
- డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో ఉదయం 10.30 గంటలకు దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఎంపీ అసదుద్దీన్ ఇంట్లో కుటుంబ సర్వే



అసదుద్దీన్ ఇంట్లో సర్వే ఫారం అందజేస్తున్న ఎన్యుమరేటర్ మాధవి

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు శనివారం శాస్త్రీపురం డివిజన్ పరిధి ఒవైసీ హిల్స్‌లోని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఇంటిలో కుటుంబ సర్వే నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌తోపాటు ఎన్యుమరేటర్ మాధవి, జెడీసీ వెంకన్న, సూపర్‌వైజర్ ఉపేందర్, వార్డ్ ఇంచార్జ్ షాహిద్ ఇబ్బంది ఒవైసీ కుటుంబ వివరాలను అడిగి ఫారం నింపారు. అనంతరం ఒవైసీ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జరుగుతున్న సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు.

బలహీనవర్గాలకు హబ్: పొన్నం



టీహబ్‌లో బీఐసీసీఐ అవార్డులు ప్రదానం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

'టీ హబ్'లో బీఐసీసీఐ అవార్డులు –2024 పంపిణీ కార్యక్రమం

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చిందని, అందులో బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలు లేకపోవడంతో వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకుపోయానని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బలహీన వర్గాలకు హబ్ పెట్టాలన్న ఎంఎస్ఎంఈకి సంబంధించిన అంశాలపై చర్చించామని గుర్తుచేశారు. ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకొనేలా ప్రయత్నిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీహబ్'లో బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఆఫ్ చాంబర్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బీసీ పారిశ్రామికవేత్తలకు ఆయన లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల(బీఐసీసీఐ అవార్డులు–2024)ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రజాప్రభుత్వంలో బీసీలందరికీ న్యాయం జరిగేవిధంగా అండగా ఉంటానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బలహీనవర్గాలను పారిశ్రామికంగా ప్రోత్సహించడానికి అవసరమైన సహకారంపై చర్చిస్తామని, ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొనేలా చూస్తానని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో సామాజిక ఇంటింటి కుల సర్వే జరుగుతోందని మంత్రి ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ఈ సర్వేలో అందరూ పాల్గొని సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ ఐఏఎస్ అధికారి నరహరి, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ పారిశ్రామికవేత్తలు, బీఐసీసీఐ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత ఎన్ఆర్ఐ కుటుంబానికి పరిహారం



మణిదీప్ కుటుంబానికి నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

చెక్కు అందించిన మంత్రి శ్రీధర్‌బాబు

లక్డీకాపూల్: విదేశాల్లో ఉన్న భారత విద్యార్థుల హక్కులను పరిరక్షించడంలో కోర్ ట్రాకర్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అమెరికాలోని కాన్సాస్ రాష్ట్రంలోని లివ్ అపార్ట్‌మెంట్స్ స్విమ్మింగ్ పూల్ వద్ద జరిగిన ఘటనలో మృతి చెందిన ఎన్ఆర్ఐ విద్యార్థి కొల్లి మణిదీప్ కుటుంబానికి ఆ సంస్థ స్ఫూర్తిదాయకమైన సేవలను అందించిందంటూ సంస్థ చైర్మన్ విక్రంసాగర్ పసాలను అభినందించారు. శనివారం మాదాపూర్ టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో మణిదీప్ కుటుంబానికి భారీ నష్టపరిహారం చెక్కును మంత్రి ఆందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఐటీ టెక్నాలజీ సంస్థ కోర్ ట్రాకర్ కృషి ఫలితంగా బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందిందని పేర్కొన్నారు. అమెరికాలో ప్రముఖ న్యాయవాది, హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ క్యూ ఆరిఫ్ బలమైన ఆధారాలు సేకరించి అపార్ట్‌మెంట్ నిర్వాహకుల నిర్లక్ష్యమే ఈ దుర్ఘటనకు కారణమని వాదనను సమర్థవంతంగా వినిపించారని కొనియాడారు.

పోస్టింగ్‌ల్లో పారదర్శకత అవసరం: డీఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టింగ్‌లు కేటాయించడంలో పారదర్శకత పాటించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖలలో టీజీపీఎస్సీ గ్రూప్–4 ద్వారా నూతనంగా జిల్లాలో ఎంపికైన అభ్యర్థుల నియామకాలపై శాఖలవారీగా ఆయన సమీక్షించారు. జిల్లాలో వివిధ శాఖల్లో గల 1059 జూనియర్ అసిస్టెంట్, ఇతర పోస్టులకు అభ్యర్థులు వివిధ పోస్టులకు ఎంపికయ్యారని, డిసెంబర్ 4న సీఎం చేతుల మీదుగా ఉద్యోగ నియామకపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆ దిశగా హైదరాబాద్ జిల్లాలోని 1059 మంది అభ్యర్థులకు సంబంధించి శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎక్కడ కూడా సమస్యలు ఉత్పన్నం కాకుండా పలు జాగ్రత్తలు చేపట్టాలను సూచించారు. ఉద్యోగ నియామకపత్రాలు సిద్ధంతోపాటు అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరుదైన మొక్కలకు నిలయం బొటానికల్ గార్డెన్

యూఏఈ జాతీయ దినోత్సవాల్లో మొక్కలు నాటిన కాన్సుల్ జనరల్



బొటానికల్ గార్డెన్‌లో జమ్మి చెట్టు నాటిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కాన్సుల్ జనరల్

గచ్చిబౌలి: అరుదైన మొక్కలకు, రకరకాల పక్షులకు బొటానికల్ గార్డెన్ నిలయంగా మారిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ హైదరాబాద్ కాన్సుల్ జనరల్ ఆరీఫ్ అలీఅల్ తబుర్ అల్‌నుయిమి అన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ హైదరాబాద్ పర్యవేక్షణలో యూఏఈ 53వ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని 53 రకాల అరుదైన జాతి మొక్కలను బొటానికల్ గార్డెన్‌లో శనివారం నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో 2 వేల రకాల అరుదైన మొక్కలకు ఇది అనువైన ప్రదేశంగా తీర్చిదిద్దిన టీజీఎఫ్‌డీసీని అభినందించారు. టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ మాట్లాడుతూ వైవిధ్యపరంగా లక్ష మొక్కలు, రకరకాల పక్షులు బొటానికల్ గార్డెన్‌లో ఉన్నాయన్నారు. రకరకాల పాఠశాలల నుంచి రోజుకు 800 మంది విద్యార్థులు స్టడీటూర్‌లో భాగంగా ఇక్కడికి వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎండీ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ వి.తనూజ, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, డిప్యూటీ ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ మేనేజర్ సుమన్, బొటానిస్ట్ డాక్టర్ వీరకిషోర్, హఫీజ్, హజీ కాన్సుల్ జనరల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పటి 'నుండి'.. ఆగిన రిజిస్ట్రేషన్లు

- 168 సర్వే నంబర్ల భూముల క్రయవిక్రయాలకు బ్రేక్
- రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ ఒక్క పదం తెచ్చిన అవస్థలు
- మూడు నెలలుగా కుత్బుల్లాపూర్‌లో పరిస్థితి ఇదీ



సూరారంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం..

సుభాష్‌నగర్: నిత్యం క్రయవిక్రయదారులతో రద్దీగా ఉండే కుత్బుల్లాపూర్ రిజిస్ట్రార్ కార్యాలయం మూడు నెలలుగా దాదాపుగా వెలవెలబోతోంది. దీనికి కారణం కేవలం ఒక్క పదమే కారణమంటే ఆశ్చర్యంగా ఉన్నా, అదే నిజం. ఉన్నతాధికారుల ఉత్తర్వుల్లో 'మరియు'అనే పదం స్థానంలో 'నుండి'అనే పదం టైపింగ్ చేయడమే ఆ పరిస్థితికి కారణం. అప్పటి 'నుండి'రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఆ ఒక్క పదంతో రెండు సర్వే నంబర్లకు బదులు ఏకంగా 168 సర్వే నంబర్లలోని వందల ఎకరాల స్థలాల రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడింది. దీనికి హైడ్రా కూడా తోడవడంతో క్రయవిక్రయాలు భారీగా పడిపోయాయి. దీంతో ప్రతిరోజు 100కుపైగా జరిగే రిజిస్ట్రేషన్లు సగానికి తగ్గిపోయాయి.

'మరియు'కు బదులు 'నుండి'

కుత్బుల్లాపూర్ టౌన్ పరిధిలో 58, 226 సర్వే నంబర్లలో వక్ఫ్ బోర్డు స్థలం ఉండటంతో వాటిపై ఎలాంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టరాదని వక్ఫ్ బోర్డు ఆగస్టు 27న ఆదేశాల జారీ చేసింది. ఆదేశాలలో 58 మరియు 226 సర్వే నంబర్లు అని టైపు చేయకుండా పొరపాటున 58 సర్వే నంబర్ నుండి 226 సర్వే నంబరు వరకు అని టైపు చేయడంతో ఏకంగా 168 సర్వే నెంబర్లపై ఈ ఎఫెక్ట్ పడింది. దీంతో వందల ఎకరాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేశారు.

- వాస్తవానికి నిలిపివేసిన సర్వే నంబర్లలో వక్ఫ్ బోర్డ్ స్థలం మొత్తం కేవలం ఒక ఎకరం ఒక గుంట స్థలం ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ 3 నెలల నుంచి నిలిచిపోవడంతో 50 కాలనీలు, పలు బస్తీల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వెంటనే ఆదేశాల్లో దొర్లిన పొరపాటును సరిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. 'రిజిస్ట్రేషన్లు సగం మేర తగ్గిపోవడంతో డాక్యుమెంట్ రైటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపులు, 5 హోటల్స్, మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్లు బోసిపోతున్నాయి' అని రవీందర్ ముదిరాజ్ అనే స్థానికుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **పాత వాటికి రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం..**
>
> 
>
> వక్ఫ్‌బోర్డ్ స్థలం ఉన్న సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశాం. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనర్ ఆదేశాల మేరకు 20 ఏళ్ల క్రితం ఉన్న పాత భవనాలకు, అపార్ట్‌మెంట్లకు రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. కొత్తవాటికి చేయట్లేదు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించాం. వారి ఆదేశానుసారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతాం.
>
> –అశోక్, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఇన్‌బిల్ట్ అల్గారిథమ్ తీసుకురావాలి

డీప్‌ఫేక్‌లను అడ్డుకోవడంపై ఫ్యాక్ట్‌చెక్ ట్రైనర్ ఉడుముల సుధాకర్‌రెడ్డి



గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: డీప్‌ఫేక్‌లను అడ్డుకోవడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఇన్‌బిల్ట్ అల్గారిథమ్ తీసుకురావాలని ప్రముఖ పాత్రికేయుడు, ఫ్యాక్ట్‌చెక్ ట్రైనర్ ఉడుముల సుధాకర్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో శనివారం నిర్వహించిన డేటా సైన్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. డీప్‌ఫేక్‌ల వల్ల విపరిణామాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. మంచి కోసం ఉపయోగించాల్సిన ఏఐ టెక్నాలజీని కొందరు చెడు కోసం వినియోగిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థులను దెబ్బతీయడం కోసం డీప్‌ఫేక్‌లను ఉపయోగిస్తున్నారని, ఏఐ ద్వారా ముఖాలను మార్చడం, సెలబ్రిటీల వాయిస్‌తో ఇతర వ్యాఖ్యలను ఏఐ ద్వారా సృష్టిస్తున్నారని గుర్తుచేశారు. సినీ నటులు, రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారుల ఫేక్ వార్తలను ఈ డీప్‌ఫేక్‌ల ద్వారా సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు డీప్‌ఫేక్‌లను గుర్తించడం కాస్తా సలువుగా ఉండేదని, కానీ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కారణంగా డీప్‌ఫేక్, ఒరిజినల్‌ను కనుగొనడం కష్టంగా మారిపోయిందన్నారు. ఏఐని మంచికి కాకుండా చెడు కోసం ఉపయోగిస్తూ ఉండటమే ఈ పరిణామాలకు కారణమవుతోందన్నారు.

సెలబ్రిటీల పరువు తీయడానికి...

సెలబ్రిటీల పరువు తీయడానికి, కొందరిని లక్ష్యంగా పెట్టుకొని సోషల్ మీడియాలో దాడులు చేయడానికి, మతాల మధ్య చిచ్చుపెట్టడానికి ఈ డీప్‌ఫేక్‌లను ఉపయోగిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ఇంకా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో తప్పుడు సమాచార వ్యాప్తిని అడ్డుకోవడం కోసం ఫ్యాక్ట్ చెకర్లు మిస్ ఇన్ఫర్మేషన్ కాంబాట్ అలయెన్స్‌ను స్థాపించారని గుర్తు చేశారు. అందులో భాగంగా డీప్‌ఫేక్ అనాలిస్ యూనిట్‌ను కూడా తీసుకొచ్చారని అన్నారు. ఈ సమ్మిట్‌ను బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ ఓవెన్ ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణాసియా సైబర్‌లీడ్ బ్రిటీష్ కమిషనర్ లారా బాల్విన్, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, ఐపీఎస్ అధికారులు అజయ్‌కుమార్ యాదవ్, రోహిత్ మాల్పని, సైబర్‌పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేజర్ వినీత్‌కుమార్, పలువురు ఐఎస్‌బీ ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, ఆదివారం, 1, డిసెంబర్, 2024

సివిల్ సర్వీసెస్ దేశంలోకెల్లా అత్యంత కఠినమైన పరీక్ష అంటారు. నిజమే మూడంచెలుగా ఉండే ఈ ప్రక్రియ కూడా చాలా కష్టతరంగా ఉంటుంది. ఒక్కో దశ దాటాలంటే తీవ్రంగా కష్టపడాల్సి వస్తుంది. ప్రిపరేషన్ కూడా అంత సులువైన విషయం కాదు. అందుకే చాలా మంది ఇన్‌స్టిట్యూట్స్‌లో చేరి కోచింగ్ తీసుకుంటుంటారు. ఒకప్పుడు సివిల్స్ కోచింగ్ అంటే ఢిల్లీ వెళ్లాల్సిందే. అక్కడే నెలలు, సంవత్సరాల తరబడి కోచింగ్ తీసుకుని, ప్రిపరేషన్ అయితే కానీ అత్యున్నత ఉద్యోగాన్ని సాధించడం సులువు కాకపోయేది. కానీ కరోనా తర్వాత ఈ ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. మన భాగ్యనగరం సివిల్స్ కోచింగ్‌కు హబ్‌గా మారిపోయింది. దీంతో ప్రిపేర్ అయ్యే వారు అశోక్‌నగర్‌కు క్యూ కడుతున్నారు. అంతేకాకుండా కోచింగ్ సెంటర్లు విపరీతంగా పెరిగిపోయాయి. ఢిల్లీతో పోల్చుకుంటే అశోక్‌నగర్‌ను ఎందుకు ఎంచుకుంటున్నారు..? అనుకూల అంశాలేంటి.. నాణ్యతగల కోచింగ్ లభిస్తోందా..? వంటి అంశాలను తెలుసుకుందాం. - సాక్షి, సిటీబ్యూరో

చివాస్ పెర్ఫ్యూమ్ ఆవిష్కరణ

'చివాస్ లక్స్ కలెక్టివ్ పెర్ఫ్యూమ్'ను హీరో నాగ చైతన్య ఆవిష్కరించారు. ఈ మేరకు తారామతిలో శనివారం జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇదే వేదికపై పలువురు ఫ్యాషన్ భామలు హొయలు ఒలకబోశారు. ఈ కార్యక్రమంలో ఆల్కెమిస్ట్ జయంతి రెడ్డి, చివాస్ లక్స్ కలెక్టివ్ ఆల్కెమీ, సునీల్ సేథీ, డిజైన్ అలయన్స్ వ్యవస్థాపకుడు సునీల్ సేథీ, ఏస్ డిజైనర్ ఆశిష్ ఎన్ సోనీ తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో







టాప్ పోస్ట్.. సిటీ హోస్ట్!

కోచింగ్‌కు అడ్డాగా మారిన అశోక్‌నగర్

సాధారణంగా ఢిల్లీలో వాతావరణం గురించి తెలిసిందే. చలికాలంలో అక్కడి వాతావరణ పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయి. తీవ్రమైన వాయు కాలుష్యంతో బయటకు వెళ్లేందుకు కూడా జంకుతుంటారు. పైగా అక్కడ జీవన వ్యయం కూడా ఇక్కడితో పోల్చుకుంటే రెండు, మూడు రెట్లు అధికంగా ఉంటుంది. భోజనం కూడా మనకు నచ్చినట్టు ఉండదు. నార్త్ ఇండియన్ వంటకాలు మన శరీర తత్వానికి సరిపడవు. ఆ ఫుడ్‌కు అలవాటు పడేందుకు కాస్త ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇక ఏడాది కాలంలో ఢిల్లీలో విద్యుత్ షాక్, వరదలతో సెల్లార్‌లోకి నీళ్ల రావడం వంటి కారణాలతో పలువురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి చాలా మంది తల్లిదండ్రులు అదే కోచింగ్ హైదరాబాద్‌లో తీసుకోవచ్చనే ఆలోచనకు వస్తున్నారు. ఈ కారణాలన్నీ మన హైదరాబాద్‌కు పాజిటివిటీని తీసుకొచ్చాయి అనొచ్చు.

ఆన్‌లైన్ క్లాసులతో..

కరోనా ముందు వరకూ ప్రిపరేషన్ అంటే దాదాపు ఢిల్లీకి వెళ్లాల్సిందే అనే ఆలోచన అభ్యర్థుల్లో ఉండేది. అయితే కరోనా తర్వాత ఆ పరిస్థితులు మారాయి. ఎక్కడి నుంచైనా టాప్ ఇన్‌స్టిట్యూట్ అనే వాటిల్లో కూడా ఇంట్లో ఉండే కోచింగ్ తీసుకునే వెసులుబాటు వచ్చింది. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకునే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దీంతో చాలా సంస్థలు ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వడం మొదలుపెట్టాయి. కరోనా అనంతరం విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసుల కన్నా నేరుగా క్లాసులు వినేందుకు మొగ్గుచూపారు. దీంతో ఆన్‌లైన్ సంస్థలు కాస్త ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో సంస్థలు ఏర్పాటు చేస్తేనే బెటర్ అని చాలా మంది నగరంలో సంస్థలు ఏర్పాటు చేశారు.



వికేంద్రీకరణ జరుగుతోంది..



సివిల్స్ కోచింగ్ అంటే ఢిల్లీ వెళ్లాలనే భావన క్రమంగా తగ్గుతోంది. మెటీరియల్ కానీ, టెస్ట్ సిరీస్ కానీ ఢిల్లీలోనే దొరికేవి. కానీ ఇప్పుడు అక్కడి సంస్థలకు దీటుగా ఇక్కడ కూడా అన్నీ అందుబాటులోకి వచ్చాయి. నైపుణ్యం గల టీచర్లు కూడా ఉన్నారు. అక్కడి ప్రతికూల పరిస్థితుల వల్ల చాలా మంది హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నారు. సక్సెస్ శాతం కూడా ఢిల్లీకి సమానంగానే ఉంది. ఇక్కడ మన రాష్ట్రంతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా విద్యార్థులు వస్తున్నారు.
- బాల లత, సివిల్స్ మెంటార్

అన్నీ ఇక్కడే అందుబాటులో..



టెస్ట్ సిరీస్ రాసేందుకు ఢిల్లీకే వెళ్లేవారు. కానీ క్వాలిటీతో టెస్ట్ సిరీస్‌లను ఇచ్చే సంస్థలు మన దగ్గర కూడా అందుబాటులోకి వచ్చాయి. ఆప్షనల్స్‌కు కూడా మంచి మెటీరియల్ లభ్యం కాకపోయేవి. కానీ ఇప్పుడు అన్ని రకాల సోర్స్ మనకు దొరుకుతున్నాయి. సబ్జెక్ట్ పరంగా ప్రత్యేక కోచింగ్ తీసుకునే వెసులుబాటు వచ్చింది.
- బొప్పని జగన్‌మోహన్, సివిల్స్ అభ్యర్థి

అశోక్‌నగర్‌కు క్యూ..



ఇదే మంచి అవకాశమని ఇటు అభ్యర్థులు, అటు కోచింగ్ సంస్థల నిర్వాహకులూ భావించి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. అభ్యర్థులు భారీగా అశోక్‌నగర్‌కు రావడమే కాకుండా.. కోచింగ్ సంస్థలు కూడా ఈ బూమ్‌ను క్యాష్ చేసుకునేందుకు ఎక్కువగా వెలుస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకే కాకుండా కోచింగ్ సంస్థల మధ్య కూడా భారీగా కాంపిటీషన్ పెరిగిందని చెప్పొచ్చు.

వరుస నోటిఫికేషన్లతో..

రాష్ట్ర ప్రభుత్వం సర్కారు కొలువులకు నోటిఫికేషన్లు ఇవ్వడం, పరీక్షలు నిర్వహిస్తుండటంతో సివిల్స్ ప్రిపేర్ అయ్యే వారు కూడా రాష్ట్రస్థాయి పరీక్షల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూశారు. దీంతో నగరంలోని చాలా ఇన్‌స్టిట్యూషన్స్ సివిల్స్ కోచింగ్‌తో పాటు టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సంబంధించి కోచింగ్ ఇవ్వడం, టెస్ట్ సిరీస్‌లను రూపొందించడం వంటివి చేస్తున్నారు.

ఆవిష్కరణలే.. మార్పుకు కీలకం

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్తులో అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలు ప్రపంచ స్థాయిలో మార్పుకు సారథ్యం వహిస్తాయని సిమెన్స్ ఇండియా ఎండీ, సీఈఓ సునీల్ మాథుర్ అన్నారు. ఐఎంటీ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ) హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేగంగా వృద్ధి చెందుతున్న రంగాల్లో పోటీతత్వాన్ని అలవర్చుకుని ముందంజలో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతర అభ్యాసం, నెట్‌వర్కింగ్ భవిష్యత్తు విజయాలకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. ఐఎంటీ హైదరాబాద్ డీన్ (అకడమిక్స్) డాక్టర్ చక్రపాణి చతుర్వేదుల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీహర్ష రెడ్డి, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



గ్యాప్ కాదు.. ప్రిపరేషన్..

తెలుగు సినిమా ఇండస్ట్రీ సొంత ఇల్లు. నా మనసు ఎప్పుడూ ఇంట్లోనే ఉంటుందని దేవకీనందన వాసుదేవ ఫేమ్, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో నిర్వహించిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న ఆమె సాక్షితో ముచ్చటించారు. 2020లో మిస్ ఇండియాగా ఎంపికయ్యాను. 2024లో తెలుగు సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చా. ఈ మధ్య కాలంలో చాలా గ్యాప్ తీసుకున్నారని పలువురు అంటున్నారు.. అయితే ఇది గ్యాప్ కాదు.. నాకు ప్రిపరేషన్‌లా అనిపిస్తోంది. ముంబై నుంచి తిరిగి హైదరాబాద్ చేరుకోవడం చాలా సంతోషంగా ఉంది. నా ఫ్యాషన్ ఎప్పుడూ సినిమాపైనే. మొన్ననే దేవకీనందన వాసుదేవ రిలీజ్ అయ్యింది. చేతిలో కొన్ని ప్రాజెక్టులు ఉన్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



- ఫ్యాషన్ షోలో దేవకీనందన వాసుదేవ ఫేమ్ నటి, మాజీ మిస్ ఇండియా మానస వారణాసి
- ర్యాంప్ వాక్‌తో అదరగొట్టిన మోడల్స్

వివిధ రకాల థీమ్స్ వస్త్రాలతో మోడల్స్ ర్యాంప్ వాక్ చేశారు. డిజైనర్ అర్జెంటుమ్ ఆర్ట్స్ రాజ్ దీప్ రణవ్ తీర్చిదిద్దిన డిజైనర్ దుస్తులను మోడల్స్ ర్యాంప్‌పై ప్రదర్శించారు. ప్రదర్శనలో భాగంగా డిజైనర్లు లక్ష్మీ రెడ్డి, వస్త్రలేఖ, మంగళగౌరి, ఆదరణ, విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్, యక్షి దీప్తి రెడ్డి, అంజలీ, అర్జున్ కపూర్ ప్రముఖ డిజైనర్స్‌కు చెందిన కలెక్షన్లు, ప్రముఖ సినీ తారలు మానస వారణాసి, సీరత్ కపూర్, ప్రజ్ఞ అయ్యగారి, మాళవిక మోహన్, నేహా శెట్టి షో టాపర్స్‌గా మెరిశారు. ఈ మోడల్ షోలో 16 మంది డిజైనర్లు రూపొందించిన సరికొత్త డిజైన్లను రెండు రోజుల పాటు ప్రదర్శించనున్నారు. హైదరాబాద్‌తో పాటు ముంబై, ఢిల్లీ ప్రాంతాలకు చెందిన మోడల్స్ ర్యాంప్‌పై సందడి చేశారు.



అలరించిన 'ఘంటసాల గానామృతం'

గన్‌ఫౌండ్రీ : తెలుగు సంగీత ప్రపంచంలో ఘంటసాల చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రవీంద్రభారతిలో శ్రీ వాసవి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మ శ్రీ పురస్కార గ్రహీత ఘంటసాల 102వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు కోటికి ఘంటసాల అవార్డును ప్రదానం చేశారు. అంతకు ముందు ఘంటసాల గానామృతం పేరిట నిర్వహించిన సంగీత విభావరి అహూతులను ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె దామోదర్ గుప్తా, సుప్రీమ్ కోర్టు న్యాయవాది జీవీఎస్‌ఆర్‌ఎస్ వరప్రసాద్, గేయ రచయిత కృష్ణమోహన్, అసోసియేషన్ అధ్యక్షులు ముకుటేశ్వర్ రావు పాల్గొన్నారు.

102వ జయంతి సభలో ప్రముఖ సంగీత దర్శకుడు కోటికి ఘంటసాల అవార్డు ప్రదానం



ఆరు రీతుల అద్భుత నృత్యం

- ఒకే వేదికపై 88 మంది కళాకారుల ప్రదర్శన
- శిల్పకళావేదికలో వైభవంగా నాట్యతోరణం-2024

చందానగర్ : ఒకటి కాదు, రెండు కాదు ఒకేసారి.. ఒకే వేదికపై ఆరు రకాల నృత్యరీతులను అత్యంత అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపజేశారు. అమ్రిత కల్చరల్ ట్రస్ట్ నాట్య తోరణం-2024 కార్యక్రమం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, ఆదాయపన్ను శాఖ మాజీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పీవీ రావు హాజరయ్యారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులందరికీ ఈ రంగంలో అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రఖ్యాత నాట్యగురువులు కళాకృష్ణ, అనితా గుహ, చావలి బాల త్రిపురసుందరి, నీనా ప్రసాద్, శామా భాటే, బిచిత్రా నంద స్వైన్, పేరిణి కుమార్ సారథ్యంలో ఈ కళాకారులంతా తమ ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. భరతనాట్యం, కూచిపూడి, మోహినీ అట్టం, కథక్, ఒడిస్సీ, ఆంధ్రనాట్యం లాంటి నృత్యరీతులకు చెందిన కళాకారిణులు ఒక్కో విభాగంలో 6 నుంచి 10 మంది చొప్పున రీతులను ప్రదర్శించారు. అనంతరం చేసిన జుగల్ బందీ ప్రేక్షకులను కట్టిపడేసింది. అమిత్ర కల్చరల్ ట్రస్టును పగడాల రాజేష్, భార్గవి దంపతులు ప్రారంభించారు. రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి టీవీ నరసింహారావు, పద్మ శ్రీ పద్మజారెడ్డి, కోటి సుర్య ప్రభ, శిల్పా రెడ్డి, టీవీ9 రజనీకాంత్, పద్మ శ్రీ ఉమామహేశ్వరి, మాదాల రవి, ఆశ్రిత వేముగంటి, సీతా ఆనంద్ వైద్యం, రేవతి పుష్పాల, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.





అభివృద్ధికి ఎవరు మాత్రం కాళ్లు అడ్డుతారు? అయితే అభివృద్ధి అనుకున్నది ఊరువాడకు చేటు చేసేలా ఉందని అనిపిస్తే... ఆందోళన మొదలవుతుంది. మంచి అని చెబుతున్నది 'చెడు' చేయడానికి వస్తుంది అనుకుంటే ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటుంది. ఆ ఆందోళన. ఆగ్రహం ఉద్యమ రూపం దాల్చుతుంది.

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. ఇది ఉద్యమ విజయం.

ఈ ఉద్యమ ప్రత్యేకత... మహిళా శక్తి.



ఇథనాల్‌పై గెలుపులో అంతా ఆమే!

అక్షరజ్ఞానం లేని మహిళల నుంచి చదువుకున్న మహిళల వరకు, కూలిపనులు చేసుకునే శ్రామిక మహిళల నుంచి ఇంటిపనుల్లో తల మునకలయ్యే గృహిణుల వరకు ఈ ఉద్యమంలో భాగం అయ్యారు. ఉద్యమానికి వెన్నెముకై ముందుకు నడిపించారు. మరో వైపు....ఆ ఉద్యమంలో ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా వెయ్యి కళ్లతో పర్యవేక్షించిన మహిళా అధికారులు. ఆర్డీఓ రత్నకల్యాణి, శాంతిభద్రతలు అదుపుతప్పకుండా చూసిన ఎస్పీ జానకీషర్మిల, ఎప్పటికప్పుడు సీఎంఓకు సమాచారమిస్తూ చర్చలు జరిపిన కలెక్టర్ అభిలాష అభినవ్... ఇలా ఎంతోమంది మహిళలు ఉన్నారు.

'ఉన్న ఊరు కన్నతల్లి' అంటారు. ఆ కన్నతల్లి కళ్లలో కలవరం మొదలైంది. నవ్వుతూ పచ్చగా పలకరించే పొలంలో కళ తప్పింది. ఊరి చెరువు దుఃఖసముద్రం అయింది. 'ఇక మన ఊరు మనుపటిలా ఉండదా?'

'ఇథనాల్ పరిశ్రమ కాలుష్య పడగనీడలో భయంభయంగా మనుగడ సాగించాల్సిందేనా?'....ఇలా ఎన్నో ప్రశ్నలు, ఆందోళనల మధ్య ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక ఉద్యమం మొదలైంది.

నమ్ముకున్న పొలాలే లేకుంటే...

'మాకు పట్టెడన్నం పెట్టే పంట పొలాలే లేకుంటే రేపొద్దున్న మా పరిస్థితి ఏంటన్న ప్రశ్నే మమ్మల్ని ఇంతలా కదిలించింది' అంటున్నారు ఉద్యమశంఖారావం పూరించిన మహిళలు. నిజామాబాద్ జిల్లాలో అంకాపూర్ ఎలాగో నిర్మల్ జిల్లాలో దిలావర్‌పూర్–గుండంపల్లి ప్రాంతాలు అలాగ. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌కు ఆమడదూరంలో ఉండే ఈ నేలంతా వ్యవసాయాధారితమే. ఇంటిల్లిపాది పొద్దున్నే పంటచేలోకి వెళ్తారు. అలాంటి చోట ఇథనాల్ ఫ్యాక్టరీ పెట్టడం ఆ రైతు కుటుంబాలు, గ్రామాలను కలవరపెట్టింది.

ఊరూరా..ఇంటింటికీ..

పొద్దున్నే పొలాలు, చేలకు వెళ్లి మధ్యాహ్నం కల్లా ఇంటికి తిరిగి వచ్చే మహిళలు ఆ తరువాత ఉద్యమబాటలో కదిలేవారు. తోటి మహిళలతో కలిసి తమ ఊళ్లో ప్రతి ఇంటికీ వెళ్లేవాళ్లు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు వల్ల ఏం నష్టపోతాం, భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులు ఎలా ఉంటాయో వివరించేవారు. పక్కనున్న గ్రామాలకు కూడా వెళ్లి మహిళలతో మాట్లాడేవారు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఉద్యమకార్యాచరణ అనేది వారి దైనందిన జీవితంలో భాగం అయింది.

లాఠీలతో కొట్టినా... ఇగ వెనక్కి తగ్గద్దు అనుకున్నాం

'మా ఊళ్లు బాగుండాలన్నా, మా పిల్లల భవిష్యత్తు భద్రంగా ఉండాలన్నా పచ్చని మా పల్లెల్లో చిచ్చుపెట్టే ఆ ఫ్యాక్టరీ ఉండొద్దని అనుకున్నాం. ఊళ్లో మగవాళ్లు చేస్తున్న పోరుకు ఎప్పుడూ ఏదో ఒక అడ్డంకి వస్తూనే ఉంది. అందుకే ఈసారి మేమే ముందుండాలని నిర్ణయించుకున్నాం. పోలీసులు అరెస్టులే చెయ్యనీ, లాఠీలతో కొట్టనీ... ఇగ వెనక్కు తగ్గేది లేదని గట్టిగ అనుకునే ముందుకొచ్చాం..' అంటుంది గుండంపల్లికి చెందిన శ్వేతారెడ్డి.

'క్షణం తీరిక లేకుండా పొలం పనులు, ఇంటి పనులు. అయినంత మాత్రాన ఊరు ఎటుబోతే నాకేంది అనుకోలేము కదా. ఇది ఒక్కరి సమస్య కాదు. ఊరందరి సమస్య. కాబట్టి ఎంత పని ఒత్తిడి ఉన్నా ఉద్యమంలో భాగం అయ్యాను' అంటుంది ఒక రైతు బిడ్డ.

.....ఎవరి మాట ఎలా ఉన్నా మహిళలందరూ ఉద్యమ బాట పట్టారు. మహిళలే ఉద్యమం అయితే ఆ శక్తి ఎలా ఉంటుందో మరోసారి నిరూపించారు.

– రాసం శ్రీధర్, సాక్షి, నిర్మల్

అందరం ఒక్కటై...

మన ఊళ్లు బాగుండాలని చేపట్టిన ఉద్యమంలో మనమంతా భాగం కావాలని మా గ్రామ మహిళలందరం నిర్ణయించుకున్నాం. ఇది ఏ ఒక్కరి కోసం చేసేది కాదని, మన ఊళ్లు, పిల్లలు బాగుండాలని చేస్తున్నామని చెబుతూ అందరూ ఇందులో భాగమయ్యేలా చేశాం.

– ఆలూరు లక్ష్మి, దిలావర్‌పూర్



నిద్రలేని రాత్రులు

దిలావర్‌పూర్–గుండంపల్లి ఊళ్ల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ పెడుతున్నారట అని తెలిసినప్పటి నుంచే మాలో ఆందోళన మొదలైంది. ఆ పరిశ్రమతో భవిష్యత్‌లో మా ఊళ్లు, పంటచేలు దెబ్బతింటాయని తెలిసినప్పటి నుంచి ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం. మా పిల్లల భవిష్యత్తు కోసం ఇక ఏమైనా పర్వాలేదనే ముందుకు వచ్చాం.

– కొమ్ముల శ్వేతారెడ్డి, గుండంపల్లి



రెండడుగులు వెనక్కి వేసి...

తీవ్ర అస్వస్థతకు గురైన ఆర్డీవో రత్నకల్యాణిని ఎస్పీ జానకీశర్మ స్వయంగా రోప్‌పార్టీతో వెళ్లి బయటకు తీసుకువచ్చింది. దిలావర్‌పూర్‌లో తమపై రాళ్లు రువ్వుతున్నా, ఎక్కడా ఆవేశపడకుండా తమ బలగాలను శాంతియుతంగా నడిపింది. తాను వెనకడుగు వేస్తూ ఉద్యమకారులకు దగ్గరైంది. చివరకు 'ఎస్పీ జిందాబాద్' అని అనిపించుకుంది.



● మజిలీ



'గీతాంజలి'లో నాగార్జున, గిరిజ



యోగాంజలి

– ఎందుకంటే సినిమా కంటే ధ్యానం ఇష్టం

'ఔత్సాహికులకు 60 పౌండ్లు మాత్రమే. వెంటనే రిజిస్టర్ చేసుకోండి' అంటున్న పూర్వ సినీనటి గీతాంజలి యోగా ప్రస్థానం ఆసక్తి కలిగిస్తోంది. 'గీతాంజలి' సినిమాతో ఒక వెలుగు వెలిగిన గిరిజా షెట్టార్ యు.కె.లో స్థిరపడింది. 35 ఏళ్ల తర్వాత ఇటీవలే ఒక కన్నడ సినిమాలో సింగిల్ మదర్‌గా నటించిన గిరిజ 'ఆ పాత్ర స్థితి. నా స్థితి ఒకటే కనుక ఒప్పుకున్నాను' అని చెబుతోంది. గతంలో పత్రికా రిపోర్టర్‌గా పని చేసిన గిరిజ ఇప్పుడు మనిషికి ఆరు వేల రూపాయల ఫీజుతో యోగా నేర్పిస్తోంది. ఆమె రాబడి ఎలా ఉన్నా యోగా అవసరం గురించి ఆమె చెప్పున్న విషయాలు అందరూ వినదగ్గవి.

'2023 సంవత్సరం మే నెలలో నాకు అనిపించింది ఇక మీదట నేను యోగా, ధ్యాన మార్గాలలో మార్గదర్శిగా నిలవాలని. ఆ నిర్ణయం తీసుకున్నాక ఎంతోమందికి సాయపడుతున్నాను' అంటున్నారు గిరిజ. 'గీతాంజలి' (1989) సినిమాతో నేటికీ మరపు రాని ఈ నటి చాలా యేళ్లుగా యు.కె.లో స్థిరపడినా, రకరకాల ఉద్యోగాలు చేసినా 55 ఏళ్ల వయసులో యోగా టీచర్‌గా నూతన ప్రస్థానం సాగిస్తున్నారు. భారతీయ సినిమాలు చూడటమే మానేసిన గిరిజ అందుకు కారణం ఏమంటారంటే 'చూశానంటే మనసు పాడవుతుంది. ఆ సినిమాలలో నేను చాలా చేసి ఉండే అవకాశం ఉండెప్పుడు. అవన్నీ వదులుకొని వచ్చినందుకు ఒక్కోసారి అది సరైన నిర్ణయం కాదని అనిపిస్తుంది' అంటారు.

2024 సెప్టెంబర్ 5న విడుదల అయిన 'ఇబ్బని తబ్బిద ఇలెయాలి' అనే కన్నడ సినిమాలో సింగిల్ మదర్‌గా నటించారు గిరిజ (ప్రైమ్ టైమ్‌లో ఉంది). 'నేను ఉన్న స్థితి ఆ పాత్ర స్థితి ఒక్కటే కనుక నిర్మాత రక్షిత్ శెట్టి అడిగాక అంగీకరించాను' అంటారామె. అయితే సినిమాల మీద కంటే ఆమె ధ్యాస, ఆసక్తి కేవలం యోగా గురువుగా తాను చేయవలసిన సేవ మీదే ఉన్నట్టుగా ఆమె మాటలను బట్టి అర్థమవుతోంది.

గీతాంజలి గర్ల్

తెలుగు మూలాలు ఉన్న కన్నడ తండ్రికి, యు.కె.కు చెందిన క్రిస్టియన్ తల్లికి జన్మించిన గిరిజ తన 17వ ఏట వరకూ యు.కె.లోనే పెరిగారు. ఆ తర్వాత ఇండియా వచ్చి పదేళ్లపాటు ఉన్నారు. ఆ సమయంలోనే గీతాంజలిలో నాగార్జున పక్కన నటించి గొప్ప ఫ్యాన్ ఫాలోయింగ్‌ను పొందారు. ఆ తర్వాత కేవలం రెండు మూడు సినిమాలు చేసిన గిరిజ వివాహం చేసుకుని లండన్‌లో స్థిరపడ్డారు. కొన్నాళ్లు ఒక బిజినెస్ పత్రికకు, మరికొన్నాళ్లు మరో పత్రికకు రిపోర్టర్‌గా పని చేశారు. సముద్రయాన కార్మికుల మానవ హక్కుల కోసం కూడా పని చేశారు. ఆమె ముందు నుంచి యోగ సాధకురాలు. అంతేకాకుండా యోగాలో పీహెచ్‌డీ చేశారు. రాజయోగ ను ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. వివిధ దేశాలలో యోగా కోర్సులు కూడా చేశారు. వీటన్నింటి భూమికతో ఆమె తాను తెలుసుకున్నది ఇతరులకు చెప్పాలని ఇప్పుడు యోగా టీచర్‌గా మారారు.

ఆమె చెప్పున్న విషయాలు

- మీలో చెడు భావాలు, నెగెటివిటీ ఉన్నాయంటే మీలోని దైవత్వం సుషుప్తిలో ఉన్నట్టే. మీలోని దివ్యత్వాన్ని మీరు మేల్కొలిపితే ఈ మలినాలు పోతాయి.
- మీలోని మంచి లక్షణాలను మీరు తరచూ గుర్తు చేసుకోవాలి. లేకపోతే మీలోని మంచి లక్షణాలను మీరు చూడటం మొదలెడితే ఇతరులలోని మంచి లక్షణాలు కూడా కనిపించడం మొదలెడతాయి.
- మొత్తం మీరే చేయాలేమో అన్న భావనతో అలసిపోవద్దు. మీరు చేయాల్సింది చేయండి మీతోపాటు విశ్వాత్మ కూడా దానికోసం పాటుపడుతుంది. అది గ్రహింపులోకి వస్తే మీరు అలసిపోరు. నేను పత్రికలో పనిచేసేటప్పుడు డెడ్‌లైన్ సమయంలో పేజీలు ఖాళీగా ఉంటే చాలా టెన్షన్ పడేదాన్ని. కాని సమయానికి అన్నీ ఆటోమేటిక్‌గా పూర్తయ్యేవి. అంటే మనతో పాటుగా మన ఆత్మ, విశ్వాత్మ కూడా పని చేస్తున్నాయన్న మాట.
- ధ్యానం మీ స్వభావానికి రక్షణ కల్పిస్తుంది. మీ ఆత్మకు రక్షణ కల్పిస్తుంది. మిమ్మల్ని అనుక్షణం చూసుకునే ఆప్తుని తోడు ఉంటే ఎలా ఉంటుందో యోగ, ధ్యానాలు మీకు తోడైతే అలాంటి భావన కలుగుతుంది.
- చెడు చాలా పరిమితం. మంచి అనంతం. ఆ అనంతమైన మంచిని మనలో నిత్యం జాగృతం చేసుకుంటూ ఉంటే మంచి జీవనం తప్పకుండా మనకు చేరువ అవుతుంది.

యోగా ఒక రక్షణ

'నేను కోవిడ్ సమయంలో తీవ్రంగా అనారోగ్యం బారిన పడ్డాను. వైరస్ నా బ్రెయిన్ వరకూ వెళ్లనుందని అర్థమైంది. అయినా, నేను భయపడలేదు. నా యోగతో, ధ్యానంతో కోవిడ్ నుంచి బయటపడ్డాను. శరీరం, మనసు ప్రశాంతతను కోల్పోకుండా ఉంటే చాలా విజయాలు సాధించవచ్చు. యోగా శరీరాన్ని, ధ్యానం మనసును అలజడుల నుంచి కాపాడుతాయి. అంతేకాదు, అంతర్గత శత్రువులను నెమ్మదింప చేస్తాయి. నేను రోజుకు మూడుగంటలు ధ్యానం చేస్తాను. మీరు కనీసం అరగంట అయినా చేయండి. లేదంటే నిద్ర లేవగానే కనీసం పది నిమిషాలు చేయండి. 'ఓ విశ్వాత్మా... ఈ జగత్తులో నన్ను ఒక సంపదగా గ్రహించు' అని వేడుకోండి. అంతా మంచే జరుగుతుంది. ఓపిక పట్టాలి... కాలం చాలా గాయాలను మాన్పుతుంది... మీరు దానికి అనుమతిస్తే' అంటారు గిరిజ.



ఇప్పుడు గిరిజ

● హెచ్‌ఐవీక్షణం



పొంచే ఉంది.. కొంచెం జాగ్రత్త

నేడు వరల్డ్ ఎయిడ్స్ డే

ఎయిడ్స్ పీడ బయటపడ్డ తొలినాళ్లలో తీవ్రమైన అనారోగ్యం, దారుణంగా క్షీణించి కదిలే కంకాళాల్లా ఉండే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. దాంతో ఎయిడ్స్ జబ్బు అంతరించి పోయిందేమో అనే అపోహ ప్రజల్లో ఏర్పడింది. అయితే, వాస్తవం మాత్రం పూర్తిగా అందుకు విరుద్ధం. ఇటీవలి కోవిడ్ రోజుల తర్వాత నుంచి హెచ్‌ఐవి వ్యాప్తి మళ్లీ పెరిగింది. దాంతో... నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగానైనా మరోమారి ఈ అంశంపై చర్చ జరగాల్సిన నేపథ్యంలో ఈ కథనం.

తాజా లెక్కల ప్రకారం 2023 డిసెంబరు నాటికి 25 లక్షల మంది హెచ్‌ఐవి రోగులతో ప్రపంచంలోనే భారతదేశం రెండవ స్థానంలో వుంది. భారతీయ జనాభాలో తెలుగు రాష్ట్రాల ప్రజలు కేవలం ఆరు శాతమే అయినా... దేశంలోని హెచ్‌ఐవి బాధితుల్లో మాత్రం 20% మంది తెలుగు వారే. అంటే... మన దేశంలోని ప్రతి ఐదుగురు బాధితుల్లో ఒకరు తెలుగు వ్యక్తి కావడం విషాదం.

వ్యాప్తికి కారణాలు...

ఎయిడ్స్, హెచ్‌ఐవీ మూడు విధాలుగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది. అవి... లైంగిక చర్యతో పురుషుల వీర్యం, స్త్రీ జననేంద్రియ స్రావాలు కలవడం; రక్తంలో రక్తం కలవడం అంటే ఎయిడ్స్ ఇన్ఫెక్షన్లు ఉన్నవారి రక్తం ఆరోగ్యకరమైన వారి రక్తంతో కలవడం; బాధితురాలైన మహిళ నుండి బిడ్డకు.

నివారణ...

చాలా వైరస్ జబ్బుల్లాగే చాలాకాలం పాటు దీనికీ నిర్దిష్టమైన చికిత్స లేదు. అయితే ఇప్పుడు చికిత్స అందుబాటులో ఉంది. కానీ అసలు ఎయిడ్స్‌కు గురై మందులతో జబ్బును అదుపులో ఉంచుకోవడం కంటే నివారణ చాలా మేలు. ఇది మూడు రకాలుగా వ్యాపిస్తుందని తెలుసు కాబట్టి ఆ మూడు అంశాలకు సంబంధించిన నివారణ మార్గాలు అవలంబిస్తే దీన్నుంచి పూర్తిగా దూరంగా ఉండవచ్చు. పైన పేర్కొన్న వ్యాప్తి కారణాలను బట్టి తీసుకోవాల్సిన నివారణ చర్యలివి...

- లైంగిక చర్యతో వ్యాప్తి చెందుతుంది కాబట్టి వివాహేతర సంబంధాలకు దూరంగా ఉండాలి. పార్ట్‌నర్‌తో నమ్మకంగా వ్యవహరించాలి. సెక్స్‌లో పురుషులు తప్పనిసరిగా కండోమ్ వాడకం వాడాలి. మహిళలకు కొన్ని దేశాలలో ఫిమేల్ కండోమ్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. మద్యం మత్తులో కండోమ్ లేకుండా నిర్లక్ష్యంగా లైంగిక చర్యకు పాల్పడే ప్రమాదం ఉన్నందున మద్యానికి దూరంగా ఉండటం చాలా అవసరం.
- రక్తంతో రక్తం కలవడం వల్ల ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందన్న అంశాన్ని గుర్తుంచుకుని ఒక నీడిల్ ఒకరికే పరిమితం చేయాలి. ఇక మాదక ద్రవ్యాలు వాడేవారు మత్తులో ఒకరు వాడిన సిరంజ్‌లే మరొకరు వాడితే... ఎయిడ్స్ వ్యాప్తిచెందుతుందన్న అంశాన్ని గుర్తుపెట్టుకుని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.
- ఇక తల్లి నుంచి బిడ్డకు అనేది సాధారణంగా భర్త కారణంగా భార్యకూ... ఆమెకు జబ్బు విషయం తెలియక... తీరా గర్భవతి అయ్యాక... తన తప్పేమీ లేకుండానే బిడ్డకు సంక్రమింప జేయడంతో అమాయకపు చిన్నారులు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఇలా ఈ వ్యాధి బారిన పడ్డ తల్లుల నుంచి చిన్నారులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా (ప్రొఫిలాక్సిస్ చికిత్సగా) నివర్‌పైన్ అనే నోటి ద్వారా ఇచ్చే మందు లేదా ఇంజెక్షన్‌ను తల్లికి ఇస్తారు. అలాగే బిడ్డ పుట్టాక అవసరాన్ని బట్టి ఆ చిన్నారికీ ఈ మందునిస్తారు.

సాధారణ వ్యాప్తి మార్గాలకు ఇవీ నివారణలు. దీనికి తోడు అత్యంత వివక్షకు గురయ్యే ట్రాన్స్ జెండర్, గే, సెక్స్ వర్కర్లకు ఈ వ్యాధిపై అవగాహన వచ్చేలా, వారిలో చైతన్యం పెరిగేలా హెచ్‌ఐవి నివారణ కార్యక్రమాలను రూపొందించాలి.

చికిత్స...



చికిత్సకు ముందుగా అసలు ఎయిడ్స్ అంటే ఏమిటి, హెచ్‌ఐవీ అంటే ఏమిటో తెలుసుకోవడం అవసరం. ఎయిడ్స్‌కు కారణమయ్యే వైరస్‌ను హెచ్‌ఐవీగా... అంటే ఆ సంక్షిప్త అక్షరాలను విడమరిసే 'హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియెన్సీ వైరస్'గా చెబుతారు. హెచ్‌ఐవీ వైరస్ సోకాక... మానవుల్లో సహజంగా ఉండే వ్యాధి నిరోధకత (ఇమ్యూనిటీ) నశిస్తుంది. దాంతో చాలా మామూలు జబ్బు బారిన పడ్డా...అది ఎప్పటికీ నయం కాకుండా, దానివల్లనే మరణించే ప్రమాదం ఉంటుంది. ఈ జబ్బును కలిగించే వైరస్‌ను హెచ్‌ఐవీ అంటారు. ఇక హెచ్‌ఐవీ సోకగానే వ్యాధి బయటకు కనిపించదు. క్రమంగా వ్యాధి నిరోధక కణాలన్నీ నశిస్తూ పోవడం వల్ల... ఒక దశ తర్వాత ఏ చిన్న ఇన్ఫెక్షన్ సోకినా అది నయం కాని స్థితి వస్తుంది. ఆ కండిషన్‌నే ఎయిడ్స్ అంటారు.

హెచ్‌ఐవి / ఎయిడ్స్ జబ్బు జీవితకాలపు వ్యాధి. ఒకసారి జబ్బు బారిన పడ్డవాళ్ల జీవితమంతా ఇక మందులు వాడాల్సే ఉంటుంది. పైగా అవి ఖరీదైనవి. యాంటీ రెట్రోవైరల్ డ్రగ్స్ అని పిలిచే ఆ మందులను వాడుతూ, హెచ్‌ఐవీని అదుపులో పెట్టుకుంటూ ఉండటమే ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స.

హెచ్‌ఐవి – ఎయిడ్స్ జబ్బుకి పెద్ద ఎత్తున మందులు అందుబాటులోకి రావడం, ప్రభుత్వ వైద్యశాలలలో వీటిని ఉచితంగా అందజేయడంవల్ల ప్రస్తుతం చాలామంది వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ దాదాపు సాధారణ మానవుల పూర్తి కాల ఆయుర్దాయంతోనే వీళ్లూ సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు.



డా. యనమదల మురళీకృష్ణ, సాంక్రమిక వ్యాధుల నిపుణులు


అపోహలూ – వాస్తవాలు...



- పైన పేర్కొన్న వ్యాధిని వ్యాప్తి చేసే పద్ధతులు కాకుండా లాలాజలం, ఇతరత్రా మార్గాల్లో ఇది వ్యాప్తి చెందదు. కాబట్టి బాధితులను ఆలింగనం చేసుకోవడం, ముట్టుకోవడం, ముద్దు పెట్టుకోవడం వల్ల ఇది వ్యాపించదు. అందువల్ల వారిని నిస్సంకోచంగా దగ్గరికి తీసుకోవచ్చు. నిజానికి వాళ్లలో నైతిక స్థైర్యం పెంచడానికి ఇది తప్పనిసరి.
- బాధితులు వాడే వంటపాత్రలూ, పక్కబట్టలూ ఇతరత్రా సామగ్రిని ఇతరులూ నిస్సంకోచంగా వాడవచ్చు. అయితే సాధారణ ఆరోగ్యం (జనరల్ హైజీన్) కాపాడుకోడానికి ఇలా ఒకరి వస్తువులు మరొకరు వాడకపోవడమే మేలు.
- బాధితుణ్ణి కాటు వేసిన దోమ ఆరోగ్యవంతుడిని కాటు వేస్తే... ఇది వ్యాప్తి చెందదు.

హెల్త్

● యంగ్ ఎటాక్స్...



పైలా పచ్చీస్‌లో జర పైలం

ఇటీవల గుండెపోటు పాతికేళ్ల పైలా పచ్చీసీలోనూ కనిపిస్తోంది. ఇక ఇప్పుడది మరీ 20ఏళ్ల కంటే తక్కువ వయసు వారిలోనూ వస్తోంది. కరొనరీ ఆర్టరీ డిసీజ్ (సీఏడీ) అనే జబ్బు ఉన్నవాళ్లలో గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనులు బాగా సన్నబారడం, దాంతో రక్తం సాఫీగా ప్రవహించకపోవడంతో గడ్డకట్టడం... ఫలితంగా క్లాట్స్ ఏర్పడి గుండెకు రక్తాన్ని చేరనివ్వకపోవడం వల్ల గుండెపోటు వస్తోందన్నది డాక్టర్లు, గుండెవైద్యనిపుణుల మాట. అయితే ఈ సీఏడీ వ్యాధిని గుర్తించిన అత్యంత చిన్నవయసు పిల్లల్లో 14 ఏళ్ల చిన్నారీ ఉండడం విషాదం. గుండెపోట్లకు కారణమైన ఈ కరొనరీ ఆర్టరీ డిసీజ్ ఎందుకు వస్తుంది, దీన్ని నివారించడం ఎలా లాంటి అనేక విషయాలపై అవగాహన కోసం ఈ కథనం.

తీవ్రతను బట్టి గుండెనొప్పిలో రకాలు...

గుండెకు తగినంత రక్తం అందని కండిషన్ అయిన 'కరొనరీ ఆర్టరీ డిసీజ్' తాలూకు నొప్పిని రకరకాలుగా పిలుస్తారు. తక్షణమే అపాయం కలిగించని మొదటిసారి వచ్చే ఛాతీనొప్పిని 'యాంజినల్ చెస్ట్ పెయిన్'గా చెప్పవచ్చు. బాగా తీవ్రంగా వచ్చి, తక్షణం మరణం కూడా కలిగించేదే 'మయో కార్డియల్ ఇన్‌ఫ్రార్క్షన్' లేదా తీవ్రమైన గుండెపోటు. ఇలా ఇది గుండెకు రక్తం సరఫరా చేసే ధమనులైన కరొనరీ ఆర్టరీస్ ఏ మేరకు బ్లాక్ అయ్యాయి అనే దాన్ని బట్టి స్వల్పం నుంచి తీవ్రమైన గుండెపోటు వరకు రావచ్చు.

కరొనరీ ఆర్టరీస్‌లో (రక్తం గడ్డకట్టి) క్లాట్స్ రూపొందడం, అడ్డంకులు (బ్లాక్స్) ఏర్పడటంతో రక్త సరఫరా తగ్గిపోవడం లేదా ఒక్కోసారి రక్తప్రసరణ పూర్తిగా ఆగడం జరిగినప్పుడు... ఒక రకమైన ఛాతీ నొప్పి వస్తుంది. దీన్ని 'యాంజినా పెక్టోరిస్'గా చెబుతారు. ఈ క్రమంలో గుండెకు రక్తసరఫరా అందకపోతే గుండె కండరాలు చచ్చుబడిపోవడం మొదలవుతుంది. ఈ కండిషన్‌నే మామూలు భాషలో హార్ట్ ఎటాక్ అనీ, వైద్యులు అక్యూట్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (ఏఎమ్‌ఐ) అని అంటారు. ఈ సమయంలో వచ్చే నొప్పిని 'గుండెపోటు' అంటారు.

కారణాలు...

గుండెపోటుకు అనేక అంశాలు కారణమవుతుంటాయి. అవి...

- **జెండర్ అంశం:** మహిళలతో పోలిస్తే గుండెపోటు వచ్చే అవకాశాలు పురుషుల్లో ఎక్కువ. రుతుస్రావం ఆగిపోయే వరకు మహిళల్లోని ఈస్ట్రోజెన్ వారికి ఒక రక్షణ కవచాన్ని ఏర్పరుస్తుంది. మహిళల్లో రుతుక్రమం ఆగిపోయాక అది ఏ జెండర్‌కు చెందినవారైనా పురుషులూ, మహిళల్లో గుండెపోటుకు అవకాశాలు సమానంగా ఉంటాయి.
- **అథెరో స్క్లిరోసిస్:** మృదువుగా ఉండాల్సిన రక్తనాళాలు వయసు పెరుగుతున్న కొద్దీ గట్టిబారుతుంటాయి. ఇలా జరగడాన్ని అథెరో స్క్లిరోసిస్ అంటారు. అథెరో స్క్లిరోసిస్ ప్రక్రియ మొదలైన ఏడాదిలోనే గుండెపోటు రావచ్చు. గతంలో 40 ఏళ్లకు పైబడ్డాకే అథెరో స్క్లిరోసిస్ కనిపించేది. కానీ ఇటీవల యువతలో తమ 20ల నుంచే రక్తనాళాలు గట్టిబారడం జరుగుతోంది.



డా. సాయి రవిశంకర్, సీనియర్ కన్సల్టెంట్, కార్డియాలజీ

నివారించగల మార్పులు...

- **మారుతున్న ఆహారపు అలవాట్లు:** ఇటీవల మారుతున్న ఆహారపు అలవాట్లలో భాగంగా ఆహారంలో గుండెకు హానికారకాలైన చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్), చెడు కొవ్వులు ట్రైగ్లిసరైడ్స్ పెరగడం, అలాగే గుండెకు మేలు చేసే మంచి కొలెస్ట్రాల్ తగ్గేలా ఆహారం తీసుకోవడం, పొగతాగే అలవాటు.
- **ఆల్కహాల్, ఇతర మాదకద్రవ్యాలు:** యువతలో ఆల్కహాల్ అలవాట్లతో అథెరోస్క్లిరోసిస్ ముప్పు చిన్నవయసు నుంచే పెరుగుతుంది. ఇటీవల పెరిగిన పబ్ కల్చర్‌తో కొకైన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలు తీసుకోవడం.
- **స్ట్రెస్ అండ్ సెంట్రల్ ఒబేసిటీ:** పొట్ట దగ్గర కొవ్వు పెరగడం అలాగే ఒత్తిడి (స్ట్రెస్)తో కూడిన ఆధునిక జీవనశైలి.
- **హైబీపీ:** అధిక రక్తపోటు.
- **వ్యాయామం తగ్గడం:** ఇటీవల వృత్తుల్లో వచ్చిన మార్పుల కారణంగా శారీరక శ్రమ తగ్గడం, అలాగే యువతలో ఆటలాడే సంస్కృతీ, వ్యాయామాలు తగ్గడం కూడా ఓ కారణం.

లక్షణాలు...

- ఛాతీనొప్పి రూపంలో గుండెపోటు వ్యక్తమవుతుంది. దీంతో పాటు కొందరిలో చెమటలు పట్టడం (ప్రొఫ్యూజ్‌డ్ స్వెట్టింగ్); వాంతులు లేదా వికారం; శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలూ కనిపిస్తాయి.

చికిత్స: గుండెపోటుకు గురైన వారిని వీలైనంత త్వరగా ఆసుపత్రికి చేర్చాలి. ఈలోపు వారికి కార్డియో పల్మనరీ రిససియేషన్ (సీపీఆర్) అనే ప్రక్రియతో గుండె స్పందనలు మొదలయ్యేలా చూడాలి. ఆసుపత్రికి తీసుకురాగానే గుండె చచ్చుబడటాన్ని ఆపేసే ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా వారిని రక్షించడానికి డాక్టర్లు ప్రయత్నిస్తారు.

ఆరోగ్యకరమైన సమాజం కోసం హెల్దీ యువత ఎంతో అవసరం. అందుకే చిన్నవయసులోనే గుండెపోట్ల నివారణకు సమాజంలోని అన్ని వైపుల నుంచి కృషి జరగాలి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రెడ్డి/ ఏజ్ : 27/5'3"/ డిగ్రీ : B.Sc (MSCs), జాబ్ : AXIS Bank వరునికి తగిన రెడ్డి వధువు కావలెను. K S. Reddy. 9703156905 [H-783652]

దూదేకుల/27y/5'7"/Pvt Job/40K PM/ ఆంధ్రాలో 5 ఎ॥ పొలాలు + ఇల్లు వెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను శ్రీ గణేష్ మ్యారేజ్ బ్యూరో 1వ, 2వ సంబంధాలు అన్ని కులాల వారికి 30 రోజుల్లో కుదుర్చబడును. ఫ్రీలుక్ ఫ్రీ. Ph: 7075036010 [H-782725]

రెడ్డి/ విడోవర్/ 50y / ప్రభుత్వ ఉద్యోగం / సొంత ఇల్లు గల వరునికి వధువు కావలెను. Ph : 9581185737 [H-783509]

SC హిందూ మాదిగ/కట్న ప్రసక్తి లేదు/ B.Tech / C.Govt. Asst. Exg. ఇంజనీర్/ONGC/ 1.30 Lakhs PM/5'11" ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15304]

క్రిస్టియన్ మాల/ B.Tech / C.Govt. మేనేజర్/ SBI/1 Lakh PM/6' ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15304]

ముదిరాజ్/ కట్నప్రసక్తి లేదు / B.Tech (CBIT)/C.Govt.Sr. ఇంజనీర్/ రైల్వేస్ / 89000/-PM/6' ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15304]

క్రిస్టియన్ మాల/ కట్నప్రసక్తి లేదు / 28/ 5'9"/B.Tech/C.Govt.Asst.మేనేజర్/ SBI / 90,000/-PM అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-15304]

మాదిగ/ A: 29 Ht: 6', IAS Collector *A:29, Ht: 5'8", B.Tech(IIT), Scientific Officer *A : 29 Ht: 5'7", I.B. Officer. Ph: 7396915712 [HA-15304]

మాదిగ/M.Tech/Govt.AE/పంచాయతీ రాజ్ Dept / 98000/-PM / 5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15307]

విశ్వబ్రాహ్మణ/ M.Tech(IIT) / C.Govt. AE/ రైల్వే/98000/-PM/5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7416584304 [HA-15307]

SC-Mala (Hindu)/ 2nd Marriage/ 40y/PG/5'10"/SWE/1.6 Lac PM. Wants Hindu Bride only. Direct Contact: No Brokers. Ph: 8187861989 [H-782790]

Independent, Divorced, 1.5L+/PM, 60yrs, Educated Muslim, needs Independent, Educated 50+ lady, No Bars&No Mediations 8125651881 novel64nomad@gmail.com [WB-32527]

Mala Chtristian 29Y 5.3H VHAG Sachivalayam 30,000/- PM wants Employee Girl. Direct Contact: 94404 74342 [B-1190112]

★

వధువు కావాలి. Any Caste. కట్నం లేదు. First/Wid/Div. Direct Contact. WA 6304751936 [WB-32767]

★★

రెడ్డి/45/5'5'' /గవర్నమెంట్ టీచర్/ M.Sc, M.Ed/ తిరుపతి /2nd మ్యారేజ్ / స్థిరాస్తులు కలిగిన /అందమైన వరుడుకు వధువు కావలెను డైరెక్ట్ నో బ్రోకర్స్ ✆ 89192 95915. [B-1242134]

విశ్వబ్రాహ్మణ, 60Y, 5'4", విడోవర్, గుడ్‌లుక్స్, గు॥లో రిటైర్డ్ ఆఫీసర్ / పెన్షన్ 70K PM, ఆస్తి 2 బిల్డింగ్స్, 40-50Y, OC-BC/ Fair వధువు, బీద-విడో-డైవర్సీ, సహజీవనానికైనా అర్జంటుగా కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ ✆ 89191 98337 [B-1190056]

బ్రాహ్మణ 55 సంవత్సరాల ఒంటరి వరుడికి 54 సంవత్సరాల బ్రాహ్మణ వధువు కావలెను. ఇల్లరికం ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి. ✆ 96634 32637 [B-1239439]

డైరెక్ట్/45/ ప్రభుత్వ ఉద్యోగము చేయుచున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్-Ph: 83417 12438. [L-794861]

వరుడు కావలెను



కాపు/38yr/కుల పట్టింపు లేదు / ఫెయిర్/Govt. ఎంప్లాయ్/3,00,000/- (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 4 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం, 1st & 2nd మ్యారేజ్ OK) సంప్ర : 8374802603 [H-783652]

కుల పట్టింపు లేదు/ Govt. ఎంప్లాయ్ / 37 years/3,00,000/- (pm) / వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను. సంప్రదించండి : 8332006483 [H-783652]

రెడ్డి/ 38yr / 5'5"/ కుల పట్టింపు లేదు / MA. English /Govt. ఎంప్లాయ్ /90K (PM), వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) సంప్ర : 9133672661 [H-783652]

కుల, ఆస్తి ప్రసక్తి లేదు /విడో/46y/ పంచాయతీ ఆఫీసర్/1L PM/ సొంత ఇల్లు/50 ఎ॥ పొలాలు/కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550817409 [H-782790]

రెండవ పెళ్ళి/విడో/50y/Fair/తిరుపతి/Own House/Rents/ వెల్ సెటిల్డ్, ఎలాంటి బాదర బందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph : 8519803423 [H-782790]

నాయుడు/విడో/50y/C.Govt.Job / VRS/90K PM / గ్రానైట్ & Sand బిజినెస్/Own House Rents, పొలాలు. 3 L PM/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph : 7702043224 [H-782790]

2వ పెళ్ళి/400,000pm / బాగా స్థిరపడిన అందమైన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఇల్లరికం. పిల్లలు ఉన్నా OK/ కోట్ల ప్రాపర్టీ ఉంది. సంప్ర : 9381696641 [H-783652]

రెడ్డి/విడో / 50y / Hydలో Own Hostels, Rents / సొంత క్లాత్ షో రూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (మనీ సపోర్ట్) నో బ్రోకర్స్. 7799083500, 7386660643 [H-782725]

కమ్మ /28y / సాఫ్ట్‌వేర్ (USA)/ 5'4"/ కన్‌స్ట్రక్షన్ బిజినెస్ గల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9676585199 [H-782725]

యాదవ /విడో/48y / Own మాన్షన్స్/ సొంత ఇల్లు గల సాంప్రదాయ వధువుకు స్నేహపూర్వకమైన వరుడు కావలెను. Ph: 9390084390 [H-783509]

పద్మశాలి / విడో / 49y / ఇంటర్/సొంత బిజినెస్ / సొంత ఇల్లు/4 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9705499686 [H-783509]

రెడ్డి /విడో/49y/5'5"/V.Fair/Govt.Rtd పెన్షనర్/సొంత ఇల్లు అపార్ట్‌మెంట్స్/రైస్ బిజినెస్/28 ఎకరాల పొలం మామిడి తోటలు/3L PM/వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపు లేదు. Ph: 7093717220 [H-783509]

క్షత్రియ / 50y /విడో /Bank Job/ Raimand Showroom/68 Acres Land/ 8 Lac Income గల వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7075194750 [H-783509]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/B.Tech/ SWE/10 Lakhs PA/5'4" ఎత్తు/29 సం॥ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15304]

హిందూ మాల/M.Sc/C.Govt. అకౌంటెంట్ ఆఫీసర్/ ట్రెజరీ Dept/ 62000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15304]

మాదిగ/ B.Tech / C.Govt. బ్యాంక్ క్యాషియర్ / ఇండియన్ బ్యాంక్ / 38000/-PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8121406576 [HA-15304]

ముదిరాజ్/25/5'4" /B.Tech / Govt. AE / జెన్‌కో / 50,000 PM / అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309258463 [HA-15304]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ/34Y/ సొంత బిజినెస్/అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం అయినా OK)/1st/2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9515673252 [HA-15307]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/ B.Com/Pvt Job/అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Cast Marriages Available. Ph: 7207510801 [HA-15307]

కాపు/45/5'6"/డిగ్రీ/విడో / C.Govt.పెన్షనర్, 10L. PA/ 50Cr. *BC/5'2"/ డిగ్రీ/విడో/ Hydలో బంగ్లా, ఫ్లాట్లు/60Cr. స్థిరపడిన వధువులకు సెటిల్డ్ వరులు కావలెను. 9573943211, 8125132949 [HA-15307]

రెడ్డి /2nd మ్యారేజ్ (కుల, ఆస్తి) పట్టింపు లేదు/30Y, B.Tech(Own Properties, Job) Settled వధువుకి, వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st-2nd సంబంధాలు కలవు. Ph: 9573002847 [HA-15307]

రెడ్డి /కుల పట్టింపు లేదు/26y/B.Tech/ 5'4"/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9133640971 [HA-15307]

రెండో పెళ్ళి /50y&49y&47y&46y&44y& 43y&41y&40y&38y&37y&35y&33y&31y& 30y&28y & 27y&25y & 24y/" "మా సేవ" (Since 1998) : PH/WA: 9291503949 [HA-15307]

SC మాల/ 24/5'5" / B.Tech, MBA/ SWE Infosys 50,000/-PM/వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9346675639 [HA-15307]

మాదిగ/B.Tech/Govt.Jr.Asst./R&B Dept/48000/-PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. 7780299703 [HA-15307]

మాల 26Yrs / 5'4" / B.Tech / IIT/ PSU Cent Govt. Officer/Sal: 20 Lacs, P/A, వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9493285326 [H-783361]

విశ్వబ్రాహ్మణ/B.Tech / C. Govt. బ్యాంక్ క్యాషియర్ /యూనియన్ బ్యాంక్ / 38000/-PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515942275 [HA-15304]

Telugu Beautiful Girl 1995 Born/5'4"/Super Rich Family is Looking for Business Class Family (Caste No Bar) (080-69070619) [HA-99147]

Chtristian Mala 2nd 41Y 5.2H Govt Employee 1 Lack PM needs suitable men. Direct Contact: 94908 79100 [B-1190111]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును. Ph: 7702526428 [H-782790]

అన్ని కులాల, డాక్టర్స్, ఇంజినీర్స్ /Govt. Jobs/ బిజినెస్/ Abroad సంబంధాలకై సంప్రదించండి. Ph: 9100357969, 9640876803 [H-782725]

రజక/ డాక్టర్స్, ఇంజినీర్స్, లాయర్స్, ఇండియా, అబ్రాడ్, గవర్నమెంట్ జాబ్ వధూవరుల వివాహ సంబంధాలకై సంప్ర॥ కోట్ల శ్రీనివాస్. Ph: 9391265304/8106303155 [H-782725]

Brahmin, Arya Vysya, పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15312]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15312]

Padmashali, Viswabrahmin, Yadava పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 7093969457 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15312]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15312]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles with Free Registration Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15312]

కాపు/మున్నూరు కాపు వధూవరుల స్వయంవరం Free Register 15/Dec/2024న కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్, ECIL, Hyderabad నందు. Ph: 9704656103, 9533608887 Whatsapp [HA-1194]

డాక్టర్స్ స్పెషలిస్ట్-MBBS, MD, DM, BDS, BAMS, BHMS, B.V.Sc అన్ని కులములకు, అన్ని ప్రాంతాలకు పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ✆ 7093722724. [T-3202]

★

Free Registration: బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1164]

★★

మాల (క్రైస్తవ, హిందూ) B.Tech, M.Tech, MS, MBA, MBBS చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్ చేస్తున్న వధూవరుల వివరాలకు kalyanamala.org ✆ 9440545049 [B-1172570]

మారుమనస్సు పొందిన అన్ని కులముల క్రైస్తవ వధూవరులకు మొదటి రెండవ వివాహముల కొరకు సంప్ర: ది హోలీ కమ్యూనిటీ మ్యారేజ్ బ్యూరో. ✆ 73999 93599, 73999 93699 [B-1172532]



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

అబద్ధాల ప్రచారాన్ని తిప్పికొడదాం

- మనం ప్రజలకు చేసింది చెప్పుకోకపోతే వెనుకబడతాం
- కింది స్థాయి నేతలకు అన్ని పదవుల్లో అవకాశమిస్తాం
- ఆదివాసీ కాంగ్రెస్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: 'మనం ఎన్ని మంచి పనులు చేసినా అబద్ధపు ప్రచారాలతో బీఆర్ఎస్ రాజకీయంగా పూట గడుపుకుంటోంది. మనం చేసిన పనులను ప్రజలకు చెప్పుకోకపోతే వెనుకబడిపోతాం. పదేళ్లపాటు పాలించి అడ్డగోలుగా అక్రమాలు చేసి రాష్ట్రాన్ని నాశనం చేసిన చరిత్ర వాళ్లది. అలాంటి వాళ్లు ప్రజా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీల అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలదే' అని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. కిందిస్థాయి నేతల కష్టంతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కష్టపడి పనిచేసిన నేతలకు రాబోయే కాలంలో అన్ని రకాల పదవుల్లో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. రైతు రుణమాఫీ కోసం రూ.18 వేల కోట్లు ఇచ్చామని, 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు లాంటి అనేక పథకాలను అమలు చేశామని వివరించారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దాం

మతతత్వ ప్రచారంతో బీజేపీ లబ్ధి పొందుతోందని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. ప్రధాని మోదీ అబద్ధాలను తిప్పికొట్టి స్వాతి ముత్యం లాంటి రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేసేందుకు పార్టీ కార్యకర్తలు కష్టపడాలని కోరారు. ఏఐసీసీ నేత కొప్పుల రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజనుల సమస్యలపై లోతుగా చర్చించేందుకు వారం రోజులపాటు నాగార్జునసాగర్‌లో క్యాంప్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిరోజూ ఏడెనిమిది అంశాలపై చర్చిస్తామన్నారు.

తెలంగాణకు మణిహారం.. తెలుగు ప్రజలకు సంజీవని

- సత్యసాయి ట్రస్ట్ అందిస్తున్న సేవలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశంసలు
- 6 రోజుల్లో 18 మందికి ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమని కితాబు.. ప్రభుత్వం చేయని పనిని ట్రస్ట్ చేస్తోందని వ్యాఖ్య
- సిద్దిపేటలోని సత్యసాయి ఆస్పత్రి సందర్శన



గుండె ఆపరేషన్లు అయిన చిన్నారులతో మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: మరణం అంచుకి వెళ్లిన చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసి పునర్జన్మనిస్తూ, తెలంగాణ రాష్ట్రానికి మణిహారంగా, తెలుగు ప్రజలకు సంజీవనిలా సత్యసాయి ఆస్పత్రి సేవలందిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో శ్రీసత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్, రీసెర్చ్‌లో తొలిసారి గుండె ఆపరేషన్లు జరగ్గా.. శనివారం హరీశ్‌రావు సందర్శించిన అనంతరం మాట్లాడారు. దేశంలో 5వ ఆస్పత్రిని సిద్దిపేటలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం చేయని పనిని సత్యసాయి ట్రస్ట్, మధుసూదన్ సాయి చేస్తున్నారని కొనియాడారు. గుండె ఆపరేషన్ల కోసం రూ.3 నుంచి రూ.5 లక్షలు ఖర్చు పెట్టలేక ఎన్నో కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, ఉచితంగా సర్జరీలు చేయడం అభినందనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల్లో 5.77 లక్షల మందికి ఓపీ, 33,600 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు చేశారన్నారు. ఆరు రోజుల్లో 18 మంది చిన్నారులకు సర్జరీలు పూర్తి చేసి వారికి పునర్జన్మ ప్రసాదించడం గొప్ప విషయం అని కొనియాడారు. మధుసూదన్ సాయి కళాశాల వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమానికి వచ్చినప్పుడు ఇక్కడ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని 2022లో కోరానని, దీంతో స్పందించి 2023లో ఓపీ ప్రారంభించారని తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యే పదవుల్లో అనుభూతి కంటే గుండె ఆపరేషన్ అయిన తర్వాత పిల్లల్లో సంతోషం చూసి తన జన్మ ధన్యమైందన్నారు. శ్రీసత్యసాయి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ మొదట కొండపాకలో యంగ్ అడోల్సెంట్ కార్యక్రమం నిర్వహించాలనుకున్నా.. హరీశ్‌రావు చొరవతో ఇక్కడ గుండె శస్త్రచికిత్సల ఆస్పత్రిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్క ఫొటోతో బాడీ ప్రొఫైల్ వచ్చే విధంగా హెచ్‌డీ స్టెత్‌తో గుండె పనితీరు తెలుసుకునే అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమణాచారి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి పాల్గొన్నారు.



అరుణ భాస్కర్, రంగారెడ్డి

ఆరు నెలల కిందట తెలిసింది

నా బిడ్డ పేరు రక్ష. వయసు పదేళ్లు. ఆర్నెల్ల కిందట నిలోఫర్‌లో డాక్టర్లు పరిశీలించి గుండెలో హోల్ ఉందని చెప్పారు. బయట ఆస్పత్రుల్లో రూ.5 లక్షలు అవుతాయన్నారు. అయితే సిద్దిపేటలో ఫ్రీగా గుండె ఆపరేషన్లు చేస్తారని నిలోఫర్ డాక్టర్లు చెప్పారు. దీంతో అక్కడ ఆపరేషన్ చేయించాం. ఈ డాక్టర్లకు, ట్రస్ట్‌కు మేము రుణపడి ఉంటాం. నా బిడ్డ కూడా డాక్టర్ అయి ఇలా ఉచితంగా సేవలందిస్తుంది.



రాజేశ్వరి, ఆంజనేయులు

ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం

మాది మెదక్ జిల్లా చిన్నశంకరంపేట. మెకానిక్ గా పని చేస్తా. నా బిడ్డ వయసు ఆరేళ్లు. దగ్గు, జలుబు, వాంతులు అయ్యాయి. అప్పుడు వెంటనే లోకల్ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాం. వారు చూసి గుండె స్పీడ్ గా కొట్టుకుంటోంది అని చెప్పారు. దీంతో నిమ్స్, నిలోఫర్ ఆ స్పత్రులు తిరిగాం. ఇక్కడ ఫ్రీగా చేస్తారని తెలిసింది వెంటనే వచ్చాం. నా బిడ్డకు పునర్జన్మనిచ్చిన డాక్టర్లు, ట్రస్ట్ వారికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం.


ఆ చిన్నారుల భవితవ్యం తేల్చండి

- కస్టడీపై రెండువారాల్లో నిర్ణయం తీసుకోండి
- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వద్ద ఉన్న చిన్నారుల కస్టడీపై.. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: దత్తతకు సంబంధించిన వివాదంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధీనంలో ఉన్న చిన్నారుల సంరక్షణపై రెండువారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆ కమిటీని హైకోర్టు ఆదేశించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని రామకృష్ణ నగర్ కాలనీలో శోభారాణి అనే మహిళ చిన్నారులను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు రావటంతో 2024, మేలో పోలీసులు దర్యాప్తు జరిపి 15 మంది చిన్నారులను స్వాధీనం చేసుకుని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. దీంతో ఈ చిన్నారులను దత్తత తీసుకున్నవారు పోలీసులు తమ పిల్లలను అక్రమంగా తీసుకెళ్లారని హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీరి పిటిషన్లపై విచారణ చేపట్టిన ఏకసభ్య ధర్మాసనం.. చట్టప్రకారం దత్తత తీసుకోవాలని పిటిషనర్లకు సూచించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ డివిజన్ బెంచ్ ముందు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం శనివారం తీర్పు వెలువరించింది. సింగిల్ జడ్జి తీర్పును పక్కనబెట్టింది. 'ఈ చిన్నారులను దత్తత తీసుకోవటంలో జువైనల్ జస్టిస్ యాక్ట్-2015లోని 36, 37, 38 సెక్షన్‌లను పాటించలేదు. అందువల్ల పిల్లల సంరక్షణకు భంగం కలిగేలా ఉత్తర్వులు ఇవ్వలేం. మా ఆదేశాల కాపీ అందిన తేదీ నుంచి రెండు వారాలలోపు కమిటీ ఉత్తర్వులు జారీ చేయాలి. ఇప్పటికే కొందరు దత్తత తల్లిదండ్రులు చట్టప్రకారం పిల్లలను దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై కాంపిటెంట్ అథారిటీ 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలి. పిల్లల కస్టడీ ఎవరికి అప్పగించాలనేది కమిటీ ఇచ్చే ఆదేశాలకు లోబడి ఉంటుంది' అని కోర్టు స్పష్టం చేసింది.

అనర్హులను ఎలా నియమిస్తారు?

- ఆరోగ్య కార్యకర్తల నియామకంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం
- కాంట్రాక్టు విధానంలో తీసుకున్నా అర్హతలు ఉండాల్సిందే
- 2013లో ఉమ్మడి ఏపీ సర్కార్ ఇచ్చిన జీవో చెల్లదు



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులతో తొలగింపునకు గురైన 1,200 మందిని కాంట్రాక్టు పద్ధతిలో బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తలుగా విధుల్లోకి తీసుకోవడం చట్టవిరుద్ధమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013లో జారీ చేసిన జీవో 1207ను కొట్టివేసింది. బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల నియామకంపై 2002లో అర్హతల వివాదం నెలకొనగా, నిబంధనలకు విరుద్ధంగా సర్కార్ జీవోలు జారీ చేసి, నియామకాలు చేపట్టడం సరికాదని పేర్కొంది. ఈ అంశాన్ని ఉన్నత, అత్యున్నత న్యాయస్థానాలు తప్పుబట్టిన విషయాన్ని గుర్తు చేసింది. అర్హతలకు సంబంధించి న్యాయస్థానాలు తీర్పులు వెలువరించిన తర్వాత వాటికి విరుద్ధంగా మళ్లీ జీవో తీసుకురావడాన్ని తప్పుబట్టింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించలేమని, వారి తప్పును కొనసాగించలేమని వ్యాఖ్యానిస్తూ.. ఈ ఉత్తర్వులు వెలువడిన 90 రోజుల్లోగా అర్హులతో జాబితా రూపొందించి చర్యలు చేపట్టాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు తేల్చిచెప్పింది. అర్హులైన వారిని కొనసాగించవచ్చని పేర్కొంది. బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల నియామకానికి సంబంధించి 2002లో ఇచ్చిన నోటిఫికేషన్ వివాదాస్పదమైంది. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. గుర్తింపు పొందిన సంస్థ నుంచి హెల్త్ అసిస్టెంట్లుగా డిప్లొమా చేసిన వారినే అర్హులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. ఆ మేరకే మెరిట్ జాబితా రూపొందించాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు కూడా ఇదే తీర్పును సమర్థించింది. దీంతో ప్రభుత్వం సరైన అర్హతలు లేని 1,200 మందిని తొలగిస్తూ జీవో జారీ చేసింది. అయితే ఇంత మందిని ఒకేసారి తొలగించాల్సి రావడంతో ప్రభుత్వం వీరందరినీ కాంట్రాక్టు విధానంలో తీసుకుంటూ జీవో 1207 జారీ చేసింది. దీనిపై కొందరు నాడు ఏపీ పరిపాలన ట్రిబ్యునల్‌లో పిటిషన్లు దాఖలు చేయగా, సర్కార్ నిర్ణయం సబబేనని చెప్పింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు.

ఖాళీలుంటే నిబంధనల మేరకు భర్తీ..

ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం తీర్పు వెలువరించింది. 'కేవలం 9 ఏళ్లు (2002 నుంచి) సర్వీస్ చేశారన్న కారణంగా సుప్రీంకోర్టు, హైకోర్టు నిర్ధారించిన అర్హతలు లేని వారిని కాంట్రాక్టు విధానంలో తీసుకోవడం సరికాదు. రెగ్యులర్, కాంట్రాక్టు విధానం.. ఏ నియామకమైనా అర్హతలు పాటించాల్సిందే. ఒకసారి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం చెల్లదు. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తే.. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా ఉత్తర్వులిచ్చినట్లే అవుతుంది. 1,200 మందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడం తప్పుబట్టాల్సిందే. 90 రోజుల్లో అర్హులతో జాబితా రూపొందించాలని తెలంగాణ, ఏపీ సర్కార్‌లను ఆదేశిస్తున్నాం. అర్హులను కొనసాగింపుపై చర్యలు తీసుకోవచ్చు. ఒకవేళ ఇంకా ఖాళీలు ఉంటే చట్టప్రకారం నిబంధనలు పాటిస్తూ నియామకాలు చేపట్టవచ్చు' అని తీర్పులో స్పష్టం చేసింది.

లగచర్ల, పోలేపల్లిలో టెక్స్‌టైల్ కంపెనీలు

- భూసేకరణకు కొత్త నోటిఫికేషన్ విడుదల
- పోలేపల్లిలో 71.39 ఎకరాలు
- లగచర్లలో 110.32 ఎకరాలు సేకరణ
- అసైన్డ్ భూములే తీసుకోనున్న ప్రభుత్వం



లగచర్ల గ్రామ పంచాయతీ

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో బహుళార్థ సాధక పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా భూసేకరణ కోసం ప్రభుత్వం శనివారం కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో ఇక్కడ ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను శుక్రవారం రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజాగా పోలేపల్లి గ్రామంలో 71.39 ఎకరాలు, లగచర్లలో 110.32 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. రెండు గ్రామాల్లోని అసైన్డ్ భూములను మాత్రమే తీసుకోనున్నట్లు అధికారవర్గాల సమాచారం. ఇక్కడ టెక్స్‌టైల్ కంపెనీలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిసింది. కంపెనీల ఏర్పాటు సమయంలో అవసరం ఏర్పడితే పట్టా భూములను కూడా సేకరించే అవకాశం ఉందని సమాచారం. ఇక్కడ ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం మొదట నిర్ణయించటంతో.. కాలుష్య భయంతో రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. పలు గ్రామాల రైతులు ఆందోళన చేపట్టిన క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ప్రతిపాదిత ప్రాంతంలో కాలుష్య రహిత కంపెనీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

క్లుప్తంగా...

ఏపీ జడ్జిగా తెలంగాణ అమ్మాయి

వ్యవసాయ కూలీ కూతురి ప్రతిభ



జూలపల్లి(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన మొగురం గాయత్రి ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. అక్కడి హైకోర్టు నిర్వహించిన పరీక్షల్లో రెండోసారి పరీక్ష రాసిన గాయత్రి.. ఈనెల 27న వెలువడిన ఫలితాల్లో సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. వడ్కాపూర్ గ్రామానికి చెందిన మొగురం మొండయ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు గాయత్రి ఉన్నారు. తండ్రి వ్యవ సాయ కూలీగా గ్రామంలోనే పనిచేస్తున్నారు. కూతురిని కాకతీయ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఉస్మానియాలో ఎల్ఎల్ఎం చదివించారు. ఏపీ హైకోర్టు నిర్వహించిన సివిల్ జడ్జి పోటీ పరీక్షలకు తొలిసారి హాజరైన గాయత్రి.. అప్పుడు విజయం సాధించలేకపోయారు. పట్టుదలతో చదివిన ఆమె రెండోసారి పరీక్షలు రాసి తన లక్ష్యం సాధించారు. కాగా, మొండయ్య ఇద్దరు కుమారులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు.

పెద్దపల్లిలో 9 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు

593 మందికి సింగరేణిలో కొలువులు: సింగరేణి సీఎండీ బలరామ్



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన -ప్రజా విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిర్వహించే యువశక్తి సభలో ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు 9,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వనున్నారని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. సింగరేణి సంస్థలో ఇటీవల కొత్తగా ఉద్యోగాలు పొందిన 593 మందికి కూడా ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారని వెల్లడించారు. ఉత్స వాల నిర్వహణపై శనివారం ఇక్కడ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా ఘనంగా ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించారు.

తెలుగమ్మాయికి బ్రిటిష్ పార్లమెంట్‌లో గౌరవం



అవార్డును అందుకుంటున్న వింజమూరి రాగసుధ

గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): హైదరాబాద్‌లో పుట్టి పెరిగి ప్రస్తుతం లండన్‌లో నివసిస్తున్న వింజమూరి రాగసుధకు 'భారత భాగ్య విధాత – మహాత్మాగాంధీ'అవార్డు లభించింది. బ్రిటిష్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో.. బ్రిటన్ పార్లమెంటు సభ్యురాలు బారోనెస్ వర్మ, ఉత్తరాఖండ్ మంత్రి డాక్టర్ ధన్‌సింగ్ రావత్ నుంచి వింజమూరి రాగసుధ పురస్కారాన్ని అందుకున్నారు. కళారంగంలో చేసిన విశేష కృషికి తనకు ఈ అవార్డును ప్రదానం చేయడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ శిక్షణార్థులకు ఉద్యోగాలు

70 మందికి జాబ్ ఆఫర్ లెటర్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణతో కూడిన ఉపాధి కార్యక్రమంలో భాగంగా.. కార్పొరేషన్ వీసీ ఎండీ క్షితిజ నుంచి 70 మంది అభ్యర్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేశారు. బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీసీఎండీ క్షితిజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా శిక్షణతో కూడిన ఉపాధి కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మసిస్ట్ గ్రేడ్-2 ఎగ్జామ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టులకు నిర్వహించిన పరీక్ష శనివారం విజయవంతంగా పూర్తయింది. మొత్తం 732 ఉద్యోగాలకు 27,101 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈరోజు నిర్వహించిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కి 24,578 మంది హాజరయ్యారు. 90.68% మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది.

గురుకులాల నిర్వహణపై సమీక్షించండి

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సూచించారు. ఈమేరకు శనివారం సీఎంకు లేఖ రాశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 42 మంది విద్యార్థులు చనిపోయారని, దాదాపు 1,200 మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారని వివరించారు.

నిశ్శబ్దాన్ని ఛేదించారు!

కామారెడ్డి జిల్లాలో నెలవారీ సమావేశాల్లో పాల్గొన్న ఎయిడ్స్ బాధితులు



- స్వశక్తితో నిలబడుతున్న హెచ్ఐవీ బాధితులు
- సంఘాలు ఏర్పాటు చేసుకొని పరస్పర సహకారం
- కామారెడ్డిలో 'స్వయంకృషి'.. నిజామాబాద్‌లో 'విజేత'
- నెలనెలా రూ.100 చొప్పున పొదుపు
- సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం
- సహకారం అందిస్తున్న 'వర్డ్'స్వచ్ఛంద సంస్థ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వాళ్లంతా కాలం కాటేసిన అభాగ్యులు.. చేయని తప్పులకు సమాజం నుంచి చీత్కారాలు ఎదుర్కొంటున్న బాధితులు.. నిత్యం దేహంలోని శత్రువుతోపాటు సమాజంతోనూ పోరాడుతున్న ధీరులు. కుంగిపోతే సమాజం మరింత తొక్కేస్తుందని గుర్తెరిగి.. ధైర్యంగా తలెత్తుకొని నిలబడే ప్రయత్నం చేస్తూ ఇప్పుడిప్పుడే నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్నారు. ఒక్కొక్కరుగా సంఘటితమవుతున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఎయిడ్స్, హెచ్ఐవీ బాధితులు కష్టాలను ఎదిరించి ధైర్యంగా ముందుకు సాగుతున్నారు.

రెండు జిల్లాల్లో సొసైటీలు...

➤ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు నిశ్శబ్దాన్ని ఛేదించారు. మండలాలవారీగా సంఘాలుగా ఏర్పడుతున్నారు. జిల్లా స్థాయిలో సహకార పరపతి సంఘాలను ఏర్పాటు చేసుకుని నెలనెలా కొంత డబ్బు పొదుపు చేసుకుంటూ సొంత కాళ్లపై నిలబడే ప్రయత్నం చేస్తున్నారు. వీరికి 'వర్డ్'అనే స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తోంది. కామారెడ్డి జిల్లాలో 'స్వయం కృషి'పేరుతో, నిజామాబాద్‌లో 'విజేత'పేరుతో 2021 సంవత్సరంలో మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (మాక్స్)లు ఏర్పాటు చేసుకున్నారు. సంఘంలో సభ్యత్వ రుసుముగా రూ.50తోపాటు రూ.100 చెల్లించి రూ.10 ముఖ విలువగల 10 షేర్లు కొని సభ్యులుగా చేరుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని స్వయంకృషి సంఘంలో 1,393 మంది సభ్యులు చేరగా, 63 మంది చనిపోయారు. ప్రస్తుతం 1,330 మంది సభ్యులున్నారు. నిజామాబాద్ విజేత సంఘంలో 1,169 మంది సభ్యులకుగాను 82 మంది చనిపోయారు. ప్రస్తుతం 1,087 మంది సభ్యులున్నారు.

ప్రతినెలా సమావేశం..

➤ ఈ సంఘాల్లోని సభ్యులంతా నెలకోసారి మండల స్థాయిలో నిర్వహించు కునే సమావేశంలో కలుస్తారు. ఆ సమయంలో అందరూ తలా రూ.100 చొప్పున సంఘంలో జమ చేస్తారు. ఇలా ఇప్పటివరకు జమ చేసిన సొమ్ము ప్రస్తుతం స్వయంకృషి సొసైటీలో రూ.8.55 లక్షలకు, విజే త సొసైటీలో రూ.8.44 లక్షలకు చేరింది. ఈ సొసైటీలు ఏర్పా టు చేసి హెచ్ఐవీ బాధితులను చైతన్యపరుస్తున్న వర్డ్ స్వచ్ఛ ంద సంస్థ ఒక్కో సొసైటీలో రూ.2.50 లక్షల చొప్పున కార్పస్ ఫండ్‌ను ముందుగానే జమ చేసింది. దీంతో ఆయా సంఘాల్లో ఇప్పుడు రూ.10 లక్షలకు పైగానే డబ్బు జమయ్యింది.

ప్రభుత్వ పథకాలు పొందుతూ..

ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌ను తీసుకోవడంతోపాటు వారికి కావలసిన మందులు, వైద్య సేవలు పొందడానికి హెచ్ఐవీ బాధితులకు వర్డ్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చాలామంది మంది వివిధ రకాల ప్రభుత్వ పథకాలు పొందారు. ఈ సంఘాల్లోని 12 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు లభించాయి. పది మందికి దళితబంధు పథకం ద్వారా లబ్ధి చేకూరింది. మిషన్ వాత్సల్య ద్వారా హెచ్ఐవీతో చనిపోయిన వారి పిల్లలు 27 మందికి నెలనెలా ప్రభుత్వ సాయం అందుతోంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.40 వేల చొప్పున పూర్తి సబ్సిడీపై మేకలు, గొర్రెలను 39 మందికి అందించారు. తొమ్మిది మంది రుణాలు పొంది కిరాణా దుకాణాలు, హోటళ్లు నిర్వహిస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా పది మందికి రూ. 50 వేల చొప్పున సాయం అందింది.

మానసిక స్థైర్యం కల్పిస్తూ...

ప్రతినెలా బాధితులంతా మండలాలవారీగా ఒక చోట చేరతారు. ఆ సమావేశాల్లో సభ్యుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడం, వారికి కావలసిన వైద్య సాయం అందించడం, మానసిక స్థైర్యం నింపటానికి కౌన్సెలింగ్ చేయడం వంటివి కొనసాగిస్తున్నారు. దీంతో చాలా మంది బాధితులు ధైర్యంగా తమతమ పనులు చేసుకుంటున్నారు. హెచ్ఐవీ బాధితులం అనే బాధ నుంచి బయటపడి సాధారణంగా ఉండే ప్రయత్నంలో సక్సెస్ అవుతున్నారు.

టైలరింగ్ చేస్తున్నా: నా భర్త చనిపోయాడు. స్వచ్ఛంద సంస్థ టైలరింగ్ నేర్పించి మిషన్ కూడా అందించింది. నేను బట్టలు కుడుతూ కొడుకును పెంచి పెద్ద చేశాను. డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా వచ్చింది. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా క్రమంతప్పకుండా మందులు వాడుతూ సంతోషంగా ఉన్నాను.
– కామారెడ్డికి చెందిన హెచ్ఐవీ బాధితురాలు

మేకల పెంపకంతో ఉపాధి..: మేకల పెంపకానికి నూరు శాతం సబ్సిడీ కింద ప్రభుత్వం ఇచ్చిన సాయాన్ని సద్వినియోగం చేసుకున్నాను. అప్పుడు 4 మేకలు ఉండేవి. ఇప్పుడు మంద తయారైంది. వాటితో జీవనం సాగి స్తున్నాను. మరికొన్ని సంక్షేమ పథకాలు కూడా అందాయి. ఏ ఇబ్బందీ లేదు. నెలనెలా సంఘం మీటింగ్‌కు హాజరవుతున్నా.
– కామారెడ్డి జిల్లాకు చెందిన హెచ్ఐవీ బాధితుడు

ఉన్ని దుప్పటి... ఉతికేది నెలకోసారే!

- కనీసం 30 మంది వాడిన తర్వాతే శుభ్రం
- కొత్తదానిలా రోజూ సీల్డ్ కవర్‌లో సరఫరా
- రైలు ఏసీ కోచ్‌లలో విడ్డూరం
- డిమాండ్‌కు తగ్గ లాండ్రీ సామర్థ్యం లేకనే..!
- త్వరలో బీఓటీ పద్ధతిలో భారీ లాండ్రీలు
- దక్షిణ మధ్య రైల్వే అధికారుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: చూడ్డానికి అందంగా ఉంటాయి.. తాకితే మెత్తగా ఉంటాయి.. కానీ, కప్పుకొంటే మాత్రం కంపు కొడుతుంటాయి. రైళ్లలోని ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు అందిస్తున్న దుప్పట్ల పరిస్థితి ఇది. ఈ ఉన్ని దుప్పట్లను వరుసగా 30 రోజులపాటు 30 మంది ప్రయాణికులు వాడుకున్నాకగానీ ఉతకడం లేదు. అయితే, వాటిని నిత్యం మడత నలగకుండా బ్రౌన్ కలర్ కవర్‌లో పెట్టి అందిస్తుండటంతో శుభ్రం చేసినవే అని ప్రయాణికులు భ్రమపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాటిని శుభ్రం చేయకుండా 30 రోజులకంటే ఎక్కువే వాడాల్సి వస్తోంది. ఎప్పటికప్పుడు శుభ్రం చేసే లాండ్రీ వ్యవస్థ లేకపోవటమే దీనికి కారణం.

ఎందుకీ పరిస్థితి?

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నిత్యం 116 రైళ్లలోని ఏసీ కోచ్‌లలో ఈ బెడ్‌రోల్స్ సరఫరా చేయాల్సి ఉంది. నిత్యం ప్రతి బెర్త్‌కు రెండు బెడ్‌షీట్లు, ఒక టవల్, దిండు కవర్ అందిస్తారు. నిత్యం 38 వేల దుప్పట్లు, 1, 52,000 బెడ్‌షీట్స్ సరఫరా చేస్తున్నారు. వీటిని ఉతికించి శుభ్రపరిచేందుకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఏడు చోట్ల మెకనైజ్డ్ లాండ్రీలున్నాయి. రోజుకు 2 టన్నుల బెడ్‌రోల్స్‌ను శుభ్రపరిచే సామర్థ్యంతో సికింద్రాబాద్‌లో డిపార్ట్‌మెంటల్ లాండ్రీ ఉంది. ఇది రైల్వే సొంత లాండ్రీ. కాచిగూడలో 12 టన్నుల సామర్థ్యం, తిరుపతిలో 2.5 టన్నులు, కాకినాడలో 4 టన్నులు, విజయవాడలో 1.5 టన్నులు, నాందేడ్‌లో 1.5 టన్నుల సామర్థ్యం కలిగిన లాండ్రీలున్నాయి. ఇవన్నీ ప్రైవేట్ సంస్థలు బీఓటీ (బిల్ట్ ఓవన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో ఏర్పాటు చేసినవి. అయితే, ఇవి దక్షిణ మధ్య రైల్వే అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఇటీవల రద్దీకి అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే నడిపిన కొన్ని ప్రత్యేక రైళ్లలోని ఏసీ కోచ్‌లలో బెడ్ రోల్స్ సరఫరా చేయలేదు. ఈ విషయాన్ని ముందుగానే రైల్వేశాఖ ప్రకటించింది. క్రమంగా ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో రైళ్ల సంఖ్య కూడా పెంచాల్సి వస్తోంది. ఇటీవల థర్డ్ ఏసీ ఎకానమి పేరుతో కొత్త క్లాస్‌ను సృష్టించటంతో రైళ్లలో ఏసీ కోచ్‌ల సంఖ్య పెరిగింది. ఫలితంగా బెడ్ రోల్స్ సంఖ్య కూడా పెంచాల్సి వచ్చింది. కానీ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరిచే సామర్థ్యం లేకుండాపోయింది.



మూడు నెలల నుంచి నెలకోసారి.. గతంలో ఉన్ని దుప్పట్లను మూడు నెలలకోసారి ఉతికేవారు. 2010లో దాన్ని రెండు నెలలకు మార్చారు. అవి అపరిశుభ్రంగా ఉంటున్నాయన్న ఫిర్యాదులతో కనీసం నెలకోసారి ఉతకాలన్న నిర్ణయం తీసుకుని అమలులోకి తెచ్చారు. ఉన్ని దుప్పట్లను కనీసం పక్షం రోజులకోమారైనా ఉతకాలన్నది రైల్వే బోర్డు సూచన. కానీ దాన్ని అమలు చేసే పరిస్థితి లేదు.

పాడయ్యే అవకాశం..

➤ ఉన్ని దుప్పట్లను నిత్యం ఉతకటం సాధ్యం కాదు. అలా చేస్తే అవి వెంటనే పాడైపోతాయి. రెండు నెలలకోసారి ఉతికే పద్ధతి ఉన్న సమయంలో ఉన్ని దుప్పటి జీవితకాలాన్ని నాలుగేళ్లుగా లెక్కగట్టారు. నెలకోసారి ఉతకటంతో రెండేళ్లకు తగ్గించారు. 15 రోజులకోమారు ఉతికితే ఏడాదే మన్నుతుంది. ఈ కారణంతో ఉతకటం లేదన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే, డ్రైక్లీనింగ్‌తోపాటు ఇతర ఆధునిక పద్ధతుల్లో నాణ్యత దెబ్బతినకుండా తరచూ శుభ్రం చేయాలన్న సూచనలను రైల్వే అధికారులు పట్టించుకోవటం లేదు.

త్వరలో సమస్యకు పరిష్కారం: దక్షిణ మధ్య రైల్వే

➤ భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో బెడ్‌రోల్స్ వినియోగించాల్సి రానున్నందున, వాటిని ఎప్పటికప్పుడు ప్రమాణాల మేరకు శుభ్రం చేసే వ్యవస్థను అందుబాటులోకి తేబోతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కొత్తగా బీఓటీ పద్ధతిలో భారీ సామర్థ్యంతో ఆధునిక లాండ్రీలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది. హైదరాబాద్/సికింద్రాబాద్, కాచిగూడల్లో 48 టన్నుల సామర్థ్యంతో, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు, నర్సాపూర్‌లలో 10 టన్నుల సామర్థ్యంతో, తిరుపతిలో 22 టన్నులు, కాకినాడలో 6 టన్నులు, నాందేడ్, పూర్ణాలలో 8 టన్నుల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. 'సాధారణ బెడ్‌రోల్స్‌ను నిత్యం ప్రమాణాల ప్రకారం శుభ్రం చేసి అందిస్తున్నాం. శుభ్రపరిచే క్రమాన్ని సీసీటీవీల ద్వారా పర్యవేక్షిస్తున్నాం. ఉన్ని దుప్పట్లను మాత్రం నెలకోసారి శుభ్రం చేస్తున్నాం. అవి దుర్వాసనతో ఉన్నా, ఇతర అపరిశుభ్రతతో కనిపించినా వెంటనే శుభ్రం చేస్తున్నాం. రెండు బెడ్‌షీట్లు ఇస్తున్నందున.. వాటిల్లో ఒకదాన్ని ఈ దుప్పటితో కలిపి వాడటం వల్ల ఉన్ని దుప్పటి అంత తొందరగా అపరిశుభ్రంగా మారదు'అని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. శుభ్రమైన బెడ్‌రోల్స్‌ను అందించేందుకు వాటి చార్జీని రైలు టికెట్ ధరలో భాగంగా వసూలు చేస్తుండటం కొసమెరుపు.

ఎయిడ్స్ కేసులు తగ్గుముఖం

- రాష్ట్రంలో నాలుగేళ్లలో 0.48 నుంచి 0.44 శాతానికి
- హెచ్ఐవీ వ్యాప్తి రేటులో ఐదో స్థానంలో తెలంగాణ
- ఈ ఏడాది ఏప్రిల్ – అక్టోబర్ మధ్య 5,363 మందికి పాజిటివ్
- రాష్ట్రంలో మొత్తం హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగులు 1.04 లక్షలు
- జాగ్రత్తలు తీసుకొంటే హెచ్ఐవీ సోకినా సాధారణ జీవితం
- ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీ కె. హైమావతి
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం


సాక్షి, హైదరాబాద్: ప్రజల్లో పెరిగిన అవగాహన, హెచ్ఐవీ రోగులను గుర్తించి తగిన చికిత్స అందిస్తుండడంతో రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాప్తి తగ్గుముఖం పడుతోంది. 15–49 సంవత్సరాల వయసు గలవారిలో హెచ్ఐవీ వ్యాప్తి (ప్రివలెన్స్) రేటు దేశంలో 0.20 శాతంగా ఉంటే.. రాష్ట్రంలో 0.44గా ఉంది. రాష్ట్రంలో 2020లో హెచ్ఐవీ వ్యాప్తి 0.48 శాతంగా ఉండగా, ఏటా ఒక శాతం తగ్గుతూ 2024–25లో 0.44 శాతానికి తగ్గింది. దేశంలో ప్రస్తుతం 25 లక్షల మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నట్లు జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (నాక్స్) లెక్కలు చెబుతున్నాయి.

ఐదో స్థానంలో తెలంగాణ

ఎయిడ్స్ వ్యాప్తిలో తెలంగాణ రాష్ట్రం ఐదో స్థానంలో ఉన్నది. మిజోరం మొదటి స్థానంలో ఉండగా, నాగాలాండ్, మణిపూర్, ఆంధ్రప్రదేశ్ వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణ లో 1.04 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ లెక్కలు చెబుతు న్నాయి. హెచ్ఐవీ వైరస్, ఎయిడ్స్ సోకి న వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మందులను 'యాంటీ రెట్రో వైరల్ థెరపీ సెంటర్స్ (ఏఆర్‌టీ) ద్వారా సరఫరా చేస్తున్నట్లు సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ కె. హైమావతి 'సాక్షి'కి తెలిపారు. భారత్‌లో 2010 నుంచి హెచ్ఐవీ వ్యాప్తి రేటు 44 శాతం తగ్గినట్లు సెప్టెంబర్ 25న 'రివైటలైజ్ మల్టిలేటరలిజం: రీకమిటింగ్ టు ఎండింగ్ ఎయిడ్స్ టుగెదర్' అనే అంశంపై ఐక్యరాజ్యసమితిలో జరిగిన సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ ప్రకటించిన విషయం తెలిసిందే.

మిజోరం ఫస్ట్.. జమ్మూకశ్మీర్ లాస్ట్

దేశంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి రేటు మిజోరంలో అత్యధికంగా ఉంది. 2023–24 లెక్కల ప్రకారం ఇక్కడ ఎయిడ్స్ వ్యాప్తి 2.73 శాతంగా నమోదైంది. ఆ తరువాత నాగాలాండ్‌లో 1.37 శాతం, మణిపూర్‌లో 0.87 శాతం, ఏపీలో 0.62 శాతం, తెలంగాణలో 0.44 శాతం ఉన్నది. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లో ఎయిడ్స్ వ్యాప్తి అతి తక్కువగా 0.06 శాతంగా ఉన్నది. 2024– 25లో దేశవ్యాప్తంగా హెచ్ఐవీ రోగుల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నట్లు నాక్స్ అంచనా వేస్తోంది. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ 31 వరకు ఏడు నెలల్లో తెలంగాణలో 9,56,713 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తే.. 5,363 మందికి పాజిటివ్‌గా తేలింది. 3,37,752 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించగా.. 427 మంది హెచ్ఐవీ బారిన పడినట్లు గుర్తించారు. హైదరాబాద్‌లో అత్యధికంగా 902 హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 2023–24 సంవత్సరంలో సుమారు 20 లక్షల పరీక్షలు నిర్వహించగా.. 11,806 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. క్రమం తప్పకుండా మందులు వాడుతూ.. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకొంటే హెచ్ఐవీ సోకినా సాధారణ జీవితం గడుపవచ్చని కె. హైమావతి చెప్పారు.



అసంపూర్తి నిర్మాణాలకు మళ్లీ జీవం!

- దుండిగల్‌లో ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ప్లాటినం ప్రాజెక్టు
- రూ. వందల కోట్లు కాజేసి బోర్డు తిప్పేసిన జయత్రీ ఇన్‌ఫ్రా
- 'రెరా'ను ఆశ్రయించిన కొనుగోలుదారులు.. పనులు మరో బిల్డర్‌కు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రీలాంచ్, బై బ్యాక్ స్కీమ్‌ల పేరిట కొందరు బిల్డర్లు చేస్తున్న మోసా లకు అటు రూ. కోట్లలో డబ్బు పోగొట్టుకోవడంతోపాటు ఇటు సొంతింటి కలకు దూరమవుతున్న బాధితులకు న్యాయం చేసేందుకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ–రెరా), రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా దుండిగల్‌లో ఇలా బోర్డు తిప్పేసిన జయత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే సంస్థకు చెందిన 'ప్లాటినం'ప్రాజెక్టు పనులను థర్డ్ పార్టీ (మరో బిల్డర్)కు అప్పగించాయి. ఈ మేరకు టీజీ–రెరా చేసిన ప్రతి పాదనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రెరా–2016 చట్టంలోని సెక్షన్ 8 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి ఆ ప్రాజెక్టును థర్డ్ పార్టీకి బదిలీ చేస్తూ టీజీ–రెరా మధ్యంతర ఉత్తర్వు లు జారీ చేసింది. త్వరలోనే ఇలా ఆగిపోయిన మరికొన్ని ప్రాజెక్టులను కూడా థర్డ్ పార్టీలకు ఇచ్చేందుకు టీజీ రెరా కసరత్తు చేస్తోంది. దీంతో ఆగిపో యిన నిర్మాణాలు మళ్లీ జీవం పోసుకోనున్నాయి.

ఇదీ 'ప్లాటినం'కథ..: ఐదేళ్ల క్రితం జయత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ యజమాని కాకర్ల శ్రీనివాస్ దుండిగల్‌లో ప్లాటినం పేరుతో అపార్ట్‌మెంట్ ప్రాజెక్టును ప్రకటించాడు. 3,267 గజాల స్థలంలో స్టిల్ట్+5 అంతస్తులకు హెచ్ఎండీఏ నుంచి అను మతి తీసుకొని 5,865 చ.అ. బిల్టప్ ఏరియాలో 60 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నామని ప్రచారం చేశాడు. రెరాలో రిజిస్ట్రేషన్ చేయకుండానే ప్రీలాంచ్ ఆఫర్ కింద కస్టమర్ల నుంచి రూ. కోట్లు వసూలు చేశాడు. కొనుగోలుదారులను నమ్మించేందుకు శ్లాబ్ లెవల్స్ వరకు నిర్మాణ పనులను శరవేగంగా చేపట్టాడు. హెచ్ఎండీఏకు తనఖా పెట్టిన 9 ఫ్లాట్లు మినహా మిగిలిన 51 ఫ్లాట్లను విక్రయించేశాడు. అయితే నిధుల దుర్వినియోగం కారణంగా ప్రాజెక్టు మధ్యలోనే ఆగిపోయింది. దీంతో గతేడాది సెప్టెంబర్‌లో కస్టమర్లు 'రెరా'కు ఫిర్యాదు చేశారు.

త్వరలోనే సాహితీ, మంత్రి ప్రాజెక్ట్‌లు కూడా..: జయత్రీ కేసులాగే సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్, మంత్రి డెవలపర్స్ మధ్యలోనే వదిలేసిన పలు అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులను కూడా సెక్షన్–8 కింద ఉత్తర్వులు ఇచ్చేందుకు రెరా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గచ్చిబౌలి, గుండ్లపోచంపల్లి, అమీన్‌పూర్ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నామని కస్టమర్ల నుంచి సొమ్ము వసూలు చేసి సాహితీ సంస్థ చేతులెత్తేసింది. మరో వైపు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద లగ్జరీ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని వినియోగదారుల నుంచి మంత్రి డెవలపర్స్ రూ. కోట్లు వసూలు చేసింది. నిధుల దుర్వినియోగం కారణంగా ఆయా ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోయాయి. బాధితుల ఫిర్యాదుతో సెక్షన్–8 కింద ఆయా ప్రాజెక్టుల నిర్మాణ పనులను థర్డ్ పార్టీ బిల్డర్‌కు అప్పగించేందుకు 'రెరా'కసరత్తు చేస్తోంది.

8 కంటే ఎక్కువ ఫ్లాట్లు ఉంటే 'రెరా' పరిధిలోకి..: గృహ కొనుగోలుదారుల భద్రత, పెట్టుబడులకు భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన 'రెరా'తెలంగాణలో 2016 మే 1న అమల్లోకి వచ్చింది. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం లేదా ఒక అపార్ట్‌మెంట్‌లో 8 అంతకంటే ఎక్కువ ఫ్లాట్లు నిర్మించే రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు 'రెరా'పరిధిలోకి వస్తాయి. స్థానిక మున్సిపాలిటీ/కార్పొరేష న్ అనుమతులు ఉన్నప్పటికీ ఫ్లాట్ల వ్యాపారం చేస్తే తప్పనిసరిగా సదరు ప్రాజెక్టు 'రెరా'రిజిస్ట్రేషన్ పొందాలి. అయితే చాలా మంది బిల్డర్లు నిర్మాణ అనుమతులు రాకముందే.. 'రెరా'రిజిస్ట్రేషన్ లేకుండానే ఫ్లాట్లను విక్రయిస్తున్నారు. నిధుల మళ్లింపు, దుర్వినియోగం కారణంగా ప్రాజెక్టు నిర్మాణ పను లు మధ్యలోనే ఆగిపోతున్నాయి. దీంతో కస్టమర్లు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి కేసుల్లో రెరా– 2016 చట్టంలోని సెక్షన్–8 కింద థర్డ్ పార్టీకి నిర్మా ణ పనులను బదలాయించే అధికారం రెరాకు ఉంది.

కస్టమర్లకు ఊరట లభిస్తుంది



పలువురు బిల్డర్లు, ఏజెంట్లు అబద్ధపు హామీలతో కస్టమర్లను నమ్మించి మోసం చేస్తున్నారు. అలాంటి వారిని వదిలిపెట్టం. టీజీ–రెరాకు విస్తృత అధికారాలు ఉన్నాయి. చట్ట పరిధిలో గృహ కొనుగోలుదారులకు న్యాయం అందించి తీరతాం. మధ్యలోనే ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు 'రెరా'అధికారాలను వినియోగించి కస్టమర్లకు ఊరట కల్పిస్తాం.
– కె. శ్రీనివాసరావు, టీజీ–రెరా సభ్యుడు

ఘనంగా నిట్ 22వ స్నాతకోత్సవం

పట్టాలందుకున్న 1,600 మంది విద్యార్థులు

కాజీపేట అర్బన్: వరంగల్ నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శనివారం నిట్ 22వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. బీటెక్, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీకి చెందిన 1,875 మందికి గాను 1,600 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. కాన్వొకేషన్‌కు ముఖ్యఅతిథిగా సెక్రటరీ డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్ (ఆర్ అండ్ డీ) డీఆర్‌డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్ పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ 22వ స్నాతకోత్సవానికి ప్రారంభ ఉపన్యాసం చేసి విద్యాసంస్థ విశిష్టత తెలిపారు. 11 రోల్ ఆఫ్ గోల్డ్ మెడల్స్‌ను పది మంది విద్యార్థులు అందుకున్నారు. ఇందులో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ గోల్డ్‌మెడల్, రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్స్‌ను మంజిమా కర్మాకర్ అందుకున్నారు.

తెలంగాణలో ఒక రోజు ముందే పుష్ప-2 ప్రీమియర్ షోలు

టికెట్ ధర రూ.800కు పెంపు.. ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పుష్ప–2'డిసెంబర్ 5న విడుదల కానుంది. అయితే, ఒకరోజు ముందే డిసెంబర్ 4న తెలంగాణ వ్యాప్తంగా ప్రీమియర్ షోలు వేసేందుకు, టికెట్ ధరలు పెంచేందుకు అనుమతినిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 4న రాత్రి 9:30 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని థియేటర్లలో బెనిఫిట్ షో వేసేందుకు అనుమతించారు. ఈ బెనిఫిట్ షో ఒక్కదానికి టికెట్ ధరను రూ.800కు పెంచేందుకు అనుమతిచ్చారు. అలాగే డిసెంబర్ 5న అర్ధరాత్రి ఒంటి గంటకు, తెల్లవారుజామున 4 గంటలకు రెండు అదనపు షోలు వేసేందుకు అనుమతించారు. డిసెంబర్ 5 నుంచి 8 వరకు సింగిల్ స్క్రీన్స్‌లో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 టికెట్ ధర పెంచేందుకు, డిసెంబర్ 9 నుంచి 16 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతించారు. ఇక డిసెంబర్ 17 నుంచి డిసెంబర్ 23 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.20, మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంచేందుకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టికెట్ ధరపై జీఎస్టీ వర్తిస్తుందని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడానికి రేవంత్ తాత జాగీరా

బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యతిరేకులను సంతృప్తి పరిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మారుస్తున్నారని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడానికి రేవంత్ తాత జాగీరా అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పు విషయంలో రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ తల్లి రూపానికి ఓ చరిత్ర ఉందని, ఉద్యమ ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేశారని వివరించారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ అస్తిత్వాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పల్లెలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయని, ఎన్నింటిని ధ్వంసం చేస్తావో చూస్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి బీసీలకు, గీత కార్మికులకు ద్రోహం చేస్తున్నారని, గీత కార్మికులకు రూ.7 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నా విడుదల చేయలేదని ఆరోపించారు.



శనివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే లింగయ్య

గెరిల్లా వార్ నుంచి

పీపుల్స్ ఆర్మీ దిశగా..

మావోయిస్టుల మిలిటరీ వింగ్‌గా పీఎల్‌జీఏ

- డిసెంబర్ 2 నుంచి వారోత్సవాలకు పిలుపు
- ఆరంభంలో పీఎల్‌జీఏ వరుస విజయాలు
- ఆపరేషన్ కగార్‌తో కుదేలవుతున్న పీఎల్‌జీఏ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భారత సాయుధ దళాలు బస్తర్ జంగిల్‌లో వేగంగా చొచ్చుకుపోతున్నాయి. మరోవైపు మావోయిస్టు పార్టీకి చెందిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 24వ వారోత్సవాలకు సిద్ధమవుతోంది. తుపాకుల నీడలో డిసెంబర్ 2 నుంచి 8 వరకు జరగనున్న వారోత్సవాల నేపథ్యంలో పీఎల్‌జీఏ ప్రస్థానంపై ప్రత్యేక కథనమిది.



పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ సభ్యులు (ఫైల్)

చేజారుతున్న దండకారణ్యం


మావోయిస్టు పార్టీకి ఉన్న అనేక కమిటీల్లో అత్యంత శక్తివంతమైనది దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ. పదేళ్ల కిందట ఇక్కడ ఐదువేల మంది సాయుధ సభ్యులు ఆ పార్టీకి ఉన్నట్టుగా చెబుతారు. మావోయిస్టుల జనతన సర్కార్ కల ఇక్కడ సాకారమైంది. అయితే ఇప్పుడిక్కడ సాయుధ దళాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుగా పేరున్న హిడ్మా సొంతూరు పూవర్తిలో.. ప్రభుత్వ దళాలు ఫిబ్రవరిలో క్యాంపు ఏర్పాటు చేశాయి. అంతేకాదు.. విప్లవ పోరాటాలకు నాంది పలికిన నేతల్లో ఒకరైన కొండపల్లి సీతారామయ్య పేరు మీద ఏర్పాటైన కొండపల్లి గ్రామంలోనూ ఇటీవల క్యాంపు వచ్చింది. మరోవైపు మావోయిస్టుల కంచుకోటైన అబూజ్‌మడ్‌లో అక్టోబర్ 4న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 38 మంది చనిపోయారు. ఇటీవల చోటుచేసుకుంటున్న ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, అరెస్టులతో మావోయిస్టుల బలం తగ్గుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భీకర దాడులు

పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీలో ప్రధానంగా జన మిలీషియా, గెరిల్లా స్క్వాడ్, ప్లాటూన్/కంపెనీలు ఉంటాయి. క్షేత్రస్థాయిలో పని చేసే జన మిలీషియాలో గ్రామస్తులే ఎక్కువ మంది ఉంటారు. ఆయుధం పట్టడం కంటే.. పార్టీకి ఇంటెలిజెన్స్ వింగ్‌లో పని చేస్తే, సంచరించే ప్లాటూన్లు అక్కడి పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తాయి. మెరుపు దాడుల పని గెరిల్లా దళాలది. పీఎల్‌జీఏ ఏర్పాటైన తర్వాత తొలి ఐదారేళ్లలో దేశవ్యాప్తంగా రెడ్ కారిడార్ పరిధిలోకి వచ్చే రాష్ట్రాల్లో అనేక దాడులు జరిగాయి. 2004 నుంచి 2011 వరకు చేపట్టిన దాడుల్లోనే 2 వేల వరకు ఆయుధాలు, రెండు లక్షల రౌండ్లకు పైగా తూటాలను ప్రభుత్వ బలగాల నుంచి మావోలు లూటీ చేయగలిగారు. ఈ సమయంలో రెడ్ కారిడార్ పరిధిలో పదివేల మందికి పైగా సభ్యులు పీఎల్‌జీఏకు ఉన్నట్టు అంచనా. ఇలా పెరిగిన సాయుధ సంపత్తితో అనేక హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ రక్తపాతం సృష్టించారు. అత్యధికంగా 2010లోనే మావోయిస్టులు జరిపిన దాడుల్లో 1,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

సల్వాజుడుం సృష్టికర్త మహేంద్రకర్మపై మావోలు చేసిన దాడి దృశ్యం (2013 ఫైల్)





మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు మడావి హిడ్మా

'కొయ్యూరు'తో బీజం

పీపుల్స్ వార్ నక్సలైట్ల ప్రభావం 90వ దశకంలో ఉత్తర తెలంగాణలో ఎక్కువగా ఉండేది. ఈ సమయంలో 1999 డిసెంబర్ 2న.. అప్పటి కరీంనగర్ జిల్లా కొయ్యూరు దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి, శీలం నరేశ్ మృతి చెందారు. వీరి ప్రథమ వర్ధంతి సందర్భంగా పీపుల్స్ గెరిల్లా ఆర్మీని.. 2000 డిసెంబర్ 2న పీపుల్స్ వార్ గ్రూప్ ఏర్పాటు చేసింది. ఆ తర్వాత దేశంలో ఉన్న సాయుధ విప్లవ శక్తులన్నీ కలిసి 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఒక్కతాటిపైకి వచ్చాయి. దీంతో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పేరును పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)గా మార్చారు.

ఈ సందర్భంగా మావోయిస్టు అగ్రనేతలు మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి పీఎల్‌జీఏ ప్రయత్నిస్తుందని ప్రకటించారు. తమ సమస్యలు పరిష్కారమైనప్పుడు ప్రజలే స్వచ్ఛందంగా పీఎల్‌జీఏకు మద్దతుగా నిలుస్తారని, ఆ మద్దతు సాయంతో సాయుధ విప్లవం విజయవంతమవుతుందనే ధీమా వ్యక్తం చేశారు. విప్లవం సిద్ధించిన తర్వాత గెరిల్లా ఆర్మీనే పీపుల్స్ ఆర్మీ (ప్రజా సైన్యం)గా రూపాంతరం చెందుతుందని నమ్మారు.

కౌంటర్ ఎటాక్

పెరిగిన హింసతో మావోయిస్టుల ఏరివేతకు ప్రభుత్వం 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. అయితే ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం రెడ్ కారిడార్‌లో మావోయిస్టులకు గట్టి పట్టు చిక్కేలా చేస్తే, అక్కడి దట్టమైన అడవులు, ఎత్తయిన కొండలు, పొంగిపొర్లే వాగులు ఆ ప్రాంతాన్ని శత్రుదుర్భేద్యంగా మార్చాయి. ఫలితంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు ఆరంభంలోనే అనేక ఎదురుదెబ్బలు తగిలాయి. ఈ ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్న ప్రభుత్వ బలగాలు ఆపరేషన్ సమాధాన్, ప్రహార్ అంటూ పక్కా ప్రణాళికతో మావోయిస్టులపై పోరాటానికి దిగాయి. దీంతో క్రమంగా రెడ్‌కారిడార్ కుచించుకుపోతూ వచ్చింది. ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)తో ఆఖరికి బస్తర్ అడవుల్లోనూ పీఎల్‌జీఏకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.



నంబాళ్ల.. కిషన్‌జీ.. హిడ్మా

పీఎల్‌జీఏకు అనేక మంది నాయకత్వం వహించినా.. ప్రస్తుత చీఫ్ నంబాళ్ల కేశవరావు అలియాస్ బస్వరాజ్, మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ, మడావి హిడ్మా చేపట్టిన డేరింగ్ ఆపరేషన్లు సంచలనం సృష్టించాయి. 2010లో జరిగిన చింతల్నార్ ఘటనలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు పీఎల్‌జీఏ దాడిలో చనిపోగా.. ఆ తర్వాత 2013లో జరిపిన దాడిలో సల్వాజుడుం సృష్టికర్త మహేంద్రకర్మతో పాటు 27 మంది మృతి చెందారు. కిషన్‌జీ నేతృత్వంలో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన పోరాటాలు సుదీర్ఘ కాలం అక్కడ కొనసాగిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చేశాయి. ప్రస్తుతం పీఎల్‌జీఏ కంపెనీ 6కు నాయకత్వం వహిస్తున్న హిడ్మా, ఇప్పుడు అత్యంత ప్రమాదకర మావోయిస్టుగా గుర్తింపు పొందారు. 2021 ఏప్రిల్ 4న హిడ్మా నాయకత్వంలో తెర్రం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిపిన దాడిలో 22 మంది జవాన్లు మృత్యువాత పడ్డారు.

టీజీఎస్పీలో 9 మంది అడిషనల్ కమాండెంట్ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది టీజీ స్పెషల్ పోలీస్ (ఎస్పీ) బెటాలియన్ల అడిషనల్ కమాండెంట్లను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ వివరాలిలా.. - సాక్షి, హైదరాబాద్

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎస్.శ్రీనివాస్‌రావు	అడిషనల్ కమాండెంట్, 17వ బెటాలియన్, ఆర్ సిరిసిల్ల	అడిషనల్ కమాండెంట్ 3వ బెటాలియన్, ఇబ్రహీంపట్నం
టి.గంగారాం	అడిషనల్ కమాండెంట్, 3వ బెటాలియన్, ఇబ్రహీంపట్నం	అడిషనల్ కమాండెంట్, 17వ బెటాలియన్, సిరిసిల్ల
కె.సుబ్రహ్మణ్యం	అడిషనల్ కమాండెంట్, 10వ బెటాలియన్, బీచ్‌పల్లి	అడిషనల్ కమాండెంట్, 5వ బెటాలియన్, ములుగు
ఎన్.పెద్దబాబు	అడిషనల్ కమాండెంట్, 5వ బెటాలియన్, ములుగు	అడిషనల్ కమాండెంట్, 2వ బెటాలియన్, యాపాల్‌గూడ, ఆదిలాబాద్
పి.సత్యనారాయణ	అడిషనల్ కమాండెంట్, 7వ బెటాలియన్, డిచ్‌పల్లి	అడిషనల్ కమాండెంట్, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎఫ్ఏసీ, 7వ బెటాలియన్, డిచ్‌పల్లి
కె.వీరయ్య	అడిషనల్ కమాండెంట్, 8వ బెటాలియన్, కొండాపూర్	అడిషనల్ కమాండెంట్, 12వ బెటాలియన్, అన్నెపర్తి, నల్లగొండ
ఎం.జయరాజు	అడిషనల్ కమాండెంట్, 12వ బెటాలియన్, అన్నెపర్తి, నల్లగొండ	అడిషనల్ కమాండెంట్, 10వ బెటాలియన్, బీచ్‌పల్లి
పి.వెంకటరాములు	అడిషనల్ కమాండెంట్, 15వ బెటాలియన్, సత్తుపల్లి, ఖమ్మం	అడిషనల్ కమాండెంట్, 13వ బెటాలియన్, గుడిపేట్, మంచిర్యాల
ఎంఐ సురేశ్	అడిషనల్ కమాండెంట్, 3వ బెటాలియన్, ఇబ్రహీంపట్నం	అడిషనల్ కమాండెంట్, 4వ బెటాలియన్, మామ్నూర్





శనివారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆస్ట్రియా రాయబారి కేథరినా వేజర్, తుర్కియే రాయబారి ఫిరాట్ సునెల్. ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం పాల్గొన్నారు.

వర్సిటీల పునర్వ్యవస్థీకరణ ఎప్పుడో..

ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలపై తగ్గని భారం

- శాతవాహన, తెలంగాణ వర్సిటీల పరిధి పరిమితమే..
- కొత్త జిల్లాలు, కొత్త జోనల్ వ్యవస్థ వచ్చినప్పటికీ వర్సిటీల విషయంలో మారని వైనం
- ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు తప్పని తిప్పలు



పరిధులపై ప్రత్యేక కమిటీ ప్రతిపాదనలు..

- ఉస్మానియా: రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, వికారాబాద్
- కాకతీయ: వరంగల్, హన్మకొండ, జనగాం, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం
- తెలంగాణ: నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, నిర్మల్
- శాతవాహన: కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సిద్దిపేట
- మహాత్మాగాంధీ: నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి
- పాలమూరు: మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు దాటినా.. విశ్వవిద్యాలయాల పరిపాలనకు తగిన విధంగా వాటిని పునర్వ్యవస్థీకరించలేదు. దీంతో ఆయా జిల్లాల విద్యార్థులు, అఫిలియేషన్ కలిగిన కళాశాలలు ఇబ్బంది పడుతున్నాయి. కొత్త రాష్ట్రంలో ఎనిమిదేళ్ల క్రితం కొత్త జిల్లాలు, మూడేళ్ల క్రితం కొత్త జోనల్ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అయినప్పటికీ వర్సిటీల పరిధి విషయంలో మాత్రం అవసరమైన మార్పులు చేయలేదు. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలోనే కొత్తగా శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీలను ఏర్పాటు చేసినప్పటికీ.. అవి ఇప్పటికీ ఆయా ఉమ్మడి జిల్లాల పరిధికి మాత్రమే పరిమితమయ్యాయి. దీంతో గతం నుంచే ఉన్న ఉస్మానియా, కాకతీయ వర్సిటీలపై మాత్రం భారం అలాగే ఉంది. మరోవైపు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల వారు మాత్రం ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను పునర్వ్యవస్థీకరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యేక కమిటీ నివేదిక

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు సంబంధించి ఆయా కళాశాలల అఫిలియేషన్ విషయమై.. జిల్లాల కేటాయింపుల్లో మార్పులు, చేర్పులు చేయాలంటూ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ గతంలోనే నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను ఉన్నత విద్యామండలికి అందజేయగా.. ఉన్నత విద్యామండలి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఉమ్మడి ఏపీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తెలంగాణలో శాతవాహన, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశారు. అయితే కళాశాలల అఫిలియేషన్ విషయానికి వస్తే.. తెలంగాణ వర్సిటీ పరిధిలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, శాతవాహన వర్సిటీ పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహాత్మాగాంధీ వర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా, పాలమూరు వర్సిటీ పరిధిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలు మాత్రమే ఉన్నాయి. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కళాశాలల అఫిలియేషన్ మాత్రం.. ఇప్పటికీ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోనే ఉంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత.. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలను ఆనుకున్న నిజామాబాద్‌లోని తెలంగాణ వర్సిటీని దాటుకుని ఆయా జిల్లాల వారు సుదూరంలోని వరంగల్ కాకతీయ వర్సిటీకి వెళ్లాల్సి వస్తోంది. కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీని అనుకున్న ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల వారు కరీంనగర్ మీదుగానే వరంగల్ వెళ్లాల్సి వస్తోంది. అయితే గతంలోనే ప్రత్యేక కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం.. ఆయా వర్సిటీలు, కొత్త జిల్లాల మధ్య దూరం, కళాశాలల సంఖ్యను బట్టి పరిధి మార్పుపై ప్రతిపాదనలు చేశారు. ఆయా అంశాల ఆధారంగా ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ మేరకు తెలంగాణ వర్సిటీ పరిధిలోకి కొత్తగా నిర్మల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలు, శాతవాహన వర్సిటీ పరిధిలోకి ఆసిఫాబాద్, మంచిర్యాల, సిద్దిపేట జిల్లాలను కేటాయించేలా నివేదికలో ప్రతిపాదించారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఉస్మానియా పరిధిలో ఉండగా.. కొత్త ప్రతిపాదనల ప్రకారం సంగారెడ్డి జిల్లా మాత్రమే ఆ వర్సిటీ పరిధిలో ఉంచాలని నిర్ణయించారు. అంటే ఉస్మానియా వర్సిటీ పరిధిలో సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, వికారాబాద్ జిల్లాలు ఉండేలా ప్రతిపాదించారు. ఇక కాకతీయ వర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉండేలా నిర్ణయించారు. ఇక మహాత్మాగాంధీ వర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండలోని మూడు జిల్లాలు, పాలమూరు వర్సిటీ పరిధిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని ఐదు జిల్లాలు యధావిధిగా ఉండేలా నివేదికలో ప్రతిపాదించారు. కాగా ఇందుకు సంబంధించి విధాన నిర్ణయం విషయంలో జాప్యం జరుగుతోంది.



మహమ్మారిని తరిమేద్దాం

ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో భారీ రిబ్బన్‌ను సిద్ధం చేస్తున్న మెడికల్ కాలేజీ విద్యార్థులు



గురజాడ గుర్తులు...

గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా విజయనగరంలో ఆయన వాడిన వస్తువులతో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఇలా ర్యాలీ నిర్వహించారు.



వైభవంగా పద్మనాభుడి దీపోత్సవం

విశాఖలోని పద్మనాభంలో అనంత పద్మనాభుడి దీపోత్సవం వైభవంగా జరిగింది. తప్పెటగుళ్లు, పులివేషాలు, స్వామి వారి ఊరేగింపుతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రాత్రి జరిగిన దీపోత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సివిల్ జడ్జిలుగా ఏయూ విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లా కాలేజ్ 2018-2021 బ్యాచ్ విద్యార్థిని విందెల గీత భార్గవి, 2016-19 బ్యాచ్ విద్యార్థిని కేంబూరి నైమిశలు సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. ఇటీవల వెలువడిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో విజయం సాధించి చిన్న వయసులో సివిల్ జడ్జిలు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సీతామాణిక్యం హర్షం వ్యక్తం చేశారు. ఇద్దరు విద్యార్థినులు కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని, వీరు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరం మండలం పసలపూడిలో జరుగుతున్న యూటీఎఫ్ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించేలోగా ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే అపార్ నమోదు ఉపాధ్యాయులపై అధిక భారం మోపుతోందని, ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. అపార్‌ను నిమిషాలు, గంటల్లో పూర్తి చేయమని ఒత్తిడి తేవడం సమంజసం కాదన్నారు. అపార్ నమోదు సమయాన్ని పెంచాలని, ఈ ప్రక్రియను సరళతరం చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

ఏపీ సమస్యలను చూస్తుంటే నిద్ర పట్టడం లేదు

మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: రాష్ట్రంలో ఉన్న సమస్యలను చూస్తుంటే నిద్ర పట్టడం లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం బోరుభద్ర నుంచి సున్నాపల్లి వరకు డీపీఎం రోడ్డు అత్యవసర మరమ్మతు పనులకు గాను రూ.70లక్షలు నిధులతో లక్ష్మీవలస వద్ద శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూలపేట పోర్టుకు అనుబంధంగా 8 ఎకరాల్లో అనేక పరిశ్రమలు, టూరిజం పార్కులు, ఇతర సంస్థలు వస్తాయని దీంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డాక్టర్, సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

జనసేన నేత ఇసుక దందా

ట్రాక్టరును అడ్డుకున్న గ్రామస్తులు

పరిగి: శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండల జనసేన పార్టీ కన్వీనర్ చిన్నపల్లి సురేష్ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడ్డాడు. శనివారం మండలంలోని పైడేటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపంలోని పెన్నానదిలో ఇసుకను తవ్వి, ట్రాక్టరులో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డగించారు. సురేష్ తరచూ ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ఆగ్రహించి..మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ సిద్దేశ్వర్ అక్కడికి చేరుకుని ఇసుక ట్రాక్టర్‌ను పరిగికి తరలించి, పోలీసులకు అప్పగించారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై అవగాహన సదస్సులు

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయుల పదోన్నతులు, ఇంక్రిమెంట్ల కోసం డిసెంబరు 18 నుంచి ప్రారంభమయ్యే డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వి. ప్రసాద్, రాధాకృష్ణ శనివారం తెలిపారు. పరీక్షలపై రూపొందించిన బుక్‌లెట్, మోడల్ పేపర్లను ఆదివారం కడప ఎన్జీవో భవనంలో ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు.

పచ్చటి పర్వత శ్రేణులను ముద్దాడుతున్న మేఘమాలలు..దట్టంగా కమ్ముకున్న పొగమంచు.. శ్వేత వర్ణంలో మెరిసిపోయే మంచు దుప్పట్లు.. మలుపు తిరిగే కొండ అంచుల్లో కనువిందుచేసే అటవీ అందాలు.. ఓవైపు చల్లని గాలులు మరోవైపు ఆకుపచ్చని హరిత అందాలు.. అడవులపై పరిచినట్టుగా పవళించే మేఘాలు.. ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంజాయ్ చేయాలంటే కశ్మీర్ వరకు వెళ్లాల్సిన అవసరం లేదు. లంబసింగిని సందర్శిస్తే సరిపోతుంది. ఇక్కడ ప్రకృతి అందాలను చూస్తేవావ్ అనాల్సిందే.



చెరువులవేనంలో కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగం

శ్వేత మయూరం

మన కశ్మీరం

- కొండలశ్రేణుల్లో హరిత సోయగాలు
- కనువిందు చేస్తున్న అటవీ అందాలు
- అడవులపై పరిచినట్టుగా మేఘ సౌందర్యం
- తరలివస్తున్న పర్యాటకులు
- కనిష్ట ఉష్ణోగ్రతల నమోదుతో ఆహ్లాదకర వాతావరణం
- అల్లూరి జిల్లా లంబసింగికి పర్యాటకంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు

చింతపల్లి: మండలంలోని లంబసింగికి తెలుగు రాష్ట్రాల్లో ఓ ప్రత్యేకత ఉంది. చలికాలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఇదే కావడం అందుకు కారణం. చలికాలం బాగా ఉధృతంగా ఉండే తరుణంలో ఇక్కడ సగటు ఉష్ణోగ్రత మూడు డిగ్రీలకు మించదు. అత్యల్ప ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్‌గా ఇక్కడ వివిధ సందర్భాల్లో నమోదైంది.

3,600 అడుగుల ఎత్తులో..

సముద్రమట్టానికి 3,600 అడుగుల ఎత్తున ఉన్న లంబసింగి ఒకప్పుడు ఎలాంటి ప్రత్యేకతలూ లేని చిన్న గిరిజన పల్లె. అటవీశాఖ చెక్‌పోస్టు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశ్రమ గురుకుల పాఠశాల మాత్రమే ఉండేవి. విశాఖపట్నం, నర్సీపట్నం, పాడేరు నుంచి బస్సులు మాత్రం ఈ ప్రాంతం మీదుగా తరచూ తిరిగేవి.

- శీతాకాలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవడం వల్ల చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడ ఉన్న చెక్‌పోస్టు సెంటర్‌లో చాలాకాలం క్రితం ఓ చెట్టుకింద ఒక వ్యక్తి చలికి కొయ్యబారి చనిపోయాడని చెబుతుంటారు. అందువల్ల ఈ ప్రాంతాన్ని కొర్రబయలు అని కూడా పిలిచేవారు.
- మైదాన ప్రాంతంలో సాధారణంగా ఏడాదికి నాలుగు నెలలు మాత్రం చలి ఉంటుంది. కానీ లంబసింగి ప్రాంతంలో అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు చలి వణికిస్తుంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి చలి ప్రభావం కనిపిస్తుంది. డిసెంబర్‌లో ఒక డిగ్రీ సెంటీగ్రేడ్ నమోదైన సందర్భాలు ఉన్నాయి. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే చింతపల్లిలో ఉష్ణోగ్రత ఇక్కడకన్నా రెండు డిగ్రీలు ఎక్కువగా ఉంటుంది.

నిత్యం భోగి మంటలే..

ప్రతీ ఇంట్లో అందరికీ పెద్ద రగ్గులు ఉంటాయి. స్వెటర్లు, కంబళ్లు తప్పనిసరి. మంట కోసం కట్టెలు సిద్ధంగా ఉంచుకుంటారు. సాయంత్రమయ్యేసరికి ప్రతి ఇంట్లో అన్నం వండుకోవడానికన్నా ముందు కుంపట్లు సిద్ధం చేసుకుంటారు.

తాజంగిలో బోటు షికార్, జిప్‌లైన్

తాజంగి జలాశయంలో ఐటీడీఏ ఏర్పాటుచేసిన బోట్ షికార్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. లంబసింగి వచ్చే పర్యాటకులందరూ 20 నిమిషాలు బోటులో షికారు చేసి ఎంతో సంతోషం పొందుతుంటారు. జలాశయం మీదుగా ఏర్పాటు చేసిన జిప్‌వే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సుమారు 250 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ జిప్ లైన్ ద్వారా కొండపై నుంచి చెరువు వరకు జారుతూ ప్రకృతి అందాలను తిలకిస్తూ పర్యాటకులు ఎంజాయ్ చేస్తుంటారు.

మరో వ్యూపాయింట్

నర్సీపట్నం నుంచి లంబసింగి వచ్చే మార్గంలో బోడకొండమ్మ ఆలయం వద్ద మరో వ్యూపాయింట్ అందుబాటులోకి వచ్చింది. గత అరకు ఎంపీ మాధవి నిధులు వెచ్చించి దీనిని నిర్మించారు.

- నర్సీపట్నం నుంచి ప్రయాణం ప్రారంభించాక చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతంలో మలుపులతో కూడిన రోడ్లు, పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరంగా ప్రయాణం సాగుతుంది. ఈ మార్గంలో కాఫీ, మిరియం తోటలు ఆకట్టుకుంటాయి.
- విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ నుంచే కాకుండా ఏకంగా బెంగళూరు నుంచి కూడా వాహనాల్లో పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. దీనిని బట్టి ఈ ప్రదేశానికి ఎంత క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. విశాఖపట్నం, నర్సీపట్నం నుంచి ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

పర్యాటక సీజన్‌లో కళకళ

పర్యాటక సీజన్ వచ్చిందంటే చాలు లంబసింగి పర్యాటకులతో కళకళలాడుతుంది. ఇక్కడ పూర్తిస్థాయిలో వసతులు లేనందున సమీప నర్సీపట్నంలో బస చేసి తెల్లవారుజామున ఇక్కడి పర్యాటకులు వచ్చేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రిసార్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కాటేజీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.

కొండల్లో 'పాల సముద్రం'

చెరువులవేనం కొండల్లో ప్రకృతి అందాలు పాల సముద్రాన్ని తలపిస్తాయి. ఈ ప్రాంతం లంబసింగికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో పొగమంచు దట్టంగా కమ్మి ఉంటుంది. మేఘాలు మనతో మాట్లాడుతున్నాయా అనిపిస్తుంది. ఈ అపురూప అందాలను తిలకించేందుకు ఎక్కడెక్కడినుంచో ప్రకృతి ప్రేమికులు ఇక్కడికి వస్తుంటారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా పాడేరు ఐటీడీఏ వ్యూపాయింట్‌ను నిర్మించింది.

- శీతల వాతావరణం ప్రారంభమైన నాటి నుంచి వచ్చే పర్యాటకులతో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి లంబసింగి సెంటర్ జాతరను తలపిస్తుంది. వీకెండ్‌లో అయితే ఇక చెప్పనక్కర్లేదు. శని, ఆదివారాల్లో అయితే చెరువులవేనం జనసంద్రంగా మారుతుంది. కొంత మంది శనివారం రాత్రి లంబసింగి వచ్చి గుడారాలు వేసుకొని రాత్రంతా జాగారం చేస్తూ దట్టంగా కురుస్తున్న పొగమంచును ఆస్వాదిస్తూ గడుపుతారు. వేకువజామున చెరువులవేనం వెళ్లి ప్రకృతి అందాలను తిలకిస్తారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు వెచ్చించి అభివృద్ధి చేసింది. తాజంగిలో స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణం చేపట్టింది. చెరువులవేనం, బోడకొండ గుడి వద్ద వ్యూపాయింట్‌లు నిర్మించింది.కృష్ణాపురం వద్ద ఎకో టూరిజం ప్రాజెక్ట్‌ను ఏర్పాటుచేసింది. తాజంగి జలాశయాన్ని అభివృద్ధి చేసింది.

– మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు ఎమ్మెల్యే

కనీస వసతులు అవసరం



పర్యాటక ప్రాంతంగా పాచు ర్యం పొందడంతో ఈ ప్రాంత అందాలను చూడడానికి ఎంతోమంది కుటుంబాలతో వ స్తున్నారు.ఈ ప్రాంతంలో కనీస వసతులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటుకు అ. ధికారులు చర్యలు చేపట్టాలి.వాహనాల నిలుపుదలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలి.

– ప్రశాంత్, పర్యాటకుడు విజయనగరం



బోడకొండమ్మ గుడి వద్ద వ్యూపాయింట్



తాజంగిలో బోటు షికారు



లంబసింగిలో పర్యాటకశాఖ రిసార్ట్

ఏవోబీలో రెడ్ అలర్ట్

రేపటి నుంచి మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు

- అడవిని జల్లెడపడుతున్న పోలీసు బలగాలు
- భయాందోళనలో సరిహద్దు గిరిజనులు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా ఒడిశా సరిహద్దులో పీఎల్‌జీఏ(పీపుల్స్ లిబిరేషన్ గెరిల్లా ఆర్మీ) వారోత్సవాల నేపథ్యంలో రెడ్ అలర్ట్ పరిస్థితులు నెలకొన్నాయి.ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు జరగనున్నాయి.ఏవోబీలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.ఏవోబీలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.గతంతో పోలిస్తే ఏవోబీలో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గినప్పటికీ,వారోత్సవాలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. వారోత్సవాలను భగ్నం చేసేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుంది. ముంచంగిపుట్టు,పెదబయలు,జి.మాడుగుల,డుంబ్రిగూడ,చింతపల్లి,జీకేవీధి మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాలల్లో ఆంధ్ర,ఒడిశా పోలీసు బలగాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.దీంతో పాటు మండల కేంద్రాల్లో విస్తృ,ంగా తనిఖీలు చేస్తున్నారు.ప్రయాణికుల బ్యాగులు,లాగేజీలను పరిశీలించి,అనుమానితుల వివరాలు సేకరించి,విడిచి పెడుతున్నారు.

తగ్గిన మావోయిస్టుల ప్రాబల్యం..

ఆంధ్ర ఒడిశా సరిహద్దులో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గింది.గత కొన్ని సంవత్సరాలుగా మావోయిస్టులకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొ న్నాయి.పోలీసులు బలగాలు విస్తృతంగా కూంబింగ్‌లతో జల్లెడ పడుతుండడంతో నిర్బంధ వాతావరణం నెలకొంది. ఆంధ్రలోని రూడకోట అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు ఒడిశాలోని జోడం,గుర్రశెట్టి,గుమ్మ వంటి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఒడిశా పోలీసులు ఆరు అవుట్ పోస్ట్‌లను ఏర్పాటు చేసారు.దీంతో మావోయిస్టుల కంచుకోటగా ఉండే ఏవోబీ ప్రాంతం పూర్తిగా పోలీసుల గెప్పెట్లోకు వెళ్లింది. ఏవోబీ వ్యాప్తంగా మావోయిస్టులు తలపెట్టిన పీఎల్‌జీఏ వారోత్సవాలను పూర్తిగా భగ్నం చేసేందుకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైయింది.సరిహద్దులోని మారుమూల అడవి ప్రాంతాల్లో పోలీసు బలగాలు కూంబింగ్‌ను మొదలుపెట్టాయి.

క్రిస్మస్ వస్తున్నా.. పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వరా?

ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జాన్ వెస్లీ



సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు పాస్టర్లకు గౌరవ వేతనం ఊసే ఎత్తకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ ప్రశ్నించారు. రాష్ట్రంలోని పాస్టర్లకు క్రమం తప్పకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గౌరవ వేతనం అందించిందని గుర్తు చేశారు. క్రైస్తవులకు అతి ముఖ్యమైన క్రిస్మస్ పండుగ వస్తున్నా.. కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదని, వెంటనే గౌరవ వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విజయవాడలో ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా కరోనా విపత్తు సమయంలో సైతం పాస్టర్లకు క్రమం తప్పకుండా అందించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో క్రిస్టియన్ మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లోనూ వైఎస్ జగన్ ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఆరు నెలలు కావొస్తున్నప్పటికీ ఇంత వరకు క్రైస్తవులకు ఒక్క సంక్షేమ పథకం అందించకపోగా పాస్టర్లకు గౌరవ వేతనం కూడా ఇవ్వలేదని జాన్ వెస్లీ మండిపడ్డారు. మరోవైపు క్రైస్తవులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మిక సమాచారం

అంతర్వేదిలో భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కార్తిక మాసం చివరి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, భవానీ, మాలధారణ భక్తులు స్వామి సన్నిధికి వచ్చారు. స్వామి వారి దర్శనంలో వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఏర్పాట్లు చేశారు.

రికార్డు స్థాయిలో సత్య వ్రతాలు



అన్నవరం: రత్నగిరిపై నిర్వహించే సత్యనారాయణ స్వామి వ్రతాలు ఈ ఏడాది కార్తిక మాసంలో కొత్త రికార్డు సృష్టించాయి. శనివారం దేవస్థానంలో 4,426 వ్రతాలు జరిగాయి. దీంతో గతంలో ఏ కార్తిక మాసంలోనూ జరగని విధంగా ఒక రోజు మిగిలి ఉండగానే 1,44,849 వ్రతాలు నిర్వహించారు. 2022లో అత్యధికంగా 1,42,378 వ్రతాలు జరగడం విశేషం. ఇప్పటి వరకూ ఇదే రికార్డు. దీనిని ప్రస్తుతం అధిగమించారు. ఇంకా కార్తిక అమావాస్య, ఆదివారం జరిగే వ్రతాలు కూడా కలిపితే ఈ సంఖ్య 1.50 లక్షలకు చేరే అవకాశం ఉంది. అత్యధికంగా ఈ నెల 25వ తేదీ, నాలుగో కార్తిక సోమవారం నాడు 10,728 జరిగాయి.

కాగా రూ.300, రూ.వెయ్యి, రూ.1500, రూ.2000 టిక్కెట్లతో నిర్వహించిన మొత్తం వ్రతాల్లో లక్ష వ్రతాలు రూ.300 టిక్కెట్లపై జరిగినవేనని అధికారులు తెలిపారు. ఈ వ్రతాల నిర్వహణ ద్వారా సుమారు రూ.8 కోట్ల వరకు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

విద్యా సమాచారం

3న సైన్స్ కాంగ్రెస్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేషనల్ గ్రీన్‌కోర్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన కాకినాడలో నిర్వహించే జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతం చేయాలని డీఈఓ పిల్లి రమేష్ కోరారు. తన ఛాంబర్‌లో శనివారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారు చేయడం, వ్యర్థ పదార్థాల పునఃప్రక్రియ, జీవవైవిధ్యం, మృత్తికారోగ్యం విషయంపై పోస్టర్ ప్రజంటేషన్ నిర్వహిస్తారన్నారు.

వికాస కార్యవర్గం ఏకగ్రీవం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యాపకేతర ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పోటీలో ఫ్రెండ్స్ ప్యానెల్ చెందిన ఒక ప్యానెల్ అభ్యర్థులే ఉండటంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆచార్య ఎస్ .మురళీమోహన్ శనివారం ప్రకటించారు. నూతన కార్యవర్గానికి అధ్యక్షుడిగా నీలపు ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దాసరి విజయ ప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా నేలపాటి నాగేశ్వరరావు, తోట వెంకటేష్, కోశాధికారిగా యేషయ్య, కార్యవర్గ సభ్యులుగా ఆనంద్ కుమార్, నాగరాజు, సాంబశివరావు, శశిధర్, జి. శ్రీను, నల్లగొర్ల శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరెడ్డి, టంకశాల వెంకటేశ్వరరావు, నూతక్కి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ సమయం ముగిసిన వెంటనే శనివారం సాయంత్రం నామినేషన్ వేసిన సభ్యుల దరఖాస్తులను పరిశీలించి పోటీలో ఉన్న వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

ఏఎన్‌యూలో త్రిసభ్య కమిటీ పర్యటన

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహిళా వసతి గృహాల్లో ఆహార పదార్థాలు, పరిశుభ్రత తదితర అంశాలపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. గుంటూరు జిల్లా తెనాలి సబ్ కలెక్టర్ అంజనా సిన్హ, డీఎస్ఓ పద్మజ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ రెడ్డిలతో కూడిన కమిటీ శనివారం యూనివర్సిటీలో పర్యటించింది. భోజనంలో జెర్రి, కప్పలు, పురుగులు వస్తున్నాయని వసతి గృహాల విద్యార్థినులు శుక్రవారం ధర్నాకు దిగిన నేపథ్యంలో త్రిసభ్య కమిటీ సభ్యులు శనివారం తొలుత యూనివర్సిటీలోని మహిళా వసతి గృహంలో పర్యటించారు. వంట గదులు, భోజన శాల, పరిసరాలను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, నిత్యావసర వస్తువుల నాణ్యత, పరిసరాల పరిశుభ్రం, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. భోజన శాలలో విదార్థినిలతో మాట్లాడి వివరాలు సేకరించారు.

Gold Memories

ఎన్ని తరాలు చూసినా కొత్తగా అనిపించే కల్ట్ క్లాసిక్ గుండమ్మ కథ

ఏ సినీ ఇండస్ట్రీలోనైనా కొన్ని క్లాసిక్స్ ఉంటాయి. వాటిని ఎన్నిసార్లు, ఎన్ని తరాలు చూసినా కొత్త ఆవకాయలా ఘాటుగా, తియ్యటి బంగినపల్లి మామిడిలా ఉంటాయి. అలాంటి సినిమాల్లో 'గుండమ్మ కథ' ఒకటి. 1962 జూన్ 7న విడుదలైన ఇలాంటి సినిమా అసలు ఎవరు చూస్తారు? అన్న దగ్గర మొదలై... ఈ సినిమా చూడని వారు ఉన్నారా? అనేవరకూ వెళ్లింది. అలాంటి కల్ట్ క్లాసిక్ గురించి కొన్ని ఇంట్రస్టింగ్ విషయాలు తెలుసుకుందాం.



ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి ఇద్దరు స్టార్ హీరోలు... సావిత్రి, జమున వంటి హేమా హేమీలున్న సినిమాకు సూర్యకాంతం వంటి నటి టైటిల్ రోల్లో 'గుండమ్మ కథ' పేరు పెట్టడం అప్పట్లో పెద్ద సంచలనం. వాస్తవానికి గుండమ్మ పేరు మన తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా కనిపించదు. ఇది కన్నడ పేరు. 'పాతాళ భైరవి, మిస్సమ్మ, మాయా బజార్' వంటి క్లాసిక్స్ తీసిన విజయా సంస్థ తొలిసారిగా రీమేక్ చేసిన సినిమా 'గుండమ్మ కథ'. కన్నడంలో విఠలాచార్య తీసిన 'మనె తుంబిద హెణ్ణు' సినిమాకు రీమేక్ ఇది. ఇందులో ఓ ప్రధాన పాత్ర పేరు గుండమ్మ. ఆ పాత్రకు తెలుగులో ఏ పేరు పెట్టాలా? అని ఆలోచిస్తుండగా అదే పేరు ఉంచమని చక్రపాణి సలహా ఇచ్చారు. చివరకు దాన్నే సినిమా పేరుగా కూడా ఖాయం చేశారు. అలా సినిమాలో టాప్ స్టార్లున్నా ఓ క్యారెక్టర్ ఆర్టిస్ట్ పేరుపై టైటిల్ పెట్టడం విశేషం. ఈ ప్రాజెక్టును విజయా వారు చేయడానికి కారణం.. సినిమాను మద్రాసులోని నాగిరెడ్డి స్టూడియోలో తీస్తుండగా.. విఠలాచార్య ఆయన్నుంచి కొంత ఆర్థిక సహాయం పొందారు. దానికి కృతజ్ఞతగా రీమేక్ రైట్స్‌ను నాగిరెడ్డికి ఇచ్చారు విఠలాచార్య.

కథేంటంటే...

ఈ చిత్రకథ విషయానికొస్తే.. గుండుపోగుల వెంకట్రామయ్య రెండో భార్య సూర్యకాంతం. ఈమె తన సవతి కూతురు లక్ష్మి (సావిత్రి)ని పని మనిషిలా చూస్తూ ఇంటి చాకిరి మొత్తం చేయిస్తుంటుంది. తన కూతురు సరోజ (జమున)ను మాత్రం గారాభంగా పెంచుతుంది. వెంకట్రామయ్య బాల్య స్నేహితుడు ఎస్వీఆర్ ఇద్దరు కొడుకులు ఎన్టీఆర్ (అంజి), ఏఎన్నార్ (రాజా) ఆ ఇంట్లో చెరో దారిన ప్రవేశించి గుండమ్మ కూతుళ్లను పెళ్లి చేసుకుంటారు. తర్వాత గుండమ్మ కూతురు సరోజకు రెండో అల్లుడు రాజా ఎలా బుద్ధి చెప్పాడు? గుండమ్మ తన తప్పు ఎలా తెలుసుకుంది? అనేదే 'గుండమ్మ కథ' స్టోరీ.

'టేమింగ్ ఆఫ్ ది ష్రూ' స్ఫూర్తితో...

'గుండమ్మ కథ'ను ముందుగా బీఎస్ రెడ్డి డైరక్షన్‌లో తీద్దామనుకున్నారు. ఓ రీమేక్‌ను అంత పెద్ద దర్శకుడితో తీయిస్తే బాగుండదని పుల్లయ్యతో చేద్దామని చర్చించుకున్నారు. అయితే... నరసరాజు రాసిన డైలాగ్ వెర్షన్ ఆయనకు పంపితే 'ఈ ట్రీట్‌మెంట్ నాకంత నచ్చలేదు' అని పుల్లయ్య అన్నారట. దీంతో నాగిరెడ్డి రంగంలోకి దిగి కమలాకర కామేశ్వరరావుకు డైరక్షన్ అప్పగించారు. మరో విషయం ఏంటంటే... కామేశ్వరరావు అప్పటివరకూ పౌరాణిక సినిమాలే తీశారు. ఈ సినిమాతో తొలిసారి ఓ సాంఘిక చిత్రానికి దర్శకత్వం వహించారు. కన్నడ సినిమాలో ఉన్న కొన్ని సీన్లు నచ్చని చక్రపాణి షేక్స్పియర్ రచన 'టేమింగ్ ఆఫ్ ది ష్రూ' నుంచి కొంత స్ఫూర్తి పొంది అచ్చ తెలుగు కథను సిద్ధం చేశారు.

గుండమ్మగా ఆమే కరెక్ట్

సినిమా కోసం ఎన్టీఆర్, ఏఎన్నార్, సావిత్రి, జమున, ఎస్వీఆర్, రమణారెడ్డి వంటి వారంతా డేట్స్ ఇచ్చినా సినిమా మాత్రం మొదలు పెట్టలేదు. కారణం 'గుండమ్మ' పాత్ర ఎవరు చేయాలి అని. ఓ షూటింగ్‌లో సూర్యకాంతం మాట తీరు గమనించిన నాగిరెడ్డి 'గుండమ్మ' పాత్రకు ఆమైతేనే కరెక్ట్ అని భావించారు. ఇదే విషయాన్ని ఎన్టీఆర్‌తో ప్రస్తావిస్తే ఆయన వెంటనే ఓకే అనేశారట.

గార్డెన్స్‌లోనే ప్రేమ యాత్రలకు బృందావనమూ...

సినిమాలోని అన్ని పాటలను పింగళి నాగేంద్రరావు రాశారు. ఘంటసాల సంగీతం అందించారు. ప్రతీ పాట ఓ క్లాసిక్. 'ప్రేమ యాత్రలకు బృందావనమూ...' పాట వెనుక ఓ చిత్రమైన చర్చ జరిగింది. చక్రపాణితో రచయిత పింగళి నెక్స్ట్ డ్యూయెట్ ఎక్కడ తీస్తున్నారు? అని అడగ్గా... ఎక్కడో ఎందుకు? పాటలో దమ్ముంటే విజయా గార్డెన్స్‌లోనే చాలు... ఊటీ, కశ్మీర్, కొడైకెనాల్ ఎందుకు? అని అన్నారట. ఆయన మాటల్ని దృష్టిలో పెట్టుకుని, 'ప్రేమ యాత్రలకు బృందావనమూ...' పాట రాశారు పింగళి.

ఇద్దరికీ నూరవ చిత్రమే

హీరోలుగా ఎన్టీఆర్, ఏఎన్నార్‌లకు ఇది 100వ చిత్రం. అప్పటికి ఎన్టీఆర్ తెలుగులో రారాజు. అలాంటి వ్యక్తి అంజి పాత్ర ఒప్పుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. పైగా తనకు దీటుగా నటించే ఏఎన్నార్ ఈ సినిమాలో స్టైలిష్‌గా కనిపిస్తారు. ఎన్టీఆర్ మాత్రం సినిమాలో ఎక్కువ భాగం నిక్కర్‌తో కనిపిస్తారు. పైగా పిండి రుబ్బుతారు. నటనపై ఎన్టీఆర్‌కున్న నిబద్ధతకు ఈ సినిమా ఓ చిన్న ఉదాహరణ. ఈ సినిమాను తమిళంలో జెమినీ గణేషన్, ఏఎన్నార్‌లతో రీమేక్ చేశారు.

ఫొటోలతో టైటిల్స్

ఎన్టీఆర్, ఏయన్నార్ కలిసి నటించినప్పుడల్లా ఓ సమస్య ఉండేది. స్క్రీన్‌పై ముందు ఎవరి పేరు వేయాలి అని. 'గుండమ్మ కథ'కూ అదే సమస్య వచ్చింది. దీనికి నాగిరెడ్డి ఓ ప్లాన్ ఆలోచించారు. స్క్రీన్‌పై అసలు పేర్లే వేయకుండా ఫొటోలు చూపించాలని డిసైడయ్యారు. అలా టైటిల్ తర్వాత ఎన్టీఆర్, ఏఎన్నార్, సావిత్రి, జమున, ఎస్వీఆర్ ఫొటోలు పడతాయి. ఇలా హీరో పేర్లు కాకుండా ఫొటోలతో టైటిల్స్ వేయడం ఈ సినిమాతోనే మొదలైంది.

'గుండమ్మ కథ' రీమేక్?

ఎన్టీఆర్, ఏఎన్నార్ పలు చిత్రాల్లో నటించారు. వారి వారసులు బాలకృష్ణ, నాగార్జున కూడా ఓ సినిమాలో కలిసి నటించాలనుకున్నారు. కానీ ఎందుకో వర్కౌట్ కాలేదు. తర్వాత వీళ్లిద్దరూ 'గుండమ్మ కథ'ను రీమేక్ చేద్దామనుకున్నారు. అదీ వర్కౌట్ కాలేదు. మరి అక్కినేని, నందమూరి మూడో తరం వారసులైనా 'గుండమ్మ కథ'ను చేస్తారేమో చూడాలి.

- అలిపిరి సురేష్

ఏఐతో భావోద్వేగాలను పునఃసృష్టించలేరు



• ఎస్పీ చరణ్

''ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' (ఏఐ) (కృత్రిమ మేధస్సు)తో వాయిస్‌ను రీ క్రియేట్ చేయొచ్చు. కానీ, అందులోని భావోద్వేగాలను పునఃసృష్టించలేరు. పైగా ఏఐ వాయిస్‌లో సహజత్వం కూడా ఉండదు'' అని గాయకుడు ఎస్పీ చరణ్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఎస్పీ చరణ్.. తన తండ్రి –ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వాయిస్‌ను ఏఐతో పునఃసృష్టించడానికి అంగీకరించకపోవడానికి గల కారణం గురించి మాట్లాడుతూ– ''కృత్రిమ మేధస్సుతో వాయిస్‌ను రీ క్రియేట్ చేయడానికి నేను వ్యతిరేకిని. ఇటీవల వచ్చిన రజనీకాంత్ గారి 'వేట్టయాన్' సినిమాలో దివంగత గాయకుడు మలేషియా వాసుదేవన్‌గారి గాత్రాన్ని ఏఐతో రీ క్రియేట్ చేశారు. ఒకవేళ నాన్నగారు జీవించి ఉంటే ఆ పాట పాడేందుకు 'వేట్టయాన్' యూనిట్ ఆయన్ని సంప్రదించి ఉండేదేమో? మనందరికీ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, మలేషియా వాసుదేవన్‌ల మీద ఉన్న ప్రేమ కారణంగా వాళ్ల వాయిస్‌లను పునఃసృష్టించాలనిపిస్తుంది. కృత్రిమ మేధస్సుని ఉపయోగించి వారి స్వరాన్ని రీ క్రియేట్ చేయగలరు. కానీ, ఆ పాటల్లో సహజత్వం ఉండదు. ఆ పాట వినడం వల్ల శ్రోతలకు కలిగే భావోద్వేగాలను పునఃసృష్టించలేరు. నాన్నగారి వాయిస్‌ని రీ క్రియేట్ చేస్తామని చాలామంది నన్ను అడిగినా నేను ఒప్పుకోలేదు. అలా చేస్తే ఆ స్వరంలో సహజత్వం ఉండదు. అలాంటి గొంతు వినడం నాకు, మా కుటుంబానికి ఇష్టం లేదు.. తన పాటల రూపంలో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు'' అని ఎస్పీ చరణ్ పేర్కొన్నారు.

'కల్కి'ని అందుకే తిరస్కరించా!

''కల్కి 2898 ఏడీ' సినిమాలో ఒక పాత్ర చేయమని నన్ను కోరారు నాగ్ అశ్విన్. అయితే ఆ పాత్ర నాకు అంత ఆసక్తిగా అనిపించలేదు.. అందుకే సున్నితంగా తిరస్కరించాను'' అని హీరోయిన్ కీర్తీ సురేష్ అన్నారు. ఇటీవల గోవాలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' (ఇఫీ) వేడుకల్లో డైరెక్టర్ నాగ్ అశ్విన్‌తో కలిసి పాల్గొన్నారు కీర్తీ సురేష్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ''కల్కి 2898 ఏడీ'లో నన్ను అడిగిన పాత్రను నేను తిరస్కరించినప్పటికీ నాగ్ అశ్విన్ ఏదో ఒక రకంగా ఆ సినిమాలో నన్ను భాగస్వామ్యం చేస్తాడని నమ్మాను. నేను అనుకున్నట్లుగానే బుజ్జి పాత్రకు (ప్రభాస్ వాడిన కారు పేరు) నాతో డబ్బింగ్ చెప్పించాడు. బుజ్జికి వాయిస్ ఓవర్ చెప్పడం వల్ల ప్రేక్షకులకు ఎలా చేరువ అవుతావు? అని కొందరు నన్ను ప్రశ్నించారు. కానీ, చాలా ప్రత్యేకంగా ఉంటుందని భావించి, నాగి అశ్విన్ అడిగిన వెంటనే ఓకే చెప్పాను. సినిమా విడుదల తర్వాత చాలా మంది.. 'బుజ్జి కారుకు నీ డబ్బింగ్ ప్లస్ అయింది' అని నాతో అనడం ఆనందాన్నిచ్చింది'' అన్నారు. ఇదిలా ఉంటే... నాగ్ అశ్విన్ దర్శకత్వంలో కీర్తి సురేష్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మహానటి' (2018). సావిత్రి బయోపిక్‌గా రూపొందిన ఈ సినిమాలో సావిత్రిగా తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు కీర్తి. ఈ సినిమాకి జాతీయ ఉత్తమ నటి అవార్డును కీర్తీ సురేష్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక కీర్తి వ్యక్తిగత జీవితం గురించి చెప్పాలంటే.... తన స్నేహితుడు ఆంటోనీ తట్టిల్‌ని డిసెంబరులో గోవాలో పెళ్లి చేసుకోబోతున్నారామె.



- కీర్తీ సురేష్

ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలి



– కాస్ట్యూమ్ డిజైనర్ జోశ్యుల గాయత్రీ దేవి

''నేను సినిమాలు చేసిన తర్వాత వెబ్ సిరీస్‌లకు పని చేయలేదు. ముందు వెబ్ సిరీస్‌లకు వర్క్ చేయటంతోనే నా కెరీర్ స్టార్ట్ అయ్యింది. ఓటీటీల్లో, వెబ్ సిరీస్‌లకు పని చేయటం అనేది యంగ్ టాలెంట్, యంగ్ టెక్నీషియన్స్‌కు గుడ్ ఫ్లాట్‌ఫామ్స్. వర్క్ పరంగా కొత్త మార్పులు తెలుసుకోవడానికి హిందీ, ఫ్రెంచ్, కొరియన్ వంటి ప్రాజెక్ట్స్‌ను చూస్తుంటాను. టెక్నీషియన్స్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలి. బిజీగా ఉన్నామని అప్‌డేట్ కావడం మానుకోలేం'' అని కాస్ట్యూమ్ డిజైనర్ జోశ్యుల గాయత్రీ దేవి అన్నారు. నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'వికటకవి'. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ సిరీస్ జీ5లో నవంబర్ 28 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ పీరియాడిక్ డిటెక్టివ్ వెబ్ సిరీస్‌కి కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేసిన జోశ్యుల గాయత్రీ దేవి మాట్లాడుతూ–'' నేను పుట్టింది విజయనగరం, పెరిగింది చెన్నై. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేసి చెన్నై, హైదరాబాద్‌లలో ఉద్యోగం చేశా. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఆ సమయంలోనే ఫ్యాషన్ డిజైనింగ్‌లో జాయిన్ అయ్యాను. సొంతంగా బొటిక్ బిజినెస్ స్టార్ట్ చేశాను. కోవిడ్ తర్వాత ఆ బిజినెస్ క్లోజ్ చేశాను. 'పలాస 1980' మూవీకి నేను డిజైనింగ్ మాత్రమే చేసిచ్చాను. షూట్‌కి వెళ్లలేదు. అయితే 'ఆహా' వాళ్లు చేసిన 'కుడి ఎడమైతే' వెబ్ సిరీస్ ద్వారా కాస్ట్యూమ్ డిజైనర్‌గా నా కెరీర్ స్టార్ట్ అయ్యింది. 'వికటకవి'లో ఫ్యాబ్రిక్స్ విషయంలో చాలా కేర్ తీసుకున్నాం. హీరో లుక్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. మేఘా ఆకాష్ గారికి ముందుగా చుడీదార్ అనుకున్నాం. కానీ కథానుగుణంగా శారీ బాగా నప్పుతుందనిపించి, కాటన్, లెనిన్, ఖాదీ చీరలనే ఉపయోగించాం. ప్రస్తుతం సతీష్ వేగేశ్నగారి దర్శకత్వంలో హాట్‌స్టార్ రూపొందిస్తోన్న 'మర్మయోగి' వెబ్ సిరీస్ చేస్తున్నాను. అలాగే 'మానసచోర' అనే సినిమాకు పని చేస్తున్నాను'' అని తెలిపారు.

సలామ్... పోలీస్

వెండితెరపై కనిపించే 'సూపర్ హీరో' తరహా పాత్రల్లో పోలీస్ పాత్ర గురించి కూడా చెప్పుకోవచ్చు. ఎందుకంటే అన్యాయం జరిగినప్పుడు సమాజం మేలు కోసం ఓ సూపర్ హీరో చేసే అన్ని సాహసాలు పోలీస్ ఆఫీసర్లు చేస్తుంటారు. ఇలా పోలీసాఫీసర్లకు 'సలామ్' కొట్టేలా కొందరు హీరోలు వెండితెరపై పోలీసులుగా యాక్షన్ చేస్తున్నారు. ఆ హీరోలపై కథనం.



• రజనీ కాంత్ • వెంకటేశ్ • ప్రభాస్ • నాని

హుకుమ్...

రజనీకాంత్ కెరీర్‌లో ఈ మధ్య కాలంలో వన్నాఫ్ ది బెస్ట్ హిట్స్‌గా నిలిచిన చిత్రాల్లో 'జైలర్' ఒకటి. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 2023లో విడుదలై, బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో రజనీకాంత్ మేజర్ సీన్స్‌లో మాజీ పోలీస్ ఆఫీసర్‌గా, కొన్ని సీన్స్‌లో పోలీస్ డ్రెస్ వేసుకున్న జైలర్‌గా స్క్రీన్‌పై కనిపించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జైలర్ 2' తెరకెక్కనుంది. ఆల్రెడీ స్క్రిప్ట్ వర్క్‌ను పూర్తి చేశారు నెల్సన్ దిలీప్ కుమార్. 'జైలర్ 2'కి సంబంధించి రజనీకాంత్ లుక్ టెస్ట్ కూడా జరిగిందని సమాచారం. డిసెంబరు 12న రజనీకాంత్ బర్త్ డే సందర్భంగా 'జైలర్' సీక్వెల్ అప్‌డేట్ ఉండొచ్చనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. అంతేకాదు... 'జైలర్' సినిమా సీక్వెల్‌కు 'హుకుమ్' టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. 'జైలర్'లోని 'హుకుమ్' పాటకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో ఈ పాటనే సీక్వెల్‌కు టైటిల్‌గా పెడితే ఆడియన్స్‌కు సినిమా మరింత బాగా రీచ్ అవుతుందని, 'హుకుమ్' అనే టైటిల్ అన్ని భాషలకు సరిపోతుందని టీమ్ భావిస్తోందట. కళానిధి మారన్ నిర్మించనున్న ఈ చిత్రం 2025లో ప్రేక్షకుల ముందుకు వచ్చే చాన్సెస్ ఉన్నాయని తెలుస్తోంది.



• ఆది



• విశ్వక్ సేన్



• త్రిగుణ్

ఫ్యామిలీ పోలీస్

'సూపర్ పోలీస్, సూర్య ఐపీఎస్, ఘర్షణ' వంటి సినిమాల్లో సీరియస్ పోలీసాఫీసర్‌గా వెంకటేశ్ మెప్పించారు. 'బాబు బంగారం' సినిమాలో కామిక్ టైమ్ ఉన్న పోలీస్‌గా వెంకీ నటించారు. అయితే ఫస్ట్ టైమ్ ఫ్యామిలీ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారాయన ('ది ఫ్యామిలీమేన్' వెబ్ సిరీస్‌లో మనోజ్ బాజ్‌పేయి చేసిన రోల్ తరహాలో...) 'సంక్రాంతి వస్తున్నాం' సినిమాలో మాజీ పోలీసాఫీసర్‌గా వెంకటేశ్ కనిపిస్తారు. ఈ సినిమాలోని కొన్ని సీన్స్‌లో వెంకీ ఆన్ డ్యూటీ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారని తెలిసింది. ఈ చిత్రంలో హీరోయిన్లుగా మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ నటిస్తున్నారు. మీనాక్షీ చౌదరి కూడా ఈ చిత్రంలో పోలీసాఫీసర్‌గానే కనిపిస్తారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమాను 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్నారు. జనవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది.

ఫస్ట్ టైమ్ పోలీస్‌గా...

ప్రభాస్ వంటి కటౌట్ ఉన్న హీరో పోలీస్ ఆఫీసర్‌గా స్క్రీన్‌పై కనిపిస్తే ఆడియన్స్ ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. తనను పోలీసాఫీసర్‌గా స్క్రీన్‌పై చూపించే అవకాశాన్ని 'అర్జున్‌రెడ్డి, యానిమల్' వంటి సినిమాలు తీసిన సందీప్‌రెడ్డి వంగా చేతుల్లో పెట్టారు ప్రభాస్. 'స్పిరిట్' టైటిల్‌తో రానున్న ఈ సినిమా షూటింగ్ జనవరిలో ప్రారంభం కానుంది. ప్రభాస్ ఫస్ట్ టైమ్ పోలీస్ ఆఫీసర్‌గా ఈ చిత్రంలో నటిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌లపై భూషణ్ కుమార్ నిర్మించనున్న ఈ సినిమా 2025లో రిలీజ్ కానుంది.

కేసు నంబరు 3

సూపర్‌హిట్ ఫ్రాంచైజీ 'హిట్' నుంచి 'హిట్: ద థర్డ్ కేస్' రానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ చాలా వరకు పూర్తయింది. 'హిట్ 1, హిట్ 2' చిత్రాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలనుయే మూడో భాగానికీ దర్శకత్వం వహిస్తున్నారు. 'హిట్' ఫ్రాంచైజీలో తొలి రెండు సినిమాలను నిర్మించిన నాని, 'హిట్ 3'లో హీరోగా నటిస్తూ, నిర్మిస్తుండటం విశేషం. నాని వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకాలపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న 'హిట్ 3' చిత్రం 2025 మే 1న విడుదల కానుంది.

బంధూక్

హీరో విశ్వక్ సేన్ తుపాకీ పట్టుకుని చాలా సార్లు స్క్రీన్‌పై కనిపించారు. కానీ రియల్ పోలీస్ ఆఫీసర్‌గా కాదు... అయితే 'బంధూక్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా కోసం విశ్వక్ సేన్ పోలీసాఫీసర్‌గా ఖాకీ డ్రెస్ ధరించి, తుపాకీ పట్టారు. ఈ పోలీస్ యాక్షన్ డ్రామాకు శ్రీధర్ గంటా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సంపద హీరోయిన్. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా 2025లో రిలీజ్ కానుంది.

ఎస్ఐ యుగంధర్

ఈ మధ్య కాలంలో పోలీసాఫీసర్ రోల్స్‌కే ఎక్కువ మక్కువ చూపిస్తున్నట్లున్నారు హీరో ఆది సాయికుమార్. ఆయన హీరోగా విడుదలైన గత ఐదు సినిమాల్లో రెండు పోలీసాఫీసర్ సినిమాలు ఉన్నాయి. ఈలోపు మరో పోలీసాఫీసర్ మూవీ 'ఎస్ఐ యుగంధర్'కు ఆది సాయికుమార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ చిత్రంలో ఎస్ఐ యుగంధర్‌గా ఓ కొత్త క్యారెక్టరైజేషన్ ఉన్న పోలీస్ ఆఫీసర్‌గా ఆది సాయికుమార్ కనిపిస్తారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ఇందులో మేఘా లేఖ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యశ్వంత్ దర్శకత్వంలో ప్రదీప్ జూలురు నిర్మిస్తున్న ఈ చిత్రం 2025లో రిలీజ్ కానుంది.

మర్డర్ మిస్టరీ

ఓ మర్డర్ మిస్టరీని ఛేదించే పనిలో పడ్డారు హీరో త్రిగుణ్ (అరుణ్ అదిత్). స్క్రీన్‌పై ఓ పోలీసాఫీసర్‌గా ఈ కేసును పరిష్కరించే క్రమంలో త్రిగుణ్‌కు ఓ టర్నింగ్ పాయింట్ దొరికింది. ఇది ఏంటీ అంటే...'టర్నింగ్ పాయింట్' సినిమా చూడాల్సిందే. హెబ్బా పటేల్, ఇషా చావ్లా, వర్షిణి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు కుహాన్ నాయుడు దర్శకుడు. సురేష్ దత్తి నిర్మించారు.

ఇలా పోలీసాఫీసర్ రోల్స్‌లో నటించే హీరోలు మరికొంతమంది ఉన్నారు. మరికొందరు స్క్రిప్ట్స్ వింటున్నారని తెలిసింది.

- ముసిమి శివాంజనేయులు

బిజినెస్ రీల్

656 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ నిల్వలు

1.31 బిలియన్ డాలర్ల మేర క్షీణత



ముంబై: విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు నవంబర్ 22తో ముగిసిన వారంలో 1.31 బిలియన్ డాలర్ల మేర క్షీణించి 656.58 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీనికి ముందు వారం (నవంబర్ 15తో అంతమైన)లో ఏకంగా 17.76 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారకం నిల్వలు తగ్గి 657.89 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్ చివరికి ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి 704.88 బిలియన్ డాలర్లకు చేరడం తెలిసిందే. ఇక ఆ తర్వాత నుంచి క్రమంగా ఇవి తగ్గుముఖం పడుతున్నాయి. ముఖ్యంగా విదేశీ ఇన్వెస్టర్లు భారత క్యాపిటల్ మార్కెట్ల నుంచి పెట్టుబడులను పెద్ద మొత్తంలో ఉపసంహరించుకోవడం దీనివెనుక ప్రధాన కారణంగా ఉంది. నవంబర్ 22తో ముగిసిన వారంలో మొత్తం ఫారెక్స్ నిల్వల్లో విదేశీ కరెన్సీ నిల్వలు 3 బిలియన్ డాలర్ల మేర తగ్గి 566.79 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. ఫారెక్స్ నిల్వల్లో కరెన్సీ రూపంలోనే అధిక భాగం ఉంటుంది. బంగారం నిల్వలు సైతం 1.82 బిలియన్ డాలర్ల మేర తగ్గి 67.57 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఐఎంఎఫ్ వద్ద ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) విలువ 79 మిలియన్ డాలర్ల మేర తగ్గి 17.98 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఐఎంఎఫ్ వద్ద భారత నిల్వలు సైతం 15 మిలియన్ డాలర్లు తగ్గి 4.23 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఆర్‌బీఐ గణాంకాలు తెలిపాయి.

ఈపీఎఫ్‌వో క్షమాభిక్ష పథకం



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) తాజాగా 2024 క్షమాభిక్ష పథకాన్ని ఆమోదించింది. దీని ప్రకారం సంస్థలు ఎటువంటి పెనాల్టీ లేకుండా గత ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను డిపాజిట్ చేయడానికి అనుమతిస్తుంది. కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా నేతృత్వంలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థకు (ఈపీఎఫ్‌వో) చెందిన అత్యున్నత నిర్ణయాధికార సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ (సీబీటీ) శనివారం ఈపీఎఫ్‌వో ఆమ్నెస్టీ స్కీమ్ 2024ను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు కార్మిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పెనాల్టీలు లేదా చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోకుండా యజమానులను స్వచ్ఛందంగా బహిర్గతం చేయడానికి, గతంలో పాటించని లేదా తక్కువ నిబంధనలను సరిదిద్దడానికి ప్రోత్సహించడానికి ఈ పథకాన్ని రూపొందించారు. స్కీమ్ ప్రయోజనాలను పొందేందుకు యజమానుల నుండి ఒక సాధారణ ఆన్‌లైన్ డిక్లరేషన్ సరిపోతుంది. స్వచ్ఛంద సమ్మతి కోసం పరిమిత అవకాశాన్ని అందించడం ద్వారా మరింత మంది ఉద్యోగులకు సామాజిక భద్రతా ప్రయోజనాలను విస్తరించడం, యజమానులతో నమ్మకాన్ని పునర్నిర్మించడం, శ్రామిక శక్తిని అధికారికంగా ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం అని ఈపీఎఫ్‌వో పేర్కొంది.

పన్ను రిటర్నుల దాఖలు గడువు పెంపు



న్యూఢిల్లీ: 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుకు గడువును డిసెంబర్ 15 వరకు పొడిగిస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ఉత్తర్వులు వెలువరించింది. 2024-25 అసెస్‌మెంట్ సంవత్సరానికిగాను నవంబర్ 30 వరకు ఉన్న గడువును 15 రోజులు పొడిగించింది. అంతర్జాతీయ లావాదేవీలు, సెక్షన్ 92ఈ కింద నివేదికలను సమర్పించాల్సిన పన్ను చెల్లింపుదారుల కోసం సీబీడీటీ ఈ వెసులుబాటు కల్పించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-12-2024

విశాఖ	590-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600-00
విజయవాడ	610-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	605-00
వరంగల్	607-00
రిటైల్ ధర	6.65

క్విక్ కామర్స్ విస్తరణలో ఫ్లిప్‌కార్ట్

కోల్‌కతా: ఈ-కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ క్విక్ కామర్స్ కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. వేగవంతమైన డెలివరీల కోసం వినియోగదారుల నుంచి డిమాండ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, బిగ్‌బాస్కెట్ వంటి డెలివరీ ప్లాట్‌ఫామ్‌ల నుండి పెరుగుతున్న పోటీ నేపథ్యంలో.. ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద బెంగళూరు, ముంబై, ఢిల్లీ రాజధాని ప్రాంతంలో మినట్స్ పేరుతో క్విక్ కామర్స్ సేవలను నిర్వహిస్తోంది. డాటమ్ ఇంటిలిజెన్స్ నివేదిక ప్రకారం క్విక్ కామర్స్ మార్కెట్ పరిమాణం 2030 నాటికి 40 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఈ రంగం 2024లో 6.1 బిలియన్ డాలర్లుగా ఉందని వెల్లడించింది. ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్ 70 బిలియన్ డాలర్లు ఉంది. ఇది దేశంలోని మొత్తం రిటైల్ మార్కెట్‌లో 7 శాతం మాత్రమేనని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది.



ఆన్‌లైన్ షాపింగ్ జోరు..

భారత్‌లో రిటైల్ రంగం మొత్తంగా వృద్ధి చెందుతున్నందున ఆన్‌లైన్ షాపింగ్ గణనీయంగా పెరుగుతుందని నమ్ముతున్నామని ఫ్లిప్‌కార్ట్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీశ్ కుమార్ తెలిపారు. 2028 నాటికి భారత రిటైల్ మార్కెట్‌లో దాదాపు 12 శాతం వాటాను ఈ-కామర్స్ దక్కించుకుంటుందని గణాంకాలు సూచిస్తున్నాయని వివరించారు. గ్రామీణ, సెమీ-అర్బన్ వినియోగదారుల కోసం కంపెనీ ప్రధాన భారతీయ భాషల్లో యాప్‌ను రూపొందించింది. ఇంగ్లీష్ తెలియని కస్టమర్లు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడానికి ఇది వీలు కల్పిస్తుందని సంస్థ తెలిపింది. ఫ్లిప్‌కార్ట్ వేదికగా సుమారు 15 లక్షల మంది వర్తకులు ఉన్నారు. సరఫరా వ్యవస్థలో 3,00,000 పైచిలుకు ఉద్యోగులు ఉన్నారని కంపెనీ వివరించింది.

అమూల్.. రెండంకెల వృద్ధి

న్యూఢిల్లీ: అమూల్ బ్రాండ్ కింద పాలు, పాల పదార్థాల తయారీలో ఉన్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆదాయంలో రెండంకెల వృద్ధి ఆశిస్తోంది. తమ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ ఇందుకు కారణమని సంస్థ ఎండీ జయెన్ మెహతా తెలిపారు. జీసీఎంఎంఎఫ్ 2023-24లో రూ.59,445 కోట్ల ఆదాయం ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల్లో తాజా పాలు, చీజ్, ఐస్ క్రీం సహా అన్ని ఉత్పత్తుల విభాగాల్లో డిమాండ్ వృద్ధి చెందిందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో సగటున రోజుకు 310 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేశామని మెహతా వెల్లడించారు. సంస్థ పాల ప్రాసెసింగ్ వార్షిక సామర్థ్యం దాదాపు 500 లక్షల లీటర్లు. యూఎస్ సహా దాదాపు 50 దేశాలకు పాల ఉత్పత్తులను ఈ సంస్థ ఎగుమతి చేస్తోంది.

రూ.11,000 కోట్ల పెట్టుబడి..

నూతన ప్లాంట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న ఇతర కంపెనీల కొనుగోలు ద్వారా సంస్థ సామర్థ్యాన్ని విస్తరించడానికి రూ.11,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలను ఇప్పటికే ప్రకటించినట్టు తెలిపారు. ఇందులో 80 శాతం ఖర్చు చేశామన్నారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేశారు.



సేంద్రియ ఉత్పత్తుల వ్యాపారం మెరుగ్గా ఉందని, చాలా ప్రొడక్టులు విడుదల చేసినట్టు వివరించారు. జీసీఎంఎంఎఫ్ గుజరాత్‌లోని 18,600 గ్రామాలలో 36 లక్షల మంది రైతులను కలిగి ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద రైతు యాజమాన్యంలోని పాడి పరిశ్రమ సహకార సంస్థ. 18 సభ్య సంఘాల ద్వారా రోజుకు 300 లక్షల లీటర్లకుపైగా పాలను సేకరిస్తోంది. ఇంటర్నేషనల్ ఫామ్ కంపారిజన్ నెట్‌వర్క్ ప్రకారం పాల ప్రాసెసింగ్ పరంగా ప్రపంచంలోని టాప్ 20 డెయిరీ కంపెనీలలో జీసీఎంఎంఎఫ్ 8వ స్థానంలో నిలిచింది.

రిటైల్ స్పేస్‌కు డిమాండ్

ఏడాదిలో లీజింగ్ 5 శాతం వృద్ధి ● కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: షాపింగ్ మాల్స్, ప్రముఖ హై స్ట్రీట్‌లలో రిటైల్ స్థలం లీజుకు ఇవ్వడం 2024 జనవరి-సెప్టెంబర్ మధ్య ఎనిమిది ప్రధాన నగరాల్లో దాదాపు 5 శాతం పెరిగిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. ఈ కాలంలో టాప్-8 నగరాల్లోని గ్రేడ్-ఏ మాల్స్, ప్రధాన హై స్ట్రీట్‌లలో లీజుకు తీసుకున్న రిటైల్ స్థలం 5.53 మిలియన్ చదరపు అడుగులు. గతేడాది ఇదే కాలంలో 5.29 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం నమోదైంది. ఈ నగరాల జాబితాలో ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, పుణే, అహ్మదాబాద్ ఉన్నాయి. హై స్ట్రీట్‌లలో రిటైల్ స్థలాన్ని లీజుకు ఇవ్వడం గతేడాదితో పోలిస్తే 3.44 మిలియన్ చదరపు అడుగుల నుండి 3.82 మిలియన్ చదరపు అడుగులకు దూసుకెళ్లింది. మరోవైపు షాపింగ్ మాల్స్‌లో రిటైల్ స్థలం 1.85 మిలియన్ చదరపు అడుగుల నుండి 1.72 మిలియన్ చదరపు అడుగులకు వచ్చి చేరింది. హైదరాబాద్‌లోని ప్రముఖ హై-స్ట్రీట్ కేంద్రాలు రిటైల్ స్థలానికి బలమైన డిమాండ్‌ను నమోదు చేశాయి. ఈ నగరంలో వివిధ బ్రాండ్లు 2024 జనవరి-సెప్టెంబర్ కాలంలో 1.72 మిలియన్ చదరపు అడుగుల స్థలం లీజుకు తీసుకున్నాయి. గతేడాది ఇదే కాలంలో ఇది 1.60 మిలియన్ చదరపు అడుగులుగా ఉంది. ఈ వృద్ధి రిటైల్ రంగం బలంగా పుంజుకోవడం, నూతన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. కరోనా మహమ్మారి తదనంతరం అభివృద్ధి చెందుతున్న వినియోగదారు ప్రవర్తనతో, ఆకర్షణీయ, అనుభవపూర్వక స్థలాలకు స్పష్టమైన డిమాండ్ ఉందని నివేదిక వివరించింది.



ప్రీమియం రిటైల్ స్థలాలకు డిమాండ్..

ప్రధాన నగరాల్లో మాల్ లీజింగ్ కార్యకలాపాలు స్థిరంగా పెరగడం రిటైల్ రంగం యొక్క బలమైన పునరుద్ధరణ, విస్తరణను నొక్కి చెబుతోందని లులు మాల్స్ తెలిపింది. ఈ సానుకూల ధోరణి రిటైల్ భాగస్వాముల కోసం అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తూ వినియోగదారుల ప్రాధాన్యతలను అభివృద్ధి చేసే ప్రపంచ-స్థాయి రిటైల్ అనుభవాలను సృష్టించే తమ కంపెనీ దృష్టికి అనుగుణంగా ఉంటుందని వివరించింది. మాల్స్, ప్రధాన వీధుల్లో బలమైన లీజింగ్ కారణంగా భారత రిటైల్ రియల్ ఎస్టేట్ వృద్ధి చెక్కుచెదరకుండా ఉందని కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ క్యాపిటల్ మార్కెట్స్ ఎండీ, రిటైల్-ఇండియా హెడ్ సౌరభ్ షట్‌దాల్ తెలిపారు. విచక్షణతో కూడిన వ్యయాలు పెరగడం, వినియోగదారుల ప్రాధాన్యత.. వెరశి ప్రీమియం రిటైల్ స్థలాలకు డిమాండ్‌ను పెంచుతున్నాయని ఆయన తెలిపారు. 'భారత్ మరింత ఎక్కువ లావాదేవీల పరిమాణాలను చవిచూడాలంటే ప్రధాన నగరాల్లో నాణ్యమైన రిటైల్ స్పేస్‌ల అభివృద్ధిని వేగవంతం చేయాలి. ఎందుకంటే ఇది తమ వ్యాపారాలను విస్తరించాలని చూస్తున్న ప్రపంచ రిటైలర్లకు అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది' అని అన్నారు.

ట్యాక్స్ నిపుణులకు దన్నుగా జెన్ఏఐ

ఈవై సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: జనరేటివ్ ఏఐపై (జెన్ఏఐ) వివిధ రంగాల్లో ఆసక్తి పెరుగుతోంది. విధుల నిర్వహణ సామర్థ్యాలను పెంచుకునేందుకు ఇది గణనీయంగా ఉపయోగపడగలదని దేశీయంగా చాలా మటుకు సీఎఫ్‌వోలు, ఆర్థిక.. ట్యాక్స్ నిపుణులు భావిస్తున్నారు. ఈవై ట్యాక్స్ అండ్ ఫైనాన్స్ ఆపరేషన్స్ (టీఎఫ్‌వో) సర్వే 2024 నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. అంతర్జాతీయంగా 32 దేశాల నుంచి 18 పరిశ్రమలకు సంబంధించి 1,600 మంది నిపుణులు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఇందులో భారత్ నుంచి 70 మంది సీఎఫ్‌వోలు, పన్నుల నిపుణులు ఉన్నారు. ట్యాక్స్, ఫైనాన్స్ విభాగాల్లో ఎదురవుతున్న కీలక సవాళ్లను ఈ నివేదికలో ప్రస్తావించారు. దీని ప్రకారం విధుల నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడానికి జెన్ఏఐ ఉపయోగపడగలదని భావించే సీఎఫ్‌వోలు, ఫైనాన్స్, ట్యాక్స్ నిపుణుల సంఖ్య భారత్‌లో 2023లో 19 శాతంగా ఉండగా తాజాగా 94 శాతానికి పెరిగింది. అంతర్జాతీయంగా 87 శాతం మంది ఇలాంటి అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్యాక్స్ నిపుణుల్లో జెన్ఏఐ సామర్థ్యాలకు గుర్తింపు పెరుగుతోం



దనడానికి ఇది నిదర్శనమని నివేదిక పేర్కొంది. సర్వే ప్రకారం దేశీయంగా ట్యాక్స్ నిపుణులు ఇప్పటికే జెన్ఏఐ వినియోగంలో పురోగతి సాధిస్తున్నారు. 14 శాతం మంది జెన్ఏఐతో వ్యూహాలను రూపొందించడం, పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించడం, దానితో ఇతరత్రా ఉపయోగాలను తెలుసుకోవడంలో నిమగ్నమయ్యారు. 47 శాతం మంది తమ కార్యకలాపాలను మెరుగుపర్చే విషయంలో జెన్ఏఐ సామర్థ్యాలపై అధ్యయనాలు, ప్రయోగాలు చేస్తున్నారు. అయితే, 44 శాతం మందికి జెన్ఏఐ సామర్థ్యాలను అర్థం చేసుకునేందుకు అవసరమైన నైపుణ్యాలు లేకపోవడం ప్రధాన అడ్డంకిగా ఉంటున్నాయి.

వృత్తిగతంగా సానుకూల మార్పులు ..

ట్యాక్స్ ప్రొఫెషనల్స్ కార్యాలయాలు, వృత్తిగత జీవితాల్లో సానుకూల మార్పులకు దోహదపడేలా జెన్ఏఐ సమర్థవంతమైన సాధనంగా ఎదుగుతోందని ఈవై ఇండియా డిజిటల్ ట్యాక్స్ లీడర్ రాహుల్ పట్నీ తెలిపారు. డాక్యుమెంట్ల సమీక్షల నుంచి రోజువారీ పూర్తి చేయాల్సిన డ్రాఫ్టింగ్ వరకు వివిధ అంశాల్లో ఏఐ ఉపయోగపడగలదని వివరించారు. దీనితో నిపుణులు ఇతరత్రా కీలకమైన అంశాలపై దృష్టి పెట్టేందుకు, మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు వీలవుతుందని పట్నీ పేర్కొన్నారు. నియంత్రణ సంస్థ నిబంధనలపరంగా, రిపోర్టింగ్‌పరంగా భారం పెరిగే కొద్దీ తలెత్తే సవాళ్లను పరిష్కరించేందుకు కంపెనీల్లో ట్యాక్స్ నిపుణులు కొత్త వ్యూహాలు పాటించాల్సి వస్తుందని .. ఇలాంటి విషయాల్లో జెన్ఏఐ ఉపయోగకరంగా ఉండగలదనే అభిప్రాయం ఉంటోందని ఈవై ఇండియా నేషనల్ లీడర్ జితేష్ బన్సల్ తెలిపారు.

రియల్టీకి ద్వితీయార్ధం సానుకూలం

- 67కు పెరిగిన భవిష్యత్ సెంటిమెంట్ స్కోర్
- నైట్‌ఫ్రాంక్, నరెడ్కో నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో (2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు) సానుకూల పనితీరు చూపించనుంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంపై రియల్ ఎస్టేట్ సెంటిమెంట్ ఇండెక్స్‌ను నైట్‌ఫ్రాంక్, నరెడ్కో సంయుక్తంగా విడుదల చేశాయి. ఏప్రిల్-జూన్ క్వార్టర్‌కు సెంటిమెంట్ స్కోరు 65గా ఉంటే, జూలై-సెప్టెంబర్‌లో 64కు తగ్గింది. అయితే భవిష్యత్ సెంటిమెంట్ స్కోర్ మాత్రం 65 నుంచి 67కు పెరిగింది. వచ్చే ఆరు నెలల్లో రియల్టీ పరిశ్రమ వృద్ధి పట్ల ఉన్న విశ్వాసాన్ని ఇది తెలియజేస్తున్నట్టు నైట్‌ఫ్రాంక్, నరెడ్కో నివేదిక తెలిపింది. రియల్ ఎస్టేట్ పరిశ్రమకు సంబంధించి సరఫరా వైపు భాగస్వాములు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ల అంచనాలు, ఆర్థిక వాతావరణం, నిధుల లభ్యతను



ఈ సూచీ తెలియజేస్తుంది. స్కోర్ 50గా ఉంటే తటస్థంగా, 50కి పైన సానుకూలంగా, 50కి దిగువన ప్రతికూల ధోరణిని ప్రతిఫలిస్తుంది. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రస్తుత, భవిష్యత్ సెంటిమెంట్ రెండూ సానుకూల శ్రేణిలోనే ఉన్నట్టు తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయని, పరిశ్రమ దీర్ఘకాల సామర్థ్యాలపై స్థిరమైన విశ్వాసానికి నిదర్శనమని నివేదిక పేర్కొంది.

ఇళ్ల మార్కెట్లోనూ సానుకూలత: ఇళ్ల మార్కెట్‌లో భవిష్యత్ సెంటిమెంట్ సానుకూలంగా నమోదైంది. ధరలు పెరుగుతాయని 62 శాతం మంది అంచనా వేస్తుంటే, అమ్మకాలు పెరుగుతాయని 40 శాతం మంది భాగస్వాములు అంచనా వేస్తున్నారు. 38 శాతం మంది మార్కెట్ స్థిరంగా ఉంటుందని భావిస్తున్నారు. ఆఫీస్ మార్కెట్‌లో లీజింగ్, సరఫరా, అద్దెల పరంగా బలమైన సానుకూలత కనిపించింది. రానున్న నెలల్లో ఆఫీస్ మార్కెట్ బలమైన పనితీరు చూపిస్తుందన్న అంచనాలున్నట్టు నివేదిక తెలిపింది. అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత రియల్ ఎస్టేట్ పరిశ్రమ బలంగా ఉండడాన్ని సెంటిమెంట్ సూచీ తెలియజేస్తోందని నరెడ్కో ప్రెసిడెంట్ హరిబాబు పేర్కొన్నారు. ''2024-25 సంవత్సరానికి జీడీపీ 7.2 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ చెబుతోంది. స్థిరమైన వడ్డీ రేట్లతో ఇన్వెస్టర్ సెంటిమెంట్ మరింత బలపడుతుంది. స్థిరమైన వృద్ధికిగాను ఈ రంగం సవాళ్లను పరిష్కరించుకుని, అవకాశాలు అందిపుచ్చుకోవాలి''అని వివరించారు.

కొత్త పన్ను కోడ్ అవసరం

- మరింత మందిని భాగస్వాములను చేయాలి
- పన్ను రేట్లను సరళతరం చేయాలి
- నిపుణుల అభిప్రాయాలు

న్యూఢిల్లీ: వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన దేశం) లక్ష్య సాధనకు తక్కువ పన్ను రేట్లతో కూడిన సమగ్రమైన పన్నుల కోడ్‌ను తీసుకురావాల్సిన అవసరాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. మరింత మందిని పన్ను పరిధిలోకి తీసుకురావడం, వసూళ్ల మెరుగుపరుచుకోవడం, నిబంధనల అమలును ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. ఇందుకు 'ఎఫ్ఎల్ఏటీ' నమూనాను ప్రస్తావిస్తున్నారు. కేవలం కొన్ని శ్లాబులు, తక్కువ రేట్లతో, వివాదాలను తగ్గించే విధంగా, పన్ను చెల్లింపుదారులను విస్తృతం చేసే విధంగా ఉండాలంటున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌కు సమర్పించనున్న నేపథ్యంలో నిపుణుల సూచనలకు ప్రాధాన్యం నెలకొంది. ''జీఎస్‌టీ కింద ఎన్నో రకాల రేట్లు ఉండడం ఎంత మాత్రం మంచిది కాదు. జీఎస్‌టీ అన్నది ఒక్కటే రేటుగా ఉండాలి. కానీ, మన దేశంలో ఒకటే రేటు అన్నది సాధ్యం కాదు''అని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) మాజీ చైర్మన్ పీసీ ఝా అభిప్రాయపడ్డారు. కాకపోతే 5 శాతం, 16 శాతం, 28 శాతం చొప్పున మూడు పన్ను శ్లాబులను పరిశీలించాలని సూచించారు. థింక్ చేంజ్ ఫోరమ్‌లో పాల్గొన్న సందర్భంగా ఈ అంశంపై మాట్లాడారు. ప్రస్తుత పన్ను వ్యవస్థలోని నిబంధనలను సులభతరం చేయాల్సిన అవసరాన్ని ఎర్నెస్ట్ అండ్ యంగ్ పార్ట్‌నర్ రాజీవ్ ఛుగ్ సైతం సమర్థించారు. ''పన్ను రేట్లు తగ్గించడం వల్ల పౌరులు, కంపెనీలకు ఖర్చు పెట్టేందుకు వీలుగా నిధుల మిగులు పెరుగుతుంది. రేట్లను క్రమబద్ధీకరిస్తే అది ఆర్థిక వ్యవస్థకు ఊతంగా నిలుస్తుంది''అని ఛుగ్ వివరించారు.

ఎంఎస్ఎంఈలకు కేంద్రీకృత ఫిర్యాదుల పోర్టల్

- అంబుడ్స్‌మన్ తరహాలో ఏర్పాటు చేయాలి
- పన్నును 15 శాతానికి తగ్గించాలి
- రాష్ట్రాల స్థాయిలో యూనివర్సిటీలు
- పరిశ్రమల మండలి అసోచామ్ డిమాండ్
- ఎంఎస్ఎంఈలపై నివేదిక విడుదల

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) కేంద్రీకృత ఫిర్యాదుల పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని అసోచామ్ డిమాండ్ చేసింది. ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ తరహాలో ఇది ఉండాలి.. పలు శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలు ఈ పోర్టల్ ద్వారా లేవనెత్తేందుకు అవకాశం ఉండాలని కోరింది. ఫిర్యాదుల దాఖలు, పరిష్కారం విషయంలో ఎంఎస్ఎంఈలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయంటూ ఈ కీలక సూచన చేసింది. వ్యాపార నిర్వహణలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఈగ్రోవ్ ఫౌండేషన్ సాయంతో అసోచామ్ సర్వే నిర్వహించింది. ఎంఎస్ఎంఈ సమస్యల పరిష్కారం, వాటి బలోపేతానికి సూచనలతో ఒక నివేదికను విడుదల చేసింది. ''2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించే లక్ష్యంలో భాగంగా ఎంఎస్ఎంఈలకు సంబంధించి వ్యూహాత్మక ప్రణాళిక, కార్యాచరణను ఈ నివేదిక తెలియజేస్తుంది. సంఘటిత, అసంఘటిత రంగంలోని మన ఎంఎస్ఎంఈలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంక్‌లు, దిగ్గజ కంపెనీల నుంచి మద్దతు అవసరం''అని అసోచామ్ ప్రెసిడెంట్ సంజయ్ నయ్యర్ పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలకు కార్పొరేట్ ఆదాయపన్ను రేటును 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలని, సులభతర జీఎస్‌టీ వ్యవస్థను తీసుకురావాలని అసోచామ్ కోరింది.



కేంద్రీకృత పోర్టల్..

ఎంఎస్ఎంఈల నమోదు, వ్యాపారానికి సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లను ఎలక్ట్రానిక్ రూపంలో సమర్పించేందుకు ఆన్‌లైన్ పోర్టల్ తీసుకురావాలని అసోచామ్ తన నివేదికలో కోరింది. జీఎస్‌టీ రిజిస్ట్రేషన్, నిబంధనల అమలు ప్రక్రియలను సైతం సులభతరంగా మార్చాలని పేర్కొంది. స్పష్టమైన నిబంధనలతో మద్దతుగా నిలవాలని కోరింది. సహేతుక కారణాలున్నప్పటికీ సకాలంలో జీఎస్‌టీ రిటర్నుల ఫైలింగ్, చెల్లింపులు చేయని ఎంఎస్ఎంఈలపై కఠిన జరిమానాలు విధిస్తున్నట్టు పేర్కొంది. జాప్యం తీవ్రత, కారణాలకు అనుగుణంగా పెనాల్టీలో మార్పులు ఉండాలని సూచించింది. జరిమానాలు ఎంఎస్ఎంఈలకు భారంగా మారరాదని అభిప్రాయం వ్యక్తం చేసింది. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యం సాకారం కావాలంటే వ్యాపార నమూనాలో నిర్మాణాత్మక మార్పు అవసరమని అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్ సూద్ అన్నారు. ''ఈ నిర్మాణాత్మక మార్పులో ఎంఎస్ఎంఈలు భాగంగా ఉండాలి. అభివృద్ధి చెందిన భారత్‌లో ఎంఎస్ఎంఈలు గొప్ప పాత్ర పోషించాలి. మా అధ్యయనం ఇదే అంశాన్ని బలంగా చెప్పింది'' అని సూద్ వివరించారు. పెరుగుతున్న కార్మిక శక్తికి ఎంఎస్ఎంఈలు పరిష్కారం చూపించగలవని, ఉత్పాదకతతో కూడిన ఉపాధిని అందించగలవని ఈగ్రోవ్ వ్యవస్థాపక చైర్మన్ చరణ్‌సింగ్ అన్నారు. వ్యవసాయ యూనివర్సిటీల మాదిరే ప్రతీ రాష్ట్రంలోనూ ఎంఎస్ఎంఈ యూనివర్సిటీ ఏర్పాటును పరిశీలించాలని, ఎంఎస్ఎంఈల ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకంగా సమన్వయ మండలిని ఏర్పాటు చేసి, పథకాల అమలు సాఫీగా సాగేలా చూడాలని, రాష్ట్రాల పరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఈ నివేదిక సూచించింది. జీడీపీలో 30 శాతం వాటా, తయారీ రంగంలో 45 శాతం వాటా, ఎగుమతుల్లో 46 శాతం వాటా కలిగిన ఎంఎస్ఎంఈలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఈ నివేదిక గుర్తు చేసింది.



భారత్ 16... తైపీ 0

సెమీఫైనల్లో భారత యువ జట్టు
- ఆసియాకప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నీ

మస్కట్: ఆసియా కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు సెమీ ఫైనల్కు దూసుకెళ్లింది. గత రెండు మ్యాచ్ల్లో విజయాలు సాధించిన భారత జట్టు... శనివారం మూడో మ్యాచ్లో 16–0 గోల్స్ తేడాతో చైనీస్ తైపీ జట్టును చిత్తు చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన పోరులో యువభారత్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. భారత్ తరఫున 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దిల్రాజ్ సింగ్ (17వ, 40వ, 45వ, 57వ నిమిషాల్లో) నాలుగు గోల్స్తో చెలరేగగా... రోషన్ కుజుర్ (23వ, 32వ, 42వ నిమిషాల్లో), సౌరభ్ ఆనంద్ కుష్వాహా (20వ, 29వ, 58వ నిమిషాల్లో) చెరో మూడు గోల్స్తో అదరగొట్టారు. అర్ష్దీప్ సింగ్ (37వ, 44వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... యోగేంబర్ రావత్ (7వ నిమిషంలో), ప్రియోబర్తా (31వ నిమిషంలో), శార్దానంద్ తివారి (39వ నిమిషంలో), అర్జీత్ సింగ్ హుండల్ (54వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. మ్యాచ్ ప్రారంభమైన ఏడో నిమిషంలో రావత్ తొలి గోల్ సాధించి జట్టుకు మంచి ఆరంభం ఇవ్వగా... ఇక అక్కడి నుంచి మనవాళ్లు వరుస గోల్స్తో విజృంభించారు. ప్రత్యర్థి డిఫెన్స్ను కకావికలం చేస్తూ గోల్స్ వర్షం కురిపించారు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్ల్లోనూ గెలిచిన భారత్ 9 పాయింట్లు ఖాతాలో వేసుకొని మరో మ్యాచ్ మిగిలుండగానే సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. నేడు జరగనున్న చివరి లీగ్ మ్యాచ్లో కొరియాతో భారత్ తలపడుతుంది. మంగళవారం సెమీఫైనల్స్ జరగనున్నాయి. గతంలో ఆసియా జూనియర్ హాకీ టోర్నీలో భారత్ నాలుగు సార్లు విజేతగా నిలిచింది.



బుల్బుల్ హ్యాట్రిక్

సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్షిప్లో మిజోరాం, హరియాణా, బెంగాల్, బీహార్, మహారాష్ట్ర జట్లు విజయాలు సాధించాయి. సికింద్రాబాద్లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్లో శనివారం టోర్నీ ఐదో రోజు జరిగిన పూల్ 'ఈ' మ్యాచ్లో మిజోరాం జట్టు 4–1తో చండీగఢ్పై విజయం సాధించింది. పూల్ 'ఎ'లో భాగంగా జరిగిన పోరులో హరియాణా 4–0తో మణిపూర్పై గెలుపొందింది. పూల్ 'హెచ్' పోరులో బెంగాల్ హాకీ జట్టు 7–1 గోల్స్ తేడాతో పుదుచ్చేరిపై గెలుపొందింది. బెంగాల్ జట్టు తరఫున కెప్టెన్ బుల్బుల్ కుమారి (2వ, 23వ, 55వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్తో ఆకట్టుకుంది. పూల్ 'ఎఫ్' మ్యాచ్లో బీహార్ 5–0తో జమ్ము కశ్మీర్పై, పూల్ 'జి' మ్యాచ్లో మహారాష్ట్ర 1–0తో గుజరాత్పై విజయాలు సాధించాయి. అంతకుముందు కేరళ, అరుణాచల్ ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్ 0–0 గోల్స్తో 'డ్రా'గా ముగిసింది.

'వరల్డ్ కప్ పతకం గెలవాలి'

భారత హాకీ కెప్టెన్ హర్మన్ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు గత రెండు ఒలింపిక్స్లో కాంస్య పతకాలు సాధించింది. గత కొన్నేళ్లలో ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో కూడా మెడల్స్ గెలుచుకుంది. ఈ విజయాల్లో కెప్టెన్ హర్మన్ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. అయితే తన కెరీర్లో వరల్డ్ కప్ పతకం మాత్రం ఇంకా లోటుగా ఉండిపోయిందని అతను వ్యాఖ్యానించాడు. వరల్డ్ కప్ పతకాన్ని గెలిచి తన కెరీర్ను సంపూర్ణం చేసుకోవాలని భావిస్తున్నట్లు అతను పేర్కొన్నాడు. 1975 వరల్డ్ కప్లో విజేతగా నిలిచిన భారత్...1973లో రజతం, 1971లో కాంస్యం సాధించింది. తర్వాతి హాకీ ప్రపంచ కప్ 2026లో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరుగుతుంది. యూరోపియన్ సర్క్యూట్లో గత కొంత కాలంగా తాము కనబరుస్తున్న నిలకడైన ప్రదర్శన ఈ సారి కలిసొస్తుందని కూడా హర్మన్ అభిప్రాయ పడ్డాడు. 'ఒలింపిక్ స్వర్ణంతో పాటు వరల్డ్ కప్ పతకం గెలవడం అనేది మొదటినుంచి లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వర్ణం లేకపోయినా రెండు ఒలింపిక్ కాంస్యాలు మనకు దక్కాయి. ఇప్పుడు మిగిలింది వరల్డ్ కప్ పతకమే. దానినీ సాధించాలని పట్టుదలగా ఉన్నాం. ఇటీవల పారిస్లో మా ప్రదర్శన చూస్తే ఎలాంటి ప్రత్యర్థినైనా సమర్థంగా ఎదుర్కోగలమని నిరూపించాం. చాలా కాలంగా మనకు వరల్డ్ కప్ మెడల్ రాలేదు. నా కెరీర్లో ఆ లోటును భర్తీ చేసుకోవాలి. పాత బంగారు రోజులను మళ్లీ తీసుకు వస్తామని నమ్ముతున్నాం. దానిని సాధించే వరకు విశ్రమించం. త్వరలో జరిగే ఆసియా కప్లో విజేతగా నిలిచి వరల్డ్ కప్కు నేరుగా అర్హత సాధించడమే మా మొదటి లక్ష్యం' అని హర్మన్ప్రీత్ స్పష్టం చేశాడు.

దక్షిణాఫ్రికా ఘన విజయం



డర్బన్: ఆల్రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన దక్షిణాఫ్రికా జట్టు... సొంతగడ్డపై శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో ఘన విజయం సాధించింది. శనివారం ముగిసిన పోరులో దక్షిణాఫ్రికా 233 పరుగుల తేడాతో లంకను చిత్తుచేసింది. తొలి ఇన్నింగ్స్లో స్వల్ప స్కోరుకే పరిమితమైనప్పటికీ... ఆ తర్వాత పుంజుకొని శ్రీలంకను తొలి ఇన్నింగ్స్లో 42 పరుగులకే పరిమితం చేసిన సఫారీలు... రెండో ఇన్నింగ్స్లోనూ అదే జోరు కనబర్చారు. 516 పరుగుల విజయ లక్ష్యంతో ఓవర్నైట్ స్కోరు 103/5తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక చివరకు 79.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్లో 7 వికెట్లతో చెలరేగిన సఫారీ పేస్ ఆల్రౌండర్ మార్కో యాన్సెన్ రెండో ఇన్నింగ్స్లోనూ 4 వికెట్లతో విజృంభించాడు. అసాధ్యమనిపించిన ఛేదనలో దినేశ్ చండీమల్ (174 బంతుల్లో 83; 12 ఫోర్లు), ధనంజయ డిసిల్వ (81 బంతుల్లో 59; 9 ఫోర్లు, 1 సిక్స్) పోరాడారు. వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (48; 9 ఫోర్లు) కూడా ఆకట్టుకున్నాడు. అయితే సాధించాల్సిన లక్ష్యం మరీ ఎక్కువ ఉండటంతో లంకేయులకు పరాజయం తప్పలేదు. సఫారీ బౌలర్లలో యాన్సెన్ 4... రబడ, కోట్జీ, కేశవ్ మహారాజ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్లో 191 పరుగులు చేయగా... శ్రీలంక 42 పరుగులకు కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్లో దక్షిణాఫ్రికా 366/5 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రెండు ఇన్నింగ్స్ల్లో కలిపి 11 వికెట్లు తీసిన యాన్సెన్కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇప్పటి వరకు 14 టెస్టు మ్యాచ్లాడిన యాన్సెన్కు ఇదే తొలి 10 వికెట్ల ప్రదర్శన కావడం విశేషం. ఇరు జట్ల మధ్య గురువారం రెండో టెస్టు ప్రారంభం కానుంది. తాజా విజయంతో వరల్డ్ టెస్టు చాంపియన్షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి రెండో స్థానానికి దూసుకుపోయింది. భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

పోరాడుతున్న న్యూజిలాండ్

- రెండో ఇన్నింగ్స్లో 155/6
- తొలి ఇన్నింగ్స్లో ఇంగ్లండ్ 499



క్రైస్ట్చర్చ్: సొంతగడ్డపై ఇంగ్లండ్తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ జట్టు ఓటమినుంచి తప్పించుకునేందుకు పోరాడుతోంది. ఇంగ్లండ్ బ్యాటర్లు భారీ స్కోరు చేసిన చోట కివీస్ బ్యాటింగ్ ఆర్డర్ అదే స్థాయిలో రాణించలేకపోవడంతో ఆతిథ్య జట్టు కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్లో సెంచరీ చేజార్చుకున్న మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (86 బంతుల్లో 61; 7 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్లోనూ అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ జట్టు రెండో ఇన్నింగ్స్లో 49 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. కేన్ కీలక ఇన్నింగ్స్ ఆడగా... రచిన్ రవీంద్ర (24), డరైల్ మిచెల్ (31 బ్యాటింగ్, 6 ఫోర్లు) పర్వాలేదనిపించారు. కెప్టెన్ టామ్ లాథమ్ (1), కాన్వే (8), బ్లన్డెల్ (0), ఫిలిప్స్ (19) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. చేతిలో 4 వికెట్లు ఉన్న న్యూజిలాండ్ జట్టు... ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు కంటే కేవలం 4 పరుగుల ఆధిక్యంలో ఉంది. మిచెల్తో పాటు నాథన్ స్మిత్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. నాలుగో రోజు ఉదయం తొలి సెషన్లో కివీస్ బ్యాటర్లు ఎన్ని పరుగులు అదనంగా జోడిస్తారనేదానిపై ఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.

వన్డే తరహా ఆటతీరుతో..

అంతకుముందు ఓవర్నైట్ స్కోరు 319/5తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 103 ఓవర్లలో 499 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (197 బంతుల్లో 171; 15 ఫోర్లు, 3 సిక్స్లు) తన స్కోరుకు మరో 39 పరుగులు అదనంగా జత చేయగా...కెప్టెన్ బెన్ స్టోక్స్ (146 బంతుల్లో 80; 9 ఫోర్లు) అర్ధ శతకం సాధించాడు. వీరిద్దరూ ఆరో వికెట్కు 159 పరుగులు జత చేయడంతో ఇంగ్లండ్ భారీ స్కోరు చేయగలిగింది.అట్కిన్సన్ (36 బంతుల్లో 48; 4 ఫోర్లు, 2 సిక్స్లు), కార్స్ (24 బంతుల్లో 33 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్లు) వేగంగా పరుగులు రాబట్టారు. ఫలితంగా ఇంగ్లండ్ జట్టుకు 151 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 4, నాథన్ స్మిత్ మూడు వికెట్లు పడగొట్టారు. మూడో రోజు 'బజ్బాల్' ఆటతీరుతో ఆకట్టుకున్న ఇంగ్లండ్ 33 ఓవర్లలో 180 పరుగులు రాబట్టడం విశేషం.

విలియమ్సన్ @ 9000

కివీస్ టాప్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ టెస్టుల్లో 9 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. కెరీర్లో 103వ టెస్టు ఆడుతున్న కేన్ 182 ఇన్నింగ్స్లలో మొత్తం 9035 పరుగులు సాధించాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్లో కొనసాగుతున్న ఆటగాళ్లలో ఈ మైలురాయిని దాటిన నాలుగో ఆటగాడిగా కేన్ నిలిచాడు. జో రూట్ (12754), స్టీవ్ స్మిత్ (9702), విరాట్ కోహ్లి (9145) అతనికంటే ముందున్నారు.

చాంపియన్ హంసిని



36వ జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: యోనెక్స్–సన్రైజ్ 36వ జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్షిప్లో తెలంగాణ క్రీడాకారిణి చదరం హంసిని చాంపియన్గా నిలిచింది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ప్లేయర్లు పాల్గొన్న ఈ టోర్నీలో తెలంగాణ షట్లర్ సత్తా చాటింది. జమ్ము కశ్మీర్ వేదికగా జరిగిన ఈ టోర్నీ అండర్–13 బాలికల సింగిల్స్ ఫైనల్లో శనివారం టాప్ సీడ్ హంసిని 21–17, 21–18తో బెడాగ్ని గొగొయ్ (అస్సాం)పై గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది. అండర్–13 బాలుర సింగిల్స్లో అనికేశ్ దత్తా (అస్సాం) 21–17, 21–7తో సాత్విక్ అగర్వాల్ (రాజస్తాన్)పై విజయం సాధించాడు. బాలికల డబుల్స్లో ఆర్యమా చక్రవర్తి (పశ్చిమ బెంగాల్)–లక్ష్మి సాయి ఆరాధ్య (ఆంధ్రప్రదేశ్) జంట 21–14, 21–8తో జయ సప్తశ్రీ–జిషిక (తమిళనాడు) జోడీపై గెలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో తెలంగాణ షట్లర్లు విదిత్ రెడ్డి–శ్రీచేతన్ శౌర్య రన్నరప్గా నిలిచారు. తుది పోరులో విదిత్–శ్రీచేతన్ ద్వయం 17–21, 13–21 తేడాతో ఆదిత్య సింగ్ నేగీ–తన్మయ్ వర్మ (ఉత్తరాఖండ్) జంట చేతిలో ఓడింది. జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులను భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, మాజీ చీఫ్ కోచ్ భాస్కర్ బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జట్టు మేనేజర్ యూవీయస్ బాబు, కోచ్ లక్ష్మణ్, బల్వీర్ సింగ్, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్విన్ అద్భుత స్పిన్నరే కానీ...

- సుందర్ను సిద్ధం చేసుకోవాలి
- హర్భజన్ సింగ్ వ్యాఖ్య



ముంబై: సీనియర్ ఆఫ్స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అద్భుత స్పిన్నరే అయినా... భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వాషింగ్టన్ సుందర్ను సిద్ధం చేయాలని భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అభిప్రాయపడ్డాడు. టెస్టు క్రికెట్లో 536 వికెట్లు పడగొట్టిన అశ్విన్... భారత్ నుంచి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే (619) తర్వాత రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' తొలి టెస్టులో అశ్విన్ను కాదని టీమ్ మేనేజ్మెంట్ సుందర్ను తుది జట్టులోకి ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో భజ్జీ మాట్లాడుతూ... 'అశ్విన్ జాతీయ జట్టు తరఫున అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అయితే ఇప్పుడతడి వయసు 38. అతడు ఆటకు వీడ్కోలు పలికే సమయానికి జట్టు సుందర్ను సిద్ధం చేసుకోవాలనుకుంటుండొచ్చు. అందుకే విదేశీ పిచ్లపై అనుభవజ్ఞుడైన అశ్విన్ కంటే సుందర్కు అవకాశం ఇచ్చారు. పెర్త్లో ఆస్ట్రేలియాపై టీమిండియా విజయం సాధించడం చాలా ఆనందంగా ఉంది. అక్కడ ఆసీస్ అజేయమైన జట్టుగా కనిపించేది. అలాంటి చోట చక్కటి ఆటతీరుతో భారత జట్టు కంగారూలను కట్టడి చేసింది. ఇదే జోరు కొనసాగిస్తూ టీమిండియా 4–1తో సిరీస్ కైవసం చేసుకుంటుందనుకుంటున్నా' అని అన్నాడు. ప్రపంచ టెస్టు చాంపియన్షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్కు చేరడం భారత్కు కొత్త కాదని... అయితే ఈసారి గెలవడం ముఖ్యమని భజ్జీ వ్యాఖ్యానించాడు. తొలి టెస్టులో రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో లేకున్నా... జస్ప్రీత్ బుమ్రా జట్టును అద్భుతంగా నడిపించాడని హర్భజన్ కొనియాడాడు.

కోహ్లిని చూసి లబుషేన్ నేర్చుకోవాలి: పాంటింగ్

ఫామ్లేమితో సతమతమవుతున్న ఆస్ట్రేలియా ఆటగాళ్లు మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్కు... మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ కీలక సూచనలు చేశాడు. ఈ ఇద్దరూ భారత స్టార్ విరాట్ కోహ్లిని చూసి నేర్చుకోవాలన్నాడు. 'పెర్త్ టెస్టులో లబుషేన్ తీవ్రంగా తడబడ్డాడు. విభిన్నమైన వికెట్పై నాణ్యమైన బౌలింగ్ను ఎదుర్కోవడం ఎప్పుడూ కష్టమే. కానీ పరిస్థితులను మనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించడం ముఖ్యం. పెర్త్ రెండో ఇన్నింగ్స్లో కోహ్లి ఇదే చేశాడు. తొలి ఇన్నింగ్స్లో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయిన విరాట్ రెండో ఇన్నింగ్స్లో పరిస్థితులపై పైచేయి సాధించాడు. కోహ్లి తన బలాలపై దృష్టి పెడతాడు. లబుషేన్, స్మిత్ అదే చేయాలి. వారి సామర్థ్యాన్ని నమ్మాలి' అని పాంటింగ్ వ్యాఖ్యానించాడు. బుమ్రా వంటి బౌలర్ను ఎదుర్కొనేందుకు మెరుగైన ప్రణాళికలతో బరిలోకి దిగాలని... లేకుంటే ఫలితాలు అనుకూలంగా రావని పాంటింగ్ అన్నాడు. మరోవైపు ఆసీస్ మాజీ పేసర్ జాన్సన్ భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఈ నెల 6 నుంచి అడిలైడ్ వేదికగా ప్రారంభం కానున్న రెండో టెస్టు నుంచి లబుషేన్ను తప్పించాలని అన్నాడు. గత కొన్నాళ్లుగా ఫామ్లోలేక ఇబ్బంది పడుతున్న లబుషేన్ దేశవాళీల్లో ఆడితే తిరిగి లయ అందిపుచ్చుకోవచ్చని సూచించాడు.

హైదరాబాద్ పరాజయం

ఏకైక గోల్తో నెగ్గిన ముంబై సిటీ ఫుట్బాల్ క్లబ్



ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) హైదరాబాద్ ఫుట్బాల్ క్లబ్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. లీగ్లో భాగంగా శనివారం జరిగిన పోరులో హైదరాబాద్ జట్టు 0–1 గోల్ తేడాతో ముంబై సిటీ ఫుట్బాల్ క్లబ్ చేతిలో ఓటమి పాలైంది. ముంబై జట్టు తరఫున మెహతాబ్ సింగ్ (29వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. మ్యాచ్లో ముంబై జట్టు హైదరాబాద్ గోల్ పోస్ట్పై 4 షాట్లు బాదగా... అందులో ఒకటి లక్ష్యాన్ని చేరింది. హైదరాబాద్ మూడు ప్రయత్నాలు చేసినా ఖాతా తెరవలేకపోయింది. 55 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్న ముంబై చివరకు విజేతగా నిలిచింది. తాజా సీజన్లో 9 మ్యాచ్లాడిన హైదరాబాద్ జట్టు 2 విజయాలు, ఒక 'డ్రా', 6 పరాజయాలతో 7 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 11వ స్థానంలో ఉండగా... ముంబై జట్టు 9 మ్యాచ్ల్లో 3 విజయాలు, 4 'డ్రా'లు, 2 పరాజయాలతో 13 పాయింట్లు సాధించి పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతోంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్లో మోహన్ బగాన్ జట్టు 1-0 గోల్స్ తేడాతో చెన్నైయిన్ ఫుట్బాల్ క్లబ్పై గెలుపొందింది. మోహన్ బగాన్ తరఫున జాసన్ కమింగ్స్ (86వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. ఆడిన 9 మ్యాచ్ల్లో ఆరో విజయం ఖాతాలో వేసుకున్న మోహన్ బగాన్ జట్టు 20 పాయింట్లతో పట్టిక అగ్ర స్థానంలో నిలిచింది. ఆదివారం ఒడిశా జట్టుతో బెంగళూరు ఫుట్బాల్ క్లబ్ తలపడనుండగా... హైదరాబాద్ తమ తదుపరి మ్యాచ్ను బుధవారం గోవా ఫుట్బాల్ క్లబ్తో ఆడనుంది.

తెలుగు టైటాన్స్ ఓటమి

జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో పరాజయం



నోయిడా: స్టార్ రెయిడర్ విజయ్ 17 పాయింట్లతో పోరాడినా... ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్లో తెలుగు టైటాన్స్కు పరాజయం తప్పలేదు. లీగ్లో భాగంగా శనివారం జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 28–41 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడింది. విజయ్ ఒంటరి పోరాటం చేయగా... అతడికి సహచరుల నుంచి తోడ్పాటు లభించలేదు. పింక్ పాంథర్స్ తరఫున నీరజ్ నర్వాల్ (12 పాయింట్లు), అర్జున్ దేశ్వాల్ (11 పాయింట్లు) సత్తా చాటారు. ఓవరాల్గా ఈ మ్యాచ్లో తెలుగు టైటాన్స్ 19 రెయిడ్ పాయింట్లు సాధించగా... జైపూర్ పింక్ పాంథర్స్ 22 రెయిడ్ పాయింట్లు సాధించింది. ట్యాక్లింగ్లో పింక్ పాంథర్స్ 12 పాయింట్లు సాధించగా... టైటాన్స్ 7 ట్యాక్లింగ్ పాయింట్లకే పరిమితమైంది. టైటాన్స్ మూడు సార్లు ఆలౌట్ కావడంతో ప్రత్యర్థి జట్టుకు అదనంగా 6 పాయింట్లు దక్కాయి. తాజా సీజన్లో 15 మ్యాచ్లాడి 9 విజయాలు, 6 పరాజయాలతో 48 పాయింట్లు ఖాతాలో వేసుకున్న టైటాన్స్ పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతుండగా... జైపూర్ పింక్ పాంథర్స్ (46 పాయింట్లు) పట్టికలో ఐదో స్థానంలో ఉంది. మరో మ్యాచ్లో పట్నా పైరేట్స్ 54–29 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్పై గెలుపొందింది. పట్నా పైరేట్స్ తరఫున దేవాంక్ 17 పాయింట్లు, అయాన్ 13 పాయింట్లతో విజృంభించగా... బుల్స్ తరఫున జై భగవాన్ 9 పాయింట్లు, ప్రదీప్ నర్వాల్ 8 పాయింట్లు సాధించారు. 25 పాయింట్ల తేడాతో నెగ్గిన పట్నా జట్టు పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది.

మంచు దుప్పటి..



శనివారం శ్రీనగర్‌లోని చారిత్రక దాల్ సరస్సులో పొగమంచు నడుమ పర్యాటకులతో సాగుతున్న షికారా (పడవ). కశ్మీర్ కొద్ది రోజులుగా మంచుతో తడిసి ముద్దవుతోంది

మంచు పరుపు..



న్యూయార్క్‌లో హిమపాతం చుక్కలు చూపుతోంది. శనివారం రోడ్ సైడ్‌వాక్‌ను ముంచెత్తిన మంచును క్లియర్ చేస్తున్న ఓ వ్యక్తి

వనంలో వనితలపై అనుచిత నిఘా

జంతువుల కోసం పెట్టిన కెమెరాలు, డ్రోన్ల దుర్వినియోగం

కేంబ్రిడ్జ్ వర్సిటీ అధ్యయనంలో విస్తుపోయే వాస్తవాలు

పెద్దపులులకు ఆవాసంగా, జీవవైవిధ్యానికి పట్టుగొమ్మగా అలరారుతున్న ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ జాతీయ వనంలో ఘోరం జరుగుతోంది. వేటగాళ్ల నుంచి వన్యప్రాణులను కాపాడేందుకు, జంతువుల సంఖ్యను లెక్కపెట్టేందుకు, వాటి స్థితిగతులను తెలుసుకునేందుకు అడవిలో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు, డ్రోన్లను గ్రామీణ మహిళలపై అనుచిత నిఘాకు వాడుతున్న వైనం కలకలం రేపుతోంది. వంట చెరకు, అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్లే గ్రామీణ మహిళలను దొంగచాటుగా చూసేందుకు కొందరు అధికారులు, స్థానికులు ఈ కెమెరాలు, డ్రోన్లు, వాయిస్ రికార్డర్లను వాడుతున్నారు. ఈ విస్మయకర విషయాలను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం అధ్యయనం వెలుగులోకి తెచ్చింది!

అడవే వారికి జీవనాధారం

ఉత్తరాఖండ్ జిమ్ కార్బెట్ టైగర్ రిజర్వ్‌ను ఆనుకుని చాలా గ్రామాలున్నాయి. అక్కడి గ్రామీణ మహిళలకు అడవే ఆధారం. వంట చెరకు, తేనె, ఇతరత్రా అటవీ ఉత్పత్తుల కోసం అటవీ ప్రాంతాలకు వెళ్తుంటారు. రోజుల పాటు అక్కడే గడుపుతారు. తాగుబోతు భర్తల హింస, వేధింపులు తాళలేక అడవి బాట పట్టే అతివలు ఎందరో. అడవి తల్లిని ఆశ్రయించే ఈ మహిళలకు వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన రహస్య కెమెరాలు, డ్రోన్లు తలనొప్పిగా తయారయ్యాయి. అడవిలో సెలయేర్లు, గట్ల వద్ద స్నానాలు చేసే, బహిర్భూమికి వెళ్లే మహిళలను డ్రోన్లు, నిఘా కెమెరా కళ్లు వెంటాడుతున్నాయని కేంబ్రిడ్జ్ అధ్యయనంలో తేలింది. ''మహిళలు అటవీ సంపదను కొల్లగొట్టకుండా వారిని బయటకు తరిమేందుకు మొదట్లో కెమెరా ట్రాప్‌లు, డ్రోన్లను అధికారులు వాడేవారు. తర్వాత కొందరు అధికారులు ఇలా మహిళలను దొంగచాటుగా చూసేందుకు దుర్వినియోగం చేశారు. ఒక మహిళకు సంబంధించిన వ్యక్తిగత వీడియో ఇటీవల ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. వాట్సాప్‌లోనూ షేర్ చేయడంతో విషయం గ్రామస్తుల దాకా చేరింది. చివరకు స్థానిక నిఘా కెమెరాలను తగలబెట్టే దాకా వెళ్లింది''అని కేంబ్రిడ్జ్‌లో సోషియాలజీ విభాగ పరిశోధకుడు, నివేదిక ముఖ్య రచయిత త్రిశాంత్ సిమ్‌లయ్ చెప్పారు. నివేదిక వివరాలు 'ఎన్విరాన్‌మెంట్, ప్లానింగ్ ఎఫ్'జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఇదేం దిక్కుమాలిన పని!

ఉత్తరాఖండ్‌లోని అడవుల్లో అత్యంత విలువైన వనమూలికలుంటాయి. వాటిని సేకరించి పొట్ట నింపుకునేందుకు గ్రామీణ మహిళలు అడవుల్లోకి వెళ్తుంటారు. గుంపులుగా వెళ్లి కొద్ది రోజులు అక్కడే ఉంటారు. ''అడవి తల్లితో మాకెంతో అనుబంధం. ఇంట్లో మాకు నిర్బంధం ఎక్కువ. పెళ్లి వంటి వేడుకలప్పుడు తప్పితే కనీసం నోరు తెరిచి పాడటం కూడా తప్పే. అందుకే వనదేవత ఒడికి చేరినప్పుడే అందరం కలిసి ఆనందంగా పాటలు పాడుతూ పనిలో నిమగ్నమవుతాం''అని ఒక గ్రామీణురాలు తెలిపారు. తాజాగా కొన్ని చోట్ల నిఘా కెమెరాలను తగలబెట్టడంతో ఆ ప్రాంతాల్లో పులి సంచారంపై అధికారులకు నిఘా కరువైంది. ఈ క్రమంలో అడవిలోకి వెళ్లిన ఒక మహిళపై పులి దాడి చేసి చంపేసింది. దీంతో కెమెరాల దుర్వినియోగం చివరకు మహిళ ప్రాణాలను బలిగొందని స్థానికుల్లో ఆగ్రహం రేగింది. ''రెక్కాడితేగానీ డొక్కాడని పేద మహిళలు ఇప్పటికీ అడవిలోకి వెళ్తున్నారు. కానీ ఏ చెట్టు కొమ్మకు ఏ కెమెరా ఉందోనన్న భయం వాళ్లను వెంటాడుతోంది. వాళ్ల గొంతులు మూగబోయాయి. అమాయక గ్రామీణుల జీవనశైలి మీదే ఇది ప్రభావం చూపుతోంది''అని పర్యావరణవేత్తలు, సామాజికవేత్తలు అంటున్నారు. జంతువులను చూడమంటే మహిళలను దొంగచాటుగా చూడటమేటని త్రిశాంత్ ప్రశ్నించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

స్పందించని అధికారులు

దీనిపై టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ కార్యాలయాన్ని మీడియా సంప్రదించగా అధికారులు స్పందించలేదు. జిమ్ కార్బెట్ జాతీయవనం ఢిల్లీ నుంచి 280 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఉత్తరాది అంతటి నుంచీ ఇక్కడికి పర్యాటకులు పోటెత్తుతారు. ఇక్కడ జీప్ సఫారీ సౌకర్యం కూడా ఉంది.

ఢిల్లీలో ఒంటరి పోరే..!

ఆప్‌తో పొత్తు లేకుండానే బరిలో దిగాలని కాంగ్రెస్ నిర్ణయం

- 70 స్థానాల్లో పోటీకి కాంగ్రెస్ సిద్ధం
- ప్రకటించిన ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీతో రానున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకునేది లేదని కాంగ్రెస్ నిర్ణయించింది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లోనూ ఒంటరిగానే పోటీ చేయాలనే నిశ్చయానికి వచ్చింది. బీజేపీతో ప్రత్యక్షపోరు కొనసాగిస్తున్న మాదిరే ఆప్‌తోనూ అదే వైఖరిని అవలించాలని కాంగ్రెస్ అధిష్టానం ఢిల్లీ నేతలకు సూచనలు చేసింది. ఢిల్లీలో షీలా దీక్షిత్ హయాంలో వరుసగా 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. గడిచిన రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఖాతా తెరవలేదు. మొన్నటి లోక్‌సభలో ఆప్‌తో పొత్తు పెట్టుకుని పోటీ చేసినా రెండు పార్టీలు ఒక్క సీటును గెలువలేకపోయాయి. అనంతరం జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీల పొత్తు ఉంటుందని భావించినా, సీట్ల పంపకాలలో విభేదాలతో పొత్తు కుదరలేదు. దీంతో రెండు పార్టీలు విడివిడిగా పోటీ చేసి ఓటమి పాలయ్యాయి. 6 నుంచి 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ఆప్ ప్రత్యక్ష కారణమైంది. హరియాణా ఓటమి నేపథ్యంలో బీజేపీని ఎదుర్కోవాలన్నా, ఓట్ల చీలికను ఆపాలన్నా రెండు పార్టీలు కలిసి పోటీ చేయడమే ఉత్తమమనే భావనను కొంతమంది నేతలు వ్యక్తం చేశారు. అయితే ఆప్ పార్టీలోని సోమ్‌నాథ్ భారతి వంటి కీలక నేతలు పొత్తును వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తుతో ఆప్‌కు ఒనగూరే ప్రయోజనం ఏమీలేదని, పైగా బీజేపీకి విమర్శల దాడిని అస్త్రాన్ని అందించినట్లు అవుతుందని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇటీవల జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలు హాజరయ్యారు. కార్యక్రమంలో కేజ్రీవాల్, రాహుల్, ఖర్గేలు చాలాసేపు ముచ్చటించుకోవడం సైతం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో ఆప్‌తో పొత్తు ఖాయమైందని చాలా మంది భావించారు. శుక్రవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం సందర్భంగా పొత్తు అంశంపై కీలక చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పొత్తు ఉంటుందని ఎక్కువ మంది భావిస్తున్న వేళ కాంగ్రెస్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఎలాంటి పొత్తులు ఉండవని ఒంటరి పోరుకు సిద్ధం కావాలని అధిష్టాన పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. దీనిపై పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ శనివారం ఒక ప్రకటన చేశారు. 'ఢిల్లీ రాష్ట్రంలో ఆప్ పరిపాలనలో వృద్ధులకు పింఛన్లు అందడం లేదు. పేదలకు రేషన్‌కార్డు అందడం లేదు. రోడ్లు పాడైపోయాయి. కాలుష్యం అదుపు తప్పింది. యువత నిరుద్యోగులయ్యారు. ద్రవ్యోల్బణంతో మహిళలు నిరుత్సాహానికి గురవుతున్నారు. కేవలం ప్రదర్శన కోసమే ఆమ్ ఆద్మీ పార్టీ మొహల్లా క్లినిక్‌లను తెరిచింది. ఇదీ కేజ్రీవాల్ మోడల్'అంటూ విమర్శలు గుప్పించారు. అటు బీజేపీ, ఇటు ఆప్ రెండూ ఢిల్లీ సర్వనాశనం చేశాయన్నారు. రెండు పార్టీలను ఒంటరిగా ఎదుర్కొంటామని, ముఖ్యమంత్రి ఎవరనేది ఫలితాల అనంతరం నిర్ణయిస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ చేసే ప్రక్రియ మొదలు పెట్టామని తెలిపారు.

పీట్ హెగ్‌సెత్‌కు మహిళలంటే గౌరవం లేదు

- వారితో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు
- అమెరికాకు కాబోయే రక్షణ మంత్రిపై సొంత తల్లి ఆరోపణలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తన సొంత టీమ్‌ను ఏర్పాటు చేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు. కీలక శాఖలకు మంత్రులుగా ఇప్పటికే పలువురి పేర్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత వీరంతా మంత్రులుగా మారబోతున్నారు. కానీ, ట్రంప్ ఎంపికల పట్ల విమర్శలు వస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని, లైంగిక వేధింపుల కేసుల్లో ఇరుక్కున్నవారిని ట్రంప్ మంత్రులుగా ఎంపిక చేశారంటూ అసంతృప్త స్వరాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఆయన వినిపించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. అమెరికా రక్షణ శాఖ మంత్రిగా ఎంపికైన పెటీ హెగ్‌సెత్(44)పై ఆయన సొంత తల్లి పెనెలోప్ హెగ్‌సెత్ ఆరోపణలు చేయడం సంచలనాత్మకంగా మారింది. తన కుమారుడికి మహిళలంటే ఏమాత్రం గౌరవం లేదని, చులకనగా చూస్తాడని ఆమె తప్పుపట్టారు. చాలాఏళ్లు మహిళలతో అతడు అభ్యంతకరంగా ప్రవర్తించాడని ఆక్షేపించారు. తన బిడ్డ ప్రవర్తన సరైంది కాదని పేర్కొన్నారు. ఈ మేరకు 2018లో తన కుమారుడికి పెనెలోప్ పంపించిన ఈ-మెయిల్‌ను న్యూయార్క్ టైమ్స్ పత్రిక బహిర్గతం చేసింది. ''నువ్వు(పీట్ హెగ్‌సెత్) మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తుంటావు. వారిని చాలా చులకనగా చూడడం నీకు అలవాటు. ఆడవాళ్ల గురించి నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్తుంటావు. తప్పుడు ప్రచారం చేయడం నీకు ఇష్టం. అందుకే నిన్ను నేను ఎప్పటికీ గౌరవించలేను. ఒక తల్లిగా నీ ప్రవర్తన పట్ల మౌనంగా ఉండాలని ప్రయత్నించా. కానీ, నీ భార్యను ఘోరంగా వేధించావు. ఆమె చాలా మంచి అమ్మాయి. ఆమె అనుభవించిన బాధను తెలుసుకొని సహించలేకపోయాను. నీ ప్రవర్తన పట్ల మేమంతా విసుగెత్తిపోయాం''అని ఈ-మెయిల్‌లో పెనెలోప్ తన ఆవేదన వ్యక్తం చేశారు. హెగ్‌సెత్ రక్షణ శాఖ మంత్రిగా ఎంపిక కావడంతో ప్రస్తుతం ఈ అంశం అమెరికాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో పెనెలోప్ స్పందించారు. కోపం, ఆవేశంతో అప్పట్లో తన కుమారుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ-మెయిల్ పంపించానని, ఆ తర్వాత అతడికి క్షమాపణ చెప్పానని వెల్లడించారు. ఇదిలా ఉండగా, పీట్ హెగ్‌సెత్‌కు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సంబంధంతో ఓ బిడ్డకు కూడా జన్మనిచ్చినట్లు సమాచారం.



అన్ని తనిఖీలు దాటుకుని ఎంచక్కా పారిస్‌కు

- బోర్డింగ్ పాస్ లేకుండానే విమానంలో ప్రయాణించిన అనామకురాలు
- అన్ని సెక్యూరిటీ చెక్‌లను ఎలా దాటగలిగిందని అధికారుల విస్మయం
- సమగ్ర దర్యాప్తునకు ఆదేశించిన డెల్టా ఎయిర్‌లైన్స్

న్యూయార్క్/పారిస్: అమెరికా. నిఘా నేత్రాలమయం. అక్కడ మన లాంటి భారతీయులు రోడ్లపై తిరుగుతున్నా అనుమానమొస్తే పోలీసులు మొత్తం ఆరాతీస్తారు. సంబంధిత గుర్తింపు కార్డులు చూపిస్తేనే వదిలేస్తారు. లేదంటే పోలీస్‌స్టేషన్‌కు పోవాల్సిందే. మరి అలాంటిది అంతర్జాతీయ విమానాశ్రయంలో నేరుగా విమానం ఎక్కనిస్తారా?. అస్సలు కుదరదు. పాస్‌పోర్ట్, వీసా, ఐడీ కార్డులు, లగేజీ తనిఖీలు, నిషేధిత వస్తువుల లేకుండా చూసుకోవడం.. వంటివన్నీ పూర్తిచేసుకుంటేనే బోర్డింగ్ పాస్ చేతికొస్తుంది. విమానంలోకి అడుగుపెట్టగలం. అలాంటిది ఒక మధ్యవయస్కురాలు ఇవేం లేకుండా నేరుగా విమానం ఎక్కేసింది. అదేదో మారుమూల విమానాశ్రయంలో అంతరాష్ట్ర విమానమో ఆమె ఎక్కలేదు. నేరుగా అంతర్జాతీయ విమానమే ఎక్కింది. న్యూయార్క్ నగరం నుంచి ఫ్రాన్స్‌లోని పారిస్‌కు చేరుకుంది. దీంతో అత్యంత కట్టుదిట్ట భద్రత అని చెప్పుకునే అమెరికా ఎయిర్‌పోర్ట్‌లోనూ డొల్ల వ్యవస్థ ఉందని ఆమె పరోక్షంగా నిరూపించింది. ఎక్కడా ఎవరికీ చిక్కకుండా పారిస్‌లో దిగి ఎయిర్‌పోర్ట్ బయటకు వెళ్దామని ఆశించి భంగపడింది. ఫ్రాన్స్‌లో విమానం ల్యాండ్ అయ్యాక దొరికిపోయింది. అమెరికా ఎయిర్‌పోర్ట్ వ్యవస్థ పరువుతీసిన ఈ మహిళ గురించే ఇప్పుడు ఎయిర్‌లైన్స్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డెల్టా ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యం వల్లే ఆమె ఖండాంతరయానం చేయగలిగిందని కొందరు ఆరోపిస్తున్నారు. అమెరికా ఎయిర్‌పోర్ట్ అథారిటీ వర్గాలు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాయి. తప్పు ఎక్కడ జరిగిందని కూపీలాగుతున్నాయి. ఈమె ఊరు పేరు ఇతరత్రా వివరాలను అధికారులు బయటపెట్టలేదు.

ఏం జరిగింది? ఎలా జరిగింది?

ట్రాన్స్‌పోర్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ ఇచ్చిన వివరాల ప్రకారం గత మంగళవారం న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ ఘటన జరిగింది. 55–60 ఏళ్ల మహిళ టికెట్, ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకుండా ఎయిర్‌పోర్ట్‌కు వచ్చింది. అక్కడ రెండు చోట్ల ఐడెంటిటీని చెక్ చేసే గుర్తింపు కేంద్రాలను ఒడుపుగా దాటేసింది. తర్వాత అనుమానాస్పద వస్తువులను తనిఖీ చేసే సెక్యూరిటీ చెక్‌పాయింట్లనూ దాటింది. తర్వాత బోర్డింగ్ పాస్ జారీచేసే చోటు నుంచి తెలివిగా ఆవలి వైపునకు వచ్చేసింది. రన్‌వే మీద నిలిచి ఉన్న విమానం దాకా ప్రయాణికులను తీసుకెళ్లే బస్సును ఎక్కేసింది. తర్వాత విమానం తలుపు దగ్గర ఎయిర్‌హోస్టెస్ స్వాగత పలకరింపులు, పరిచయాలను పూర్తి చేసుకుని లోపలికి ప్రవేశించింది. నిండుగా ఉన్న విమానంలో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండదుకాబట్టి బాత్‌రూమ్‌లోకి వెళ్లి దాక్కుంది. అంతా సవ్యంగా ఉండటంతో విమానం గాల్లోకి ఎగిరింది. ఫ్రాన్స్‌లోని ఛార్లెస్ డి గాలే ఎయిర్‌పోర్ట్ పార్కింగ్ పాయింట్ వద్ద విమానం ఆగిన తర్వాత విమానంలోనే ఈమెను అధికారులు గుర్తించారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న న్యూయార్క్ సిటీ రియల్ ఎస్టేట్ బ్రోకర్ రాబ్ జాక్సన్ ఇంకొన్ని వివరాలను వెల్లడించారు. విమానంలో సీట్లో కూర్చోకుండా ఒక బాత్రూమ్ నుంచి ఇంకో బాత్రూమ్‌లోకి మారుతూ అటూ ఇటూ తిరుగుతున్న ఈమె వాలకం చూసి విమానసిబ్బందికి అనుమానమొచ్చింది. ఈమెను ఆపి ప్రశ్నించేలోపు ఇంకో బాత్రూమ్‌లో దూరి గడియపెట్టుకుంది. దీంతో ఫ్రాన్స్‌లో దిగాక పైలట్ వెంటనే ఫ్రాన్స్ ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారమిచ్చాడు. ఏ ఉగ్రవాది నక్కాడో అని ప్రయాణికులు భయపడతారనే ఉద్దేశ్యంతో వాళ్లకు ఏమీ చెప్పలేదు. ''అందరూ మీమీ సీట్లలో ప్రశాంతంగా కూర్చోండి. మన విమానంలో అదనపు అతిథి ఉన్నారు. పోలీసులు వచ్చి పట్టుకెళ్తారు''అని ప్యాసింజర్లను ప్రశాంతపరిచాడు. చివరకు పోలీసులు వచ్చి ఈమెను అరెస్ట్‌చేసి విచారణ మొదలెట్టారు.

అమెరికా గ్రీన్‌కార్డ్..

విమానంలో చొరబడిన ఈమెకు అమెరికా గ్రీన్‌కార్డ్ ఉందని, రష్యా పాస్‌పోర్ట్ ఉందని మీడియాలో వార్తలొచ్చాయి. అమెరికాలో ఉండే ఉద్దేశంలేక కావాలనే ఫ్రాన్స్ శరణుకోరుతూ శరణార్థిగా ఇక్కడికి అక్రమంగా వచ్చిందని మరో కథనం వెలువడింది. ఆమె మానసిక స్థితి గురించి ఇంకా వివరాలు తెలియరాలేదు. అనుమతిలేకుండా విమానం ఎక్కి సేవల దుర్వినియోగం, దేశం దాటి రావడం, ఇతరత్రా సెక్షన్ల కింద కేసులు మోపి ఫ్రాన్స్ జైళ్లో పడేయొచ్చు. లేదంటే అమెరికాకే తిరిగి పంపొచ్చు. అప్పుడు అమెరికా చట్టాల ప్రకారం శిక్ష పడే వీలుంది. డెల్టా ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణించడంతో తమ వైపు సెక్యూరిటీ చెక్ విషయంలో ఏం లోపాలు జరిగాయో తెల్సుకునేందుకు విమానయాన సంస్థ ఈమెను ప్రశ్నించే వీలుంది. అమెరికాకు తిరిగొస్తే జేకేఎఫ్ ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆమెను విచారించే అవకాశముంది. గత మంగళవారం థ్యాంక్స్‌గివింగ్ హాలిడే రోజు అమెరికా ఎయిర్‌పోర్ట్‌లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంది. అమెరికాలో ఆ ఒక్కరోజే 27 లక్షల మంది విమానాల్లో ప్రయాణించారు. ఆ రద్దీని ఈమె తనకు అనువుగా మలుచుకుని ఉంటుందని భావిస్తున్నారు.

చాలా దేశాలు ఈవీఎంలను మానేశాయి

మేధా పాట్కర్

ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమిని చవిచూశాక ఈవీఎంల విశ్వసనీయతను కొన్ని విపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్న వేళ హక్కుల కార్యకర్త మేధా పాట్కర్ శనివారం స్పందించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ పట్టణంలో మహాత్మాగాంధీ మిషన్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ పట్టా స్వీకరించేందుకు వచ్చిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ''ఈవీఎంల అంశంలో నాకు అపారమైన అనుభవం లేదుగానీ ఒక్కటి చెప్తా. చాలా దేశాలు ఈవీఎంలకు స్వస్తి పలికాయన్నది వాస్తవం. ఆయా దేశాలు మళ్లీ బ్యాలెట్ విధానానికి మళ్లాయి. ఇలాంటి ఎలక్ట్రానిక్ వ్యవస్థలను చిన్నపాటి ఎలక్ట్రిక్ అనుసంధానత ద్వారా మార్పులు చేయొచ్చని కొన్ని ప్రయోగాల్లో నిరూపితమైంది''అని అన్నారు.

'బ్యాలెట్' ఉంటేనే పోటీ చేస్తామనగలరా?

కాంగ్రెస్ నేతలకు బీజేపీ సవాల్

న్యూఢిల్లీ: ఈవీఎంలు సహా ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై పదేపదే సందేహాలు వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సహా ఆ పార్టీ నేతలకు బీజేపీ గట్టి కౌంటర్ ఇచ్చింది. ముందుగా పదవులకు రాజీనామా చేసి, బ్యాలెట్ పేపర్ల విధానం మళ్లీ తీసుకొచ్చేదాకా ఎన్నికల్లో పోటీ చేయబోమని ప్రకటించగలరా అంటూ సవాల్ విసిరింది. ఈ సవాల్‌కు నిలబడితేనే ఈవీఎంలపై సందేహాలకు చిత్తశుద్ధి ఉన్నట్లుగా భావిస్తామని, లేకుంటే అవన్నీ వట్టి మాటలుగానే భావించాల్సి వస్తుందని స్పష్టం చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా శనివారం మీడియాతో మాట్లాడారు. ఈవీఎం సమగ్రత, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పలుమార్లు కోర్టులను సైతం ఆశ్రయించిన విషయాన్ని గౌరవ్ భాటియా గుర్తుచేశారు. ఇదే ఎన్నికల ప్రక్రియలో గెలిచినందున కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు ముందుగా రాజీనామా చేయాలన్నారు.

పదవీ వీడ్కోలు.. సుపుత్రిక సారథ్యంలో..

మధ్యప్రదేశ్‌లో అరుదైన ఘటన

భోపాల్: తండ్రీకూతుళ్లు ఇద్దరూ ఐపీఎస్ అధికారులే. ఇద్దరూ ఒకే రాష్ట్రంలో విధులు ఉన్నారు. తండ్రి ఏకంగా రాష్ట్ర డీజీపీగా పదవీ విరమణ చేస్తుంటే అదే వీడ్కోలు కార్యక్రమానికి కుమార్తె సారథ్యం వహించడం విశేషం. ఈ అరుదైన ఘట్టానికి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న మోతీలాల్ నెహ్రూ పోలీస్ మైదానం వేదికైంది. 1987 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి సుధీర్ సక్సేనా శనివారం మధ్యప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీవిరమణ చేశారు. పోలీస్ సంప్రదాయం ప్రకారం వీడ్కోలు పరేడ్ నిర్వహించారు. అయితే ఈ పరేడ్‌కు సుధీర్ కూతురు, 2020 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి అయిన సోనాక్షి సారథ్యం వహించారు. ఐపీఎస్ తండ్రికి ఐపీఎస్ కూతురు అధికారికంగా వీడ్కోలు పలకడం దేశ చరిత్రలో బహూశా ఇదే తొలిసారి అని అధికారులు వెల్లడించారు. భోపాల్‌లో డెప్యూటీ కమిషనర్(ఇంటెలిజెన్స్)గా సోనాక్షి విధులు నిర్వర్తిస్తున్నారు. 1992 డిసెంబర్‌లో జన్మించిన సోనాక్షి 27 ఏళ్లకే యూపీఎస్‌సీ పరీక్షల్లో ఉత్తీర్ణురాలయ్యారు. 2020 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్‌గా శిక్షణ పూర్తిచేసుకుని అఖిలభారత సర్వీసుల్లో అడుగుపెట్టారు. ఐపీఎస్ కావడానికి తండ్రే తనకు స్ఫూర్తి అని, వీడ్కోలు కార్యక్రమానికి సారథ్యం వహించడం సంతోషంగా ఉందని సోనాక్షి అన్నారు.

సంభాల్‌లో పది రోజులపాటు నిషేధాజ్ఞలు

సమాజ్‌వాదీ పార్టీ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు

లక్నో/సంభాల్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మసీదు సర్వే అంశంలో హింసాకాండ చోటుచేసుకున్న సంభాల్ జిల్లాలోకి బయటి వ్యక్తులు ప్రవేశించకుండా అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. డిసెంబర్ 10వ తేదీ దాకా నిషేధం అమల్లో ఉంటుందని ప్రజాప్రతినిధులు గానీ, బయటి వ్యక్తులు గానీ, సామాజిక సంస్థల సభ్యులు గానీ రావొద్దని పోలీసు అధికారులు స్పష్టంచేశారు. స్థానిక సివిల్ కోర్టు ఆదేశాల మేరకు మసీదులో ప్రభుత్వ అధికారులు సర్వే చేస్తుండగా నవంబర్ 24న హింస జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నలుగురు మరణించారు. ఉద్రిక్తతలకు కారణమైన షాహీ జామా మసీదును సందర్శించడానికి ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యేలు, స్థానిక సంభాల్ ఎంపీ శనివారం ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. సంభాల్ జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. హింసాకాండలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని సమాజ్‌వాదీ పార్టీ ప్రకటించింది. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

అలెప్పోను వదిలేసిన సిరియా సైన్యం

బీరుట్: సిరియాలో అంతర్యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చే సూచనలు కనిపిస్తున్నాయి. సాయుధ వాహనాలు, పికప్ ట్రక్కులతో పెద్ద సంఖ్యలో తిరుగుబాటుదార్లు శనివారం దేశంలోనే అతిపెద్దదైన అలెప్పో నగరంలోకి ప్రవేశించారు. వారికి ప్రభుత్వ బలగాల నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదని స్థానికులు తెలిపారు. అంతకుముందు, శుక్రవారం రాత్రి వైమానిక దాడిలో 20 మంది తిరుగుబాటుదార్లు హతమైనట్లు ప్రభుత్వ బలగాలు తెలిపాయి. భారీ ఎదురు దాడికి సన్నాహం చేసుకునేందుకు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తాత్కాలికంగా నగరం నుంచి వెనక్కి మరలినట్లు బలగాలు వెల్లడించాయి. తిరుగుబాటుదార్ల ఆకస్మిక దాడి అస్సద్ ప్రభుత్వానికి ఇబ్బందికరమేనని పరిశీలకులు అంటున్నారు. 2016లో రష్యా సాయంతో అస్సద్ బలగాలు తిరుగుబాటుదార్ల నుంచి ఈ నగరాన్ని స్వాధీనం చేసుకున్నాయి.

ఆప్ ఎమ్మెల్యేకు రెండేళ్ల జైలు

చండీగఢ్: ఖురాన్‌ను అపవిత్రం చేశారన్న 2016 నాటి కేసులో ఢిల్లీకి చెందిన ఆప్ ఎమ్మెల్యే నరేశ్ యాదవ్‌కు పంజాబ్ న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష, రూ.11 వేల జరిమానా విధించింది. ఈ కేసులో శుక్రవారం విచారణ ముగించిన మలెర్‌కొట్ల అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పర్మీందర్ సింగ్ గ్రెవాల్ శనివారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. 2016 జూన్ 24వ తేదీన మలెర్‌కొట్లలోని ఓ రోడ్డుపై ఖురాన్‌లోని కొన్ని పేజీలు కనిపించాయి. దీంతో, ఆగ్రహించిన కొందరు వాహనాలకు నిప్పుపెట్టారు. ఆప్ ఎమ్మెల్యే సహా నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దిగువ కోర్టు ఈ కేసు నుంచి యాదవ్‌కు విముక్తి కల్పించింది. అయితే, పిటిషనర్ మహ్మద్ అష్రాఫ్ దీనిపై అప్పీల్ చేశారు.

చంపుతామంటూ బెదిరించారు

అజ్మీర్ దర్గా కేసులో పిటిషనర్ వెల్లడి

న్యూఢిల్లీ: అజ్మీర్‌లోని మొయినుద్దీన్ చిస్తీ దర్గాను శివాలయంపైనే అప్పటి పాలకులు నిర్మించారంటూ పిటిషన్ వేసిన హిందూ సేన చీఫ్ విష్ణు గుప్తా చంపుతామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని ఆరోపించారు. ఢిల్లీలోని బారాఖంబా రోడ్ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు ఆయన శనివారం ఫిర్యాదు చేశారు. తనకు అందిన రెండు బెదిరింపు ఫోన్ కాల్స్‌లో ఒకటి కెనడా నుంచి కాగా మరోటి మన దేశంలోని గుర్తు తెలియని నంబర్ నుంచి వచ్చిందన్నారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, తగు చర్యలు తీసుకుంటామని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

సవతి కుమార్తెపై అత్యాచారం..

141 ఏళ్ల జైలు శిక్ష విధించిన కేరళ కోర్టు

మలప్పురం: మైనర్ అయిన సవతి కుమార్తెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తికి కేరళ కోర్టు 141 ఏళ్ల జైలు శిక్ష విధించింది. పోక్సో చట్టం, ఐపీసీ, జువెనైల్ జస్టిస్ చట్టం కింద వివిధ నేరాలకు గాను దోషి ఏక కాలంలో ఈ శిక్ష అనుభవించాలంటూ మంజేరి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి అష్రాఫ్ ఏఎం నవంబర్ 29వ తేదీన తీర్పు వెలువరించారు. అయితే, దోషి 40 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అతడికి విధించిన శిక్షల్లో ఇదే అత్యధికమని ఆయన ఆ తీర్పులో పేర్కొన్నారు. అదేవిధంగా, బాధితురాలికి పరిహారంగా రూ.7.85 లక్షలు చెల్లించాలని కూడా దోషిని ఆదేశించారు. బాలికపై ఆమె తల్లి ఇంట్లో లేని సమయాల్లో 2017 నుంచి సవతి తండ్రి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి?

భారత న్యాయ వ్యవస్థ

క్రియాశీలత - ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయ సమీక్ష అధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అంటే.. న్యాయ వ్యవస్థ తన అధికారాలు, విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి, సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడతారు.

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- ★ శాసన, కార్య నిర్వాహక శాఖలు విధి నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ★ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడంతో ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపరచలేని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ★ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పించడంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టుల దృష్టికి తీసుకువచ్చాయి.
- ★ న్యాయస్థానాలు స్వయం ప్రేరిత (Suo-Moto) కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీ చేయడం.
- ★ దత్త శాసనాధికారాల వల్ల కార్య నిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై, అధికారాన్ని దుర్వినియోగం చేయడం, జవాబుదారీతనం లోపించడం.

న్యాయశాఖ క్రియాశీలత - ప్రధాన వివాదాలు

- ★ ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాలకార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- ★ లక్ష్మీకాంత్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్న పిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- ★ తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం, దాని ద్వారా తాజ్‌మహల్‌కు ఉన్న ముప్పునకు సంబంధించిన కేసులు.
- ★ బిహార్ పశుగ్రాసం కేసు.
- ★ జార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి వివాదం.
- ★ రక్షణ శాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- ★ జడ్జీల నియామకం.
- ★ కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్. బొమ్మై తొలగింపు వివాదం.
- ★ ఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడలు.
- ★ పెట్రోల్ బంకుల కేటాయింపులు.

న్యాయమూర్తులు రకరకాల ప్రభావాలకు, ప్రలోభాలకు దూరంగా ఉండాలి. వృత్తి నిబద్ధతను, నిష్పాక్షికతను, అత్యున్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉండి జాతి, మత, కుల ప్రాంతాలకు అతీతంగా తీర్పులను వెలువరించే గొప్ప లక్షణాలను కలిగి ఉండాలి. అప్పుడే ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ద్విగుణీకృతం అవుతుంది.

- ★ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని అనుమతించడం.
- ★ ఎర్రబుగ్గ కార్లు, సైరన్లకు సంబంధించిన అంశాలు.

మొదలైన కేసుల్లో సుప్రీంకోర్టు క్రియాశీలక తీర్పులను వెలువరించింది.

ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం [Public Interest Litigation (PIL) Or Socially Interested Litigation (SIL)]:

సాధారణంగా న్యాయస్థానాలను ఆశ్రయించడానికి వివాదంలో భాగస్వామికి మాత్రమే హక్కు ఉంటుంది. దీన్నే లోకస్ స్టాండై (Locus Standi) అంటారు. అయితే 1980 తర్వాత సుప్రీంకోర్టు నూతన శకానికి శ్రీకారం చుట్టింది. వివాదాలతో సంబంధం లేని వ్యక్తులు కూడా న్యాయస్థాన జోక్యాన్ని కోరవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. విషయం లేదా వివాదంలో ప్రజా ప్రయోజనాలు ఉంటే మూడో వ్యక్తి కూడా (థర్డ్ పార్టీ) జోక్యం చేసుకునే అవకాశం ఉంటుంది. దీన్నే 'ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (PIL)' అంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పి.ఎన్. భగవతి, వి.ఆర్. కృష్ణ అయ్యర్ చొరవ వల్ల ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అనే భావన ప్రచారంలోకి వచ్చింది. పిల్‌ను సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో మాత్రమే దాఖలు చేయాలి. కేసుల్లో ప్రజా ప్రయోజనాలు ఉన్నట్లు జోక్యం కోరే వ్యక్తి నిరూపించగలగాలి. ఈ పద్ధతి ద్వారా చాలా ప్రజా సమస్యలు పరిష్కారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ప్రజలకు న్యాయాన్ని చేకూర్చడమే కాకుండా పేదలు, బలహీన వర్గాల హక్కులను కాపాడగలిగింది. అనేక కుంభకోణాలు బయటపడటానికి పిల్ దోహదం చేసింది.

గమనిక: PIL అనే భావన మొదటగా అమెరికా రాజ్యాంగంలో ప్రారంభమైంది. కొన్ని మార్పులతో భారత సుప్రీంకోర్టు అదే పద్ధతిని అనుసరిస్తోంది.

ప్లీ బార్గెయినింగ్ (Plea Bargaining)

నిందితుడు నేరాన్ని అంగీకరిస్తే న్యాయస్థానం విచారణ ఆపేసి అతడికి తక్కువ శిక్ష విధించవచ్చు. దీన్ని 2006 నుంచి అమలు చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా కేసులు సత్వరం పరిష్కారం అవుతాయి. అయితే ఈ సౌకర్యం అన్ని నేరాలకు వర్తించదు.

న్యాయ ప్రవర్తన

ఇటీవల న్యాయ ప్రవర్తన (Judicial Behaviour) అనే ప్రక్రియ ప్రాముఖ్యతను సంతరించుకుంది. సమాచార హక్కు చట్టం, రాజకీయ ప్రక్రియల అధ్యయనంలో ప్రవర్తన పద్ధతి అనుసరించడం వల్ల న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్న

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

అంశాలు, వారి క్రమశిక్షణ, పనితీరు, నిబద్ధత మొదలైన విషయాలు ప్రజా సమీక్షకు గురవుతున్నాయి. న్యాయమూర్తులు శీఘ్రంగా కేసులను విచారించడం, విచారణ సమయంలో విపరీత జాప్యానికి బాధ్యత వహించేలా చేయడం, న్యాయమూర్తుల ప్రవర్తన ఆదర్శంగా ఉండేలా చేయడం మొదలైన అంశాల పరిశీలనను న్యాయ వ్యవస్థ ప్రవర్తన అంటారు.

కోర్టు ధిక్కారం - శిక్ష

కోర్టు తీర్పులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినా, అమలు చేయకపోయినా, తీర్పులకు పక్షపాతం ఆపాదించినా అలాంటి వారిని ప్రకరణలు 129, 215ల ప్రకారం శిక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంది.

ఉదా: కర్ణాటక కేడర్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ వాసుదేవన్‌కు కోర్టు ధిక్కారం నేరం కింద నెల రోజులపాటు జైలు శిక్ష విధించారు.

సోషల్ జస్టిస్ బెంచ్

భారత రాజ్యాంగం ప్రవేశికలో పేర్కొన్న - సామాజిక, ఆర్థిక, రాజకీయ అనే మూడు రకాలైన న్యాయాలను సాధించడానికి రాజ్యాంగంలో అనేక ఏర్పాట్లు ఉన్నాయి. అయితే వీటి అమల్లో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అణగారిన వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు తగిన రీతిలో అమలు కావడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ, బాల కార్మిక వ్యవస్థ, పేదరికం, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యం, దళిత హక్కుల ఉల్లంఘన మొదలైన అంశాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని న్యాయస్థానాల ద్వారా పరిష్కరించడానికి విపరీతమైన జాప్యం జరుగుతోంది.

ప్రజల సామాజిక సమస్యలను, ప్రభుత్వం ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను త్వరితగతిన విచారించడానికి సుప్రీంకోర్టులో సామాజిక న్యాయ బెంచ్ అనే ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ ఉదయ్ యు. లలిత్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుంది. 2014 డిసెంబర్ 12 నుంచి ఈ బెంచ్ పనిచేయడం ప్రారంభించింది. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ బెంచ్ సమావేశమవుతుంది. సుప్రీంకోర్టులో సామాజిక న్యాయానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు సహా కొత్త కేసులనూ విచారిస్తుంది.

నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్

పార్లమెంట్ చేసిన గ్రీన్ ట్రైబ్యునల్ చట్టం 2010 ప్రకారం దీన్ని ఏర్పాటు చేశారు. 1992లో ఐక్య రాజ్య సమితి పర్యావరణ, అభివృద్ధి సమావేశం; రియో డి జెనిరియోలో చేసిన తీర్మానం నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు ప్రాతిపదికగా చెప్పొచ్చు.

నిర్మాణం

ఇది ఒక చట్టబద్ధమైన సంస్థ. ఇందులో ఒక చైర్మన్, 10 మందికి తక్కువ కాకుండా, 20 మంది సభ్యులకు మించకుండా 'జ్యుడీషియల్ మెంబర్లు', అదేవిధంగా 10 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా పర్యావరణం, సంబంధిత రంగాల్లో నిష్ణాతులైన ఇతర సభ్యులుంటారు. వీరందరినీ కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది.

చైర్మన్, సభ్యుల పదవీకాలం 5 ఏళ్లు. పునర్నియామకానికి అర్హులు కారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, చైర్మన్ లేదా జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులైతే వారి పదవీ విరమణ వయసు 75 సంవత్సరాలు. హైకోర్టు న్యాయ మూర్తులు జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులైతే వారి పదవీ విరమణ వయసు 67 ఏళ్లు. నిష్ణాతులైన సభ్యుల పదవీ కాలం 65 ఏళ్లు.

అర్హతలు

- ★ చైర్మన్ లేదా జ్యుడీషియల్ సభ్యుడిగా నియామకం పొందే వ్యక్తి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ఉండాలి.
- ★ పర్యావరణం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వారిని నిష్ణాతులైన సభ్యులుగా నియమిస్తారు.

తొలగింపు - రాజీనామా

- ★ చైర్మన్, సభ్యులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు కేంద్ర ప్రభుత్వం తొలగిస్తుంది.
- ★ అవినీతి, అసమర్థత, దివాళా తీయడం, నేరారోపణ రుజువు కావడం మొదలైన కారణాల ఆధారంగా తొలగిస్తారు. వీరందరూ వారి రాజీనామాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు.

అధికారాలు, విధులు - పరిధి

- ★ పర్యావరణానికి సంబంధించిన అన్ని ప్రధాన వివాదాలు దీని పరిధిలోకి వస్తాయి.
- ★ అటవీ పరిరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ మొదలైన చట్టాల్లోని అంశాలను విచారిస్తుంది.
- ★ మెజార్టీ సభ్యులు ఇచ్చిన తీర్పే తుది తీర్పు. అయితే ప్రత్యేక సందర్భాల్లో ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై 90 రోజుల్లోగా సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు.

జాతీయ న్యాయ సర్వీసుల సంస్థ (National Legal Services Authority)

జరిగిన అన్యాయాన్ని లేదా నష్టాన్ని కోర్టుల ద్వారా సత్వరమే పరిష్కరించుకొని తగిన పరిహారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుంది. అయితే పేదరికం, అవిద్య కారణంగా వారు న్యాయాన్ని పొందలేకపోవచ్చు. భారత రాజ్యాంగం నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39(ఎ) ప్రకారం ప్రజలందరికీ సమన్యాయాన్ని వర్తింపజేయడానికి సమాన అవకాశాలు ఉండాలని ఉచిత న్యాయ సలహాను పొందేందుకు తగిన ఏర్పాటు చేశారు. ఇలాంటి సేవలను అందించడానికి జాతీయ స్థాయిలో ఒక సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికనుగుణంగా 1987లో జాతీయ న్యాయ సలహా సేవల చట్టాన్ని పార్లమెంట్ రూపొందించింది. ఈ చట్టం ప్రకారం 1998లో 'జాతీయ న్యాయ సేవల అధికార సంస్థ'ను ఏర్పాటు చేశారు.

జాతీయ స్థాయిలో ఈ సంస్థకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య పోషకులు (Patron-in-Chief)గా, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు కార్య నిర్వాహక చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

రాష్ట్రస్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య పోషకులు (Patron-in-Chief)గా హైకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు, రిటైర్ అయిన న్యాయమూర్తుల్లో ఒకరు కార్య నిర్వాహక చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

జిల్లా స్థాయిలో జిల్లా న్యాయమూర్తి హోదా రీత్యా ఈ సంస్థకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. తాలూకా లేదా మండల స్థాయిలో ఈ సంస్థకు సీనియర్ సివిల్ జడ్జి హోదా రీత్యా చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

విధులు

- ఉచిత న్యాయ సలహా అందించడానికి చర్యలు తీసుకోవడం.
- దేశ వ్యాప్తంగా న్యాయ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడం.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- ★ సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీబీ.
- ★ సుప్రీంకోర్టులో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్, రెండో వారు కె.జి. బాలక్రిష్ణన్.
- ★ గతంలో 9 మంది మహిళా న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో సేవలందించారు. ప్రస్తుతం బి.వి. నాగరత్నమ్మ, బేలా ఎం.త్రివేదిలు న్యాయమూర్తులుగా కొనసాగుతున్నారు.
- ★ సుప్రీంకోర్టులో అతి తక్కువ కాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తి కె.యన్.సింగ్. ఈయన 18 రోజులు మాత్రమే పనిచేశారు.
- ★ ఆంధ్రప్రదేశ్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలుగా పనిచేసిన వారు కోకా సుబ్బారావు, ఎన్వీ రమణ.
- ★ దళిత వర్గాల నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన వ్యక్తి కె.జి. బాలకృష్ణన్.
- ★ గోలక్‌నాథ్ కేసు సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు.
- ★ కేశవానంద భారతి కేసు సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎం. సిక్రి.
- ★ ఇందిరాగాంధీ లోక్‌సభ సభ్యత్వ అనర్హతకు సంబంధించి విచారించింది - జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్ బెంచ్.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

తెలుగు - ఎస్ఏ, ఎస్జీటీ



ఆధునిక కవిత్వోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన 'లలిత'.

భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు - అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి - కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి - నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి - గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి 'హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్' అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని **'లిరికల్ పోయెట్రీ'**నే తెలుగులో **'భావ కవిత్వం'** అని పిలుస్తున్నారు.
- 'లిరిక్' అంటే **'గాన గుణం అమరిన రచన'** అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి **'ముసలమ్మ మరణం'** నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డి**ని పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడ**ను ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం **కాల్పనికవాదం.** దీనికి మూల పురుషుడు **రూసో.**
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత - **రూసో.**
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన **'రొమాంటిసిజమ్'**ను అనుసరించిన కవులనే **'కాల్పనికవాద కవులు'** అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయేట్రిగా పిలుస్తారు.
- **'లిరికల్ పోయెట్రీ'**ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712-88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో 'న్యూ హెలాయిస్' రచనలో ప్రణయతత్వాన్ని, 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం - **ఆత్మాశ్రయ సిద్ధాంతం.**
- భావకవిత్వోద్యమం మూడు (1910-40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. 'కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత' - **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి ప త్రికలో)
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం' - **విశ్వనాథ సత్యనారాయణ.**
3. 'కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరిసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత' - **శ్రీశ్రీ.**
4. 'వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం' - సి.నా.రె.

భావ కవిత్వం లక్షణాలు

1) ఆత్మాశ్రయత	2) ప్రకృతి ప్రీతి
3) స్వేచ్ఛాప్రియత్వం	4) ప్రణయం
5) దేశభక్తి	6) సంఘ సంస్కరణాభిలాష
7) స్త్రీ ఉదాత్త చిత్రణ	
8) మానవ సామాజిక స్పృహ	
9) మార్మికత	10) స్మృతి

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

రాయప్రోలు సుబ్బారావు - లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం, స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.

బసవరాజు అప్పారావు - సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.

పింగళి - కాటూరి కవులు - తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.

కాటూరి వెంకటేశ్వరరావు - గుడిగంటలు, పౌలస్త్య హృదయం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి - కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.

దువ్వూరి రామిరెడ్డి - పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.

నండూరి సుబ్బారావు - యెంకి పాటలు

నాయని సుబ్బారావు - సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.

వేదుల సత్యనారాయణశాస్త్రి - దీపావళి, ముక్తఝరి.

అబ్బూరి రామకృష్ణారావు - మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాలు, మాతృ భూమి, తిక్కన మొదలైనవి.

అడవి బాపిరాజు - శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.

విశ్వనాథ సత్యనారాయణ - ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిదూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవిత్వోద్యమం **అభ్యుదయ కవిత్వం.** ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివరి వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని 'ప్రోగ్రెస్' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో **'అభ్యుదయం'** అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి **'పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం'** అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే.**

- సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో **'పారిస్'**లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో **'ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'**ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే **'ది డెయిలీ ట్రిబ్యూన్'** పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో **'మున్షీ ప్రేమ్ చంద్'** అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో **'న్యూ సిగ్నేచర్స్'** అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘాన్ని** ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **వాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. 'ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ **అభ్యుదయ కవిత్వం'.**
2. 'ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం' - **దేవులపల్లి కృష్ణశాస్త్రి.**
3. 'చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం' - **వేల్చేరు నారాయణరావు.**

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ - **శ్రీశ్రీ** అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- **శ్రీశ్రీ** 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ **'జ్వాల'** పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం **'నయాగరా'.** 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రమణ్యం కలసి రచించారు.
- శ్రీశ్రీ మహాప్రస్థానం సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ): మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి

ఆరుద్ర: త్వమేవాహం, సినీవాలి, గాయాలు - గేయాలు

ఆవంత్స సోమసుందర్: వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)

కాళోజీ నారాయణరావు: నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)

దాశరథి కృష్ణమాచార్యులు: అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహోంద్రోదయం.

రెంటాల గోపాలకృష్ణ: సర్పయాగం, సంఘర్షణ

అనిసెట్టి సుబ్బారావు: అగ్నివీణ

కె.వి. రమణారెడ్డి: అడవి, భువనఘోష, అంగారవల్లరి

సి. నారాయణరెడ్డి: మంటలు - మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.

పురిపండా అప్పలస్వామి: పులిపంజా, అనల పతాకం, సంధ్యావందనం, స్వర్గానికి - నరకానికి.

పఠాభి: ఫిడేలు రాగాల డజన్, పఠాభి పంచాంగం (1964)

శిష్ట్లా ఉమామహేశ్వరరావు: నవమిచిలుక, విష్ణుధనువు

శ్రీరంగం నారాయణబాబు: మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
1) కులపాలికా ప్రణయం
2) కరుణ విప్రలంభం
3) అమలిన శృంగారం
4) విప్రలంభ శృంగారం

2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే' అది?
1) విప్లవ కవిత్వం
2) అభ్యుదయ కవిత్వం
3) ఆధ్యాత్మిక కవిత్వం 4) భావ కవిత్వం

3. 'వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం' అనే శ్రీ రంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?
1) దిగంబర కవిత 2) అభ్యుదయ కవిత
3) భావ కవిత 4) విప్లవ కవిత

4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
1) వర్గ సామరస్యం 2) వర్గ సంఘర్షణ
3) ప్రణయ బోధన 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
ఆదివారం 1-12-2024

భారతీయ ఉక్కు నగరం అని దేన్ని పిలుస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశంలో పారిశ్రామిక రంగం

ఖనిజ ఆధారిత పరిశ్రమలు: భారతదేశం ఇనుము - ఉక్కు ఉత్పత్తి పరంగా ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. (చైనా, జపాన్, యూఎస్ఏ, రష్యాల తర్వాత). స్పాంజ్ ఐరన్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. భారతదేశంలో ఇనుము ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధిని రెండు దశల్లో పరిశీలించవచ్చు అవి...

- **స్వాతంత్ర్యానికి పూర్వం:** ఈ దశలో ఇనుము - ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధి ప్రైవేటు రంగంలోనే జరిగింది.
- **స్వాతంత్ర్యానంతరం:** ఈ దశలో విదేశీ సహకారంతో ప్రభుత్వ రంగంలో ఇనుము - ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చెందింది.

స్వాతంత్ర్యానికి పూర్వం

1. 1830 - భారత్‌లో మొట్టమొదటి ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని చెన్నై సమీపంలోని పోర్ట్ నోవాలో స్థాపించారు.
2. 1864 - పశ్చిమ బెంగాల్‌లోని 'కుల్టీ' అనే ప్రదేశంలో 'బెంగాల్ ఐరన్ వర్క్స్' ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.
3. 1907 - జార్ఖండ్‌లోని 'జంషెడ్‌పూర్' (సక్చి) అనే ప్రాంతంలో జంషెడ్ జీ టాటా మొదటి సారి సమీకృత ఇనుము ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. దీన్నే టిస్కో (TISCO - టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) అని పిలుస్తారు.

ముడి పదార్థాల సరఫరా
- ఐరన్ ఓర్- జార్ఖండ్‌లోని నేముండి,ఒడిశాలోని గురుమహ-సాని, బాదమ్ పహాడ్
- బొగ్గు - ఝరియా, రాణిగంజ్
- మాంగనీస్ - జోడామైన్స్ (ఒడిశాలో కియోంజార్ జిల్లా)
- నీరు - సువర్ణరేఖ
- డోలమైట్ అండ్ లైమ్‌స్టోన్ - సుందరగఢ్

4. 1908 - కుల్టీ సమీపంలోని హీరాపూర్ అనే ప్రాంతంలో మరో ఇనుము ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు.
5. 1919 - బెంగాల్‌లోని బర్న్‌పూర్ వద్ద ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (IISCO) ఏర్పాటు చేశారు. దీనిలో కుల్టీలోని బెంగాల్ ఐరన్ వర్క్స్, హీరాపూర్‌లోని హీరాపూర్ స్టీల్ ప్లాంట్లను విలీనం చేశారు. 1972లో IISCOను భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

ముడి పదార్థాల సరఫరా
- ఐరన్‌ఓర్ - జార్ఖండ్‌లో సింగ్భూమ్ జిల్లాలో ఉన్న 'గున' గనులు
- బొగ్గు - ఝరియా, రాణిగంజ్
- విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
- నీరు - బార్కార్ నది
- డోలమైట్, లైమ్‌స్టోన్ - సుందరగఢ్

6. 1923-కర్ణాటకలోని భద్రావతి వద్ద 'మిస్కో' (మైసూర్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) ఏర్పాటు చేశారు. 1929లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో దీని పేరును విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారంగా మార్చారు. 1962లో దీన్ని భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

ముడి పదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - కెమ్మంగుడి
విద్యుత్ - శరావతి పవర్ ప్లాంట్
నీరు - భద్రావతి నది
లైమ్ స్టోన్ - బుందిగూడ
మాంగనీస్ - షిమోగా, చిత్రదుర్గ

స్వాతంత్ర్యానంతరం

రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో

7. 1957 - చత్తీస్‌గఢ్ (గతంలో మధ్యప్రదేశ్) యూఎస్ఎస్ఆర్ సహాయంతో 'భిలాయ్' ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

ముడి పదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - రాజీహర
బొగ్గు - కోర్బా, కార్గాలి
లైమ్ స్టోన్ - నందిని
విద్యుత్ - కోర్బా థర్మల్ పవర్ ప్లాంట్
మాంగనీస్ - భాండారా, బాల్గాయ్

8. 1959 - బ్రిటన్ సహాయంతో పశ్చిమ బెంగాల్‌లో ఇనుము-ఉక్కు కార్మాగారాన్ని 'దుర్గాపూర్'లో స్థాపించారు.



ముడిపదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - బొలానిమైన్స్
కోల్ - ఝరియా, రాణిగంజ్
లైమ్‌స్టోన్ - బిర్‌మిత్రాపూర్
మాంగనీస్ - కియోంజార్
విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్

9. 1959 - ఒడిశాలో పశ్చిమ జర్మనీ సహాయంలో 'రూర్కెలా' ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

ముడి పదార్థాల సరఫరా:
ఐరన్‌ఓర్ - సుందరగఢ్, కియోంజార్
బొగ్గు - ఝరియా
విద్యుత్ - హీరాకుడ్ హైడ్రోపవర్ ప్లాంట్
మాంగనీస్ - బరాజమ్‌డా
లైమ్‌స్టోన్ - పూర్ణాపాండ్

మూడో పంచవర్ష ప్రణాళిక కాలంలో

10. 1964 - జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో యూఎస్ఎస్ఆర్ సహాయంతో 'బొకారో' స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

ముడిపదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - కిరిబరు (ఒడిశా)
బొగ్గు - ఝరియా
లైమ్‌స్టోన్ - పాలము
విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో

11. 1972 - ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖతీరంలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ సహాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 1982లో నిర్మాణాన్ని ప్రారంభించగా 1992లో పూర్తైంది.

- 1992 ఆగస్టు 1న దివంగత ప్రధాని పి.వి. నరసింహారావు ఈ కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు.
- ఈ కర్మాగారం దేశంలో అత్యాధునికమైంది, తీర ప్రాంతంలోని ఏకైక ఇనుము - ఉక్కు కర్మాగారం.

ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంలో

12. 1982 - తమిళనాడులోని సేలం వద్ద ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఇది నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి.

ఏడో పంచవర్ష ప్రణాళిక

13. 1989 - కర్ణాటకలోని హోస్పేట్ వద్ద విజయనగర్ ఐరన్ - స్టీల్ కంపెనీని ఏర్పాటు చేశారు.

1989 తర్వాత ఏర్పాటైన స్టీల్ ప్లాంట్‌లు

1. ఒడిశాలో పోస్కో స్టీల్ కంపెనీ. దీన్ని దక్షిణ కొరియా సహాయంతో ఎంఓయూ పద్ధతిలో నిర్మించారు.
2. బైలడిల్లా - చత్తీస్‌గఢ్
3. సూరజ్‌గఢ్ - మహారాష్ట్ర

అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ సమీపంలో జయక్ నగర్‌లో అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను స్థాపించారు. దీన్ని భారత ప్రభుత్వం 1954లో జాతీయం చేసింది. ప్రస్తుతం ఈ కార్పొరేషన్ పరిధిలో ఐదు ప్రభుత్వ రంగ కంపెనీల ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. అవి....

1. బాల్కో (భారత్ అల్యూమినియం కంపెనీ - కోర్బా (చత్తీస్‌గఢ్), రత్నగిరి (మహారాష్ట్ర)
2. ఇండాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ) - హీరాకుడ్, బెల్గాం, అలూపురం
3. నాల్కో (నేషనల్ అల్యూమినియం కంపెనీ) - కోరాపుట్ సమీపంలోని దామన్‌జోడి, అంగుల్
4. హిందాల్కో (హిందూస్థాన్ అల్యూమినియం కంపెనీ - రేణికూట్ (ఉత్తరప్రదేశ్)
5. మాల్కో (మద్రాస్ అల్యూమినియం కంపెనీ - మెట్టూరు (తమిళనాడు)

హెచ్ఎంటీ (హిందూస్థాన్ మిషన్ టూల్స్): 1953లో కర్ణాటకలోని బెంగుళూరులో మొదటి హెచ్ఎంటీ యూనిట్‌ను స్థాపించారు. ప్రస్తుతం దేశంలో ఆరు హెచ్ఎంటీ యూనిట్లు ఉన్నాయి. అవి....

1) శ్రీనగర్ 2) బెంగుళూరు
3) పింజోర్ 4) హైదరాబాద్
5) జైపూర్ 6) కాలమస్సేరి

బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్): 1956లో మొదటి బీహెచ్ఈఎల్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో ఆరు బీహెచ్ఈఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...

1) భోపాల్ 2) హరిద్వార్
3) రాణిపేట్ (తమిళనాడు)
4) బెంగళూరు 5) హైదరాబాద్
6) జగదీశ్‌పూర్

హెచ్ఏఎల్ (హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్): 1964లో బెంగళూరులో మొదటి హెచ్ఏఎల్ యూనిట్‌ను స్థాపించారు. దేశంలో ఆరు హెచ్ఏఎల్ యూనిట్లున్నాయి. అవి....

1) నాసిక్ 2) కోరాపుట్
3) హైదరాబాద్ 4) లక్నో
5) కాన్పూర్ 6) బెంగళూరు

ఐడీపీఎల్ (ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్): ప్రస్తుతం దేశంలో ఐదు ఐడీపీఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...

1) రిషికేశ్ 2) హర్యానాలోని గుర్గావ్
3) హైదరాబాద్ 4) ముజఫర్‌పూర్
5) చెన్నై

కాపర్ పరిశ్రమ

భారత్‌లో మొదటి కాపర్ పరిశ్రమను జార్ఖండ్‌లోని 'ఘాట్‌సీలా' వద్ద ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న రాగి ఉత్పత్తి కేంద్రాలు...

1. మహంభాండార్ (జార్ఖండ్)
2. ఖేత్రి (రాజస్థాన్)

మాదిరి ప్రశ్నలు

1. భారతీయ ఉక్కు నగరం అని దేన్ని పిలుస్తారు?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) జంషెడ్‌పూర్
2. 'భిలాయ్' ఇనుము ఉక్కు కర్మాగారానికి ఏ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు?
   1) ఫరక్క థర్మల్ పవర్ ప్లాంట్
   2) దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
   3) కోర్బాథర్మల్ పవర్ ప్లాంట్
   4) హీరాకుడ్ పవర్ ప్లాంట్
3. కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారానికి అవసరమైన నీటిని ఎక్కడ నుంచి సరఫరా చేస్తారు?
   1) కావేరి నది 2) తుంగ
   3) నేత్రావతి 4) భద్రావతి
4. జర్మనీ సహకారంతో దేశంలో ఏర్పాటు చేసిన ఇనుము ఉక్కు కర్మాగారం ఏది?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) విశాఖ
5. దేశంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన ఏకైక స్పాంజ్ ఇనుము-ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది?
   1) హోస్పేట్ 2) మెట్టూరు
   3) విశాఖ 4) పాల్వంచ(ఖమ్మం)
6. భారత్ అల్యూమినియం కంపెనీ (బాల్కో) ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ యూనిట్ ఉన్న ప్రదేశం ఏది?
   1) రాణిపేట్ 2) రేణికూట్
   3) బెల్గాం 4) కోర్బా
7. కింది వాటిలో హెచ్ఎంటీ యూనిట్ లేని ప్రదేశం ఏది?
   1) రిషికేశ్ 2) పింజోర్
   3) కాలమస్సేరి 4) అజ్మీర్
8. రైల్వే ఎలక్ట్రిక్ ఇంజన్లను తయారు చేసే బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్) యూనిట్ ఏది?
   1) హరిద్వార్ 2) భోపాల్
   3) రాణిపేట్ 4) బెంగుళూరు
9. ట్రాక్టర్స్‌ను తయారుచేసే హెచ్ఎంటీ యూనిట్ ఏది?
   1) శ్రీనగర్ 2) కాలమస్సేరి
   3) అజ్మీర్ 4) పింజోర్
10. 'సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్'ను తయారు చేసే ఐడీపీఎల్ యూనిట్ ఏది?
   1) రిషికేశ్ 2) చెన్నై
   3) ముజఫర్‌పూర్ 4) గుర్గావ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 4; 4) 2; 5) 4;
6) 4; 7) 1; 8) 2; 9) 4; 10)2.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ బెంగళూరులో 12 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 12.
» అర్హత: బీబీఏ/బీబీఎం ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 01.11.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.21,500 నుంచి రూ.82,000.
» దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.295. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజు ఉండదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.11.2024.
» పనిచేయాల్సిన ప్రదేశాలు: గాజియాబాద్, పంచ్‌కుల, కోట్‌ద్వార్.
» వెబ్‌సైట్: https://bel-india.in

సీడ్యాక్, పుణెలో 265 పోస్టులు

పుణెలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీడ్యాక్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 265.
» పోస్టుల వివరాలు: కార్పొరేట్ కమ్యూనికేషన్ అసోసియేట్-01, ప్రొడక్ట్ సర్వీస్-అవుట్‌రీచ్ (పీఎస్-ఒ) మేనేజర్-01, ప్రొడక్ట్ సర్వీస్-అవుట్‌రీచ్(పీఎస్-ఒ)ఆఫీసర్-మార్కెటింగ్-01, ప్రాజెక్ట్ అసోసియేట్-43, ప్రాజెక్ట్ ఇంజనీర్-100, ప్రాజెక్ట్ మేనేజర్-23, ప్రాజెక్ట్ ఆఫీసర్-03, ప్రాజెక్ట్ సపోర్ట్ స్టాఫ్-07, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్-86.
» అర్హత: పోస్టును అనుసరించి ఐటీఐ, సీఏ, బీఈ, బీటెక్, ఎంఈ,ఎంటెక్, పీజీ,పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» పనిచేయాల్సిన ప్రదేశాలు: పుణె, బెంగళూరు, ఢిల్లీ, మొహాలి, నోయిడా, తిరువనంతపురం, లక్నో, సిమ్లా, ధర్మశాల.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.12.2024.
» వెబ్‌సైట్: https://careers.cdac.in

The synonym of Tranquility is..



BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Due to the financial crisis (1)/ the price of food grains (2)/ has risen sharply (3) / over the past few months. (4) / No error (5)
2. Under the Hindu Minority and Guardianship Act, (1)/ a child natural guardian, (2)/ both of person and property, (3)/ is first the father and then the mother. (4)/ No error (5)
3. New data for rural households (1)/ will reveal by the Socio Economic and Caste Census (2)/ represent a grim reminder(3)/ of the state of rural India. (4)/ No error (5)
4. Ensuring financial services and health care (1)/ to the poor can be done (2)/through create (3)/ social businesses. (4) / No error (5)
5. A committees will be set up (1)/ to study and to reconsider (2)/ the rejected applications of forest encroachers (3)/ in the State. (4) / No error (5)

Directions (Q. 6 -10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given in bold in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The union minister said that all the States **had been instructed** to have a contingency plan ready in the wake of a drought forecast this season.
   1) has being instructed
   2) were been instructed
   3) will been instructed
   4) has been instructed
   5) No correction required
7. The attendance for the movie **release** yesterday was sparse and reviews were negative.
   1) releasing 2) will release
   3) released 4) was released
   5) No correction required
8. Singles and albums will be released on Friday **upon**.
   1) from now on 2) together
   3) from know 4) from within
   5) No correction required
9. Millions of people across the world **could affect** by cyber attack.
   1) will affect 2) would effect
   3) can effect 4) were affected
   5) No correction required
10. In the heaviest commercial launch **of it's formation**, the Indian Space Research Organization's PSLV on Friday launched five satellites.
   1) since its inception
   2) from it beginning
   3) with an initiation
   4) at the starting
   5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), and (E) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) What this means is that the weaver has to figure out where on the loose threads the dye should go in order for it to form the proper pattern when it is woven on the loom.
B) Some ikats are made by dyeing the warp threads, some by dyeing the weft threads and some by dyeing both, a technique known as double ikat.
C) The word 'ikat' comes from the Malaysian word 'mengikat,' or 'to tie'.
D) It gets more complicated as you add more colors.
E) It's like an aesthetic logic puzzle, and just thinking about it makes my head hurt.
F) Because the loose threads are tied into bundles using grasses or wax-treated cotton to specify where the dye is able to sink in and color the thread.

11. What is the FOURTH sentence after rearrangement?
   1) C 2) B 3) D 4) E 5) A
12. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) E 4) D 5) C
13. What is the LAST sentence after rearrangement?
   1) A 2) C 3) B 4) E 5) D
14. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) C 3) D 4) E 5) A
15. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. The master dispensed ______ the services of his servant.
   1) of 2) with 3) off
   4) for 5) at
17. He has great ______ for me.
   1) affection 2) affectation
   3) effect 4) affect 5) affliction
18. My friend is ______ very good at cricket.
   1) coincidence 2) affectionate
   3) passion 4) really 5) fact
19. Turkey's economy has grown ______ over the past ten years.
   1) prodigiously 2) providently
   3) provisional 4) affectionate
   5) increasing
20. In an abrupt ______ of violence, Boko Haram ______ killed around 200 people in Nigeria over the past week.
   1) surge… insurgents
   2) rush… rebel
   3) push… content
   4) radical… revolt
   5) revolution… captive

Directions (Q. 21-25): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The model code of conduct places _____ (21) on the government initiating welfare schemes and development projects in a constituency going to the polls. But voters ___ (22) they would be rewarded later if they vote for the ruling party. However, there is no guarantee that the _____ (23) in a by-election would hold in a general election. When voters sense an opportunity to throw out a ruling party in a general election, and not just embarrass it as in a by-election, they vote in a very _______ (24) manner. While these by-elections are thus cause for some celebration for those in power in the respective States, they are by no means pointers to what ______ (25) follow in a general election.

21. 1) restrictions 2) barricades
   3) obstacle 4) impediment
   5) hurdle
22. 1) aware 2) know
   3) welfare 4) benefit
   5) object
23. 1) outcast 2) formality
   3) results 4) affect
   5) distress
24. 1) new 2) creation
   3) innovate 4) different
   5) symptomatic
25. 1) must 2) may
   3) have 4) shall
   5) could

Directions (Q. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

"The whole sky was blazing with stars, larger and brighter than they appear through the dense atmosphere breathed by inhabitants of the lower parts of the earth. They seemed actually suspended from the dark vault of heaven, and their gentle light shed a fairylike gleam over the snow-fields around the foot of the Matterhorn, which raised its stupendous pinnacle on high, penetrating to the heart of the Great Bear and crowning itself with a diadem of his magnificent stars. Not a sound disturbed the deep **tranquility** of the night except the distant roar of streams that rush from the high plateau of the St. Theodule glacier and fall headlong over precipitous rocks till they lose themselves in the mazes of the Gorner glacier."

26. "The lower parts of the earth" refers to
   1) lower altitudes
   2) people with poorer vision
   3) the underworld 4) plains
   5) stars
27. A vault is
   1) a place for safekeeping
   2) a jumping-off place
   3) an arched structure
   4) a welcoming place
   5) the whole sky
28. The Great Bear is
   1) a rock formation
   2) a constellation of stars
   3) a mountain in the Alps
   4) a wild animal
   5) a special species
29. A maze is
   1) a corn field
   2) a remarkable place
   3) a river
   4) a confusing network of paths
   5) a constellation
30. The synonym of **Tranquillity** is
   1) surreptitious
   2) clandestine
   3) serendipity
   4) providence
   5) serenity

ANSWERS

1) 1	2) 2	3) 2	4) 3	5) 1
6) 5	7) 3	8) 1	9) 4	10)1
11) 3	12) 1	13) 4	14) 2	15) 2
16) 2	17) 1	18) 4	19) 1	20) 1
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 3	28) 2	29) 4	30) 5